# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జూలై, 2012 ₹ 20



భుక్తి

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 23 జూలై 2012 సంచిక 7**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాంద్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 3

తెలుగు నవల తీరుతెన్నులు ........ 5
*– జి.యస్.చలం*

బుర్ర కథ జానపద కళారూపం ........ 14
*– డాక్టరు దామెర వెంకట సూర్యారావు*

కోణార్క దేవాలయం ........ 17
*– డాక్టరు ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)*

హిందీలో నవ కవిత్వం: తెలుగులో దిగంబర కవిత్వం ........ 21
*– డాక్టరు సి. హెచ్.బి. మీనన్*

నా స్వగతం ........ 24
*– పసుమర్తి వేణుగోపాల కృష్ణ శర్మ*

సార్వభౌముడు–మహామంత్రి ........ 27
*– కె.జి. గోపాలకృష్ణరావు*

అతిరాత్రం : సోమయాగం ........ 30
*– ముత్తేవి రవీంద్రనాథ్*

రుబ్రీలు ........ 34
*– నండూరి పార్థసారథి*

సురభి నాటక రంగం ........ 40
*– జి.యస్. ప్రసాద రెడ్డి*

అగాధం ........ 43
*– ఆస్కార్ వైల్డ్ – అశ్విని.కె*

వార్తా వాణి ........ 51
*– డాక్టరు వోలేటి పార్వతీశం*

జపాన్‌లో వసంతం ........ 54
*– రీతా రాణి పాలీవాల్*

చివరి తత్త్వవేత్త ........ 58
*– ముక్తవరం పార్థసారథి*

భారతీయులు హిందువులుగా ఎలా మారారు? ........ 63
*– డాక్టరు ఫజులుల్లా ఖాన్*

యానాం ఆంధ్రలో ఎందుకు విలీనం కాలేదు? ........ 68
*– బొల్లోజు బాబా*

అసంపూర్ణ అద్భుతాలు (రా.వి శాస్త్రి నవలలు) ........ 74
*– కాంద్రేగుల నాగేశ్వరరావు*

చరిత్రలో నాగమ్మ ........ 77
*– ఆర్. చంద్రశేఖరరావు*

చదవండి (పుస్తక పరిచయం) ........ 78


*ముఖచిత్రం* : బరువు ..... *చిత్రకారుడు :* దత్తాత్రేయ పడేకర్

*రెండవ అట్ట* : భుక్తి } ద్రోణాదుల గోవిందరాజులు

*మూడవ అట్ట* : భక్తి

*నాల్గవ అట్ట* : నీటి చుక్క ...... *చిత్రకారుడు :* సజల్ పాత్ర

దశాబ్దకాలంగా పట్టుమని పది నవలలు రాలేదు. కట్టతెగిన వరదలా కథలు వస్తున్నాయి, వివిధ ఇతివృత్తాలతో అనేకానేక మాండలికాలలో. కాని నవల కంట్లో నలుసై పోయింది. దీనికి కారణాలేమిటి ? ఏ రచన అయినా మనిషి భావిజీవితాన్ని ఆవిష్కరించగలిగినదే రావాలి. అందుకు సంఘర్షణ, తాత్త్విక స్పర్శ అవసరం. అప్పుడే రచన పరిపూర్ణత సాధించగలదు. కాని ఇప్పుడు వ్యక్తి విచ్ఛిన్నమైపోయాడు. నిత్యావసరాలకే పోరాడవలసిన దుస్థితిలో నిలబడి ఉన్నాడు. ఇంక నవల రాయటానికి తీరుబడి, ఓర్పు-సందర్భం ఎక్కడిది? ఇదీ విషయం ! అయినా గత 15 సంవత్సరాలుగా వచ్చిన నవలల విశ్లేషణ అందిస్తున్నాం. పరాయీకరణ, దళిత అస్తిత్వ పోరాటాలే ఇతి వృత్తాలుగాగల నవలలే ఎక్కువగా వున్నాయి.

'యానాం' ఆంధ్రలో ఎందుకు విలీనం కాలేదు? చాలా ఆసక్తికరమైన చరిత్ర ఇది. విగ్రహాలకు సైతం ఎంతటి గౌరవం ఇచ్చారో తెలుసుకుంటే ఇప్పటి తరం సిగ్గుతో తల దించుకోవలసిందే.

భారతీయులు హిందువులుగా ఎలా మారారు? ఇది ఎన్నో సత్యాలను తెలియ జేసే వ్యాసం.

ఈనాడు ఇనుము, అద్దాల గూళ్ళలో వుండిపోతున్న మనకు ఋతువుల సందడి, అందాలు ఎలా తెలుస్తాయి, మనిషి ఛిద్రమయిపోతున్న ఈ సంధి కాలంలో సౌందర్యోపాసనకు తీరుబాటు ఎక్కడ ? 'జపాన్‌లో వసంతం' చదివితే కొంత వరకైనా ఊరట కలుగుతుంది.

మూఢనమ్మకాలకు పుట్టిల్లు మన దేశం ! అతిరాత్రం, సోమయాగం సాధించింది ఏమీ లేక పోయినా, వారు చేసిన హడావుడి సామాన్యమైనది కాదు.

నాటకాన్ని బ్రతికిస్తూ, నాటకంతోనే బ్రతుకుతూ కళాసేవ చేస్తున్న సురభి వారసులకు జేజేలు పలకాలి !

తెలుగు వారికే ప్రత్యేకమైన జానపద కళారూపం బుర్రకథ. నాజర్‌లాంటి మహామహులు బ్రతికించిన ఈ కళ ఇంకా సజీవంగా ఉందా?

నేనే చివరి తత్త్వవేత్త నన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఇదెలా సాధ్యం? 'చివరి తత్త్వవేత్త' చదవండి.

కాలపు ఇసుక పొరలలో మరుగున పడిపోయిన 'కోణార్క దేవాలయం' చరిత్రను సమగ్రంగా అందించారు స్థపతి శివనాగిరెడ్డి.

బుద్ధ జయంతి సంచికను పాఠకులు విశేషంగా ఆదరించినందుకు అభివందనాలు.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

**ఉత్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో మిసిమి చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి 'అంతర్వీక్షణం' పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!**

✶ "... 2556 వ బుద్ధ జయంతి సంచికలో *బౌద్ధం కోర్కెల్ని చంపుకోమంటుందా?* శ్రీ కృష్ణార్జున బోధిగారి రచన చదివిన తర్వాత – నాకు ఎదురయ్యే సమస్యకు సమాధానం దొరికినది... బుద్ధ జయంతి పత్రికలోని ప్రతి అంశము ధార్మికుల పాఠ్యగ్రంథమే. సంవత్సరమంతా చదివి పరీక్ష వ్రాసే విద్యార్థిలా దీనిని చదవాల్సి ఉన్నది... ముఖచిత్రం, కలువపీఠంపై కూర్చున్న దేవత తార, బుద్ధ పాదాల శరణు వేడుతున్న ఆమ్రపాలి, రథాలలో లిచ్ఛవీయుల గుసగుసలు, మహాభినిష్క్రమణ మరియు పుస్తకంలోని ప్రతి చిత్రం మన వారసత్వ సంపద తెచ్చి మాకు విందు చేసినట్లున్నది...

...పాఠ్యాంశాలు పసిహృదయాలలో ఎలాంటి పునాదులు వేస్తాయో నాకు అనుభవం.( 5వ. తరగతి / 9 సం॥ వయస్సులో) నాకు భగత్‌సింగ్, సుఖదేవ్, గురుదేవ్ ఉరి ముద్రపడినది. (6వ.త. 10 సం॥ వయస్సులో) అమరావతీ పట్టణమున బౌద్ధులు, *దేశమును ప్రేమించుమన్నా* టంగుటూరి సూర్యకుమారి గారి గేయం, పాఠ్యభాగంలో ఉన్నందున నా మనసులో ముద్రపడిపోయినది. అదేవిధంగా *ఆ తోటలో నొకటి ఆరాధానాలయం* అనే రావు బాలసరస్వతిగారి గానం, *సిద్ధార్థుడు* అనే పదం సిద్ధించినది. ఇవన్నీ నా మనస్సులో నాటుకున్న నాటి బీజాలు, ఈ నాడు వృక్షాలు... కరుణశ్రీగారి *యశోధర ప్రార్థన* వంటి కవితలుండేవి. విద్యార్థులు గౌతముని త్యాగం, యశోధర భక్తి చదివి పరవశించేవారం..."

**– ఉపాసిక ఎస్.పైడితల్లి,** సర్పవరం.

✶ "...మే, 2012 ***మిసిమి*** మాసపత్రికను హైదారాబాద్ వచ్చినపుడు కోఠి వద్ద ఓ బుక్ స్టాల్‌లో చూసి, కొని, చదివాను. ...ఇది బుద్ధ సంచిక. *పునర్భవం* వ్యాసంలో జీవిపుట్టుక, వివిధ మత పెద్దలు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఆలోచనలోకి నెట్టాయి... *అట్టమీది బొమ్మల* వివరణ బాగుంది...ఆధునిక విజ్ఞానశాస్త్రానికి, బౌద్ధానికి మేధోపరమైన ఆధ్యాత్మిక సంబంధం ఉంది. శాంతికి భంగం కలిగించనంత వరకు ఏ మతమైనా మంచిదే. బౌద్ధంలో శాంతి అంతర్లీనంగా ఉంది. ముఖ్యంగా చెప్పాలంటే బుద్ధుని త్యాగం గొప్పది. నేటి తరానికి ఆదర్శమైనది..."

**– ముట్నూరు ఉపేంద్రశర్మ,** శ్రీకాకుళం.

✶ "...***మిసిమి*** పత్రికకు అథఃశీర్షికగా 'చింతనాత్మక సారస్వతం' అనేమాట మే నెల 2012 సంచిక (బుద్ధ జయంతి సంచిక) విషయంలో అన్వర్థమైంది. అన్ని వ్యాసాలు, విషయసంపన్నంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయి. *శ్రమణ సంప్రదాయం* పేరుతో డి. చంద్రశేఖర్‌గారి వ్యాసం సంచికలో అతి శ్రేష్ఠంగా ఉంది. రెండు సంప్రదాయాలైన బ్రాహ్మణ, శ్రమణులను చక్కగా విశ్లేషించడమే గాక చారిత్రక దృక్పథంతో పరిశీలించారు. బౌద్ధం మీద మమకారం అధికంగా ఉన్నవారే అన్ని వ్యాసాలు వ్రాసినా ఈ సంచిక శోభించక పొయ్యేది. చంద్రశేఖర్ గారి విశ్లేషణ నిర్మమంగా సాగింది. "మహాకవిగా ప్రసిద్ధి చెందిన బమ్మెరపోతన రచించిన ఈ క్రింది పద్యం" అని ఉదాహరించింది, పోతన స్వీయాభిప్రాయమని రచయిత పొరబడ్డాడేమో ననిపించింది. *శ్రమణ సంప్రదాయం* లోని మౌలిక లక్షణాలకు దూరమైన బౌద్ధం వీటిని అంది పుచ్చుకోకుండా, నిజమైన బౌద్ధ పునరుద్ధరణ సాధ్యం కాకపోవచ్చని ముగించడం ఏ పక్షంపట్ల వివక్షత, మమకారం లేని ఒక న్యాయమూర్తి హోదాలో రచయితను నిలబెట్టింది...

..."శంకరాచార్యుల వారి ఆదేశాలతో బౌద్ధ భిక్షువులను గానుగలలో వేసి చిత్ర హింసలకు గురిచేసి చంపివేసా"రని కాలువ మల్లయ్య గారు రాసింది ఆధారాలను చూపవలసిన వ్యాఖ్యగా భావిస్తున్నాను..."

**– డాక్టరు సంగనభట్ల నరసయ్య,** హైదరాబాదు.

✶ "...*మిసిమి* పబ్లిషర్‌గారయిన బాపన్న ఆలపాటిగారికి, మీరు నడుపుతున్న *మిసిమి* మాస పత్రికలో తెలుగు కన్నా సంస్కృత పదాలే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మీ పత్రికతో పాటు తెలుగు – సంస్కృత నిఘంటువును ప్రక్కనే వుంచుకోవలసి వస్తున్నది...మీరు చెప్పదలచుకున్న విషయాలు కనీసం కాలేజీ విద్యార్థులకు అర్థమయ్యే భాషలో వుండేటట్లు చూడగలరు..."
**– ఏ.దేవయ్య,** కావూరు.

✶ "...*మిసిమి* లో బళ్ళారి గురించి మంచి వ్యాసం ప్రచురించారు. నేను బళ్ళారిలోనే పుట్టి బళ్ళారిలోనే చదివాను. అందుకు గర్విస్తున్నాను. బళ్ళారి ఉల్లిపాయలు అమెరికాలో ప్రసిద్ధి. బళ్ళారి రాఘవ ఎంతో కీర్తిగడించిన నటుడు. రాష్ట్రాలు చీలినపుడు ఆ బాధ అక్కడ వున్న సామాన్యులకు కడుపుకోత. మనకు ఆ విధంగా మద్రాసు పోయింది, బళ్ళారి పోయింది, బరంపురం పోయింది. ఇప్పుడు హైద్రాబాదు కూడా పోతుందా? నేను చదివినపుడు మా క్లాసులో 25–30 మంది ఆడపిల్లలమే వుండేవాళ్లం. మూడు భాషలు తెలుగు, కన్నడ, ఉర్దూ మాట్లాడే వాళ్లం. రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ప్రజల్ని ఎన్నోవిధాలుగా బాధిస్తున్నారు– దురదృష్టం..." **– శ్రావణ మంగళ,** మద్రాసు.

✶ "...2556 బుద్ధజయంతి సంచిక పాఠకులకు బౌద్ధం గురించిన ఎన్నెన్నో విషయాలు విశదీకరించింది. *సిద్ధార్థుని జీవనగాథ* సంక్షిప్తంగా అగుపించే సమగ్రరూపం. *బ్రహ్మవాదం, శ్రమణ సంప్రదాయం, బౌద్ధం కోర్కెలను చంపుకోమంటుదా? బుద్ధుని మౌనం, పునర్భవం, మేధావుల దృష్టిలో బౌద్ధం* ఇలా ప్రతి వ్యాసము ఎంతో సమాచారాన్ని అందించడంతోబాటు ఎన్నో సందేశాలను అందించాయి. సందేహాలు తీర్చాయి. మిసిమి ప్రతినెల విలువైన సమాచారమే అందిస్తుంది. వ్యాసకర్తలకు, సేకరించి శ్రమించి పొందుపరచి సంచికలు 2, 3 తేదీల లోపే అందజేస్తున్న సంపాదక వర్గానికి, సిబ్బందికి అభినందనలు, అభివందనములు..."
**– బండి ప్రసాదరావు,** పొదగట్లపల్లి.

✶ "...బుద్ధజయంతి మే నెల 2012 సంచిక చాలా ఆకర్షణీయంగాను, ఆలోచింపచేసే విధంగాను వున్నది. అట్టలమీద బుద్ధుడి బొమ్మలు, ఆమ్రపాలి చిత్రం బావున్నాయి...*బౌద్ధం కోర్కెల్ని చంపుకోమంటుందా?* అనే కృష్ణార్జున బోధిగారి వ్యాసం, కోర్కెలు అంటే ఏమిటి? వాటి పట్ల ఎలాంటి వైఖరితో ఉండాలి? కుశలకోర్కెలు, అకుశల కోర్కెల వివరణ చాలా బావుంది. బౌద్ధం గురించి ప్రాథమికంగా తెలుసుకోగోరే వారికి అర్థం అయ్యే విధంగా చాలా సరళంగా మంచి అవగాహనతో వుంది...

*బుద్ధం శరణం గచ్ఛామి* అనే కాలువ మల్లయ్యగారి వ్యాసం ఈనాటికీ బౌద్ధం ఎలా అవసరమో, సమకాలీన ధర్మాలతో–సిద్ధాంతాలతో ఉన్న సామీప్యతల్ని–భేదాల్ని చక్కగా వివరించింది. చిన్న వ్యాసంలో సమగ్రమయిన అవగాహనతో వ్రాశారు...*బ్రహ్మవాదం–బుద్ధుడు* గురించి భదంత ఆనంద కౌసల్యాయన్ వ్యాసం చాలా లోతయిన తాత్త్విక చర్చ జరిపింది. ఎంతటి కష్టమైన విషయాన్నయినా అందరికీ అర్థమయ్యేలా చెప్పడం ఆయన యొక్క ప్రత్యేకతగా వుంది...

*శ్రమణ సంప్రదాయం* గురించి డి. చంద్రశేఖర్‌గారు చాలా లోతులలోనికి వెళ్ళి మంచి పరిశోధనాత్మక వ్యాసం చాలా బాగా వ్రాశారు. వైదికవేన్, బ్రాహ్మణవేన్ హిందూమత కాలపరిధి ప్రచారంలో వున్నదాని కంటె ఎంత తక్కువ అనేది చక్కగా వ్రాశారు. 'శ్రమణ' పదం యొక్క అర్థం లేక వ్యుత్పత్తి అర్థం కూడా చెబితే కొత్తగా చదివే వాళ్ళకు ఉపయోగంగా వుండేది...పునర్భవం–వ్యాసం పూర్వజన్మ–పునర్జన్మ విషయాలతో పరస్పర విరుద్ధంగా వున్నట్లుగా అనిపించింది...బౌద్ధం లో స్త్రీల ప్రతిపత్తి తదితర వ్యాసాలు బావున్నాయి. మొత్తం మీద ఈ సంచిక చింతనాత్మక బౌద్ధ సంచికగా చెప్పదగిన విధంగా వచ్చింది. సంపాదకులకు, రచయితలకు అభినందనలు..." **– ఆర్. చంద్రశేఖరరావు,** మంగళగిరి.

✶ "...*డాక్టరు గారు* కథను మా వారు చదివి వినిపించారు. పేదల వైద్యసేవలో జీవితాన్ని గడిపిన *డాక్టరు గారు* లాంటి వారు తిరిగిన ఈ నేల మరింత అందంగా కనపడుతోంది–రచయిత బాల్య స్మృతులు ఎంతో ఆత్మీయంగా చెప్పారు... *గుడ్ ఎర్త్* లో మట్టి వాసన, భారతంలో భీముని భోజనం, సుందరకాండలో హనుమంతుని ఫ్లయిటు ఇవన్నీ నన్ను ఎక్కడికో తీసుకు వెళ్ళిపోయాయి. ప్రతిమాట చెక్కి పెట్టినట్లుంది సుమా...

***మిసిమి*** ద్వారా మీరందిస్తున్న రచనలు మమ్మల్ని ఎంతగా ఆనందపరుస్తున్నాయో చెప్పేందుకు మాటల్లేవు...మీకు మనఃపూర్వక అభినందనలు..."
**– లక్ష్మీసీతారామ రాజు,** ఒరిస్సా.

✶ "...*అజరామరం అజంతా* వ్యాసంలో హర్షుని తర్వాత కనిష్కుని కాలంలో అని వుంది. కాని కనిష్కుని తర్వాత కదా హర్షుడు?..."
**– అరుణ,** జనగాం.

*......మరికొన్ని ఉత్తరాలు...80వ పుటలో...*

# తెలుగు నవల తీరుతెన్నులు

(1991-2005)

- జి.యస్.చలం

"ఈ కుల వివక్ష ఏమిటి?
ఆహా! ఏ పుణ్యాత్ముడు కల్పించెనో
ఈ పాడు ధర్మంబులు"

శ్రీరంగరాజు చరిత్ర నవలలో నాయకుడు రంగరాజు వేటకు వెళ్ళి వడదెబ్బ తగిలి సొమ్మసిల్లిపోతే దరిదాపుల్లో ఉన్న కొందరు కాపులు పరుగున వచ్చి అతని నోట్లో నీళ్ళు పొయ్యడానికి ప్రయత్నిస్తారు. ఇంతలో ఒక ముసలాయన వచ్చి ఆ రాజుకి మనం నీళ్ళు పొయ్యకూడదు. ఈ నీళ్ళు తాగితే అతడు కులభ్రష్టుడవుతాడని వాళ్ళను అడ్డుకుంటాడు. ఈ సన్నివేశంలో రచయిత పై మాటలంటాడు.

1872లో నరహరి గోపాలకృష్ణమచెట్టి రచించిన శ్రీరంగరాజు చరిత్ర నవలలో రంగరాజు ఒక రాజ కుమారుడు. అతని తండ్రికి వేశ్య వలన కలిగిన మరొక కుమారుడుంటాడు. కొడుకులిద్దరినీ సమానంగానే చూస్తాడు తండ్రి. రంగరాజుకు అది నచ్చదు. అతడు ఇల్లు వదిలి పారిపోతాడు. ఒక ఊళ్ళో లంబాడి కన్య సోనాబాయి కనిపిస్తుంది. రంగరాజు ఆమెను ప్రేమిస్తాడు. ఆమెను ప్రేమించిన వేరొకడు కొండవీడుకు ఎత్తుకు పోతాడు. రంగరాజు కొండవీడుకు చేరుకుంటాడు. అక్కడ సోనాబాయి రంగరాజుకు మేనత్త కూతురని తెలుస్తుంది. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారు. ఇదీ కథ. "సోనాబాయి పరిణయము" అనే వేరే పేరు కూడా ఈ నవలకు ఉంది.



కందుకూరి
వీరేశలింగం పంతులు

గత పది పదిహేనేళ్ళలో వచ్చిన నవలల గురించి చెప్పబోతూ ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, ఇప్పుడు ఇంతింతై వట వృక్షంలా శాఖోప శాఖలుగా విస్తరించిన తెలుగు నవల దాని విశ్వరూపాన్ని విత్తనంలోనే నాటికి ఎలా ఇముడ్చుకోగలిగిందో తెలియచెప్పటానికి. కందుకూరి వీరేశలింగం పంతులు వచన ప్రబంధంగా "రాజశేఖరచరిత్ర" (వివేకచంద్రిక)ని 1878లో వెలువరించాడు. తదనంతర నవలలకి ఒక నమూనాగా ప్రచారంలోకి రావటంతో "రాజశేఖరచరిత్ర" మొదటి నవలగా గుర్తింపును, ప్రాముఖ్యాన్ని పొందింది.

నరహరి గోపాలకృష్ణమచెట్టి తన నవలను నవీన ప్రబంధమన్నాడు. 1896లో వివేకచంద్రికా విమర్శనంలో "కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి" నవల అని స్థిరపరిచేరు.

తదాదిగా తెలుగు నవల సంఘ సంస్కరణోద్యమానికి చేదోడు వాదోడుగా నిలిచింది. ఆంధ్రుల చారిత్రక వైభవాన్ని చాటిచెప్పింది. జాతీయ ఉద్యమానికి ఊపిరులూదింది. మనిషి మనోవల్మీకంలో సంచరించే సరీసృపాల విన్యాసాల్ని, వాటి హేతువుల్ని వెదికింది. పోరాటాల్లో 'మృత్యుంజయులై'న "ప్రజల మనుషుల్ని" వారి వీరోచిత గాథల్ని గానం చేసింది. ''చెలియలి కట్టల్ని'' దాటి 'స్వేచ్ఛ'గా 'మైదానాల్లో' సంచరించింది. మధ్య తరగతి బుద్ధిజీవులకు 'చదువు' నేర్పించి 'మంచీ-చెడులను' విడమరిచింది.

'అల్పజీవి'కి ఆలంబనగా నిలబడింది. 'అంధకారంలో' ఉన్న 'మట్టిమనిషి'ని గురించి ఆరా తీసింది. ఇంతచేసి రాను రాను తీరిక సమయం ఎక్కువై సుఖం మరిగి పడవలాంటి కారుల్లో రాకుమారుడి లాంటి ప్రియుడితో షికార్లు కొడుతూ పగటి కలలు కన్నది. చివరికి భూతప్రేత పిశాచాలను ఆవాహన చేసుకున్నది.

కానీ అదే సమయంలో "కొలిమంటుకున్నాది" అది రాష్ట్ర వ్యాప్తంగా రాజుకునేసరికి ఒక దశాబ్దం పట్టింది. తొంభైయవ దశకంలో వచ్చిన నవలకు చాలా వరకు ముడిసరుకు ఎనభైయవ దశకం నుంచీ లభించింది. డెభై ఎనభై దశకాల్లో జరిగిన అనేక రాజకీయ ఆర్థిక మార్పులు తొంభైయవ దశకం

జి.యస్.చలం, ఫోన్ : 9490106390

నాటి వచన రచనా భూమికని ఏర్పరిచాయి. గత కొంతకాలంగా అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకున్నాయి. స్త్రీలు, దళితులు, ముస్లింలు తమపై అమలవుతున్న ప్రత్యేక పీడనలను అక్షరబద్ధం చేస్తున్నారు. అస్తిత్వ ఉద్యమ నేపథ్యంలో సాహిత్యంలో నిర్దిష్టత ప్రాధాన్యం సంతరించుకుంది. రచయితలు, కవులు తమ తమ మూలాల్లోకి వెళ్ళి రాయడం తప్పని సరయింది. లింగవివక్ష, కులం, మతం, ప్రాంతం వంటి నిర్దిష్టతలు తెలుగు సాహిత్య సంపన్నతకు దోహదం చేస్తున్నాయి.

ఒక విప్లవ ప్రధాన స్రవంతిలో భాగమై ఉన్న స్త్రీలు, దళితులు, చైతన్య పూర్వకంగా సృజనాత్మకంగా తమను కలుపుకోలేనందువల్ల వేరు వేరు పాయలుగా విడిపోయి ఎవరికి వారు పరిష్కార విముక్తి మార్గాలు వెదుక్కుంటున్నారు.

1975 - 85ని అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన తరువాత ప్రజా రాజకీయ ఉద్యమ చైతన్యం ఈ కాలంలో అసమానతలకు సంబంధించిన అన్ని పార్శ్వాలనూ కదిలించింది. లింగవివక్ష, పునరుత్పత్తి హక్కులు, అణచివేత, పీడన, హింస, ఇంటిచాకిరి మొదలైన కీలకమైన అంశాలను లేవనెత్తింది. స్త్రీలు తమ స్వేచ్ఛకు, వ్యక్తిగత వికాసానికి ఆటంకాలుగా ఉన్న పరిస్థితులేమిటో గుర్తించి ఆ క్రమంలో వివాహం, దానిననుసరించి ఏర్పడ్డ కుటుంబం, ప్రధానమైన అడ్డంకులుగా పనిచేస్తున్నాయని గుర్తించడం జరిగింది. ఈ నేపథ్యంలో చాలా మంది స్త్రీలు తమదైన తాత్విక పునాది నిర్మించుకొని రచనలు చేయసాగారు.

ఈ సందర్భంగా తొంభైల తరువాత వచ్చిన స్త్రీవాద రచనలు పరిశీలిస్తే వెలుతురు సోకని అనేక అంశాలు అవగతమవుతాయి పరిశీలిస్తే. ఆధునిక యువతి అంతరంగాన్ని, స్వీయ మానసిక చైతన్యాన్ని ఆవిష్కరించింది అహల్య (కుప్పిలి పద్మ). ముగ్గురు పురుషులతో తనకున్న సంబంధ బాంధవ్యాలను సహ జీవనానికి, లేదా నవాచర్యానికి సంబంధించిన అంశాలను చర్చకు పెట్టింది. శాంతి నిండిన, స్నేహమయ ప్రేమతో, సమానంగా నడవగలిగే పరిస్థితికోసం ఎందుకు ప్రయత్నించ కూడదు, అంటూనే ప్రతిపాదనల్ని సున్నితంగా తిరస్కరించి ఒంటరిగా ఉండడానికే నిశ్చయించుకొంటుంది. వివాహంతో నిమిత్తం లేని స్త్రీ పురాణ సంబంధాలను స్త్రీల వైపు నుంచి వాంఛించబడడం ఆ సంబంధాలలోని ఔచిత్యాన్ని, ఔన్నత్యాన్ని పురుషాధిక్య ప్రపంచం గుర్తించలేకపోవడం అనే అంశాలను ప్రయోగం (ఓల్గా) చర్చించింది. స్త్రీలను విడదీసి పోటీకి పెట్టిన పితృస్వామ్య మాయాజాలాన్ని బట్టబయలు చేసింది.



ఓల్గా

"ఆమె అడవిని జయించింది (గీతాంజలి) తన సంక్షోభ కారణాలు, పరిష్కారాలు, కేవలం తనలో లేవని వ్యవస్థలో ఉన్నాయని గ్రహించి నివారణ కోసం ఉద్యమించింది. భిన్న పార్టీలలో శత్రువులుగా ఉన్న అగ్రవర్ణ భూస్వాముల పెత్తనం కింద నలిగిపోతున్న దళితులందరినీ సమీకరించి ఎదిరించి గ్రామాల్లో మహిళా ఉద్యమాన్ని నడిపి అగ్రవర్ణ పురుషుల అహంకారానికి బలైపోయిన స్త్రీ కథ "ఆకాశంలో సగం" (ఓల్గా). దళిత స్త్రీ నాయకత్వంలో స్త్రీలందరూ ఏకమై అగ్రవర్ణ భూస్వాములను ఎదుర్కోవడం నవలలో ముఖ్యవిషయం.

పట్టణ స్త్రీల జీవితం కన్నా దళిత స్త్రీల జీవితాలు ముఖ్యంగా పల్లెలో ఎందుకు భిన్నమైనవో చూపుతుంది "ఎల్లి" (అరుణ). కులానికి, లింగానికి, వర్గానికి సంబంధించిన అధికార సంబంధాలను పలుకోణాల్నుంచి ప్రవేశపెట్టి బయట పెత్తందారుల లైంగిక పీడన, ఇంట్లో పురుషుల పీడన, పునరుత్పత్తి హక్కులు లేని దుర్భర జీవిత పరిస్థితులను ఎరుకుల జీవిత నేపథ్యంలో చిత్రించింది.

పై నాలుగు నవలలు రకరకాల సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన స్త్రీల సమస్యలను చర్చించాయి.

కొన్నేళ్ళ క్రితం రాజస్థాన్‌లో రూప్‌కన్వర్ సతి జరిగింది. ఆ ప్రేరణతో వచ్చిన "సతిమంటలు" (సింహప్రసాద్) నవల విధవల మనోవేదనని మన కళ్ళకు కడుతుంది. వృత్తిరీత్యా, సామాజిక దౌష్ట్యంలో భాగమయిన కుళ్ళు రాజకీయాల మధ్య నిత్యం నలిగిపోతూ, విధి నిర్వహణలో సజీవ సమాధు లవుతున్న వేలాది ఎ.ఎన్.ఎం.నర్సుల జీవితాలను సమాజానికి తెలియజేసింది "సంకెళ్ళు" (పి.వి.బి.శ్రీరామమూర్తి). సలీం "జీవన్మృతులు" నవలలో కూడా నర్సులకు సంబంధించిన సమస్యలను స్పృశించాడు. గ్రామాల్లో అట్టడుగు వర్గాల్లో

స్త్రీలను, ఆసాములు కామానికి మాతంగినులుగా, బసివినిలుగా ఎలా బలి తీసుకుంటారో వి.ఆర్.రాసాని "మట్టిమనుషు"ల్లో బయటపెట్టారు. "సరిహద్దు", "రాగో" (సాధన) నవలల్లో జైని అంబక్కల జీవితాలను పరిశీలిస్తే స్త్రీలపై అత్యంత క్రూరంగా అమలయ్యే ఉక్కు చట్రంలాంటి పితృస్వామిక అణచివేత ఆదివాసీ ఆడవాళ్ళ జీవితాల్లోనూ అనివార్యమని తెలుస్తుంది. "పునరావాసం" (అప్పలనాయుడు) లో పాతికేళ్ళ గిరిజన మహిళ బంతి ఏ అనుభవాలలోంచి, కీకారణ్యం లోంచి, ఒక బిగిసిన పిడికిలై ఆమె జ్ఞానం వికసిస్తుందో మనం చూడొచ్చు. రాజకీయంగా సాంస్కృతికంగా ముస్లింల సమస్యలు చాలా ప్రత్యేక మయినవని ఇంతవరకూ వెలువడిన ముస్లిం సాహిత్యం నిరూపించింది. ఈ సందర్భంలో (సలీం) "వెండిమేఘం" నవల వెలువడింది. క్రింది స్థాయి ముస్లిం స్త్రీ జీవితాన్ని మతంలో అంతర్గతంగా ఉండే వైరుధ్యాలని వివరించడంతో పాటు తమ ఆత్మన్యూనతకి మూలాలెక్కడున్నాయో కూడా పట్టుకొనే ప్రయత్నం చేసింది.

జాతీయ అంతర్జాతీయ సంస్థలు దళిత హక్కుల కోసం పోరాటం చేస్తున్నాయి. సాంఘిక వివక్షకు, అసమానతలకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో డర్బన్‌లో 2001 లో సదస్సు జరిగింది. భోపాల్ డిక్లరేషన్, అంబేద్కర్ శత జయంతి ఉత్సవాలు, ఇవి ఇలా ఉండగా, దళితులకు రాజ్యాధికారం అనే నినాదంతో 1984లో కాన్షీరాం దళితుల రాజకీయ హక్కులు సాధించడానికి బహుజన పార్టీ స్థాపించడం. 85 లో మనరాష్ట్రంలో కారంచేడులో దళితుల ఊచకోత, 86 లో దళిత మహాసభ ఆవిర్భావం, చుండూరు, నీరుకొండల్లో దళితులపై పునరావృతమైన దాడులు జరిగాయి. రాష్ట్రంలో రిజర్వేషన్‌లు పెంచారు. కేంద్రంలో మండల కమిషన్ నివేదిక అమలు ప్రకటన, రిజర్వేషన్ అనుకూల ప్రతికూల పవనాలు, ఫలితంగా నూతన సామాజిక సమీకరణాలు రూపొందాయి.

87లో మహారాష్ట్ర రాజధానిలో దళిత రచయితల మొదటి సభలు జరిగాయి. ఇవి సాహిత్యంలో దళితుల ఉనికిని తెలియచేశాయి. 93లో హైదరాబాద్‌లోను, 95లో వరంగల్‌లోనూ 'ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక సభలు' జరిగాయి. సమస్త వర్ణ, లింగ, కుల, జాతి, మత, భాష, ప్రాంతీయ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ, అణచివేతకూ, దోపిడీకి, అసమానతలకు తావులేని నిజమయిన ప్రజాస్వామికతనూ తన సాంస్కృతిక విలువలతో కూడిన నిర్మాణానికి కృషి చెయ్యాలని తీర్మానించడం జరిగింది. అంతకు మునుపే కోస్తాలో మిషనరీల సహాయంతో ఆరంభమైన దళిత వికాసం, మార్క్సిస్ట్ ఉద్యమాలు దళితులకు ఆత్మస్థైర్యాన్నిచ్చాయి. విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రవేశించిన నేటి దళితయువత, ఆత్మన్యూనతాభావం విడనాడి కులం పేర్లను తమ పేర్లతో సహా ప్రకటించుకునే ఆత్మగౌరవాన్ని పెంపొందించుకుంది.

ఈ కారణాలన్నీ గత పది పదిహేనేళ్ళలో వచ్చిన సాహిత్యం మీద తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఈ కాలంలో వచ్చిన దళిత నవల "అంటరాని వసంతం" (కళ్యాణరావు). దాదాపు ఒకటిన్నర శతాబ్దాల కోస్తా ప్రాంత దళితుల జీవన గమనాన్ని ఉద్వేగభరితంగా వర్ణించింది. మాలమాదిగల ఉమ్మడి చరిత్ర, సంస్కృతి, జానపద కళల సంప్రదాయ నేపథ్యంలో సాగుతుంది. ఆరు తరాల అంటరాని ఇతిహాసం ఇది. నల్లమల అడవుల నుంచి నెల్లూరు సముద్రతీరం వరకూ విస్తరించిన సంచార గిరిజన తెగ యానాదులు, సామాజిక పరిణామంలో ఆహార సేకరణ దశకు చెందిన జాతి. అలాంటి ఒక యానాది మన్నోడుకి, భూస్వామి మణియంకు, మధ్య సంఘర్షణను గొప్ప శిల్పసౌందర్యంతో ప్రతీకాత్మకంగా డా॥కేశవరెడ్డి "చివరి గుడిసె" నవలలో చిత్రించారు.

తన అధికార ప్రాబల్యంకోసం కురవల్లో, రెండు తెగల వారినీ ఎర్రమరెడ్డి విడదీసినప్పుడు, చివరికి వాళ్ళంతా నిలకడ మీద నిజాన్ని గ్రహించి ఏకమవ్వడం (వి.ఆర్.రాసాని) "చీకటి రాజ్యం" ఇతివృత్తం. నిత్యం అనావృష్టి పీడిత రాయలసీమలో నీటివనరుల వినియోగాన్ని ప్రాజెక్టుల రూపంలో వ్యవస్థీకరించి చివరకు అవ్యవస్థ విస్తరణకు ఎలా దారితీస్తుందో (స్వామి) "గెద్దలాడతండాయి" నవలలో చూపించారు.

అనంతపురం జిల్లా సామాజిక రాజకీయ చరిత్రను "మీ రాజ్యం మీరేలండి" (స్వామి)లో చూడవచ్చు. అందివచ్చిన అవకాశాలను చేజిక్కించుకుని మతాలు మార్చుకుని కులస్వభావాన్ని భద్రంగా అంటిపెట్టుకుని, రెండు అగ్రవర్ణాల వారు, ఎలా దళితుల్ని కీలుబొమ్మలుగా చేస్తారో, ఈ నవల నిరూపించింది.

దళిత నేపథ్యంలో కులవర్గ దృక్పథాల నుండి, దళిత సమస్యను విశ్లేషించిన నవల (చిలుకూరి దేవపుత్ర),

"పంచమం". దళితుడు, అచేతన దశనుంచి హక్కులకోసం ఉద్యమాన్ని చేపట్టడం వరకూ సాగుతుంది. నవల్లో ప్రధానమైన కథతోపాటు స్త్రీవాదం, ముస్లింలు, క్రైస్తవులకు సంబంధించిన సమస్యలు చర్చకువచ్చాయి. గతశతాబ్దం ఎనిమిదో దశకానికి ముందట భూసంస్కరణలు మొదలుకొని, దండోరా వనాల మహానాడు వరకు, పరిణామాలను చిత్రించింది. మాలమాదిగల మధ్య అంతరాలను, అనాదిగా వస్తున్న పంతాలను, ఆసరాగా చేసుకుని తమ రాజకీయ ఆర్థిక ప్రయోజనాలకోసం అగ్రవర్ణాల వారు ఉపయోగించుకోవడం మామూలు కథే అయినప్పటికీ ఏభై ఏళ్ళ కాలాన్ని నవలలో ఇనుమడింపచేస్తూనే గత పదేళ్ళ కాలంలో గ్రామాల్లో చోటుచేసుకున్న పరిణామాలను రికార్డు చేసింది (ఎస్.వెంకట రామిరెడ్డి) "కాడి" నవల.

రాయలసీమ ముఠా కక్షల నేపథ్యంలో వేంపెంట సంఘటన స్ఫూర్తితో వెలువడిన నవల (పినాకపాణి) "నిప్పులవాగు". నల్లమల అటవీ ప్రాంతంలో పీపుల్స్‌వార్ ప్రవేశం నుంచి అనేక రాజకీయ పరిణామాలు ఇందులో చోటుచేసుకున్నాయి. భూస్వామ్య సాయుధ ముఠాలు పోలీసుల వెన్నుదన్నుతో మాదిగల్ని సజీవ దహనం చెయ్యడం నుంచి, మాలమాదిగల మధ్య ఉన్న వైరుధ్యాలను, విప్లవోద్యమ క్రమం నుంచి దండోరా వరకూ చిత్రించింది.

దళిత సమస్యకు మార్క్సిస్ట్ ఉద్యమాల సహాయం అవసరమని, దళిత బహుజన విముక్తికి వెలుగుదారి విప్లవమని, చెప్పిన నవల "దండం మీద చిలుకలు" (గోపరాజు నాగేశ్వరరావు). మధ్య కోస్తాలో దళిత బహుజనులు వృత్తుల పరాయీకరణ పొంది, దొరలకు కిరాయిహంతకులుగా, దళారులుగా మారడం చాపకింద నీరులా విస్తరించిన పీపుల్స్‌వార్ కార్యక్రమాల పట్ల దళితులు ఆకర్షితులవ్వడం, ఈ రెండు అంశాలు కేంద్రంగా నడుస్తుంది నవల. దళిత జీవిత వాస్తవాల్ని, వాళ్ళు అనేక రకాలుగా ఎదుర్కొంటున్న సమస్యల్ని "మాదిగపల్లె" (పి. నాసరయ్య) నవలలో చూడొచ్చు. దళితులను చైతన్యపరచి, వారిని సంఘటిత పరుస్తుంటే, వాళ్ళను విడదీసి బలహీనుల్ని చేయడానికి పెద్దలు ఎలా ప్రయత్నిస్తారో చెప్పారు. తెలంగాణా మాదిగ జీవితాన్ని చిత్రించిన (వేముల ఎల్లయ్య) నవల "కక్క" దళిత సాహిత్యోద్యమం, సామాజిక న్యాయం దిశగా, మళ్ళిన క్రమంలో కులవృత్తి నేపథ్యంలో (వీర) మాండలికంలో వచ్చిన నవల ఇది. పాలేరు జీవితంతో తృప్తిపడని ఓ మాదిగ యువకుడు, కులవృత్తివేపు మళ్ళడం కథకు ఆయువుపట్టు. దళితుడి ఆత్మగౌరవానికిది నిక్కమైన నిదర్శనం. "సూర" (భూతల ముత్యాలు) నవలలో కూడా ఒక దళిత యువకుడి స్వీయాత్మక కథగా సాగుతుంది.


శారద

వలస జీవిత విషాదం గురించి, అగ్రవర్ణాల వారి పెత్తనం గురించీ, ఆడవాళ్ళపై లైంగిక దాడుల గురించీ స్పృశించింది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వస్తున్న మార్పుల్ని "మంచి నీళ్ళ బావి" (సదానంద శారద) కేంద్రంగా చిత్రిస్తూనే మొత్తం తెలంగాణా గ్రామీణ సమాజ పరిణామాలను పరిశీలించింది. తెలంగాణా గ్రామీణ సంస్కృతిని కళ్ళకు కట్టినట్టు వర్ణించడం ఈ నవల ప్రత్యేకత. విద్యావంతుడైన ఒక మాదిగ యువకుడు, జీవితం పట్ల అతని చుట్టూ ఉన్న సామాజిక వ్యవస్థ పట్ల, మానవ సంబంధాల్లో డొల్లతనం వల్ల కలిగే మానసిక సంవేదన సంఘర్షణ ప్రతిరూపమే "వేర్లు" (కేతు విశ్వనాథరెడ్డి). ముప్పయ్యేళ్ళ క్రితం విద్యావంతుడైన ఒక దళితుడి అంతరంగానికి అద్దం ఈ నవల. అయిదారు తరాలుగా వీధినాటకాలే జీవనోపాధిగా జీవించిన ఒక కుటుంబం పడిన కష్టనష్టాల్ని వారు వేసుకున్న రంగుల వెనుక ఉన్న విషాదాన్ని బొమ్మకట్టించారు "బతుకాట" నవలలో వి.ఆర్.రాసాని.

వేసవికాలం, వర్షాకాలం, శీతాకాలం ఈ మూడు కాలాల్లోనూ రజకులు వృత్తిపరంగా ప్రకృతితోనూ, అగ్రవర్ణాల వారితోనూ నిత్యఘర్షణ (జి.ఎన్.చలం) "రేవు" నవలలో చూడొచ్చు. ఇదే ఇతివృత్తంతో వచ్చిన (పి.నాసరయ్య) "ఉతికేసిన బతుకులు" నవలలో తండ్రీ కొడుకులిద్దరూ తోటి రజకుల్ని చైతన్యవంతుల్ని చెయ్యడం, అగ్రకులాల వారి ఆధిపత్యాన్ని ప్రశ్నించడం, ఇందులో కథ.

దళిత స్త్రీలను జోగినులుగా మార్చడం నుంచి, దళితులపై దాడులను "జగడం" నవలలో బోయ జంగయ్య చిత్రించారు. నవలంతా సామాజిక పరిస్థితుల చిత్రణే ప్రాధాన్యంగా సాగింది. సంసారాలను కూల్చే సారాను

నిషేధించాలనే డిమాండుతో సారాజులను, వారి మద్దతుదారులతో గద్దెనెక్కిన పాలకులను గజగజలాడించిన మహోజ్వల మహిళా ఉద్యమం సారా వ్యతిరేక ఉద్యమం. నాటి చారిత్రక సందర్భాన్ని రికార్డు చేసిన నవల (శక్తి) "పులిజూదం". భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. కరవులొచ్చినా కాటకాలొచ్చినా లెక్కచెయ్యకుండా ఎనభై శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు.

1990-91లో నూతన ఆర్థిక విధానాలద్వారా భారతదేశంలోకి ప్రవేశించిన ప్రపంచీకరణ, డబ్బుతో ముడిపడినా, ఉన్న వ్యవసాయక ఉత్పాదకాలన్నింటినీ బహుళజాతి సంస్థల ద్వారా నియంత్రించడం ప్రారంభించింది. ఇది ప్రత్యేకించి రైతు జీవితాన్ని, మొత్తం మీద గ్రామీణ జీవితాన్ని తీవ్ర సంక్షోభం లోకినెట్టేసింది. 95లో గాట్ ఒప్పందం W.T.O. రూపంలో మన ముందుకు వచ్చింది. (సభ్యత్వ హోదాలో మనదేశం కూడా ఉండడం గమనించ దగ్గది). దీని ముఖ్య లక్ష్యం వ్యవసాయ రంగంలో మార్కెట్ దృక్పథాన్ని ప్రవేశ పెట్టడం. వ్యవసాయం ఒక జీవనోపాధి మార్గంగా ఉన్న పరిస్థితి నుంచి అది ఒక లాభార్జన దృష్టిగల పారిశ్రామిక సంస్థగా అవతరించడానికి రంగం సిద్ధమైంది. ఆహార ఉత్పత్తుల స్థానాలలో, వాణిజ్య పంటలు ప్రవేశించాయి. మార్కెట్టులో వచ్చే ఒడిదుడుకులు, చాలా సందర్భాలలో, రైతు జీవితంలో కొత్త సమస్యలు తెచ్చిపెట్టాయి. సహకార రంగాల రద్దు, సబ్సిడీల కోత, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి లేకపోవడం, మొత్తంగా ఈ సంక్షోభానికి పరాకాష్ట రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి దారితీసింది.



కేశవరెడ్డి

ఛిన్నాభిన్నమైన గ్రామీణ వ్యవస్థని చిత్రించే సాహిత్యం తెలుగులో వివిధ ప్రక్రియల్లో వచ్చినప్పటికీ, ఈ సద్యస్ఫృహతో అయినా కాకపోయినా, రైతు జీవితాన్ని గురించి, కొద్దో గొప్పో నవలలు కూడా వచ్చాయి. భూమికి, రైతుకి ఉన్న సంబంధం తల్లీబిడ్డల సంబంధం. పండినా పండకపోయినా, చివరకు అడుక్కుతినే పరిస్థితి దాపురించినా, భూమిని అమ్ముకోవడానికి మాత్రం ఇష్టపడడు. కానీ మారుతున్న సామాజిక వ్యవస్థలో భూమిని బేరం పెట్టడం అనివార్యమవుతుంది.



చంద్రలత

పిల్లల్ని చదివించి, వివాహాలు జరిపించాలన్నా రైతుకున్న ఆధారం అదొక్కటే (కాలువ మల్లయ్య), "భూమి పుత్రుడు" నవలలో కొండమల్లయ్య పరిస్థితి కూడా అంతే. భూమిని తప్పనిసరై అమ్ముకొని పట్టణానికి వలసపోతాడు. ఇది వాస్తవ చిత్రణ. "మూగవాని పిల్లనగ్రోవి (డా॥కేశవరెడ్డి) నవలలో కూడా భూమితో రైతుకున్న సంబంధం అన్యోన్యత ఎంత గాఢమైందో, ఎడబాటు రైతు అస్తిత్వాన్ని ఎంతగా కుంగదీస్తుందో, జానపదుల విశ్వాసాల నేపథ్యంలో బలమైన, గాఢమైన, తాత్విక పునాదితో చర్చించారు.

అప్పుకింద తన భూమిని మణియం చేజిక్కించుకున్న తరువాత, బక్కరెడ్డి తనిక కాపోడిని కానంటాడు. ఆ అర్హత లేదంటాడు. మిత్రుడు మాత్రం కాపు కులంలో పుట్టినోడివి కాపోడివి కాకుండా ఎలా పోతావంటాడు.

"కాడి" నవలని దళిత నవలల్లో చేర్చినప్పటికీ, రైతు జీవితానికి సంబంధించిన అనేక అంశాలను కూడా స్పృశించింది. అసలు ఈ నవల ఏ రకమయిన వింగడింపుకీ లొంగనిది. పాలేర్లు ఉన్నవాళ్ళు కాడిని చేపట్టే స్థాయికి ఎదగడం, వ్యాపార సంస్కృతి కారణంగా అగ్రవర్ణాల వారు ఎందుకు వదులుకున్నారో అదే కాడిని 'సొంతం' గా చేపట్టడానికి దళితులు ఎందుకు ఆరాటపడవలసి వచ్చిందో అద్భుతంగా చిత్రించింది.

మధ్యకోస్తా నుంచి తెలంగాణా పోయి ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేపట్టి బీడు భూమిని సస్యశ్యామలం చేసిన ఒక కృషీవలుని కథ "రేగడి విత్తులు" (చంద్రలత-వలసకు సంబంధించిన పరిమితులున్నప్పటికీ).

ఈ దశాబ్దిలో వ్యవసాయానికి సంబంధించిన అనేక అంశాలను శాస్త్రీయంగా చర్చకు పెట్టింది. వ్యవసాయం వ్యాపార మార్గం పట్టిన తరువాత సంప్రదాయ సేద్యం, దానికి ఆలంబనగా ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థా, ఏ విధమయిన మార్పుకు లోనయ్యిందీ ఈ నవలలో విశ్లేషించారు.

పత్తికాయను పురుగు దొలిచినట్టు రైతుల రక్తాన్ని దళారులు ఏవిధంగా పీల్చేస్తున్నారో హృదయ విదారకంగా చిత్రించిన (మొలకపల్లి కోటేశ్వరరావు) నవల "ఆక్రందన." నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, గిట్టుబాటు ధర లేకపోవడం, అప్పులు, వడ్డీలు, ఈ క్రమం అంబయ్య అనే రైతు కుటుంబాన్ని (భార్య, చెల్లెలు ఆత్మహత్య) ఎలా విచ్ఛిన్నం చేసిందో చూపింది. గ్రామాలు ప్రగతికి పట్టుకొమ్మలనీ, భారతదేశానికి ఆత్మలని, ఎవరెన్ని రకాలుగా చెప్పినా, కూడు, గుడ్డ, చదువు, వైద్యం, త్రాగునీరు వంటి మౌలికమైన సౌకర్యాలు లేని గ్రామాల అభివృద్ధికి, అలవిమాలిన అభిమానంతో కృషిచేసిన పాత్రలు కొన్ని నవలల్లో చూడవచ్చు. "పల్లె పిలిచింది" (ద్వారక) నవల ఒక ఉపాధ్యాయుడి కనీస కర్తవ్యాన్ని, కఠోర శ్రమని, తెలియచేసిన నవల. పల్లెతో అతడు మమేకమయ్యే వైనాన్ని, గొప్ప గొప్ప మార్పుల్ని, చిన్న చిన్న లక్ష్యాలు ఎలా నిర్దేశిస్తాయో నిరూపించిందీ నవల.

ఏ రకమయిన సౌకర్యాలూ లేని పాలెం గ్రామానికి, రహదారి ద్వారా పట్టణానికి అనుసంధానం చేస్తే, స్వాలంబన సాధ్యమవుతుందని విశ్లేషించి చెప్పిన నవల "ది రోడ్" (చంద్రశేఖర్ ఆజాద్). రావిశాస్త్రి నవలల్లో కథా సందర్భంలో తప్ప, కేవలం పోలీసులకు సంబంధించిన వస్తువుతో వచ్చిన నవలలు తెలుగులో చాలా తక్కువ.

96లో వచ్చిన ఖాకీ బతుకులు (స్పార్టకస్) నవల పోలీసు వ్యవస్థలోని కింది స్థాయి ఉద్యోగి జీవితాన్ని చిత్రించింది. తన అట్టడుగు కులాన్ని, చేస్తున్న అట్టడుగు ఉద్యోగాన్ని, రచయిత నవల ఇతివృత్తంగా, స్వీకరించడం ఈ నవల ప్రత్యేకత. సమకాలీన సమాజంలోని పోలీసు కానిస్టేబుల్స్ చుట్టూ అల్లుకు పోయిన కుల, మత, ఆర్థిక, రాజకీయ సమస్యలతో పాటు, అధికార్ల జులుం, వృత్తి సమస్యలు, కులపరంగా అదనంగా ఎదుర్కొనే పీడన, ఈ నవలలో చాలా విపులంగా విస్తారంగా చర్చకు వస్తాయి.

ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యక్తిత్వానికి, ఉద్యోగ ధర్మానికి మధ్య జరిగిన సంఘర్షణ నేపథ్యంగా, పోలీసు వ్యవస్థపై రాజకీయాల దుష్ప్రభావం, వివిధ స్థాయిల్లో అధికారుల మధ్య జరిగే ప్రచ్ఛన్న యుద్ధాన్ని మనకు తెలియచేస్తుంది. "నిర్జీవయాత్ర" (సత్యవోలు సుందర సాయి) నవల. కరుడుగట్టిన ఖాకీల కఠోర ఆదేశాలకు, వాటి అమలుకు, చిల్లర మల్లర దొంగతనాలు చేసేవాళ్ళు ఎలా బలైపోతారో థర్డ్ డిగ్రీ, వాళ్ళపై ఎంత పాశవికంగా ప్రయోగింప బడుతుందో, ఒళ్ళు జలదరించే విధంగా దృశ్యమానం చేశారు (మొలకపల్లి కోటేశ్వరరావు) లాకప్ నవలలో.

అటూ ఇటూ కాని వయస్సులో, తెలిసో తెలియకో చేసిన తప్పుకు, చిన్నపిల్లలు బాలనేరస్తులుగా చీకటి బతుకులు బతకవలసిన దుస్థితిని వర్ణించారు, చిలుకూరి దేవపుత్ర "చీకటిపూలు" నవలలో. అమ్మానాన్నల ఆలనా పాలనా లేక, వీధిబాలలు నేరస్థులుగా ఎలా మారుతారో, మానసిక పరివర్తనకు దోహదపడవలసిన కారాగారాలు, ఆ పని చేయకపోతే పిల్లల్లో పెరిగే వ్యతిరేక భావాలు ఈ నవలలో ప్రస్తావించారు. పై నాలుగు నవలల్లో పోలీసుల్లో పై అధికారులు, అట్టడుగు ఉద్యోగులు, కటకటాల్లో చిల్లర దొంగలు, బాల నేరస్తులు ఇలా నలుగుర్నీ నాలుగు కోణాల్లో చిత్రించడం జరిగింది. ఎన్ని లాకప్ డెత్‌లు జరిగినా, చిన్న పిల్లలమీద ఎన్ని దాడులు జరిగినా, ఎన్ని దాడులు జరిగినా, ఎన్ని అత్యాచారాలు జరిగినా, న్యాయం చీకట్లో పిల్లిలాంటిదని, దాని ఆనుపానులు పట్టుకోవడం కళ్ళకి గంతలు కట్టుకున్న న్యాయదేవత వల్లకాదని, దాన్ని కనిపెట్టాల్సిన వాళ్ళు దాచి పెట్టడానికే తోడ్పడుతున్నారనీ, పౌరహక్కులకు సంబంధించిన అనేక కోణాల్ని స్పృశిస్తూ న్యాయ వ్యవస్థని శాసిస్తోన్న శక్తుల గురించి చర్చకు పెట్టిన నవల "చీకట్లో నల్లపిల్లి" (నందిగం కృష్ణారావు).

ప్రజాస్వామ్యం ఎంత మేడిపండు చందంగా ఉంటుందో, "రిగ్గింగ్" (విశ్వమోహనరెడ్డి) నవలలో విడమరిచి చూపించారు. అభ్యర్థుల ఎంపిక నుంచి, ప్రచారం, పోలింగ్, కౌంటింగ్‌లలో జరిగే అక్రమాలు, వాటిని మనం కనీసం ప్రశ్నించ కుండా, పరోక్షంగా అలాంటివి కొనసాగడానికి ఎలా సహక



రా.వి. శాస్త్రి

రిస్తున్నామో, ఈ నవల ప్రతి బింబించింది. పోలీసులు, న్యాయ వాదులు, రాజకీయ నాయకులు, పత్రికలు, ఈ నాలుగు రంగాల నీతిమాలినతనాన్ని అత్యంత వ్యంగ్య వైభవంతో చీల్చి చెండాడారు, "గోపాత్రుడు" ('పిలక తిరుగుడు పువ్వు' దీనికి కొనసాగింపే) నవలలో కె.ఎన్.వై.పతంజలి. డెబ్భైలలో నిర్దిష్టమైన లక్ష్యంతో కొత్త రూపం తీసుకున్న ప్రజారాజకీయ ఉద్యమాలు, పౌరహక్కుల ఉద్యమాలు, ఎనభైలలో మరింత బలపడి, ప్రజా ఉద్యమాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాలకు ఉన్న వైరుధ్యం స్పష్టంగా బయటపడింది. వర్గ సమాజంలో జీవితం తప్పనిసరిగా వర్గస్వభావాన్ని కలిగి ఉంటుందని, రచయితలకు దోపిడీవర్గం, దోపిడీకి గురవుతున్న వర్గం – ఈ రెండు రకాల వాళ్ళ జీవితం గురించి స్పష్టమయిన అవగాహన ఉండాలన్న చైతన్యం బలపడింది. ఈ రకమయిన చైతన్యంతో జీవితాన్ని కొత్త కోణాల నుంచి చూపిస్తూ వేరు వేరు రంగాలలో వివిధ అంతరువులలో ఉన్న సంక్లిష్టతను, సమస్యలనూ, సంఘర్షణనూ వస్తువుగా చేసికొని వస్తోన్న నవలలున్నాయి.

దళజీవితాన్ని, దళాలకు గ్రామీణ జనజీవితంతో ఉన్న అనుబంధాన్ని, గ్రామీణ జీవితాన్ని అభివృద్ధికరంగా మార్చడం, దళాలు నిర్వహించే పాత్రను, దళాలకు, ప్రభుత్వ పోలీసు యంత్రాంగానికి, మధ్య నడిచే రాజకీయ వ్యవహారాన్ని వస్తువుగా చేసుకొని, సామాజిక నవల, పోరాట నవలగా మలుచుకున్న నవలలు "సరిహద్దు", "రాగో" (సాధన) నవలలు. మన రాష్ట్ర సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర అరణ్య ప్రాంతాల్లోని ఆదివాసీ రైతాంగ ఉద్యమం, "సరిహద్దు" నవలకు ఇతివృత్తం. గిరిజనులపై పోలీసులు, ఫారెస్టు అధికారులు సాగిస్తున్న నిరంకుశ దోపిడీ దౌర్జన్యాలే ముఖ్యమైన అంశాలు.

బలవంతపు పెళ్ళి నిర్బంధాల నుంచి విపరీతంగా పెనుగులాడి బయటపడి దళంతో కలుస్తుంది "రాగో". తను అనుభవించిన క్షోభ–స్వేచ్ఛకోసం పడే ఆరాటం, మీడియా స్త్రీలందరిలోనూ చూస్తుంది రాగో. పంజరం లాంటి జీవితం నుంచి ఏ కట్టుబాట్లు లేని అరణ్యంలోకి, అక్కడి నుంచి ఆశయ పథంలోకి పయనించింది. నేటి యువతరం కంప్యూటర్‌లలో తమ భవిష్యత్తుని వెదుక్కుంటున్న సమయంలో సామాజిక భవిష్యత్తుని గురించి ఆలోచించవలసిన అవసరాన్ని గుర్తుచేస్తుంది "వేకువ పూలు" (జతిన్ కుమార్). వామపక్ష ఉద్యమంలో పనిచేసే స్త్రీ పురుష సంబంధాల్లో నెలకొన్న వివక్షనూ బయటపెట్టింది. ప్రాణభయంతో దొరలు ఎక్కడున్నా, గ్రామాలపై ఏదో ఒక పద్ధతిలో పట్టును బిగించి ఉండడం, ఆర్థికంగా జరిగిన మార్పులు, వ్యవసాయం, దాని అనుబంధ వృత్తులమీద ఎలాంటి చావుదెబ్బ తీసిందో, ఈ మార్పు ఎలాంటి అరాచకానికి దారితీస్తుందో చూపింది పులుగు శ్రీనివాస్ "అన్నలు". బూటకపు ఎన్‌కౌంటర్లు నిర్వహించే పోలీసులను విమర్శిస్తూనే, అన్నల్లో వివిధ శిబిరాల మధ్య నెలకొన్న శత్రువైఖరులను, వాళ్ళు బలిగొంటున్న అమాయకులను, ఇలా అనేక అంశాలను విశదపరిచారు.

అటు నక్సలైట్లకు, ఇటు పోలీసులకు, మధ్య నలిగే ఆదిలాబాద్ గోండు గిరిజన యదార్థ జీవితం "ఊరు" (వసంతరావు దేశ్‌పాండే) నవల చిత్రీకరించింది. గిరిజనులకు పునరావాసం పేరుతో పాలకులు చేసే ప్రచారాలు ఉత్తుత్తివేనని గిరిజన జీవన సంఘర్షణకు భూమి కేంద్రమనేది మనకు ఎరుకపరుస్తుంది, అప్పలనాయుడి "పునరావాసం". శ్రీకాకుళ ఉద్యమ నేపథ్యంలో వాస్తవాన్ని, కల్పననూ, జ్ఞాపకాన్ని, కలగలిపి అల్లిన నవలిది.

"ఆ కొండల వెనుక" (ఇ.రామచంద్రం) నవల కూడా గిరిజనులను ప్రధాన జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చేసే కృషిలో నిబద్ధత కొరవడి, గిరిజనులు పడేపాట్లు చిత్రించింది. 'ప్రాంతీయత' ఇటీవల తెలుగు సాహిత్యంలో ప్రధాన వస్తువయింది. నిర్దిష్ట ప్రాంతీయ ప్రత్యేకతతో రచన సాగించడమో ఆ ప్రాంతానికున్న చరిత్రని, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని, చెప్పడమో రచయితల ఉద్దేశంగా కనిపిస్తుంది. ఈ దృష్టితో చూసినప్పుడు మూడు ప్రాంతాల నుంచి వచ్చిన నాలుగు నవలలు ప్రత్యేకంగా అనిపించాయి. కళింగాంధ్ర నుంచి అప్పలనాయుడి "ఉత్కళం", రాయలసీమ నుంచి శాంతినారాయణ "పెన్నేటి మలుపులు", తెలంగాణా నుంచి దాశరథి రంగాచార్య "అమృతంగమయ", నవీన్ "కాలరేఖలు".

గత ఎనభై ఏళ్ళ కాలపరిమితి గల "ఉత్కళం"లో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాల కథ ఉంది. ఉనికికోసం మనిషికోసం మట్టిమనుషులు ఎలాంటి పోరాటాలు చేయవలసి వస్తుందో ఈ నవల వివరిస్తే ఎనభై దశకంలో రాజకీయ గ్రామాల నేపథ్యంలో అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన సామాజిక చలనాన్ని రికార్డు చేసింది "పెన్నేటి మలుపులు". తుంగభద్ర కాలువ సాగునీటి మూలంగా భూస్వాముల సంబంధాల పరిధిలో చెన్నంపల్లి సామాన్య జనాల బతుకుల్లో భూస్వాముల రాక్షసత్వాన్ని మనకళ్ళకు కడుతుంది. గ్రామీణ జీవితంలోని అనేక పార్శ్వాలను వాటి అంతః సంబంధాలను వెల్లడించింది. "అమృతంగమయ"లో స్వాతంత్ర్యానికి పూర్వం ఏభై ఏళ్ళు, తరువాత ఏభై ఏళ్ళు, ఈ వందేళ్ళ కాలంలో తెలంగాణ గ్రామీణ జీవితంలో సాంఘిక ఆర్థిక, రాజకీయ పరిణామాలు విచ్చలవిడి పాశ్చాత్య నాగరికత పోకడలు పర్యావరణం ఈ అంశాల నేపథ్యంలో సాగుతుంది. "కాలరేఖల్లో", 1944 ఆంధ్ర మహాసభ ప్రారంభం నుంచి 56 ఆంధ్రప్రదేశ్ ఏర్పడినంతవరకూ మధ్య కాలాన్ని ప్రాతిపదికగా చేసుకొని నాటి సాయుధ రైతాంగ పోరాటం చెప్పబడుతుంది.

కె.ప్రతాపరెడ్డి "బందూక్" నవల నాటి నిజాం నవాబుల పాలనలో దొరల అక్రమాలు రజాకార్ల దురాగతాలు వివరిస్తే ముదిగంటి సుజాతారెడ్డి "మలుపుతిరిగిన రథచక్రాలు" కూడా తెలంగాణా సాయుధ పోరాటానికి సంబంధించిన ఇతివృత్తంతోనే సాగింది. "మంటలు మానవత్వం" (సరిపల్లి కృష్ణారెడ్డి) నవలలో రజాకార్లు సృష్టించిన హింసలో కొంతమంది ముస్లింలు అనుకూలంగా ప్రవర్తించగా మరికొంతమంది ముస్లింలు మాత్రం ఎదురు తిరగడం ఇతివృత్తం.

"జగడం" దళిత నేపథ్యంలో సాగినప్పటికీ నవల రజాకార్ల ఆగడాలతో ఆరంభమవుతుంది. కాలువ మల్లయ్య "సాంబయ్య చదువు" లో 1947 – 95 పాఠశాల నుంచి కళాశాల విద్య వరకు వచ్చిన మార్పులు ఆంధ్ర తెలంగాణ ఏర్పాటు ఉద్యమం, నక్సలైట్ ఉద్యమం తెలంగాణను ఏ మేరకు ప్రభావితం చేశాయో విపులీకరించారు. తెలంగాణ సాంఘిక సాంస్కృతిక జీవితాన్ని, దొరల నిరంకుశ పీడనకు, దోపిడీకి గురవుతున్న ఒక గ్రామాన్ని, ఆ దొరల కబంధ హస్తాల నుంచి విముక్తం చేసిన, ఒక గాంధేయవాది కథ "నిరుడు కురిసిన కల" (బి.మురళీధర్). హైదరాబాద్ చారిత్రక నేపథ్యాన్ని విశిష్టతను లోకేశ్వర్ "సలాం హైదరాబాద్" నవలలో చిత్రించారు. పరస్పర మత సహనంతో మానవత్వం వెల్లివిరిసిన ఒకప్పటి నగర జీవన సరళిని ఆవిష్కరించారు. కాకినాడ యానాంల మార్గాలలో ఉన్న కోరంగికి చారిత్రకంగా చాలా పేరుంది. ఆంగ్లో ఫ్రెంచి యుద్ధాలు మొదలుకొని ఒక పల్లెలో జరిగిన మామూలు సంగతుల వరకూ చిత్రించింది "బంకోలా" నవల. ఒక చారిత్రక సంఘటన ప్రభావం సమకాలీన సమాజంపై ఎలాపడుతుందో నిరూపించింది.

సింహప్రసాద్ "స్వేచ్ఛా ప్రస్థానం" స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో ప్రారంభమై అయిదున్నర దశాబ్దాల తెలుగు రాజకీయ చరిత్రను ఓ మహిళా కేంద్రస్థానంగా చేసుకొని సాగింది. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు ఉన్న సమస్యలను చిత్రిస్తూ కూడా కొన్ని నవలలు వచ్చాయి. కళ్యాణి రచించిన "భేటి" నవల పాఠశాలలో మార్గదర్శకులుగా ఉండవలసిన ఉపాధ్యాయుల్లో క్రమశిక్షణ, నిజాయితీ లోపిస్తే సున్నిత మనస్కులైన పిల్లలు ఎంత నొచ్చుకుంటారో లోకంలో మంచిపట్ల వారిలో ఎలాంటి అపనమ్మకం కలుగుతుందో వివరించారు. గారాబంగా పెరిగిన పిల్లలు కన్నవారి నుంచి, పెరిగిన పరిసరాల నుంచి దూరమైనప్పుడు ఆ పిల్లల్లో రేగిన కల్లోలమే చంద్రలత "వర్ధని" నవల. భావుకుడయిన ఒక విద్యార్థి హృదయంలో ఎగిసిన రాగరంజిత భావాలు, కలలు, కోరికలు సంఘర్షణలు లేఖా ప్రక్రియలో సాగింది చంద్రశేఖర్ ఆజాద్ "నాన్నకో ఉత్తరం" నవల. విద్యార్థి "తొలిఅడుగు" నవలలో ఆశనిరాశల మధ్య కొట్టు మిట్టాడుతున్న విద్యార్థులకు నేటి కర్తవ్యాన్ని, వారిపట్ల తల్లిదండ్రుల ప్రవర్తనని, ఉపాధ్యాయుల బాధ్యతని గుర్తుచేస్తుంది.

'ది యూనివర్సిటీ' నవలలో కె.సురేష్ చాలా ఆసక్తికరమైన, ఆలోచించ వలసిన ప్రతిపాదన చేశారు. లోపభూయిష్టమైన విద్యా విధానం వల్ల విద్యార్థుల్లో స్వార్థం,

సంపాదన తన కోసమే తను, అనే భావన పెరిగిపోతుందని ప్రత్యామ్నాయంగా శాస్త్రీయమైన విద్యాబోధన గురించి రచయిత కొన్ని సూచనలు చేశాడు. పరిశోధనా రంగాలలో విశ్వవిద్యాలయ ఆచార్యులు గైడులుగా వ్యవహరిస్తూ విద్యార్థులను పెట్టే ఇబ్బందులను "స్కాలర్" నవలలో ఏకరవు పెట్టారు సీతా రత్నం. ప్రపంచం ముందున్న అతి పెద్ద సమస్య, అత్యంత ప్రమాదకరమైన సమస్య పర్యావరణం. ఈ అంశాల పట్ల కూడా రచయితలు స్పందించిన తీరు అభినందనీయం. పరిశ్రమలు సృష్టిస్తున్న కాలుష్యం జనజీవనంపై చూపిన దుష్టభావం ప్రాణ్‌రావు "నీలిపాప" నవలలో బయటపెట్టారు. అభివృద్ధి పేరిట విస్తరిస్తున్న పరిశ్రమలు పర్యావరణానికి, మనిషి మనుగడకి, ఎలా పరిణమించాయో ఇందులో చూడవచ్చు.

ఆనకట్టల నిర్మాణం వల్ల జరిగే సాధక బాధకాలను ఒక గ్రామం ప్రాతిపదికగా పరిసరాలు, కాలుష్యం, నీటి సమస్య వంటి పర్యావరణ సమస్యలతో చర్చించింది "దృశ్యాదృశ్యం" (చంద్రలత) నవల. ఊర్లు పట్టణాలుగా పట్టణాలు నగరాలుగా మారుతున్న పరిణామ క్రమంలో ఆవాస భూములు అమ్మకపు సరుకై సంపదల అభివృద్ధిలో ఎలా భాగమవుతాయో విశదపరుస్తుంది. "ఇల్లు" (రాచకొండ విశ్వనాథశాస్త్రి) నవల. ఇల్లు ఉనికికి ఆలంబన కాని వ్యాపార సంబంధాలు బలపడే క్రమంలో ఉనికికి సంబంధించిన అంశాలు సైతం ఆర్థిక విలువలుగా మారిపోయి లాభనష్టాల దోపిడి దురాగతాల పరిధిలోకి వెళ్ళిపోతాయని నిరూపించిన నవల.

వైద్య విజ్ఞాన రంగంలో జరుగుతున్న ప్రయోగాలు సంతానోత్పత్తి విషయంలో జన్యుశాస్త్ర విషయంలో ఇటీవల పరిశోధనలు ప్రాతిపదికగా చేసుకుని రాసిందే కె.కె.మీనన్ "క్రతువు". కృత్రిమ గర్భధారణకు ముందు, తరువాత, రమేష్ దంపతుల మానసిక మార్పులు ఈ నవల సహజంగా వర్ణించింది. ధనకాంక్ష, భోగలాలసతనీ, స్త్రీ పొందు పొందేందుకు ప్రజల మూఢత్వాన్ని, బలహీనతల్ని వాడుకొనే వారు మన సమాజంలో ఇటీవల మరీ ఎక్కువయ్యారు. ఈ క్రమంలో మనకు చాలా మంది బాబాలు, స్వాములు, అమ్మలు, యోగులు, అవతారాలు కనబడుతున్నారు. వీళ్ళు సాగించే చీకటి తప్పులను విశ్వమోహనరెడ్డి తన "నరబలి" లో బట్టబయలు చేశాడు. వృత్తిరీత్యా పాత్రికేయుడైన కె.రామచంద్రమూర్తి అంతర్జాతీయ రాజకీయాలలో నాలుగు దశాబ్దాలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను పాత్రికేయ పద్ధతిలో సెప్టెంబరు 11, 2001 నేపథ్యంలో రాసిన నవల, "కాలమేఘం".

ఇంకా అమెరికిండియా సంస్కృతి మీద "నీళ్ళలో చంద్రుడు", కల్లుగీత కార్మికుల మీద "బతుకుతాడు" దళిత నేపథ్యంలో "అయిదు హింసలు", "దిక్కుమొక్కులేని జనం", "ఊర్మిళ", "ఆకాశంలో విభజన రేఖల్లేవు", మొదలయిన నవలలు వచ్చాయి. (నా దృష్టికి రాని మరికొన్ని మంచి నవలలు కూడా ఉండవచ్చు) శిల్పం సంగతి కాస్తా పక్కన పెడితే తెలుగు నవల పుట్టిననాట ఇంతకు ముందులేని వస్తు వైవిధ్యం ఈ పది పదిహేనేళ్ళలో తెలుగు నవల సాధించిందని చెప్పవచ్చు. తమ దృక్పథానికి ప్రాంతీయ జీవిత చైతన్యాన్ని మాండలిక మాధుర్యాన్ని అనుసంధించి విజయు వంతమయ్యారనీ చెప్పవచ్చు. మునుపటి రచయితలు వెళ్ళని జీవిత పార్శ్వాలలోకి అనుభవమూలాల్లోకి ఈనాటి రచయితలు వెళుతున్నారు. జీవితం మారుమూలల్లోకి కల్పనా సాహిత్యం చొచ్చుకుపోయినప్పుడు జీవితం మరింత విస్పష్టంగా అర్థమవుతుంది. జీవితం నుంచి పుట్టిన రచనకు మరింత సమగ్రత ఏర్పడుతుంది.

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కనుక రచనలన్నిటినీ వాటి సామాజిక అస్తిత్వాల నుంచి పరిశీలించడం జరిగింది. పరిశీలించిన తరువాత ఆధునిక ఇతిహాసం, నవల, అన్నమాట బలపడింది. సకల జీవన రంగాల్లోకి ప్రపంచీకరణ చొచ్చుకు వచ్చింది. దాని దారుణ ఫలితాలను అనుభవిస్తున్నాం. సామాజిక సంబంధాలు, మానవీయ అంశాలు ఎలా దెబ్బతింటున్నాయో, మన జీవితాల్లోని సున్నితమైన అంశాల్లోకి సైతం ప్రపంచీకరణ ఎలా చొరబడిందో మనం ఏం కోల్పోయామో, కోల్పోనున్నామో చిత్రిస్తూ (కథ, కవిత వచ్చినప్పటికీ) బృహత్తర నవలలు రావలసి ఉంది. మి

# బుర్రకథ
# జానపద కళారూపం

– దామెర వెంకట సూర్యారావు

ముగ్గురు వ్యక్తులతో కూడిన కళారూపంగా తెలుగు వారి సాంస్కృతిక జీవనంలో అనిర్వచనీయ మైన పాత్రను పోషించింది బుర్రకథ. ఉత్తమ కళాయుధంగా చరిత్రాత్మకంగా ఆంధ్ర ప్రజాహృదయాల్లో హత్తుకుపోయింది. కథలో ప్రధాన కథకుడు తంబూరాను ఉపయోగిస్తాడు. ఈ తంబురా బుర్ర సోరకాయ లేదా గుమ్మడికాయతో చేసినదే ఉంటుంది. అందువల్ల ఇది బుర్రకథ అయింది. గుమ్మెట్లు, డక్కలనే పేర్లు కూడా వాడుకలో ఉన్నాయి.

'బుర్రకథ' అనేమాట సర్కారు జిల్లాలోనే ఎక్కువగా వినిపిస్తుంది. రాయలసీమలో తందాన కథ అంటారు. తంబురాకథ అని కూడా కొన్ని ప్రాంతాల్లో వ్యవహరించడం ఉంది. బుర్రకథ పరిణామం గురించి భిన్నాభిప్రాయా లున్నాయి. బుర్రకథ యక్షగానం యొక్క పరిణత రూపమంటారు శ్రీనివాస చక్రవర్తి మొదలయినవారు. స్వల్పంగా మార్పులు, చేర్పులు చేసి ప్రదర్శించే తంబూరా పాటనే బుర్రకథ అంటారని జానపద వాఙ్మయ పరిశోధకులు నేదునూరి గంగాధరం పేర్కొన్నారు.

**బుర్ర కథ :**

తంబూరా పాట – తంబూరా వాయిస్తూ పాడే పాటలని అర్థం. వీటిని దాసరి పాటలని, బొబ్బిలి పదాలని కూడా వ్యవహరించే వారు. ఈ పాటలు తందాన తానాది వరుసలు ఉంటాయి. ఈ కళ దాదాపు వేయి సంవత్సరాలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్ర దేశంలో దాసర్లు, జంగాలు దీనిని తమ కులవృత్తిగా చేసుకున్నారు. పాటలు పాడుతూ యాచన చేసుకుంటూ జీవిస్తారు. ఒకడు గానీ ఇద్దరు గానీ వంత పాటగాళ్లుంటారు. డొమిక్‌లనే వాద్య విశేషాలు ధరిస్తారు. ఈ లక్షణాలు బుర్ర కథలో చోటు చేసుకున్నాయి.

**జంగంకథ – బుర్రకథ :**

జంగములంటే స్థిరనివాసం లేకుండా తిరుగుతుండే జాతి. వీరు శైవులు. ఈ జంగాల్లో నాలుగు తెగల వారున్నారు. 1. గురు జంగాలు, 2. గునుపూడి జంగాలు, 3. గూడి జంగాలు, 4. గండి జంగాలు.

వీరిలో గూడి జంగాలే జంగమ కథలు చెబుతుంటారు. బసవేశ్వరుడు కన్నడ దేశంలో వీరశైవం స్థాపించాక శివమత ప్రబోధం చేస్తూ శివకథాగానం చేస్తూ ఊరూరా సంచారం చేసే తెగ జంగాలు ఈ కథలు 'తందాన తాన' అనే వంతపాటతో నడుస్తున్నా, మధ్యమధ్యలో దరువులు, పద్యాలు కూడా ఉంటాయి. గుంటూరు జిల్లాలో *జంగంకథలు* విస్తృతంగా వుండేవని తెలుస్తోంది. దొడ్డవరపు వేంకటస్వామి ధేనువు వెంకయ్య రచించిన *ఉత్తర గోగ్రహణం* కథ చెప్పేవాడని ఇదే తొలి జంగం కథ అని ఒక అభిప్రాయం. *లక్ష్మమ్మ కథ, కామమ్మ కథ, బాలనాగమ్మ కథ, సారంగధర కథ, బొబ్బిలి కథ, దేశంగు రాజు కథ* మొదలైన కథలు గానం చేసేవారు. జంగం కథలలోని కథనం, దరువులు, పద్యాలు బుర్రకథ లోనికి దిగుమతికాగా, రాజకీయంకూడా ప్రవేశించి బుర్రకథ ఆధునికతను సంతరించుకుంది. జంగం కథ కూర్చొని పాడేవారు. బుర్రకథలో తంబూర పాటలా నిల్చొని పాడతారు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలోనే ఆంధ్రదేశంలో నెలకొన్న దారుణమైన అరాచక అమానవీయ పరిస్థితుల్లో బుర్రకథ పుట్టింది. రాయలసీమలో భయంకరమైన కరువు, విశాఖపట్నం, కాకినాడలపై బాంబులదాడి, ప్రపంచ వ్యాప్తంగా ఫాసిస్టుల విజృంభణ– ఈ పరిస్థితుల్లో ప్రజానీకాన్ని చైతన్య వంతం చేసే లక్ష్యంతో ప్రజానాట్య మండలి అవతరించింది.

డాక్టరు దామెర వెంకట సూర్యారావు, ఫోన్ : 9885188431

కళ కళకోసం కాదని అది ప్రజలకోసమని ఎలుగెత్తి చాటింది. ప్రాచీన కళారూపాలను పునరుద్ధరించింది. సమకాలీన ఇతివృత్తాలను చేర్చి ఆ కళారూపాల స్థాయిని, రూపాన్ని మార్చి కొత్త మెరుగులు పునరుద్ధరించింది. సమకాలీన ఇతివృత్తాలను చేర్చి ఆ కళారూపాలస్థాయిని, రూపాన్ని మార్చి కొత్త మెరుగులు దిద్దింది. మన ప్రాచీన జానపద కళారూపాల్లో ప్రజానాట్యమండలి బుర్రకథకు విశేష ప్రాచుర్యం కల్పించింది.

బుర్రకథ బృందంలో ఉండే ముగ్గురిలో ప్రధానమైన వాడు కథకుడు. ఇతడు పాదాల దాకా బాటిని అంటి పెట్టుకొని ఉండే తెల్ల ఇజారు ధరించి పైన బిగువు చేతులుగల మోకాళ్ల క్రింద దాకా ఉండే అంగరకా లాల్చీ ధరిస్తాడు. ఈ వస్త్రాలు చమ్కీలతో మెరుస్తుంటాయి. తలకి పట్టుపాగా ధరిస్తాడు. ముఖానికి రంగుపూసుకొని నుదుట సన్నని నామాలు పెట్టుకొని ఉంటాడు. కాళ్లకు గజ్జెలుంటాయి. చిన్న బుర్ర తంబురా చేతిలో ఉంటుంది. ఇద్దరు వంత పాటకులుంటారు. వారికి కాళ్లకు గజ్జెలు లేకపోయినా మెళ్లో డుమ్కీలుంటాయి. వీరిలో ఒకడు హాస్యం చెప్పగలవాడుగా, మరొకడు రాజకీయం చెప్పగలవాడుగా ఉంటారు. కథకు అన్వయిస్తూ సమకాలీన రాజకీయ విశేషాలను సందర్భానుసారంగా చమత్కార భరితంగా ప్రేక్షకులకు అందిస్తారు.

హార్మోనీ, తబలా, ఫిడేలు వంటి పక్కవాద్యాలుంటాయి. 'భారతాంబ' స్తవం, 'తందాన తాన' వరుసలో కథకుడు పాడి 'వినరా భారత వీరకుమారా – విజయం మనదేరా' అంటూ భారతదేశ విశిష్టతను చెప్పబోయే కథా లక్ష్యానుకూలంగా పాడి కథలోకి ఉపక్రమిస్తాడు. మధ్య మధ్యలో వంతగాళ్ల సంభాషణ చమత్కార భరితంగా, విజ్ఞానదాయకంగా సాగుతూ ప్రేక్షకులను అలరిస్తుంది. బుర్రకథ సంగీత, నృత్యాది కళల సమాహారం. ప్రేక్షకుల మనోతంత్రుల్ని మీటే ఆహ్లాదకరమైన సంగీతంతో, కంటికింపైన నృత్యాభినయంతో, మనసుని మురిపించే చమత్కార కథనంతో వినోదాన్ని, సందేశాన్ని పంచే అపురూప కళారూపం బుర్రకథ. బుర్రకథలో ఉపయోగించే వంతపద బంధాలు కూడా విభిన్న భాషలనుంచి గ్రహించ బడినాయి. పారశీక పదమైన 'భళా'కు మరాఠీ పదం 'ఛాంగ్' చేర్చి 'ఛాంగు భళారే', 'ఛాంగు భళాగా' అని వాడుకున్నారనీ 'భాయి' కి 'తమ్ముడా' చేర్చి 'భాయి భళానోయి తమ్ముడా' అని వ్యవహరిస్తున్నారని ప్రసిద్ధ విమర్శకులు రాంభట్ల కృష్ణమూర్తి పేర్కొన్నారు. కథనంలో శైలి ధారాళంగా ప్రవాహ సదృశంగా ఉండే జానపద, వ్యావహారిక, గ్రాంథిక పదాల మిశ్రమంగా ఒప్పారుతుంది. కొన్ని బుర్రకథలు ద్విపద, రగడ ఛందాల్లో నడచిన తందానతాన వరుసల్లో రచించబడినా కొందరు వీటిలో పద్యాలు, కీర్తనలు, పాటలు, వివిధ తాళయుక్తమైన మట్టులు కూడ ప్రవేశపెట్టి ఈ కళా సౌందర్యాన్ని ఇనుమడింప జేశారు.

కృష్ణాజిల్లా దివి తాలూకాలో పెండ్యాల వెంకటేశ్వరరావు, పరుచూరి రామకోటయ్యగార్లు దేశభక్తిని ప్రేరేపిస్తూ యువజన సభల్లో విజ్ఞాన దాయక కార్యక్రమంగా బుర్రకథలు చెప్పడం ప్రారంభించారు. వీరిని అనుసరించి కోసూరి పున్నయ్య, సరివి శెట్టి సుబ్బారావు, గోవర్ధన అనే ముగ్గురు కళాకారులు ఒక బృందంగా ఏర్పడి బుర్రకథలను బహుళ జనవ్యాప్తం చేశారు గుంటూరు జిల్లాలో కాకుమాను సుబ్బారావు, చింతల సూర్యనారాయణ మొదలైన వారు రష్యన్ వీరనారి టాన్యా, ఝాన్సీలక్ష్మీబాయి మొదలైన వారి కథలతో ప్రజలను ఉత్తేజితుల్ని చేసేవారు. ఆ రోజుల్లో మహిళా బుర్రకథ దళాలు కూడా ఏర్పడ్డాయి. మోటూరు ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి ఒక దళంగా *టాన్యా* బుర్రకథను ప్రదర్శించగా, కొండేపూడి రాధ, తాపీ రాజమ్మ, వీరమాచనేని సరోజిని వంటివారు సుంకర సత్యనారాయణ రచించిన వీరగాథ *అల్లూరి సీతారామరాజు* చరిత్రను చెప్పేవారు. ఈ కథ ఆనాటి విప్లవ పరిస్థితులను సమన్వయిస్తూ సాగడంతో ప్రభుత్వ నిషేధానికి కూడా గురైంది. బుర్రకథల్లో వీరగాథలే ఎక్కువగా ఉండేవి. వీరుల సాహసాన్నీ, దేశభక్తి స్మరిస్తూ ఉద్రేకపరిచేవి. *బొబ్బిలి యుద్ధం, పల్నాటి యుద్ధం* మొదలైన ఆంధ్రదేశపు చారిత్రక వీరకథలు బుర్రకథల రూపంలో బహుళ జనాదరణ పొందాయి. తంగిరాల వెంకట సుబ్బారావుగారు బుర్రకథ సంప్రదాయ వీరగాథానుకరణంగా భావించారు.

హరికథ పేరు చెబితే ఆదిభట్ల నారాయణదాసు, జముకుల పాట వింటే సుబ్బారావు పాణిగ్రాహి, గుర్తు కొచ్చినట్లు ఆంధ్ర దేశంలో బుర్రకథ అనగానే స్మరించదగ్గ మహనీయ కళాకారుడు నాజర్. 'బుర్రకథ పితా మహుడు'. ఆయన *బెంగాల్ కరువు, పల్నాటి*



**నాజర్**

*యుద్ధం* మొదలైన బుర్ర కథలను రచించారు. వీర కరుణ రసాత్మక కథల్లో నాజర్‌కు సాటిలేదు. బుర్రకథాప్రక్రియలు తనదైన ఒరవడిని, శైలిని నెలకొల్పారు. జనం గాథల్ని, బాధల్ని గుండెలు కదిలేలా ఆలపించేవారు. సుంకర సత్యనారాయణ కష్టజీవి బుర్రకథ ద్వారా భూస్వాముల పాలనలు, రైతుల, కూలీల కడగండ్లను హృదయం ద్రవించేలా చెప్పేవారు. నిడదవోలు అచ్యుతరామయ్య, నిట్టల బ్రదర్స్, కుమ్మరి మాస్టరు మొదలైన కథకులు కొన్ని తరాల ప్రజలను బుర్రకథలతో అలరించారు. ఏ పండుగైనా, ఉత్సవమైనా, జాతరైనా తెలుగునాట గ్రామసీమల్లో, బుర్రకథ ఉండాల్సిందే. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి కూడా బుర్రకథ మాధ్యమంగా ఉపకరిస్తోంది. ముగ్గురికి బదులుగా ఒక్కరే మూడు పాత్రలు నిర్వహిస్తూ ఏకపాత్రాభినయంలా బుర్రకథ ప్రదర్శించే పరిణామం కాలక్రమంలో చోటు చేసుకుంది. పాండ్రింక్ జగన్నాథం, దిమిలి పొడుగు మనిషి, ఈ రకమైన బుర్రకథను ప్రచారంలోకి తెచ్చారు. నాగరకతలో వచ్చిన మార్పుల వల్ల ఇతర కళారూపాల్లాగే బుర్రకథ కూడా అదృశ్యమై పోతోంది. కళాకారులకు ఆదరణ కరువవుతోంది. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా బుర్రకథ మౌలిక రూపం జానపద కళారూపమేనన్నది వాస్తవం.

## బవనీలు

బవనీలకే బైండ్ల, పంబాల యను పేరులున్నవి. వీరు తెలుగు దేశమందంతటను కలరు. వీరు తెలంగాణమున గ్రామదేవతల కొలువులు కొలుచుటకును, గత్తర, స్ఫోటకమువంటి రోగములను కుదిర్చెడు మాంత్రికులుగను ప్రసిద్ధిగన్నవారు. క్రీడాభిరామమున నేకవీరా మహాదేవి యెదట నిల్చి పరశురాముని కథ లెల్ల ప్రౌఢి బాడిన బవనీల చక్రవర్తి ప్రశంసగలదు. పరశురాముని కథకే ఎల్లమ్మ కథ యనియు, రేణుకా కథ యనియు మారు పేరులు. ఇప్పటికిని వీరెల్లమ్మ, పోచమ్మ కథలను చెప్పుచు భిక్షమెత్తెదరు. వీరంకమ్మను కూడ కొల్చెదరని థర్స్టన్ పండితుడు వ్రాసియున్నాడు. మాలవారి యిండ్లలో కొలువులు కొలుచుట, శుభాశుభకర్మలందు పూజాదికములు నెరపుట వీరికి పరిపాటి. వీరు మాలలందొక జాతివారు.

బైండ్లవారను పేరు వీరు వాయించెడు వాద్యమువలన కలిగి యుండును. వీరి వాద్యములకు జమిడిక, జమళిగ లనిపేరు. శిష్టులు వీనిని బవనిక లందురు. బవనికలు వాయించువారు బవనీలు. బైండ్లవారు. జమిడిక యనునది ధ్వన్యనుకరణ శబ్దము. జమిడికం దొకటి (పెద్దది) వాయించునపుడు జమిడిక జమిడిక యను ధ్వనించును. బవనీ లెప్పుడును రెండు జమిడికలు వాయించుచు కథలు చెప్పుదురు. వంతపాట పాడెడువాని చెంత నుండునది చిన్న జమిడిక. ఇది కేవలము శ్రుతికై యుపయోగపడును. టింగు టింగుమను తంత్రీ ధ్వని ఇందుండి వెడలును. రెండిటి యాకారమొకే తీరుగా నుండును. చిన్న జమిడిక నిర్మాణ మిటులుండును. ఒక కట్టె సోలకు మేక బక్కి యొకవైపున నతికించెదరు. రెండవవైపు ఏమియు నుండదు. సోల కానుకొని యొక మూరెడు దండ ముండును. దండమునకు చివర భాగమున నొక జీవగర్ర యుండును. సోలలోపలి నుండి బక్కి మధ్య భాగమున కట్టబడిన తీగ యొకటి జీవగర్రకు బిగించి యుండును. ఆ తీగపై చేతితో వాయించిన టింగుటింగుమని మ్రోయుచుండును. పెద్ద జమిడిక సోల కట్టెతో చేయబడదు. ఇది ఇత్తడితో చాల పెద్దదిగా చేయబడును; చిన్న జమిడిక కన్న నాల్గింతలుండును. దీనికి వాడబడు బక్కి ఎద్దు, దున్న మొదలగు పెద్ద జంతువులది. మరియొక విశేషమేమన దీనిలో తీగెకు బదులుగా నరముపయోగింతురు. ఆ నరముచివర నొక చిన్న కర్రపిడికిలి కట్టబడి యుండును. ఎడమచేత కర్ర పిడికిలిని లాగిపట్టి కుడిచేతితో నరముపై వాయించినచో భీకరమయిన మూడు నాలుగు దప్పులు మ్రోగిన చప్పుడు పుట్టును. చిన్నపిల్లలా ధ్వనికి భయపడగలరు. శక్తుల, గ్రామదేవతల కొలువులు చేయునపుడు వీరతిభీభత్సకార్యము లొనర్చుచు నీవాద్యముల మ్రోగించుచు గుండెలదరునట్లు చేయుదురు. మత్తు పదార్థములు గ్రోలి శక్తుల ముందర గంతులిడుచు బలిపశువులను గావుపట్టుటలో వీరు సమర్థులు. (గావుపట్టుట యనగా బలిపశువును నోటితో మెడకొరికి చంపుట.) దాని నెత్తురు గ్రోలి, ప్రేవులు దొబ్బలు నోట గరచికొని జమిడికెలు వాయించుచు వీరు వీధి వీధుల తిరుగునప్పుడత్యంత బీభత్సముగా నుండును. ఈ బవనీలే రాయలసీమలో పెద్ద దేవర కథను చెప్పెదరని కీ.శే. సురవరము ప్రతాపరెడ్డి గారు వ్రాసియున్నారు.

## శారదకాండ్రు

మన పూర్వ సాహిత్యమున నీ పేరు కానరాదు. కనుక నీ పేరు ఇటీవలిదై యుండును శారద వరుస పదములు వీరు ముఖ్యముగా పాడెదరు. ఈ పదములం దంత్యప్రాసనియమ ముండును. సాహిత్య భాగము కొంత యధికముగా నుండును. ఓ భారతి కరుణామతి, భళి శారద కరుణానిధి యనునది వంతపాట, వీరుపయోగించెడు వాద్యములందొక దానికి శారద యని పేరు. పురుషుడు ఎడమచేతితో మీటుచుండును. దీనినే శారద యందురు. శారదా దేవి స్తోత్ర మొనర్చి గీతమారంభింతురు కనుక శారద వారనబరగి యుందురని యూహింప వచ్చును. పురుషుడు గీతము పాడుచుండగా ప్రక్కనుండు నాతని యింటిది వంత పాడుచు 'డిమ్కీ' (బుర్ర) గొట్టు చుండును. నేటి రాజకాయపక్షములవారి బుర్రకథలు శారద కాండ్ర వేషములకు, గానములకు, వాద్యములకు అనుకరణములు.

– డాక్టరు బిరుదురాజు రామరాజు



# కోణార్క దేవాలయం

– ఈమని శివనాగిరెడ్డి

ఒరిస్సాలోని చంద్రభాగా నది సముద్రంలో కలిసే చోటు చిత్రంగా ఉంటుంది. అక్కడ భూభాగం ఆగ్నేయంగా చూస్తూ ఉంటుంది. ఇసుక మేటతో సముద్రపు అలలు దోబూచు లాడుకొంటూ, అల బలంగా లేచినపుడల్లా కొంత ఇసుకను తనతో పాటే సముద్రంలోకి తీసుకెళ్ళినా, అయ్యోపాపం అని మళ్ళీ కొంత ఇసుకను ఒడ్డుకు చేరుస్తూ, చూపరులను ఇట్టే ఆకట్టుకొంటుంది. పచ్చటి పరిసరాల్లో ఒకవైపు కొబ్బరి తోటలు, మరోవైపు విరివిగా పెరిగిన సరుగుడు తోపులతో, ఆ ప్రాంతమంతా ఆహ్లాదంతో నిండి ఒక వింత అనుభూతిని కలిగిస్తుంది.

ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి తిరిగొచ్చే సూర్యుడు, మాఘ శుక్ల సప్తమినాడు ఉదయాన్నే సముద్రం నుంచి అగ్ని కోణంలో పుట్టు కొస్తుంటే, వర్ణనాతీతమైన ఆక్షణంలో వేలమంది సూర్యోపాసకులు, ఆ దృశ్యాన్ని చూచి తరించి పోతుంటారు. ప్రార్థన చేస్తారు. ప్రత్యక్షనారాయణుణ్ణి చూచి పులకించిపోతారు. మరి కొంతమందైతే, సూర్య భగవానుడు తన ఏడుగుర్రాలు పూన్చిన వెలుగులు విరజిమ్మే రథంలో ముందుకు కదులుతున్నట్లు ఊహించుకొని, తమ్మే తాము మరచి పోతుంటారు.

తూర్పు తీరంచాలా పొడవైంది. వంగదేశం నుంచి కన్యాకుమారి దాకా ఎన్నో నదులు, వాగులు, వంకలు సముద్రంలో కలుస్తూనే వుంటాయి. ఎన్నో సంగమ క్షేత్రాలున్నాయి. అయినా, ఒరిస్సాలోని 'కోణార్క' (అగ్ని కోణం లోంచి సూర్యుడు ఉదయిస్తాడుగాబట్టి) భౌగోళికంగా ప్రత్యేకతను సంతరించుకొంది. వొంపు, సొంపుల నడుమ, వాలు కోణాల బాణాల ములుకులా పొడుచుకొచ్చే అగ్నికోణ సూర్య కిరణం కోణార్క సొంతం.

ఆ ఒక్క క్షణం కోసం, వేలమంది భక్తులు కాలినడకన అలుపెరుగక, ఊళ్లూ, వాడలూ, నదులూ, కాల్వలు, అడవులూ, మైదానాలు దాటుకుంటూ పంటి బిగువున వందల మైళ్ళు ప్రయాణం చేయటానికి ఎంత బలమైన సంకల్పముండాలి? అన్నిటికీ మించి తాము నమ్ముకొన్న దైవాన్ని కళ్లారా చూచి, పునీతులమవ్వాలన్న అచంచల విశ్వాసం వారిని అంత దూరం రప్పించింది. ఇంకా రప్పిస్తూనే ఉంది. చదువుకొన్న వాళ్ళకు కోణార్క సూర్యదేవాలయాన్ని ఎపుడు, ఎవరు కట్టారో తెలుసేమోగానీ, అక్షరాభ్యాసం చేయని లక్షల మందికి అవేవీ తెలియక పోయినా భక్తి–విశ్వాసాలే వారిని ఇంకా కోణార్క వైపు నడిపిస్తూనే ఉన్నాయి.

కట్టు దిట్టంగా కట్టిన, కట్టినంతెత్తు ఇప్పుడు లేకపోయినా, తరతరాలుగా తీరం వెంబడి దారిదోపిడి గాళ్ళలా తుఫానులూ, జడివానలు వచ్చినపుడల్లా, ఈదురు గాలుల భీభత్సానికి ఉలిక్కి పడిన ప్రతిసారీ ఆ ఆలయం ఏదో ఒక భాగం నేల రాలింది. ఉత్సవాలను, ఉత్సాహాలను చూచిన అనుభవమే కూలిన రాళ్లను చూచి పరాభవం చెందింది. అయినా ఇప్పటికీ ఒరిస్సా తీరంలో అందాలను ఆరబోసి, రాశిగా మారిన గతకాలపు వైభవ చిహ్నంగా భాసిల్లుతూనే ఉంది.

కట్టిన మూడొందలేళ్లపాటు దేదీప్యమానంగా వెలుగొందిన ఆ మహాద్భుత కట్టడం, మరో మూడొందలేళ్ల పాటు మౌనం దాల్చి ఇసుక తిప్పల్లో తెప్పరిల్లింది. కట్టేప్పుడు వందల, వేల ఉలుల చప్పుళ్లతోనూ, కట్టింతర్వాత రోజూ మూడు కాలాల్లో వినిపించే వేదమంత్రాల ఘోషతోనూ నిండిన ఆ ప్రాంతం దాదాపు చడీ, చప్పుడూ లేకుండా నిర్లక్ష్యపు అబద్ధాన్ని కప్పుకొని ఎవరికంటా పడకుండా జాగ్రత్త పడింది. అలా మూగ పోయిన కోణార్క దేవాలయం మళ్లీ రాగాల్ని పలికించింది. మారుమూలన దాగి ఉన్న తన ఉనికిని దేశాన్ని

డాక్టరు ఈమని శివనాగిరెడ్డి (స్థపతి), ఫోన్ : 9848598446



గుర్రము-సైనికుడు

దాటించి, ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కించుకొంది.

మరుగున పడిన ఈ వారసత్వ కట్టడాన్ని ఎవరు, ఎపుడు కట్టారన్న సంగతి పక్కన బెడితే, అసలీ అద్భుత కళాఖండం అక్కడుందన్న సంగతి తెల్సింది మాత్రం క్రీ.శ. 18వ శతాబ్దిలోనే.

పూరిలోని జగన్నాథాలయంలో భద్రపరచ బడిన **మాదలాపాంజి** అనే ఒక తాళ పత్ర గ్రంథంలో క్రీ.శ. 18వ శతాబ్దిలో ఒరిస్సాను పాలిస్తున్న మహారాష్ట్ర రాజవంశీకుడు సాతే గురువైన బాబా బ్రహ్మచారి రాసిన ఒక నివేదికలో తాను చూచిన కోణార్కదేవాలయం గురించిన వివరాలున్నాయి.

ఆయన మాటల్లో, "బాబా బ్రహ్మచారిననే నేను, సముద్రం ఒడ్డున శిథిలావస్థలోనున్న సూర్యాలయాన్ని గురించి ఒకరి ద్వారా విన్నాను. సూర్యదేవుని భక్తుడినైన నాకు, ఆ దేవాలయాన్ని చూడాలనిపించింది. అందుకోసం చిమన్జీ నాకు 200ల బంగారు నాణేలనిచ్చారు. నీలాంబర కొత్తనాయకుడనే ఆలయ మేనేజరు, అతని సహాయకులతో కలిసి పాల్గుణ శుక్ల పక్ష దశమి (క్రీ.శ. 1759) నాడు బయలుదేరాం.

సముద్రతీరంలో ప్రయాణించి, రెండు నదులు దాటాం. తీరంలో ఎక్కడా ఒక్కఇల్లు కూడా లేదే, మరి ఇక్కడ సూర్యునికి ఆలయం ఎలా కట్టారో నాకు అర్థం కాలేదు సరికదా, ఆశ్చర్య మేసింది. ఇంతలోనే దూరంగా మాకొక రాళ్ల కొండ లాంటిది కనిపించింది. అదే దేవాలయం! **ప్రాచీమహాత్మ్యం**లోనూ, **పద్మపురాణం**లోనూ ఈ ఆలయం ప్రాశస్త్యాన్ని చదివినప్పట్నించీ నాలో చూడాలన్న తపన పెరిగింది. ఏకాదశి ఉదయానికి అక్కడికి చేరుకొన్నాం.

చెట్లూ, చేమల మాటున చిన్నగా కనిపించిన ఆలయం, దగ్గరయ్యే కొద్దీ చాల పెద్దదిగా గోచరించి, ఇంతపెద్ద ఆలయం, ఎలా కూలిందబ్బా అనిపించింది. పడిపోయిన రాళ్లన్నీ అందంగా తీర్చిదిద్దిన అపురూప శిల్పాలే. ప్రాకారమైతే మొఘల్ చక్రవర్తుల కోటగోడల్ని తలపించినా రాళ్లన్నీ బీటలు వారి, చెదిరి పోయి ఉన్నాయి. పూట పూటకూ మేటలు వేసిన ఇసుక తిప్పలనడుమ ఆలయ ప్రాకారం ఉనికి కోల్పోయింది.

నాతో వచ్చిన దేవాలయ మేనేజరు, ఈ గోడ 12 హస్తాల (గజాలు) ఎత్తుండేదని పుస్తకాల్లో ఉందని చెప్పాడు. మొదట, దక్షిణానున్న ఠాకురాణి దేవాలయాన్ని చూచి, అదే సూర్య దేవాలయ మన్నాను. కానీ దాని పక్కనే మరో పెద్ద దేవాలయాన్ని కూడా చూశాను. చిన్న దేవాలయంలోని దేవీ విగ్రహాన్ని స్థానికుల తరలించి, వాళ్ల దగ్గర పూజిస్తున్నారని తెలిసి చాలా బాధపడ్డాను. పరిస్థితులిలా ఉన్నపుడు, ఎవరు మాత్రం ఏం చేస్తారు?

గొలరా, ఇంకా, కణియా అనే ఊళ్ల నుంచి నేనొక వందమందిని పిలిపించి, రాళ్లకుప్పతో తీగలు పాకిన ఒక అందమైన రెండు చేతుల పొడవున్న స్థంభాన్ని బయటికి తీయించగలిగాను. రెండు రోజుల తరువాత, ఈ స్థంభాన్ని

బాగా శుభ్రం చేసి చూడగా, ఇలాంటి అందమైన శిల్పకళా ఖండం భారత వర్షంలోనే లేదని పించింది. తరువాత దారి చేసుకొంటూ ప్రవేశ ద్వారం చేరటానికి ప్రయత్నిస్తున్నాం.

దారిపొడవునా రాకాసి బల్లులూ, పాములూ. ఇసుక మేటను తొలగించగానే మధ్యలో సూర్యుని తల చెక్కిన అందమైన తోరణం కనిపించింది. మేం ఒక్కొ కాలుతీసి మరో కాలు వేసే సరికి మా కన్నీ శిల్పాలే కనిపిస్తున్నాయి. వాయు దేవుని భార్యగా భావింబబడుతున్న లేడి మీదున్న ఒక శిల్పం అందంగా ఉండేసరికి తీసుకొని చూచి ఆనందించాము. అక్కడొక సింహం తల కూడా కనిపించింది.

అరుణ స్థంభం ఎదురుగా రెండు సింహాలు కనబడగానే, అక్కడ కొంతమేర నేనే తవ్వాను. వెంటనే శిథిలమైన ప్రవేశద్వారం కనిపించగా లోనికి చూశాను. లోపలికి చూస్తున్నపుడు నాకేవో కీచు శబ్దాలు వినబడి, నేను కొంచెం భయపడ్డాను. నాలుగు స్థంభాలు, వాటినుంచి వేలాడుతున్న పొడవాటి ఇనుప దూలాలు కనిపించాయి. స్థంభాలగుండా గర్భగృహం వైపునడిచాను. పడి పేరుకు పోయిన రాళ్ల కుప్పలు తప్ప నాకేమీ కనిపించలేదు.

బయటి తోరణం మాదిరిగానే దాని తోరణం దగ్గరకూడా అందంగా చెక్కిన ద్వార బంధాలు వున్నాయి. నాకక్కడ కొత్త రక్తపు మరకలు కనిపించాయి. దాంతో నేను భయపడి పక్కకొచ్చాను. కానీ, నాతో పాటు వచ్చిన వారిని, చేతులూ, ముక్కూ పగిలిపోయి ఉన్న పూజా (మూల విరాట్టు) విగ్రహాన్ని బయటికి తెమ్మని చెప్పాను.

వాళ్లు ఐదు రోజులపాటు, శిథిలాలను తొలగించి ఆ విగ్రహాన్ని బయటికి తీసుకొచ్చారు. ఇంత అందమైన శిల్పాలున్న ఈ ఆలయాన్ని మహారాష్ట్రరాజు సహాయంతో పునర్నిర్మిద్దామను కొన్నాను గానీ, అది అసాధ్యమనిపించింది. దక్షిణం, పడమర వైపులో నున్నట్లుగానే ఆలయాన్ని పునరుద్ధరించాలనిపించింది గానీ, నిరాశే మిగిలింది. ఆలయాన్ని యథాతథంగా నిర్మించటం సాధ్యం కాదు గాబట్టి, కనీసం కొన్ని మంచి బొమ్మలైనా తీసుకెళితే బావుండనిపించింది. పీఠానికున్న 18 రాళ్లతో కలిపి అరుణ స్థంభాన్ని మూడు ఎడ్లబండ్లెక్కించుకొన్నాం.


సూర్య భగవానుడు

చిన్న దేవాలయ బారండి (గోడ) నుంచి ఒక బాబాజీ విగ్రహం, ఒకటిన్నర చేతుల కొలతగల కృష్ణుని విగ్రహం, అదే కొలతలుగల ఏనుగుల వరసున్నరాయి, వాయు దేవుని భార్య విగ్రహం, నరసింహదేవుని విగ్రహం తోపాటు మరో పది విగ్రహాలను సేకరించాం. ఈ విగ్రహాలన్నింటినీ పురుషోత్తమ పట్టణాని (పూరి)కి పంపించి, బరువెక్కిన గుండెతో నేనక్కణ్ణించి బయులుదేరాను. అప్పుడు నాకనిపించిందీ, సముద్రం ఎందుకని ఈ రాళ్లను తనలో కలుపుకోకపోయిందోనని.

కేశోమరు అనే హిందువొకడు దేవాలయ శిఖరం పైనున్న పరమ పవిత్రమైన ధ్వజ పద్మాన్నెత్తు కెళ్లాడని కరణం ద్వారా నాకు తెలిసింది. అంత పవిత్రమైన చిహ్నాన్నెత్తు కెళ్లిన అతడొక రాక్షసుడనిపించింది.

పురుషోత్తమాని (పూరి)కి తిరిగొచ్చిన తరువాత, తెచ్చిన విగ్రహాలనన్నింటినీ, జగన్నాథ దేవాలయ భోగమండపం కప్పుల మీద పెట్టించాను.

రాజా నరసింహుని బొమ్మను, మొదటినరసింహ దేవుని బొమ్మలను, లక్ష్మీదేవి ఆలయ ముఖశాలలో ఉంచాను. వాయుదేవుని భార్య, బాబాజీ విగ్రహాలను హనుమాన్ దేవాలయానికి పంపాను.

నేను ఎంతో బాధపడ్డానే తప్ప, ఇంతకంటే ఏమీ చేయలేకపోయాను. ఈ నివేదిక నుంచి ఆలయ స్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇట్లు

**– బాబా బ్రహ్మచారి**

**– కొట్టకరణ నీలాంబర పట్టనాయక**

**చైత్ర త్రయోదశినాడు చేసిన సంతకాలు.**



కోణార్క శిలాసుందరి

**కోణార్క** నుంచి బాబా బ్రహ్మచారి మరికొన్ని విగ్రహాలను పూరీకి తరలించినట్లు మాదలా పాంజి లోని మరో నివేదిక తెలియ జేస్తూంది. దాని ప్రనీతం. రథ సింహాసనం పైనున్న చేతులు విరిగిన పూజా విగ్రహం; దక్షిణ మండపం లోని నవగ్రహ శిల (పూరీలోని గుండీచ దేవాలయ ప్రాకారంలో ఉంది); ఆరు కన్యల విగ్రహాలు వీటిలో మూడు గుండీచ దేవాలయంలో ఉన్నాయి; సాంబ పీఠం పక్కనున్న నరసింహదేవుని విగ్రహం; ఒక పెద్దసైజు శృంగార భంగిమలలోనున్న శిల్పం; ఒక యుద్ధ దృశ్యమున్న శిల్పాలను బాబా బ్రహ్మచారి పురుషోత్తమాని (పూరీలోని జగన్నాథాలయాని)కి తరలించాడు.

క్రీ.శ. 1793-1798 మధ్య పాలించిన రాజా దివ్య సంహదేవుడు కూడా కోణార్క దేవాలయాన్ని తవ్వటానికి ప్రయత్నించినట్లు తెలిపే మరో నివేదిక కూడా బయల్పడింది. దాని ప్రకారం, రాజా దివ్య సింహదేవుడు దేవాలయాన్ని తవ్వటానికి భ్రమర పట్టనాయకుడనే దివానుకు 200ల మొఘల్ (వెండి) టంకాలనిచ్చాడు. అతడు మూణ్ణెల పాటు ప్రయత్నించినా, కుదరలేదు. రెండున్నర చేతుల ఎత్తున్న కన్యకల విగ్రహాలు ఆరు, ఒక బాబాజీ విగ్రహం, ముఖశాలనుంచి తొలగించిన ఒక వాద్యకారుని తలలను తరలించాడు. బాబాజీ విగ్రహాన్ని హనుమాన్ దేవాలయంలోనూ, సాఖీ (కన్యల) విగ్రహాలను గుండీచ దేవాలయంలోనూ ఉంచాడు. తవ్వకాల కోసం, వారితో పాటెళ్ళిన దామ మహారాణ అనే జమీందారు వాద్యకారుని తలను, తన భవంతిలోని దేవాలయంలో ఉంచారు. తరువాత రాజా దివ్య సింహదేవుని బ్రిటీషు వారు బందీగా తీసుకెళ్ళటం వల్ల కోణార్క దేవాలయాన్ని తవ్వే పని ఆగిపోయింది.

ఈ రెండు నివేదికలే కోణార్క శిథిలాల గురించి బ్రిటీషు వాళ్ల కంటే ముందు తెలియజెప్పిన తొలి ఆధారాలు. అయితే క్రీ.శ. 1580నాటికి ఈ దేవాలయాన్ని సందర్శించిన అబుల్ ఫజల్, తన ఐనీ అక్బర్‌లో ఈకోణార్క దేవాలయాన్ని చూచిన వారెవ్వరైనా మెచ్చు కోకుండా ఉండరనీ దీన్ని రాజా నరసింహ దేవుడు నిర్మించాడని పేర్కొన్నాడు. క్రీ.శ. 1824లో కోణార్క దేవాలయాన్ని సందర్శించిన యండ్ర్యూ స్టిర్లింగ్, 120 అడుగుల ఎత్తున్న ఈ దేవాలయ శిథిలాలు సముద్రంలో పయనిస్తున్న ఒక ఓడలా ఉందని *ఆసియాటిక్ రిసర్చెస్‌*లో ఆ తరువాతి సం॥లో ప్రచురించారు.



శిలాతోరణం

1838లో ఈ అపురూప కట్టడ శిథిలాల్ని చూచి మైమరచిన జేమ్స్ ఫెర్గూసన్ ఆ వివరాలను తాను రాసిన *పిక్చరస్ ఇల్లస్ట్రేషన్స్ ఆఫ్ ది ఆర్కిటెక్చర్ ఆఫ్ హిందూస్థాన్* లోనూ *ఈస్టర్న్ అండ్ ఇండియన్ ఆర్కిటెక్చర్* లోనూ పొందుపరిచాడు. తరువాత, 1872లో హంటర్ రాసిన ఒరిస్సా (వా.1)లోనూ, రాజేంద్రలాల్ మిత్ర 1880లో రాసిన *ది యాంటిక్విటీస్ ఆఫ్ ఒరిస్సా;* బిషన్ స్వరూప్ (1910) రాసిన *కోణార్క, ది బ్లాక్ పగోడా*, ఎం.ఎం.గంగులీ (1912) *ఒరిస్సా అండ్ హర్ రిమైన్స్*; ఆర్పీ బెనర్జీ (1930) *హిస్టరీ ఆఫ్ ఒరిస్సా*; నిర్మల్ కుమార్ బోస్ (1932) *కానన్స్ ఆఫ్ ఒరిస్సన్ ఆర్కిటెక్చర్* లలోనూ దేబల మిత్ర (1968) *కోణార్క* లలోనూ దేవాలయానికి సంబంధించిన చరిత్ర, వాస్తుశిల్పం; సంరక్షణ చర్యల వివరాలు అందుబాటులోకొచ్చాయి.

పద్మశ్రీ పండిత సదాశివ్ రథ్‌శర్మ 32 గ్రామాల్లో ఎనిమిదేళ్ళపాటు తిరిగి సేకరించిన తాళ పత్రాల ఆధారంగా, ఎలీస్ బోనర్, రాజేంద్ర ప్రసాద్ దాస్‌లు పరిశోధించి వెలువరించిన మాదలపాంజీ అనే అనువంశక తాళపత్ర గ్రంథం వల్ల వారు రాసిన *న్యూ లైట్ ఆన్ సన్ టెంపుల్ ఎట్ కోణార్క* ద్వారా బయటికొచ్చిన బాబా బ్రహ్మచారి నివేదిక ఈ వ్యాసానికి ఎంతగానో ఉపయోగపడింది. పై ముగ్గురితో పాటు బాబా బ్రహ్మచారికి కూడా కృతజ్ఞతలు. ❂

# హిందీలో నవ కవిత్వం తెలుగులో దిగంబర కవిత్వం

- సిహెచ్.బి. మీనన్

సాహిత్య రూపాల్లో కవిత్వం ఒకటి. గద్యం ద్వారా సాధ్యం కాకపోయేది కవిత్వం ద్వారా తప్పకుండా సాధ్యమవుతుంది. సాహిత్య ఇతిహాసంలో అది నిరూపణ అవుతూ వస్తున్నాది. ఈ భావనతోనే కొంత మంది సమాజాన్ని సంస్కరించాలని సాహిత్యాన్ని ఒక విశేష సాధనంగా తీసుకుంటారు. ఇది కేవలం ప్రాచీన కాలం లోనే కాదు. ఆధునిక కాలంలో కూడా కొంత మంది కవిత్వం ద్వారా సమాజాన్ని సంస్కరించాలని కోరుకుంటూ ప్రయాస పడుతున్నారు. అయినప్పటికీ కవితా సాధనకి సామాగ్రి ఎప్పుడూ ఒకటే ఉంటుంది. వారి యొక్క రచనా కౌశలమూ, శైలీ మాత్రం కాలానుగుణంగా కొంచెం అధికంగా మారుతూ వుంటాయి.

ఇక్కడ కొన్ని రోజులనుంచీ కొంతమంది కవులు సంస్కరణ కోసం సంఘటితమై ప్రసిద్ధికెక్కారు. వారి ఉద్దేశ్యంలో ఏదైనా విశేషమైన ప్రక్రియ ఎప్పుడయితే ఎక్కువ సంఖ్యలో కవిగణం స్వీకరిస్తుందో అప్పుడు వారి ప్రయత్నం అతి కొద్ది కాలంలోనే సఫలం కావచ్చునని వాదకవిత్వం యొక్క ఉద్దేశ్యం- బహుశా కవుల యొక్క సమ్మేళనాల భావాలతో పోతూ వుంటుంది. ఉదాహరణకి సమాజాన్ని అభ్యుదయ పథంవైపు తీసుకెళ్లాలి అన్నట్లయితే, అభ్యుదయ వాదకవిత్వం యొక్క ఆవశ్యకత వుంటుంది. అనేక మంది కవుల యొక్క కలం నుంచీ అనేక రకాల భిన్న స్వరాలు. వచ్చీ... వచ్చీ



చెరబండ రాజు

ప్రయోగవాద కవితా యుగం ఊపిరి పీల్చుకోవటం మొదలు పెట్టింది. హిందీలో అయితే ఇది ఎటువంటి వాదము కాదు; దీని నుండి విద్వాంసులయిన విమర్శకులు, నవ కవిత్వం, యొక్క పేర్లలో ('నయీకవితా') ను ఎక్కువగా వుపయుక్తంగా స్వీకరించారు. అయినప్పటికీ ఈ కవుల యొక్క లక్ష్యం కూడా అదే. ఇంతకు ముందే వాద సాహిత్యకారులు వారి పూర్వకవులు ఉంటూనే ఉన్నారు. నవ కవిత్వం హిందీ సాహిత్యం యొక్క నూతన రూపం. ఈ నవ కవిత్వం యొక్క విషయంలో చాలా మంది ఆక్షేపణలు చేశారు. అలాగే ప్రసంశలు కూడా బాగానే చేశారు. ఆక్షేపణ చేసేవారు, ప్రశంసించేవారు యిద్దరూ ఈ కావ్యత్వం యొక్క అనివార్యతను స్వీకరించారు. కావ్య పరిధిలో స్వీకరించిన కారణంగా యిది పరిశోధనకు అధికారం కూడా పొందింది. ఈ విధంగా యిది పరిశోధకులకి సామాగ్రిగా తయారయింది.

తెలుగులో కవిత్వం యొక్క నూతన రూపం, దిగంబర కవిత్వం. అదే విధంగా హిందీలో నవ కవిత్వంతో పాటు ప్రాచీన సంప్రదాయక కవిత్వం కూడా సమాంతరంగా జరుగుతూనే వుంది. ఈ ప్రకారంగా తెలుగులో దిగంబర కవిత్వంతో పాటు ప్రాచీన సంప్రదాయం యొక్క ధార ప్రవహిస్తూనే మార్పు పొందుతూ వచ్చింది.

**హిందీ నవ కవిత్వం యొక్క సంక్షిప్త పరిచయం:**

హిందీ నవ కవిత్వం, దాని యొక్క విశిష్ట-వ్యక్తిత్వం నిలబెట్టుకొంది. మొదట్లో దీనిని 'క్షణిక-అనుభూతి' 'ఖండిక-అభివ్యక్తి' అంటూ అవహేళన చేశారు. తరువాత 'క్షణిక-అనుభూతి' అయినా పూర్ణ - అనుభూతి అనీ ఆ తరువాత సంపూర్ణ అభివ్యక్తి అంటూ ఒప్పుకొని స్వీకరించారు.

డాక్టరు సిహెచ్. బి. మీనన్, ఫోన్ : 9440652114



జ్వాలాముఖి

ఏదైనా అనుభూతి క్షణాల్లో వస్తుంది. క్షణికమై వుంటుంది కూడా. అయినప్పటికీ అది పూర్ణమై ఉంటుంది. ఫలితంగా యీ కవుల అభివ్యక్తి కొంచెం కూడా ఖండితం కాదు. అనుభూతి పూర్ణమగుట వల్లనే వారి అభివ్యక్తి పూర్ణమై సార్థకం అవుతుంది.

ఒక దేశ ప్రధానమంత్రి యొక్క మృత్యువూ ఒకడి యింట్లో వున్న పెంపుడు కుక్క యొక్క చావూ రెండూ శోకం యొక్క అనుభూతి ప్రేరకాలే – అవి సమానమే.

శోకంలో హెచ్చు – తగ్గులు అనే తేడా ఉండదు. నవ కవిత్వం, గురించి అసలు చెప్పదలచినది ఇదే. ఈ భావన మీదే వారి యొక్క గోపురం నిర్మించబడింది.

**దిగంబర కవిత్వం సంక్షిప్త పరిచయం.**

తెలుగు దిగంబర కవిత ఒక వైపు కవిత్వం కోసం ఏ ప్రకారంగానూ బంధనాలు స్వీకరించలేదు. సంప్రదాయాల కట్టడి చేయలేదు. ఇంకొక విధంగా యిది ప్రజల్లో రాజకీయ చైతన్యం కోరుకొంటుంది. దిగంబర కవుల దృష్టిలో సామాజిక వైషమ్యానికి మూలకారణం ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మాత్రమే. ఈ విధంగా దాని నగ్న దర్శనం చేయించటం వారి యొక్క ముఖ్యోద్దేశం. దానితో పాటు వచ్చిన సాంఘిక దురాచారం కూడా దర్శనం యిస్తూ ఉంటుంది.

వీరు, రౌద్ర మరియు 'భీభత్స' తకే తమ కవిత్వంలో ముఖ్యస్థానం యిచ్చారు. అన్ని పురాతన సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి వ్యతిరేకించారు. సంక్షిప్తంగా చెప్పాలంటే వీరి ప్రక్రియ 'విప్లవాత్మకం' రాజకీయ, సామాజిక మార్పులకు ఈ మార్గం ప్రస్తుతం 'విరసం' (విప్లవ రచయితల సంఘం) పేరుతో సంఘటితమయింది.

**రెంటి యొక్క తులనాత్మక పరిచయం:**

ఏదైనా రెండు వస్తువుల లేదా విషయాల్లో తుల్యత్వం యొక్క ప్రేరణ మనకు ఆ రెండిటికీ మధ్యలో చూచేవాళ్ళ సామ్యాల నుంచి దొరుకుతుంది. వైషమ్యాలనుంచి కాదు. అయినప్పటికీ రెండు వస్తువులనూ పోల్చి చూడవచ్చు. కాబట్టి ఆ రెంటిలోని స్థితి సామ్యములు వైషమ్యాల యొక్క నిర్ధారణ చేయవచ్చు. వైషమ్యాలు అధికం అయినప్పటికీ మరియూ ఒక్కటి కూడా సామ్యం లేకపోతే ఆ మాటనూ ఉద్ఘాటించవచ్చు.

పైన చెప్పబడిన దృష్టితో హిందీ 'నవ కవిత్వం' తెలుగు 'దిగంబర కవిత్వం' వీటి తులనాత్మక అధ్యయనం అనుపయుక్తం కాదు. రెంటి యొక్క కావ్య సాహిత్యం నూతనం. రెండింటిలోనూ 'బింబ–విధానం' 'అలంకార యోజన' స్వచ్ఛంద ఛందస్సు' ఉభయ సామాన్యము అనుభూతి యొక్క పరిపూర్ణత్వం స్వీకరించబడింది. 'నవ కవిత' యొక్క అగ్రనేత అజ్ఞేయ్. ఆయన పూర్తి పేరు 'సచ్చిదానంద్ హీరానంద్ వాత్స్యాయన్ వాని వెనుక అగ్రవాల్, గజానన మాధవ్ ముక్తిబోధ్, నెమిచ్చంద్రజైన్, ప్రభాకర్ మాచవే, గిరిజా కుమార్ మాధుర్, రామ్ విలాస్ శర్మా మున్నగువారు. హిందీ యొక్క భావ కవిత్వానికి వలె కాక తెలుగులో దిగంబర కవిత్వానికి ప్రారంభకులు ఒకరి కంటే ఎక్కువ మందే. వారు నిఖిలేశ్వర్, మహాస్వప్న, చెరబండరాజు, జ్వాలాముఖి, నగ్నముని, భైరవయ్య.

హిందీలో 'తారసప్తక్' నవ కవిత్వం యొక్క ప్రథమ సంకలనం యిదే విధంగా ఆరుగురు కవుల యొక్క సంపుటి, దాని పేరు 'కుష్ఠు వ్యవస్థ' దీని ఆశయం సమాజం కుష్ఠు రోగ పీడితుల శాసనాల ద్వారా నడుస్తున్నాది. దీని వల్ల వారి యొక్క రోగం రోజు–రోజుకూ సమాజం నిండా వ్యాపిస్తూ వుంది. నవ కవిత్వం యొక్క రచనల్లో చాలా లఘు కవితలు, అక్కడ కూడా రెండు మూడు పంక్తులలో మాత్రమే ఉంటాయి. తెలుగులో కూడా దిగంబర కవితలు చాలా మటుకు దీర్ఘమైనవి కావు. తెలుగులో యిప్పుడు ఈ ధార యొక్క కవులు కవివతావస్తువును విడనాడలేదు. అనగా వారిలో పాత వాసనలు ఇంకా తొలగలేదు. 'భావ కవిత్వం', 'రహస్య తత్త్వ కవిత్వం' అక్కడక్కడా పల్చని తెర వెనుక కనిపిస్తూ



నగ్నముని

ఉంటుంది. తెలుగులో అయితే నగ్నత్వం ఈ కవుల లక్ష్యం. పేరులోనే దిగంబరత్వం అన్నది ఈ విషయం చెప్ప కుండానే చెప్తున్నది. హిందీలో అయితే ఆ కవుల కవితా తత్వాన్ని రక్షించాలనే లక్ష్యాన్ని విడనాడలేదు. తెలుగులో నగ్నత్వాన్ని దాచాలనే ప్రాచీన కవుల ఉద్దేశ్యంతో దిగంబర కవులు తెగ తెంపులు చేసుకున్నారు. హిందీ కవులు కళాతత్వాన్ని నిలపాలని భావ కవుల ప్రయత్నాన్ని విడనాడ లేకపోయారు. వారు అభ్యుదయ వాద కవుల నగ్న చిత్రణ నుంచీ విముక్తి పొందారు గానీ, భావకవిత్వపు కళాత్మకత అంటే మోహం వదులుకోలేకపోయారు.

దిగంబర కవులు అయితే కళాత్మకత కంటే నగ్నత్వానికే ఎక్కువ ప్రాధాన్య ఇచ్చారు. ఒక విధంగా నగ్న చిత్రణ కూడా ఒక కళయే కదా! వీరు ఈ విధంగా దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి 'భావ కవిత్వం' నుంచి ఒక అడుగు ముందుకు వేసి తెలుగు అభ్యుదయ వాది అయిన శ్రీశ్రీ నుంచి మరొక అడుగు ముందుకు సాగారు. హిందీలో కళాత్మకతతో కూడిన ఆవరణ కారణంగా ఏదో జారిపోయినట్టు కనిపిస్తుంది. చదువుతూ ఉంటే ఛాయావాద, రహస్యవాద కవిత్వం చదివే ఆహ్లాదం అనుభవంలోకి వస్తుంది. దిగంబర కవిత్వాన్ని అర్థం చేసుకుంటూ, భావాన్ని గ్రహిస్తూ, కవితా రసాస్వాదన చేయడంలో ఏమీ ఆటంకం ఉండదు. రెండు భాషల కవుల కవితా వస్తువు ఒక్కటే. కానీ దిగంబర కవులలో రాజకీయ సామాజిక దుర్వ్యవస్థ, కుళ్ళు ఎక్కువగా కనిపిస్తుంది. హిందీ కవులు బహుశా తెలుగు వారు చేసినంత కఠోర విమర్శ చేయలేదు. కనుకనే ఆ కవిత్వంలో శాంతితత్వం, నాజూకు తనం, మాధుర్యం కనిసిస్తే, దిగంబర కవిత్వంలో ఉగ్రత్వం, తేజస్సు, ఓజస్సు తొణికిసలాడుతూ దర్శనమిస్తాయి.

దిగంబర కవిత్వం కాని, నవ కవిత్వం కాని సమాజం మీద ఎటువంటి ప్రభావం చూపింది అనేది పెద్ద ప్రశ్న చాలా మందికి. సాహిత్యం యొక్క ప్రభావం సమాజం మీద తప్పక ఉంటుంది. అదే విధంగా సమాజం ప్రభావం సాహిత్యం మీద కూడా ఉంటుంది. రచయితలు ఆ రెంటి మధ్య నిలబడి ఉంటారు. వారి సబల సాధనం కవిత్వం. ప్రజల మనోభావాల్లో మార్పు తీసుకురాగల శక్తి కవిత్వానికి ఉంది. అయినప్పటికీ హిందీలో 'నవ కవిత్వం' ప్రజల్లో ఎటువంటి పరివర్తనం తీసుకురాలేకపోయింది. అలాగే తెలుగులో 'దిగంబ కవిత్వం' కూడా. దీనికి కారణం దేశ ప్రజలు నిరక్షరాస్యత, దారిద్ర్యంలో మునిగియుండటం, రేపటి గురించిన మాట అటుంచి ఈ రోజు పొట్టనింపుకోవడమే పెద్ద సమస్య అయింది. కావ్య ప్రక్రియ ద్వారా సమాజం లేదా నాగరికుల మేలు కోసం, ప్రగతి కోసం ఆశించడం మూర్ఖత్వం అవుతుంది. అయినప్పటికీ దిగంబర కవులను కాని, నవ కవులను కాని సమాజంలో పరివర్తన తీసుకురాలేదని దూషించే అధికారం మనకి లేదు. టి.వి. ద్వారా 'రామాయణం', 'మహాభారతం' ప్రదర్శించి, నైతికత ప్రజల్లో తీసుకురావటంలో విఫలం అయ్యారు. ఇక్కడిది సాహిత్యం అదికూడా చాలా తక్కువ మందికి అందుబాటులో ఉన్న సాధనం.

అశ్లీల పదజాలం దిగంబర కవులతోనే ప్రారంభమైందా? లేక ఇంతకు ముందు వారు కూడా ఉపయోగించారా? వీరికి ముందు కవులు కూడా ఉపయోగించారు ముఖ్యంగా సంస్కృత సాహిత్యంలో స్త్రీ, పురుష అవయవ వర్ణన విస్తారంగా ఉంది. జయ దేవుని 'గీత గోవిందం' లోనూ, విశేషంగా 'మేఘ సందేశం' లోనూ, ప్రస్తుతం అంతా వినిపిస్తున్న 'వెంకటేశ సుప్రభాతం' లో అశ్లీలత పరచబడి ఉంది. సాధారణంగా స్త్రీ, పురుష జననావయువాల వర్ణన ఉల్లేఖించడం అశ్లీలత యొక్క పతాక స్థాయి అవుతుంది.

సంస్కృత భాషలో అశ్లీలత మర్యాదగా భావించారు. కాని ఈ రోజు దేశంలోని ప్రాంతీయ భాషల్లో వాటి చర్చ అశ్లీలంగా భావిస్తున్నారు. సంస్కృత భాషలో శృంగారం మీద భక్తి ఆవరించింది. నగ్నత్వం పై కళ లేదా సంస్కృతి ముద్ర ఉంది. ప్రాంతీయ భాషలు యుక్త స్త్రీలు. విషయ వస్తువు కారణంగా దిగంబర కవిత్వం చదువుతూ వుంటే భావగ్రహణంతో పాటు పాఠకుల హృదయంలో భావ శమనం కూడా జరుగుతూ వుంటుంది. వీరి గొంతులో నిప్పులు కక్కే శక్తి ఉంది. ఉగ్రత్వం లేని ఏ ఒక్క దిగంబర కవీ కూడా కనిపించదు. వీరి ద్వేషం, ప్రతీకారం భావం, నిండి వున్నాయని కొందరు విమర్శకులు అంటూ ఉంటారు.

కానీ నిజానికీ మానవత్వం యెడల జరిగే అన్యాయాలు, అక్రమాలు చూచి వాళ్ళ మనస్సులో సుడిగుండంలా తిరిగే దుఃఖ గుండమే ప్రతీకారంగా అనిపిస్తుంది. దిగంబర కవులందరూ మనుష్యుల్ని ప్రేమించేవారే – మానవతా వాదులే. మి



## నా స్వగతం

# పసుమర్తి వేణుగోపాల కృష్ణ శర్మ

**మా** తల్లిదండ్రులకు మేము ఆరుగురు మగ పిల్లలం, ఆడపిల్లలు ఇద్దరు, అందరి కన్నా పెద్దవాడిని నేనే. నా ప్రథమ గురువు యక్షాగానపితామహులు శ్రీ చింతా వెంకట్రామయ్య, సంగీతంలో సంగీత విద్వాన్ శ్రీ ఏలేశ్వరపు సీతా రామాంజనేయులు, అభినయభాగం, నాయికా నాయక ప్రకరణం, భరతకళానిధి శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి. గురువులను మించి నేనేమీ ముందుకు వెళ్ళలేదు. వారి బాటలోనే ఉన్నాను.

1952వ సంవత్సరంలో నాట్యకళాశాల ఏర్పాటు చేసేందుకుగాను ఒక పిటిషన్ తయారు చేసి, కర్నూలు వెళ్ళి, ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారికి ఇవ్వడం జరిగింది. ఆ సందర్భంలో ప్రొఫెసర్ సాంబమూర్తి, రుక్మిణీ అరుండేల్, శ్రీ వెంపటి చినసత్యం మున్నగు వారందరూ అక్కడకు వచ్చారు. చినసత్యం శివుడిగా నర్తించారు, వారిచే మేము శివతాండవం చేయించాము. అప్పుడు కొంతమంది పెద్దలు, కళాశాల స్థాపించడానికి కమిటీగా ఏర్పడి కూచిపూడికి వస్తూండేవారు.

అలావారు వచ్చినపుడల్లా ఒకసారి క్షేత్రయ్య పదాభినయం, మరొకసారి నారాయణతీర్థుల వారి తరంగములు ప్రదర్శించాము. బెజవాడ గోపాలరెడ్డి, మాడభూషి అనంతశయనం వంటి పెద్దల సమక్షంలో బాలగోపాల తరంగం చెంబు, పళ్ళెంతో కలిపి చేయించాము. నీలం సంజీవరెడ్డి వంటి పెద్ద పెద్ద మంత్రులందరితోనూ పరిచయాలుండేవి. ఎలాగైనా చేసి కూచిపూడిలో కళాక్షేత్రం స్థాపించాలి అనే ఉత్సాహం మాది. అప్పుడు నాకు అండగా వేదాంతం పార్వతీశం ఉండేవాడు. ఆ సమయంలో నేను కూచిపూడి చుట్టుప్రక్కల గ్రామాల్లో సంగీత, నాట్యాలను బోధించేవాడిని, భట్లమర్తి అనే ఊరిలో 'చలసాని శశిరేఖ' అనే ఆమెకు నేను సంగీతం నేర్పాను. వారు మా గురువుగారైన సీతారామాంజనేయులుగారి శిష్యురాలు.

ఐతే 1952 నుండి 1957 వరకు కళాశాల స్థాపనకై కృషి చేస్తూనే 'బాలాత్రిపుర సుందరి నాట్యమండలి' పేరుతో ప్రైవేట్‌గా చింతా కృష్ణమూర్తి గారింటి ముందు సందులలో నున్న ఖాళీ ప్రదేశాలలో పాక నేర్పరచి నాట్యాలయం నిర్వహించేవాడిని. అప్పుడు నా సహాధ్యాపకుడైన పార్వతీశం పురుషపాత్రలు, నేను స్త్రీపాత్రలు వేసి *రంగి-రంగడు, సీతారాములు* వంటి కొన్ని పాటలను అభినయించేవాళ్ళం.

ఆ కాలంలో దాదాపుగా ఊళ్ళో ఉన్న పిల్లలందరికీ నేను శిక్షణనిచ్చాను. ఆ రకంగా నా వద్ద తయారైన పిల్లలందరిచేత అన్ని వేషాలు వేయిస్తూ *ఉషాపరిణయం, భామాకలాపం, భక్తప్రహ్లాద, రామనాటకం, మోహినీరుక్మాంగద, శశిరేఖాపరిణయం* వంటి మన యక్షగానాలన్నీ శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవములలో ప్రదర్శనలిప్పించేవాడిని.

1963వ సంవత్సరములో కూచిపూడిలో దేవాలయం వద్ద ఉషాపరిణయం చేయిస్తే, ఏదో పనిమీద మద్రాసు నుంచి శ్రీ వెంపటి పెదసత్యం మా ప్రదర్శన చూచి చాలా సంతోషించడమేకాక మద్రాస్ వెళ్ళి నా గురించి శ్రీ వేదాంతం రాఘవయ్య, మా అన్నగారైన శ్రీ పసుమర్తి కృష్ణమూర్తి గార్లకు చెప్పి నన్నుబాగా ప్రశంసించారు. 1957 నుండి 1962 వరకు శ్రీయుతులు బందా కనకలింగేశ్వర రావు గారి ఆధ్వర్యంలో శ్రీ చింతాకృష్ణమూర్తి గారిని పెద్దగా నియమించి వారి సలహా సంప్రదింపులు తీసుకుంటూ ప్రదర్శనల పరంపర కొనసాగించాము. ఆ తరువాత 1963లో సిద్ధేంద్రకళాక్షేత్రం

(పసుమర్తి వేణుగోపాల కృష్ణ శర్మ (83సం॥) 2012, జూన్ 3న కన్నుమూసారు.)

ఏర్పాటు, గొట్టిపాటి బ్రహ్మయ్య గారి ప్రోత్సాహంతో శ్రీమాడభూషి అనంతశయనం గారి ముందు పదాభినయం చేస్తే వారు మెచ్చి నన్ను ప్రిన్సిపాల్‌గా నియమించడం, ఇది ఇలా జరుగుతుండగా 1971-72 ప్రాంతంలో బోంబే ఫిల్మ్ డివిజన్ వారు కూచిపూడికి రావడం, అపుడు *భామాకలాపం, భక్తప్రహ్లాద* మున్నగు ప్రదర్శనలు చేయడం, వారవి చిత్రీకరించడం జరిగింది.

అందులో ప్రహ్లాదుడుగా మా పెద్దబ్బాయి పసుమర్తి శేషబాబు నటించినట్లుగుర్తు. మన కూచిపూడికి ఆయువు పట్టు అయిన యక్షగానాన్ని క్షుణ్ణంగా అభ్యసించడమేకాక, చింతాకృష్ణమూర్తి గారి తరువాతి తరంలో వాటిని మరల అందరికీ నేర్పి 1952 నుండి దాదాపు 50 సం॥ల పాటు వాటిని నా తరువాతి తరాలవారికి అందించాను.

నేను ప్రారంభించిన నాటికి వెంపటి చినసత్యం కూడా విద్యార్థిదశలో పెద సత్యం వద్ద శిక్షణ పొందుతుండేవాడు. ఐతే పూర్వులు నేర్పిన యక్షగానాలలో సంగీత విషయాదులలో కొద్దిపాటి మార్పులు చేసి, సాహిత్యభావం, అర్థం చెడకుండా విరుపులు చేసి కొన్ని ఎక్కువ సంగతులు జోడించి, దోషాలున్న చోట వాటిని శుద్ధిచేసి నేర్పించేవాడిని, అలా ఈ విధమైన కూర్పులు చేయగల్గిన వాళ్ళలో ఇపుడు నా శిష్యుడు చి॥డి.ఎస్.వి.3 శాస్త్రి ఒకడు. అలా సంగీత, సాహిత్య, నృత్యాలను త్రివేణీ సంగమంగా చేసుకుంటూ నా జీవితాన్ని గడిపాను.

ఇది ఇలా ఉండగా 1970 ప్రాంతంలో సిద్ధేంద్ర కళాక్షేత్రం ఒక కమిటీ క్రింద ఉండేది. దానికి సెక్రటరీగా గడ్డమణుగు ఆంజనేయులు ఉండేవారు. వారు చాలా గొప్ప కళాభిమాని. వారి ద్వారానే వడాలి గ్రామ వాస్తవ్యులైన సంగీత, సాహిత్య, ఆగమవిద్వాన్ శ్రీ దండిభొట్ల వెంకట శాస్త్రిగారి పరిచయం ఏర్పడి, వారి స్వీయ రచన *పార్వతీ పరిణయం* యక్షగాన శైలిలో విరచించి, దానికి నృత్యదర్శకత్వం చేయమని వారే స్వయంగా వచ్చి ఆ రచనను నా చేతిలో పెట్టి కోరగా! నేను దానిని చూసి,



నృత్య భంగిమ

నృత్యప్రదర్శనకిది అనువుగా ఉన్నది అని నిశ్చయించుకొని, వారి సంగీత కూర్పును, కూచిపూడి యక్షగాన శైలిలోకి మార్పుచేసి కొంత నేనే స్వరపరచి, నా శిష్యులచేత ప్రదర్శనలిప్పించాను. ఈ విధంగా నూతన నృత్యరూపకాలకు నేను కూడా ఆహ్వానం పలికాను. ఆ *పార్వతీ పరిణయాన్ని* కొంత యక్షగాన శైలిలోను, కాలానుగుణంగా మార్పులు సహజం కావున కొంత నృత్యరూపక పద్ధతిలోను మేళవించి నృత్యీకరించాను. అది దాదాపు 30-40 ప్రదర్శనల వరకు చేశాము.

ఇందులో పార్వతిగా గడ్డమణుగు వసంత లక్ష్మి, శివుడుగా వేదాంతం రత్తయ్య శర్మ, వంత సూత్రధారిగా వేదాంతం సీతారామ శాస్త్రి మున్నగువారు చేసేవారు. ఆ విధంగా పాత యక్షగానాలన్నీ చింతా కృష్ణమూర్తి గారి తర్వాత పోషించిన వాడిని మా తరంలో నేనొక్కడినే! ఆ సాంప్రదాయాన్ని కొనసాగించిన వాడినీ నేనే!!

ఇవే గాక రేడియోలో సీనియర్ ఆర్టిస్ట్‌గా గుర్తింపుపొంది 40 ఏళ్ళపాటు కర్నాటక సంగీత కచేరీలు చేశాను. ఆ సమయంలోనే శ్రీ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, శ్రీ రంగం గోపాల రత్నం, శ్రీమతి వింజమూరి లక్ష్మి, శ్రీ వోలేటి వెంకటేశ్వర్లు, శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు వంటి ప్రముఖ సంగీత విద్వాంసుల పరిచయం, మైత్రి కొనసాగి అక్కడ కూడా మంచి పేరు గడించాను.

ఇంకా *పురూరవ చక్రవర్తి, దక్షయజ్ఞం* వంటి సంగీత రూపకాలు పార్వతీశంతో కలసి రేడియోలో ప్రసారం చేయించాము. ఆ రోజులలో నేను లేకుండా పార్వతీశం ఏ పనీచేసేవాడు కాదు. మా బంధం అలాంటిది. అంతకు పూర్వం మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, వినోబాభావే వంటి జాతీయ నాయకుల సమక్షంలో నాట్య ప్రదర్శనలిచ్చాను.

ఆ రోజులు వేరు, ఆ పరిస్థితులు వేరు. 92 సం॥ల వయసున్న మా తాత చింతా వెంకట్రామయ్యగారు అరుగు మీద కూర్చుని బడి నుంచి ఇంటికి వెళ్తున్న నన్ను పిలిచి 'స్మర హృది మానస-హరి వర చరణౌ' అని 'అయ్యా నాపలుకుల నాలకించుటకు నెయ్యంబు



పేరిణీ నృత్యం

పంపగా నేను మద్రాస్ వెళ్ళటం, అక్కడ ఘంటసాల, భానుమతి, ఎన్.టి.ఆర్ వంటి వారందరి పరిచయం, ఐనా ఆ వాతావరణం నాకు నచ్చక తిరిగి వచ్చేయడం, నేను నమ్మిన బాణీలోనే ముందుకు సాగడం జరిగింది. చివరి దశలో వేదాంతం రాఘవయ్యగారు కూచిపూడి వచ్చి అనారోగ్యం తో ఉన్నపుడు రోజూ నాకు కబురు పంపి నన్ను పిలిపించుకుని అన్ని యక్ష గానాలు పాడించుకుని ఆనందిస్తూ కొంచెం సంగీతం పాలు ఎక్కువైందేమోరా అనే వారు, మరి అలాకాకపోతే అది జానపదంగా వినిపిస్తుంది కదండీ, శాస్త్రీయతకు పెద్ద పీట వేయాలి కదా! అని నేనంటే ఔనౌనని నన్ను అభినందించే వారు. ఇక నా శిష్యులలో నన్నత్యంత అభిమానంగా చూసు కొనేది మా యామినీ కృష్ణమూర్తి అలా నాట్యంలో ఎందరో శిష్యులు... సంగీతం విషయానికొస్తే అప్పట్లో, చలసాని శశిరేఖ, డా॥జయలక్ష్మి, మాపిల్లలు శేషుబాబు, శ్రీనివాస్, పాండురంగ విఠల్, వేదాంతం రాధేశ్యాంలే కాక ఈ తరం గాయకులలో చి॥డి. ఎస్.వి.శాస్త్రి, మా మనుమరాళ్ళు పావని, పవిత్రలు, వేదాంతం భవానీ రామలింగ శాస్త్రి వంటివారు. నా శిష్యుడు రాజారెడ్డికి పద్మభూషణ్ అవార్డు వచ్చింది.

మనమున' అంటూ భక్తప్రహ్లాద యక్షగానంలోని దరువులు, పద్యాలు నేర్పించేవారు. వారి వంటి గురువు లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. వారు అరుగుమీద సరదాకి నేర్పిన పాటలు వెంటనే నేపాడటం చేత, నాకు తెలియకుండానే, ఆ వృద్ధాప్యంలోనూ, నా వెనకే నడుచుకుంటూ మా ఇంటికి వచ్చి మా నాన్నగారితో ఒరేయ్ శర్మా! వీడిని నా దగ్గరకు పంపిస్తావా? అని అడిగి నేను తయారు చేస్తానని చెప్పి ఒప్పించి మరీ వెళ్ళిపోయారు.

మర్నాటి ఉదయం నుండి సిరాబుడ్డి, కొంగ ఈకల కలం, ఒక పుస్తకం తీసుకొని వారింటికి వెళ్ళి నాట్యాభ్యాసం చేశాను. ఆ తరువాత పెద్దతనం చేత అడుగులు కొన్ని చెప్పలేనివి మా పసుమర్తి కృష్ణమూర్తి అన్నయ్య దగ్గరకు వెళ్ళి నేర్చుకు రమ్మని చెప్పి పంపేవారు. అప్పట్లో మా అన్నయ్య స్త్రీ పాత్రలు, వేదాంతం రాఘవయ్య పురుషపాత్రలు, పెద సత్యం మున్నగు వారు పాల్గొంటూ ప్రదర్శనలిచ్చేవారు. నా ముందు తరం కళాకారులు వారంతా! నేను బాగా తయారయ్యే సమయానికి వారంతా చిత్ర పరిశ్రమకు వెళ్ళిపోయారు.

ఆ తరువాత తరంగగానంలో అత్యంత నిష్ణాతులైన శ్రీ ర్యాలి పిచ్చయ్యగారు (ఘంటసాల గారి మేనమామ) ఓ సందర్భంలో కూచిపూడి వచ్చినపుడు అత్యద్భుతంగా గానంచేసి, మంచి విద్వత్ప్రదర్శించారు; వారు నా గానం విని చిత్రపరిశ్రమలో రాణిస్తాడని తెలిసినవారికి సిఫారసుచేసి

ఆ రోజులలో కళాక్షేత్రంలో సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు కూచిపూడిలో ఎన్నో సంవత్సరాలపాటు నేను నిర్వహించాను. అంతేగాక సిద్ధేంద్రయోగి ఆరాధనోత్సవాలను కూడా క్రమం తప్పకుండా నిర్వహిస్తూ 1991 వరకు అదే కళాక్షేత్రంలో నా శక్తి వంచనలేకుండా కూచిపూడి అభ్యున్నతికై శ్రమించి, ఇపుడు విశ్రాంతి జీవనంలో భగవంతునిపై కీర్తనలు, వ్రాసుకుంటూ, పాడుకుంటూ ఆ బాలాత్రిపురసుందరీ తల్లి సేవలో తరిస్తున్నాను.

శాస్త్రాన్ని పాడుచేయకుండా, కాలానుగుణమైన స్వల్ప మార్పులతో కూచిపూడి నాట్యంలోని సంగీత, సాహిత్యాల పటిష్ఠతను కాపాడుతూ మనదైన ఈ కళను ఖండాంతరాలలో ప్రస్తారింపజేస్తున్న కళాకారులందరికీ నా శుభాశీస్సులు....



# సార్వభౌముడు-మహామంత్రి

*- కె.జి. గోపాలకృష్ణరావు*

చరిత్రకు సంబంధించిన *మానసిక విశ్లేషణ* ఉప విభాగం 40 సంవత్సరాల క్రిందటే అమెరికాలో ఆరంభమయినప్పటికీ, ఇప్పటికీ ఈ నూతన విభాగం శైశవదశలోనే ఉన్నది. యుద్ధం పట్ల అశోకుని వైఖరిలో హఠాత్తుగా వచ్చిన మార్పు, మహమ్మద్ బిన్ తుగ్లక్ వింతైన ప్రవర్తన, 1792 తర్వాత టిప్పు సుల్తాన్ ప్రదర్శించిన వికారమైన చేష్టలు, ఆలోచనా పద్ధతులు వంటి విషయాలపై మన దేశంలోని చరిత్ర పరిశోధకులు *మానసిక విశ్లేషణ* చేపట్ట దగ్గ అంశాలే. అదే విధంగా క్రీ.శ. 1524 నుండి 1529 మధ్యకాలంలో శ్రీకృష్ణదేవరాయ చక్రవర్తి చర్యలు, ప్రవర్తన విశ్లేషించదగినవే. ఆ కాలంనాటి కొన్ని యథార్థాలు తెలుసుకోవడానికి 1524లో ఏం జరిగిందో తెలుసుకోవాలి.

మనకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని 'న్యూనిజ్' అనే పోర్చుగీసు యాత్రికుడు అందించారు. అతని వృత్తాంతం ప్రకారం రాయలకు 'తిరుమల' అనే కుమారుడు జన్మించాడు. లేక లేక కలిగిన తన కుమారుని భవిష్యత్తును గురించి, తన తదనంతరం వారసత్వంగా సింహాసనం ఆ బాలునికి దక్కుతుందో లేదో అనే భయంతో, తాను సజీవునిగా ఉండగానే, తన కుమారునికి 6 సంవత్సరాల చిరుప్రాయంలోనే రాజ్యాభిషిక్తునిగా చేయడానికి రాయలు నిర్ణయించారు. పట్టాభిషేకం జరిగిన తర్వాత పట్టాభిషేక ఉత్సవాలు 8 నెలల పాటు జరిగాయి.

ఈ ఉత్సవాల ముగింపు తర్వాత రాయలకుమారుడు మృతి చెందాడు. 'తిరుమల' మృతికి సాళువ తిమ్మరుసు, ఆయన కుమారుడు బాధ్యులని రాయలను ఎవరో నమ్మించారు. మరుసటి రోజు నిండు న్యాయస్థానంలో తిమ్మరుసు, ఆయన వంశీకులు బాలునికి విషమిచ్చినట్లు రాయలు ఆరోపించి, అప్పుడు మన దేశంలో ఉన్న పోర్చుగీసు సైనికుల సహాయంతో వారిని బంధింపచేశారు.

3 సంవత్సరాల తర్వాత తిమ్మరుసు పెద్దకుమారుడు ఖైదులోనుంచి తప్పించుకొని , ఉత్తరాదిన తన బంధువొకరు పాలిస్తున్న జాగీరుకు చేరుకుని రాయలకు వ్యతిరేకంగా యుద్ధప్రయత్నాలు చేశాడు. అతనిని తుదకు బంధించి విజయనగరానికి తెచ్చి చక్రవర్తి ఎదుట నిలుపగా, రాయలు కోపావేశంలో సాళువ తిమ్మరుసు, అతని కుటుంబ సభ్యుల నేత్రాలను పెరికించి అంధులను చేయించారు. పిమ్మట కొద్దికాలానికే తిమ్మరుసు పెద్దకుమారుడు మృతిచెందగా, తిమ్మరుసు, ఆయన కుటుంబ సభ్యులు, కీ.శ. 1634లో న్యూనిజ్ భారతదేశాన్ని విడిచి వెళ్లే నాటికి ఇంకా ఖైదులోనే మగ్గుతున్నారని న్యూనిజ్ వృత్తాంతం తెలుపుతుంది.

1524లో ఈ సంఘటన దగ్గర నుంచి, రాయలవారి ప్రవర్తనలో కచ్చితమైన మార్పు వచ్చిందని ఈ క్రింది ఆధారాల ద్వారా తెలుసుకోవచ్చు. (1) రాయలు తిరుమల వేంకటేశ్వరుని యందు గాఢమైన భక్తి కలవారు. ఆయన జీవితకాలంలో కనీసం 6 సార్లు తిరుమలేశుని దర్శించారు. ఆయన తన కుటుంబ సభ్యులందరికీ తిరుమలేశుని పేర్లను పెట్టుకున్నారు. పట్టపురాణి తిరుమలదేవి, పెద్దకుమార్తె తిరుమలాంబ, చిన్నకుమార్తె తిరు వెంగళాంబ, కుమారుని పేరు తిరుమల. ఆయన తాను రచించిన ప్రసిద్ధ ప్రబంధం ఆముక్తమాల్యదను వెంకటేశ్వరునికి అంకితం ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వరునికి అంకితం ఇవ్వబడిన మొదటి గ్రంథం ఇది. అంతకు ముందు ఎవ్వరూ ఇవ్వని విధంగా తిరుమల దేవాలయానికి అనేక గ్రామాలను, లెక్కలేనన్ని ఆభరణాలను, 30వేల బంగారు నాణాలను రాయలు సమర్పించుకున్నారు. అయినా 1524 తర్వాత రాయలు ఈ దేవాలయాన్ని ఒక్కసారి కూడా దర్శించుకోలేదు.

2. ఆయన జీవితంలో అనేక పుణ్యక్షేత్రాలను, పెక్కు సందర్భాలలో రాణులతో సహా దర్శించుకున్నారు. 1524 తర్వాత పుణ్యక్షేత్రాలను దర్శించలేదు. తన జీవితకాలంలో

ఆంగ్లం నుంచి అనువాదం: డాక్టరు పాటిబండ్ల దక్షిణామూర్తి, ఫోన్ : 9550652680

అనేక దేవాలయాలను నిర్మింపచేసిన రాయలు 1524 తరువాత దేవాలయాల నిర్మాణము చేపట్టలేదు.

3. ఆ సంవత్సరం నుండి రాజ్యపాలన మీద రాయలవారి పట్టు మరింత సడలిందని చెప్పవచ్చు. 1524-1526 సంవత్సరాలలో అచ్యుతరాయలు, అలియ రామరాయలు, సదాశివ రాయల పేర్లమీద ప్రకటించిన శాసనాలు కనపడుతున్నాయి.

వీటన్నిటి వెనుక గల కారణం సుస్పష్టం. తన ఒకే ఒక కుమారుని ఆకస్మిక మరణం రాయలను తీవ్రంగా కృంగదీసింది. తన కుమారుని మరణంతో మహామంత్రి తిమ్మరుసు, ఆయన కుమారుల అనుమానాస్పద పాత్ర రాయలను మరింత కృంగతీసింది. ఈ సంఘటనలు రాయలను భరించలేని నైరాశ్యంలోకి నెట్టివేసినాయి. న్యూనిజ్ వృత్తాంతం ప్రకారం, రాయలకు తిమ్మరుసు పితృసమానులే కాదు, రాయలనేత్రాలను రక్షించి, రాయల పదవీ స్వీకారానికి మహామంత్రి బాధ్యులు. రాయలకే కాదు, విజయనగర రాజ్యానికంతకు తిమ్మరుసు పితృసమానులు. మహామంత్రి తిమ్మరుసు, రాజకుమారునికి నిజంగా విషమిచ్చి చంపించాడా? ఈ ప్రశ్న చరిత్ర పరిశోధకులను చాలా కాలం కలవర పెట్టినా, ఈ ప్రశ్నకు తగినంత శ్రద్ధ చూపించ లేదనిపిస్తుంది. ఈ వ్యాసంలో నేను 'తిరుమల' మరణానికి అసలైన కారణమేదో తెలుసుకోవడానికి తగినంత సాక్ష్యాన్ని తెలియచేస్తున్నాను.

***తన కుమారుని మరణంతో మహామంత్రి తిమ్మరుసు, ఆయన కుమారుల అనుమానాస్పద పాత్ర రాయలను మరింత కృంగతీసింది. ఈ సంఘటనలు రాయలను భరించలేని నైరాశ్యంలోకి నెట్టివేసినాయి. న్యూనిజ్ వృత్తాంతం ప్రకారం, రాయలకు తిమ్మరుసు పితృసమానులే కాదు, రాయల పదవీ స్వీకారానికి బాధ్యులు కూడా.***

కొన్ని ముఖ్యమైన శాసనాలను పరిశీలిద్దాం. కృష్ణరాయలి విశ్వాసపాత్రులైన నాయకుల్లో ఒకరైన, రాయసం కొండమరసయ్య కన్నడంలో వ్రాయించిన దాన శాసనం ఒకటి. 1517 డిసెంబరు 1వ తేదిన ప్రకటించిన చోళ సముద్రం శాసనంలో, తన యజమాని కృష్ణదేవరాయలకు సంతతిని ప్రసాదించవలసినదిగా చేడేశ్వరీదేవతను ప్రార్థిస్తూ ఆ శాసనం వ్రాయబడింది. సంతానాన్ని ప్రసాదించమని దేవతలను కోరుతూ అలాంటి శాసనాలను సాధారణంగా పిల్లలు లేనప్పుడు లేదా ఆఖరి సంతానం తర్వాత అనేక సంవత్సరాలు తదుపరి సంతానం కలగనప్పుడు ప్రకటిస్తారు. రాయలకు అప్పటికి 17 సంవత్సరాల నుండి (ఇద్దరు కుమార్తెల తర్వాత) తిరిగి సంతానం లేదు. రాణిగారు అప్పటికే గర్భవతి అయి ఉంటే అలాంటి ప్రార్థనలు శాసన రూపంలో చేయరు. కాబట్టి 1517 డిసెంబరు 1 నాటికి పట్టపురాణి తిరుమలదేవి గర్భవతి అయి ఉండదని స్పష్టం అవుతుంది.

ఇక, దక్షిణ కర్ణాటకలోని గుండ్లు పేట శాసనం గురించి పరిశీలిద్దాం. 1518 జులై 19న సాళువ గోవిందరాజు జారీ చేసిన ఈ శాసనంలో కృష్ణరాయలకు పుత్ర జననం సందర్భంగా ఒక బ్రాహ్మణునికి దానం చేసిన వివరాలు ఉన్నాయి. సాళువ గోవిందరాజు అధికార పరిధిలో ఉన్న శ్రీరంగపట్టణంలో రాజకుమారుడు జన్మించటం వల్లను, రాయల వారి పట్టపురాణి తిరుమలదేవి శ్రీరంగపట్టణ పాలకుడు వీరప్పొదేయ కుమార్తె అయి ఉండటం వల్లను, తిరుమల రాకుమారుడు 19-7-1518 న జన్మించాడని స్పష్టమవుతుంది.

చోళ సముద్రం శాసనం నాటికి (1-12-1517) గర్భవతి అయి ఉంటే, శిశుప్రసవ శాస్త్రం లెక్కల ప్రకారం (8-9-1518) ప్రాంతాల్లో నిండు నెలల తరువాత రాకుమారుని ప్రసవించి ఉండాలి. ప్రసవించవలసిన తారీఖుకు, ప్రసవించిన తారీఖుకు నడుమ 7 వారాల సమయం ఉన్నందున, 7 వారాల ముందుగానే తిరుమల నెలలు నిండని బిడ్డ (Premature Baby) గా జన్మించి నాడని నిర్ణయించ వచ్చు. నెలలు నిండ కుండా పుట్టిన బిడ్డలు ఆ రోజుల్లో జీవించటం చాలా అరుదు. ఒక వేళ జీవించినా బలహీనంగా, పెరుగుదల లేకుండా, అసమర్థమైన, అపరిపక్వమైన రోగనిరోధక శక్తి వల్ల తరచు అనారోగ్యాలకు గురవుతూ ఉంటారు.

రాకుమారుడు వ్యాధి గ్రస్థుడైన బిడ్డ అని ఇతర ఆధారాల ద్వారా ఊహించవచ్చు. తిరుమలేశుని యందు గాఢభక్తి కలిగి, తన కుమారునికి ఆ దేవుని పేరు పెట్టుకున్నా, ఆ బాలుడు జీవించిన సంక్షిప్త జీవితకాలంలో ఒక్కసారి కూడా రాయలు తన కుమారుని రాయలు తిరుమలకు, మరే ఇతర దేవాలయాలకు, పుణ్య క్షేత్రాలకు గాని రాకుమారుడు యాత్ర చేసినట్లు శాసనాలు ద్వారా తెలియలేదు. రాకుమారుని పేర

దానాలను క్రింది ఉద్యోగులు ఇచ్చినట్లు కొన్ని శాసనాల్లో ఉన్నది గాని స్వయంగా దేవాలయాలకు మఠాలకు బహుమతులిచ్చినట్లు లేదు. తాను జీవించిన 6 సంవత్సరాల్లో రాకుమారుడు రాజభవనాన్ని గాని, రాజధానిని కాని విడిచి బయటకు వెళ్ళలేదని తెలుస్తున్నది. న్యూనిజ్ తన నివేదికలో రాకుమారుని మృతికి ఎలాంటి కారణాన్ని పేర్కొనలేదు. 'దీని తర్వాత రాయలు 8 నెలల పాటు వైభవంగా ఉత్సవాలు జరిపించారని, ఆ సందర్భంగా రాకుమారుడు అనారోగ్యానికి గురై మృతి చెందాడని' న్యూనిజ్ నివేదికలో ఉన్నది. బాలుడు నెలలు నిండ కుండా పుట్టినందువల్ల తరచు వ్యాధి గ్రస్తుడనే వాదంతో ఈ నివేదిక ఏకీభవిస్తున్నది.

మహామంత్రి తిమ్మరుసు పట్ల ఎంతో గౌరవాభిమానాలను కలిగి ఉన్న రాయలు హఠాత్తుగా అంత త్వరగా, తనంతట తానే తిమ్మరుసు అనుమానించటం నమ్మశక్యంగా లేదు. ఆ బలహీనమైన, వేదనా భరితమైన అత్యవసర స్థితిలో సాళువ తిమ్మరుసు అంటే సదభిప్రాయం లేని వ్యక్తులెవరో రాయల మనసులో అనుమాన బీజాలను నాటి ఉంటారు. అలా రాయల మనస్సును మహామంత్రి పట్ల విషపూరితం చేసేటంత వ్యతిరేకత కల్గిన వ్యక్తులు రాజన్యాయ స్థానంలో ఉన్నట్లు నమ్మశక్యం కాదు. రాజన్యాయస్థానంలో పోర్చుగీసువారే ఈ నీచమైనచర్యకు పాల్పడి ఉంటారని చెప్పవచ్చు. పోర్చుగీసు వారికి, మహామంత్రికి మధ్య సంబంధాలు సరిగాలేవని తెలిసిన విషయమే. క్రీ.శ.1523 చివర్లో తిమ్మరుసు గోవా సరిహద్దుల్లో ఉన్న విజయనగర సామ్రాజ్యానికి సంబంధించిన భూములను స్వాధీనం చేసుకోవటానికి పోర్చు గీసువారితో యుద్ధం చేశారు.

*మహామంత్రి తిమ్మరుసు పట్ల ఎంతో గౌరవాభిమానాలను కలిగి ఉన్న రాయలు హఠాత్తుగా అంత త్వరగా, తనంతట తానే తిమ్మరుసు అనుమానించటం నమ్మశక్యంగా లేదు. ఆ బలహీనమైన, వేదనా భరితమైన అత్యవసర స్థితిలో సాళువ తిమ్మరుసు అంటే సదభిప్రాయం లేని వ్యక్తులెవరో రాయల మనసులో అనుమాన బీజాలను నాటి ఉంటారు.*

తన రాజ్యంలో, తన న్యాయస్థానంలో తిమ్మరుసు పరాజితులై రాజధానికి తిరిగి వచ్చారు. 'సాళువ తిమ్మరుసును అతని కుటుంబీకులను పోర్చుగీసు సైనికులు ఖైదు చేశారు' అని న్యూనిజ్ నివేదికలో ఉన్నది. తన రాజ్యంలో తన న్యాయస్థానంలో తిమ్మరుసును నిర్బంధించడానికి పోర్చుగీసు సైనికుల సహాయం రాయలు తీసుకొన్నాడన్న కథనం పై చరిత్ర కారులు ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఆ రోజున ఆ సమయంలో రాజన్యాయస్థానంలో ఉద్రిక్తత, భావోద్వేగాలతో నిండిన సభలో మహామంత్రిపై నమ్మశక్యంగాని హత్యారోపణ రావటం సభాసదులందరినీ దిగ్భ్రాంతులను చేసింది. రాయలకే కాదు యావత్తు విజయనగర సామ్రాజ్యానికే పితృసమానులైన తిమ్మరుసుపై నమ్మశక్యంగాని ఆరోపణపట్ల దిగ్భ్రాంతి కలిగిన సమయంలో ఏ దళాధిపతిగాని, సైనికుడుగాని రాయలు ఆజ్ఞాపించినప్పటికీ మహామంత్రిని నిర్బంధించే సాహసం చేయలేక పోయారు. అటువంటి అయోమయ పరిస్థితిలో తన ఆజ్ఞను తన సైనికులు శిరసావహించక పోవటంతో రాయలు, తిమ్మరుసు బంధించ వలసిందిగా పోర్చుగీసు సైనికులను కోరారు.

తిమ్మరుసును, ఆయన కుటుంబ సభ్యులను ఖైదులో ఉంచిన తరువాత జరిగిన సంఘటనలపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. 1536 తరువాత తిమ్మరుసు జారీ చేసిన ఆనాటి శాసనాలను పరిశీలిస్తే దేవాలయానికి తిమ్మరుసు బహుమానాలను ప్రకటించి నట్లు ఆశాసనాల్లో లేదు.

తాను తన కుమారుడు గోవింద రాజు లోగడ ప్రసిద్ధకవి తాళ్లపాక అన్నమాచార్యుని పెద్ద కుమారుడు, పెద తిరుమలయ్యకు లోగడ దానం చేసిన ప్రసాదం హక్కులను అమ్ముకున్నట్లు అందుకు ప్రతిఫలంగా 11,73 పణాలు ధనాన్ని స్వీకరించినట్లు ఆ శాసనాల్లో స్పష్టంగా ఉన్నది. మహామంత్రి చెరసాల నుండి విడుదలైన తర్వాత దురదృష్టమైన, దయనీయమైన, నిర్భాగ్యస్థితిలో ఉండి, కుటుంబ పోషణకు ప్రసాదం హక్కులను అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని బట్టి 1524 నుండి 1534 వరకు చెరసాలలో ఉన్నాడని, బహుశా కంటి చూపును కూడా కోల్పోయినాడని నిర్ధారణ చేయవచ్చు.

రాయల వారసుడు అచ్యుత రాయలు పరిపాలనలో 5 సంవత్సరాల తర్వాత తిమ్మరుసును నిర్బంధం నుంచి విడుదల చేశాడని, తిరుపతి వెళ్లడానికి అనుమతించారని స్పష్టమవుతున్నది. ఆదర్శప్రాయులైన కృష్ణదేవరాయలు, మహామంత్రి తిమ్మరుసుల జీవితాల్లో కడపటి సంవత్సరాలు విషాదంగా ముగియడం శోచనీయం. మహామంత్రి తిమ్మరుసు గురించి పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ చెప్పిన వృత్తాంతాలు చాలవరకు సరైనవని చెప్పవచ్చు. మి

# అతిరాత్రం : సోమయాగం

– ముత్తేవి రవీంద్రనాథ్

ఖమ్మం జిల్లా భద్రాచలం మండలం ఎటపాక వద్ద ఏప్రిల్ 21వ తేదీ నుంచి పన్నెండు రోజులపాటు జరుపబడిన 'అతిరాత్రం ఉత్కృష్ట సోమయాగం' లక్షల సంఖ్యలో జనాన్ని ఆకర్షించింది. ప్రతిరోజూ క్రతువు తెల్లవారు జామున మూడు గంటలనుంచీ రాత్రి ఎనిమిది గంటల వరకు జరిగింది. విశ్వశాంతి కోసం, అన్ని రకాల దోషాలనూ తరిమేసి, దేవతలను అగ్నిముఖంగా ప్రసన్నం చేసుకొనటం ఈ యాగం లక్ష్యమని, చివరి రోజు పూర్ణాహుతిలో యాగశాల దహనం సందర్భంగా కుంభవృష్టిగా వర్షం కురుస్తుందనీ నిర్వాహకులైన సమతా లోక్ సేవా సమితి వారు ముందే ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ దీని నిర్వహణకు ఇచ్చిన యాభై లక్షల రూపాయలు కాక తిరుమల–తిరుపతి దేవస్థానం ఇరవై ఐదు లక్షల రూపాయలను సమకూర్చింది. ఇదికాక నిర్వాహకులు పెద్దమొత్తంలో విరాళాలను ప్రజలనుంచి వసూలు చేశారు.

**'అతిరాత్రం' అంటే?**

అతిరాత్రం అనేది పదహారు మంది ఋత్విజులు నిర్వహించే జ్యోతిష్టోమం అనే సంక్లిష్ట సోమయాగంలో ఒక అంతర్భాగం. యాగం జరిగిన పన్నెండు రోజులూ యజమాని




(యాగ నిర్వాహకుడు) అయినట్టి కేరళకు చెందిన నడువం నారాయణన్ సోమయాజి, ఆయన భార్య సావిత్రి కేవలం పాలు మాత్రమే ఆహారంగా తీసుకున్నారు. సాధారణంగా యాగ నిర్వహణలో యజమానికి సహకరించేందుకు హెూత, ఉద్గాత, అధ్వర్యుడు,బ్రహ్మ అనే నలుగురు ఋత్విజులు, వారిలో ప్రతి ఒక్కరికీ ముగ్గురు చొప్పున వారి సహాయకులు, అలా మొత్తం పదహారుగురు ఋత్విజులు యాగ నిర్వహణలో పాలు పంచుకుంటారు. ఈ సందర్భంగా యజమాని, ఋత్విజులు మొత్తం కేరళనుంచే వచ్చిన నంబూద్రి బ్రాహ్మణులు కావడం విశేషం. యాగ నిర్వహణ కోసం గరుడ పక్షి ఆకారంలో 'గరుడచితి' ని కేరళ నుంచి తెచ్చిన ప్రత్యేకమైన ఇటుకరాళ్ళతో నిర్మించారు. కేరళ నుంచే తెచ్చిన సోమలతను రాళ్ళతో నలగకొట్టి శుభ్రమైన వస్త్రంలో వడకట్టి సేకరించిన సోమరసాన్ని యాగంలో అగ్నికి అర్పించారు. ఈ సోమరస సేకరణకు 'గ్రావస్తోత్' అనే ఋత్విజుడు బాధ్యత వహిస్తాడు. సోమరసం తీయబోయే ముందు కేరళ నుంచి తెచ్చిన సోమలతను 'శోభాయాత్ర' పేరుతో పల్లకిలో ఊరేగించారు.

ఆర్యులు యజ్ఞయాగాదులకు ఎంతో ప్రయోజనముందని నమ్మేవారు. తమకు కొమ్ములు కావాలంటూ ఒకప్పుడు ఆవులు, శిశిర ఋతువులో తమ ఆకులు రాలిపోకూడదని వృక్షాలు కూడా యాగాలు చేశాయని ప్రాచీనుల విశ్వాసం. యజ్ఞం కోరుకున్న కార్యం సిద్ధింపజేస్తుందని వారు నమ్మారు. సంతానం కోసం సౌమ్యయాగం, పుత్ర సంతానం కోసం పుత్రకామేష్టి, పుంసవనం వగైరాలు నిర్వహించేవారు. యాగం చేసిన నెలన్నరకు సంతానం కలుగుతుందని నమ్మారు. శాస్త్ర పరిజ్ఞానం పెంపొందిన తరువాత సంతానం లేనివారు కూడా సకాలంలో తగు చికిత్సా పద్ధతులను అనుసరిస్తే సంతానం పొందగలరని, స్త్రీ పురుషులలో ఉన్న XY క్రోమోజోముల కలయికను బట్టి స్త్రీ లేక పురుష సంతానం కలుగుతుంది కానీ, పుంసవనాల వంటివి ఎన్ని చేసినా ప్రయోజనం

ఉండదనీ శాస్త్రీయంగా రుజువైంది. అందుకని ఇప్పుడు పుత్ర సంతానం కోరుతూ ప్రజలెవ్వరూ యజ్ఞాలు చేయడం లేదు. సామాన్యులలో కూడా ఆ నమ్మకం దాదాపుగా తొలగిపోయింది.

'యజ్ఞాద్భవతి పర్జన్య' అన్న గీతావాక్యాన్ని ఇంకా చాలామంది నమ్ముతున్నారు. యజ్ఞం చేస్తే పర్జన్యం అంటే వర్షుకాభ్రం అంటే వాన మబ్బు (పర్జన్యం అంటే వాన అనే అర్థమూ ఉంది) ఉద్భవిస్తుంది; అంటే వర్షం కురుస్తుందని వారి విశ్వాసం. శాస్త్రీయంగా ఆలోచిస్తే యజ్ఞానికీ, వర్షాగమనానికీ కూడా ఎలాంటి సంబంధమూ లేదు. ఎక్కడైనా యజ్ఞం నిర్వహించే చోట యాదృచ్ఛికంగా వాతావరణం అనుకూలించి, ఎప్పుడైనా వర్షం కురిస్తే కురవవచ్చుగానీ, యజ్ఞం మూలంగా మాత్రం కాదు. యజ్ఞం కారణంగా వర్షం పడేటట్లయితే యజ్ఞం చేసిన ప్రతిచోటా వాన పడితీరాలి. మరి చాలా చోట్ల అలా పడడం లేదు. అంతెందుకు–ఈ అతిరాత్ర నిర్వహకులు ప్రగల్భాలు పలికిందేమిటి? యజ్ఞం చివరిరోజు పూర్ణాహుతిలో యాగశాలను దగ్ధం చేసినప్పుడు కుంభవృష్టిగా ఉరుములు మెరుపులతో కూడిన శక్తిమంతమైన వాన కురుస్తుందన్నారు. కానీ అలా జరగలేదు.

చివరిరోజు ఈ వింతను చూద్దామని ఆసక్తిగా వచ్చిన అశేష జనసందోహం యాగశాల దహనమైపోయినా, 'ఇంకెప్పుడు వర్షం పడుతుందా 'అని ఆసక్తిగా అక్కడే చాలాసేపు వేచివుండి, ఇక లాభంలేదని నిరాశగా తిరిగి వెళ్తూ ఆ బూడిదను సేకరించుకుని వెళ్ళారని పత్రికలన్నీ పేర్కొన్నాయి. రాజిరెడ్డి అనే శాస్త్రజ్ఞుడి నేతృత్వంలో కొందరు ఔత్సాహికులు ఈ యజ్ఞం యొక్క ఫలితాలు ఏమేరకు శాస్త్రీయమో పరిశీలించడానికి యాగం జరిగినన్నాళ్ళూ అక్కడే కొనసాగారనీ పత్రికలు రాశాయి. వర్షాలకోసం మేఘమథనం కార్యక్రమానికి బదులుగా ఇకమీదట అతిరాత్ర యజ్ఞనిర్వహణ చేయాలని ప్రభుత్వానికి సూచించే ఉద్దేశ్యంతో ఈ యజ్ఞఫలితాలను విశ్లేషించిన కొందరు శాస్త్రవేత్తలకు పాపం తీవ్ర ఆశాభంగం తప్పలేదు. మేఘమథనం అనే ప్రక్రియ శాస్త్రీయమైనది. పూర్తిగా పారదర్శకమైనది. సిల్వర్ అయోడైడ్‌ను కాల్చి, దాని కణాలను గాలిలోకి పంపడం ద్వారా క్లౌడ్‌సీడింగ్ చేస్తారు. యజ్ఞం కారణంగా కూడా వర్షం కురిస్తే అవకాశం ఉందని ఎవరైనా శాస్త్రీయంగా రుజువుచేయగలిగితే కేవలం నమ్మడమేమిటి? ఇకమీదట అందరూ వర్షంకోసం యజ్ఞాలే చేస్తారు. అసలెందుకు? యజ్ఞాలవల్ల వానలు కురుస్తాయనే వాళ్ళను ఏ ఎడారి ప్రాంతాలకో, దక్షిణాఫ్రికాలోని 'ఇటోషా పాన్' లేక ఇజ్రాయెల్ లోని 'డెడ్ సీ' మొదలైన వర్షరహిత ప్రాంతాలకో పంపి, అక్కడ యజ్ఞాలుచేసి వర్షాలు కురిపించమంటే బాగుంటుందేమో!

కాని వాళ్ళు కనీసం ఇక్కడి అనంతపురం వంటి కరవు పీడిత ప్రాంతాలలోనైనా యజ్ఞాలు చేయరు. భద్రాచలం వంటి అటవీ ప్రాంతం అయితే అనుకోని వర్షాలు పడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయనేనేమో–దీన్ని ఎంచుకున్నారు తమ యజ్ఞస్థలిగా! ఏప్రిల్ ఇరవై ఐదవ తేదీన అనుకోని విధంగా వర్షం కురిస్తే అది ఈ యజ్ఞం కారణంగానేనని నమ్మబలికి, యజ్ఞం చివరిరోజు కుంభవృష్టి తప్పదని అందరిలో ఆశలు రేకెత్తించారు. వాస్తవానికి ఏప్రల్ మాసారంభం నుంచీ కోస్తా, తెలంగాణాలలో పలుచోట్ల పెనుగాలులూ, వడగండ్లవానలూ, కుంభవృష్టులూ మనం చూశాం. అంతెందుకు - ఏప్రిల్ 24న ఇల్లెందులోనూ, 25వ తేదీ ఖమ్మంలోనూ అకాల వర్షపాతం జరగలేదా? పైపెచ్చు యజ్ఞానికి అంతటి సత్తా ఉందనుకున్నప్పటికీ అకాలంలో వర్షం కురిపించడానికి ప్రయత్నించడం ఏమాత్రం సమర్థనీయం కాదు కదా? (అసలు ముందు యజ్ఞానికి అంతటి సామర్థ్యం ఉన్నట్లు శాస్త్రీయంగా రుజువు కాలేదనుకోండి)

ఒక పక్క ప్రకృతి కురిపిస్తున్న అకాల వర్షాల కారణంగానే ఇటీవల ఖమ్మం జిల్లాలోనే మామిడి, మిర్చి, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు మూడుకోట్ల పైచిలుకు పంట నష్టపోయారు. ముగ్గురు పిడుగుపాటుకు మరణించారు. తీవ్ర పశునష్టం జరిగింది. ఇవన్నీ పత్రికల్లో వచ్చిన వార్తలే. ప్రజలను ఆలోచింపజేస్తూ, వారిలో శాస్త్రీయ



గరుడచితి

దృష్టి పెంపొందింపజేయాలేగానీ, వారిలో అంధవిశ్వాసాలను పెంచడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. గద్దలు యజ్ఞం జరిగేటప్పుడే కాదు; ఇతర సమయాలలో కూడా ఆకాశంలో గిరికీలు కొట్టడం మనం గమనించవచ్చు. అవి నేలమీద తమ ఆహారమైన చిన్న పక్షులు, పాములు మొదలైనవి ఎక్కడ దొరుకుతాయోనని తమ తీక్షదృక్కులతో నిశితంగా పరిశీలిస్తూ ఉంటాయి. జనం ఎక్కువగా గుమికూడిన చోట్ల వాటికి వింతగా అనిపించి ఆకాశంలో కొంచెం ఎక్కువసేపు తిరుగాడే అవకాశముంది. అది చూపుతూ ఈ యజ్ఞం చూడడానికే అవికూడా వచ్చాయని ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం. అక్కడే వర్షాన్ని కోరుతూ వరుణ దేవుడికి అభిమానపాత్రమైన కప్పని పూజించడం మరింత విడ్డూరం.

ఒకవేళ పూర్ణాహుతి సమయంలో కుంభవృష్టి పడకపోతే పరువు పోతుందని, ఎందుకైనా మంచిదని కప్ప పూజ కూడా చేసి వరుణుడిని ప్రసన్నం చేసుకుందామనా? ఈ రెండూ చేసినా చివరిరోజు వర్షం కురవలేదు కదా! ఆలోచించండి. ఇక 'ప్రవర్గ్యం' పేరుతో మట్టికుండలో ఆవు నేతిని మరిగించి, దానిలో పాలుపోసి, అగ్నిగోళాలు సృష్టించడం చాలా పాతబడిన విద్యే. ఇందులో అబ్బురపోవాల్సినదేమీ లేదు. ఇదిచూసి, కనీసం కొందరు అమాయకులైనా నిర్వాహకులకు అతీంద్రియ శక్తులున్నాయని నమ్ముతారని వారి ఉద్దేశమా?

అదే స్థలంలో సంతానం లేని దంపతులు సంతానం కలగడానికి పుత్రకామేష్టి చేయడం కోసం నిర్వాహకులు ఒక్కో జంటనుంచి రూ.5,115/- చొప్పున పెద్దసంఖ్యలో వసూలు చేశారనీ, ఆ వసూళ్ళకు కూడా మిగిలిన భారీ వసూళ్ళ వలెనే ఎటువంటి లెక్కా పత్రమూ లేదనీ, 17 మంది నంబూద్రి రుత్విజులకు యజ్ఞానంతర సంభావనగా రూ.50 లక్షలు చెల్లించారనీ పత్రికలలోనే వార్తలొచ్చాయి. వీటికి నిర్వాహకులేమని సమాధానమిస్తారో మరి? ప్రభుత్వం కూడా ఈ తరహా కార్యకలాపాలకు కళ్ళెం వేయకపోతే ఇదేదో వాటంగా ఉన్నట్లున్నదని మరింత మంది తెలివైనవాళ్ళు స్వప్రయోజనం కోసం ఈ మార్గంపట్టే అవకాశం లేకపోలేదు.

**సోమలత నిజంగా ఉందా?**

కావాలని కాకున్నా ఈ అతిరాత్రి సోమయాగం మరో వివాదానికి తెరదీసినట్లయింది. అది సోమలత గురించి. సోమయాగాలలో సోమలత నుంచి తీసిన సోమరసాన్ని అగ్నికి హవిస్సుగా సమర్పిస్తారు. దాన్ని హుతవాహుడైన అగ్ని దేవతలవద్దకు మోసుకు వెళ్తాడనీ, దాన్ని తాగిన దేవతలు ప్రసన్నులవుతారనీ వైదిక ఋషుల విశ్వాసం. ప్రాచీనులు సోమరసాన్ని తాము కూడా తాగేవారు. సోమరసం తాగినవాడిని వేదాలలో 'సోమపా', సోమపీథిన్' మొదలగు పేర్లతో వ్యవహరించారు. ఇక సోమరసం గుణాల విషయానికొస్తే–అది కొంత మత్తునిచ్చినా, సురాపానం కంటే అదెంతో శ్రేష్ఠమైనదని ప్రాచీనులు భావించారు. సుర అంటే కల్లు, సారాయిలలా పులియబెట్టబడేది. సోమరసంలో పులియబెట్టడం ఉండదు.

సోమరసపానం సకల పాపాలనూ, రుగ్మతలనూ తొలగించి, శరీరానికి నవ్య తేజస్సునూ, దీర్ఘాయుష్షునూ ఇస్తుందని వారి నమ్మకం. సోమరసం మనస్సు నిలకడలేని వారిలో కుదిరికనూ, ధారణ శక్తినీ పెంపొందిస్తుందట. అది క్రిములను కూడా వెడలిస్తుందట. అయితే మోతాదు మించితే శ్లేష్మాన్ని, రక్తవాంతులు, రక్తవిరేచనాలను కలిగిస్తుందట. అందుకే ప్రాచీనులు సోమరసాన్ని కొద్ది మోతాదుల్లో పాలలో, పెరుగులో, బార్లీ జావలోనూ కలిపి సేవించేవారు. ఈ మిశ్రమ పానీయాలను వరుసగా గవాసిరం, దధ్యాసిరం, యవాసిరం అనేవారు. సోమరసాన్ని తేనెతో కలిపి కూడా సేవించేవారు. ఇక సోమలత లక్షణాలు ఏమిటో చూద్దాం.

ఋగ్వేదంలో ప్రధానంగా తొమ్మిదవ మండలంలో సోమలత ప్రస్తావన ఉంది. అదొక ఆకులులేని కాండమనీ, దాని నుంచి పుల్లని రుచిగల పాలవంటి తెల్లటి స్రావం కారుతుందనీ చెప్పబడింది. వేదకాలంలోనే అదొక అరుదైన లత కనుక దానికి ప్రత్యామ్నాయాల కోసం కూడా అన్వేషణ జరిగింది. 'సుశ్రుత సంహితా'లో సోమలతలలో ఇరవైనాలుగు రకాలున్నాయనీ, అవి లభించే ప్రాంతాలు, వాటి పేర్లు, భౌతిక రూపాలు భిన్నమైనప్పటికీ వాటన్నిటి సామాన్య లక్షణం పదిహేను ఆకులు కలిగి ఉండడమనీ పేర్కొనబడింది.

కొద్దిపాటి తేడాలతో మొత్తం నలభైరెండు రకాల సోమలతలున్నాయని ఆ గ్రంథం పేర్కొంది. వైదిక ఋషులు సోమరసాన్ని అమృతమని భావించారు. అమృతనిష్యందుడని పేరొందిన చంద్రుడికి సోముడని మరో పేరుండడం గమనార్హం. చంద్రుడే సోమలతకు అధిదైవం. చంద్రకళలను అనుసరించి సోమలత ఎదుగుతుందనీ, శుక్లపక్షంలో

పాడ్యమికి ఒకే ఆకుతో ఉండే ఆ లత ప్రతి తిథికీ ఒక్కొక్క ఆకు చొప్పున పెరుగుతూ పౌర్ణమి నాటికి పదిహేను ఆకులు కలిగి ఉంటుందనీ, తిరిగి కృష్ణపక్షంలో ఒక్కొక్క ఆకు రాల్చుతూ అమావాస్య నాటికి అసలు ఆకులేవీ లేని తీగగా తయారవుతుందనీ ప్రాచీనుల విశ్వాసం. సోమలత ఇది అని ఇదమిత్థంగా చెపుతున్నవారెవరూ లేరు. ప్రతివారూ తమకు తోచినరీతిలో ఏదో ఒక మొక్కను సోమలతగా భావించి తృప్తి పడుతున్నారు. పుల్లకాడ అనబడే ఎస్క్లిపియాస్ యాసిడా అనే శాస్త్రీయనామం గల మొక్కనే మన ప్రాంతంలో సోమలతగా వ్యవహరించి యజ్ఞంలో ఉపయోగిస్తున్నారు. ఇది మన కాడ చెముడు లేక జెముడు మొక్కలాగానే ఉంటుంది. గిల్లితే పాలు వస్తాయి. అవి పుల్లగానూ ఉంటాయి.

తెనాలి ప్రాంతంలో ప్రసిద్ధ యాజ్ఞికులు చాలామందిని కలిసి నేను ఈ విషయమై విచారించాను. అక్కడివారు సత్తెనపల్లి తాలూకా బెల్లంకొండ సమీపంలోని చౌట పాపయ్యపాలెం నుంచి ఈ పుల్లకాడ తెచ్చి యజ్ఞాలలో వాడతారు. సుప్రసిద్ధ వైద్యులు డా.కె.యం.నద్కర్ణీ తన 'ఇండియన్ మెటీరియా మెడికా' అన్న గ్రంథంలో సోమలత శాస్త్రీయనామం 'ఎఫెడ్రా అఫిసినాలిస్' అని పేర్కొన్నారు.

ఇంకొందరు 'ఎఫెడ్రా సినికా' అనే పొదమొక్కను సోమలతగా భావిస్తున్నారు. ఎందుకంటే దానిలోని ఎఫెడ్రిన్ అనే ఆల్కలాయిడ్ సోమరసంలాగే నరాలకు ఉత్ప్రేరణనిచ్చి, మత్తునిస్తుందట. ఇవన్నీ చూస్తుంటే నాకైతే మాత్రం ఏప్రాంతం ప్రజలు ఆ ప్రాంతంలో అందుబాటులో వున్న ఒక మొక్కను సోమలతగా భావించి దానినే యజ్ఞాలలో సోమరసం పిండేటందుకు వాడుతూ ఉన్నరనిపిస్తున్నది.

ఏది అసలైన సోమలత అనే విషయమై ఇంకా పలు వింత వాదనలున్నాయి. సోమలత అనే పేరునుబట్టే అదొక తీగమొక్క అని గ్రహించవచ్చు. 'ఎమారిటా మస్కారియా' అనే లతకానట్టి ఒక పుట్టగొడుగు జాతియొక్క (Fungi) కూడా వేదాలలో చెప్పబడ్డ సోమలత అయివుంటుందేమోనని పరిశోధనలు సాగుతున్నాయంటే చిత్రంగా ఉంది. అలాగే కొందరు బచ్చలి ప్రాచీనులు ఉపయోగించిన సోమలత అయివుంటుందనీ, మరికొందరు ద్రాక్ష అయివుండొచ్చనీ భావిస్తున్నారు. ఆ రెండూ లతలే అయినా సుశ్రుతుడు పేర్కొన్నట్లుగా వాటికి పదిహేను ఆకులు మాత్రమే ఉండవు. ఉన్న అసంఖ్యాకమైన ఆకులు కూడా చంద్రకళలను బట్టి మారవు. ఆకులు లేని కాండంతో చిన్న తెల్లటి పూలు గుత్తులుగా పూసేదీ, అన్ని మొక్కల్లా నేలలో వేళ్ళు ఉండకుండా ఉల్లి, లిల్లీ మొక్కల్లా గడ్డ (Bulb) ఉండే 'శార్కోస్టేమ్మా యాసిడం' అనే శాస్త్రీయనామం కల తీగమొక్కే వేదాల్లో పేర్కొనబడిన సోమలత అని కొందరి అభిప్రాయం. సిసలైన సోమలత ఎక్కడ లభిస్తుంది? అనే విషయంలోనూ పలు వివాదాలున్నాయి.

కొందరు సప్త కుల పర్వతాలలోని (త్రికాండ శేషంలో చెప్పబడిన ఏడు అతి పెద్ద పర్వతాలలోని) అతి ఎత్తైన ప్రాంతాలలో సోమలత లభిస్తుందనీ, ఇంకొందరు కేవలం హిమాలయాల్లోనే లభిస్తుందనీ భావిస్తున్నారు. 'చరిత్ర తమోభాస్కర' అనే బిరుదు పొందిన ప్రముఖ ప్రాచీన ఖగోళ పరిశోధకులు కీ.శే. కోట వెంకటాచలం (విజయవాడ) దర్భ లేక ముంజ గడ్డి విస్తారంగాకల 'ముంజవత్' పర్వత శ్రేణులలో సోమలత లభిస్తుందనీ, అందుకే సోమలతకు 'మౌంజవత్' అనే మరొక పేరుందనీ అభిప్రాయపడ్డారు. కొందరేమో 'శఖారం ముంజా' అనే శాస్త్రీయనామం కల ముంజగడ్డినే సోమలత అని భావిస్తుండడం విడ్డూరం.

మన ప్రాచీన సాహిత్యంలో చెప్పబడినట్లు చంద్రకళలనుబట్టి పుట్టే, రాలిపోయే పదిహేను ఆకుల సోమలత ఉండడం శాస్త్రీయంగా సాధ్యం కాదు. అది కేవలం ఒక అశాస్త్రీయమైన విశ్వాసం మాత్రమే. పైపెచ్చు అలాంటి సోమలతను ఈ నంబూద్రీలతో సహా ఎక్కడా, ఎప్పుడూ, ఏ యాజకుడూ చూసిన, ఇతరులకు చూపిన, యజ్ఞాలలో వాడిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో తాము కేరళ నుంచి తీసుకొచ్చిన సిసలైన సోమలతను పిండి సోమరసం తీశామని కేరళ నంబూద్రీలు గొప్పలు చెప్పడం ఆత్మ వంచనే కాదు; పరవంచన కూడా.

దీని అర్థం ఇన్ని శతాబ్దాలుగా ఆంధ్రప్రాంతంలోని యాజకులు తాము నిర్వహించిన యాగాలలో సిసలైన సోమలత వాడకుండా ఇక్కడి యజమానులను మోసం చేశారనేగా? ఈ రెంటిలో మోసమేదో విజ్ఞులైన జనమే నిర్ణయించాలి. వాస్తవానికి (Phoenix) అనే ఐతిహాసిక పక్షి, పెగాసస్ (Pegasus) అనే ఐతిహాసిక రెక్కల గుర్రం లాగానే సోమలత కూడా ఒక కాల్పనిక మొక్క మాత్రమే. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. మి

# ఠుమ్రీలు

## చరిత్ర గర్భంలోకి..

– నండూరి పార్థసారథి

గత సంచిక తరువాయి.....

**హిం**దుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ఖ్యాల్ తర్వాత చెప్పుకోదగిన అతిముఖ్యమైన, అతిమనోహరమైన ప్రక్రియ ఠుమ్రీ. దీన్ని గురించి వివరంగా చెప్పుకొనే ముందు తరానా, టప్పా అనే యింకో రెండు చిన్న ప్రక్రియల గురించి చెప్పుకుందాం.

తరానా ద్రుత్ ఖ్యాల్ లాంటిదే. అయితే, ద్రుత్ ఖ్యాల్ (ఛోటా ఖ్యాల్)లో–రెండు పంక్తులే అయినా–సాహిత్యం వుంటుంది. తరానాలో సాహిత్య రచన ఉండదు. దీనికి బదులు తరన, దిరెన, తనన, ధీంత, ధీం తన, దిర్ తాన, దిర్ దిర్ తాన, ఓదిర్ తాన, యాలాల వంటి అర్థరహితమైన బోల్‌లు ఏవో ఉంటాయి. వాటిని ద్రుతలయలో నిబంధిస్తారు. ద్రుత్ ఖ్యాల్ లాగానే తరానా కూడా ఎప్పుడూ ద్రుత్ లయలోనే ఉంటుంది. విలంబిత తరానాలుండవు. ఇందులోనూ జారు గమకాలుండవు. తరానాను ఎప్పుడూ విలంబిత ఖ్యాల్ తర్వాత దానికి అనుబంధంగానే గానం చేస్తారు. అంటే విలంబిత ఖ్యాల్ తర్వాత ద్రుత్ ఖ్యాల్‌ను గానీ, తరానాను గానీ – ఏదో ఒకటే – గానం చేస్తారు. కాని, చాలా అరుదుగా రెండింటినీ కూడా కొందరు గానం చేస్తారు. ఖ్యాల్ రచనలకు ఉపయోగించే రాగాలన్నింటినీ తరానాలకు కూడా ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియను ఉత్తర భారతీయ సంగీతలోకి ప్రవేశపెట్టిన వాడు అమీర్‌ఖుస్రోయే.

టప్పా ఒక అరుదైన ప్రక్రియ. ఇది యిప్పుడు దాదాపుగా అంతరించిపోయింది. ఇప్పటి కళాకారులలో గ్వాలియర్ ఘరానా గాయని మాలినీ రాజూర్కర్ ఒక్కరే టప్పాలను గానం చేస్తున్నారు. ఇది వరకు కృష్ణరావ్‌శంకర్ పండిత్, సిద్ధేశ్వరీదేవి టప్పాలు పాడేవారు. ఇప్పటి వాళ్ళలో బనారస్ ఖురానా గాయని గిరిజాదేవి ఖ్యాల్, టాప్పా రెండింటి లక్షణాలతో కూడిన 'టప్ ఖ్యాల్' పాడుతుంటారు. టప్పాకు సాహిత్యమైతే కాస్త ఉంటుంది కాని దానికి ప్రాధాన్యం ఉండదు. తరానాలాగానే ద్రుత్‌లయలోనే గానం చేయబడుతుంది. టప్పా బందిష్‌లకు సాధారణంగా బరువైన రాగాలను ఉపయోగించరు–ఠుమ్రీ అంగ్ రాగాలనే ఉపయోగిస్తారు. టప్పాలో తాన్‌లు అతి క్లిష్టమైన గిరికీలతో సాగుతాయి. ఈ గిరికీలనే 'ముర్కీ' లంటారు. ఈ ముర్కీలలో చాలా రకాలుంటాయి. వాటిలో కొన్ని – ఖట్కా, గిట్కడీ, జమ్‌జమా, సాన్నా, అన్నా. ఒక దీర్ఘస్వరం, దాని వెంటనే అతి వేగంగా ఈ ముర్కీలూ వస్తాయి.

ఒక తానాకి మరో తానాకి మధ్య విరామం ఉండదు. ద్రుత్ ఖ్యాల్, తరానాల లాగానే టప్పాకూడా ఎక్కువసేపు పాడరు. టప్పా రచనలు పంజాబీ, లేదా పుష్టు భాషలో ఉంటాయి. పంజాబ్‌లో ఒంటెలను తోలే వాళ్ళు పాడుకొనే ఒకరకం జానపదగీతం ధోరణిలో, దానికి అనుకరణగా



బిందా దీన్ మహరాజ్



కాల్కా దీన్ మహరాజ్



అచ్చన్ మహరాజ్

నండూరి పార్థసారథి, ఫోన్ : 9959734534



లచ్చు మహరాజ్
(వెనక) శంభు మహరాజ్



బిర్జూ మహరాజ్



ఉస్తాద్ అబ్దుల్ కరీంఖాన్

శాస్త్రీయ రాగాలలో కూర్చిన బందిష్‌లు టప్పాలు. టప్పా గాత్ర సంగీతానికే ఉద్దేశించినది. అయితే, యిప్పుడు ఒకరిద్దరు విద్వాంసులు టప్పా శైలిని సితార్‌పై అనుకరిస్తున్నారు.

**ఠుమ్రీ, దాద్రా:**

ఠుమ్రీ, దాద్రాలు రెండూ కర్ణాటక సంగీతంలోని పదం, జావళీ ప్రక్రియల వంటివి. ఇవి కూడా ప్రధానంగా స్త్రీలు అభినయించడానికి, గానం చేయడానికి ఉద్దేశించినవి, సాహిత్య ప్రాధాన్యం కలిగినవి. ఇవి ఉపశాస్త్రీయ సంగీత విభాగానికి చెందినవి. ఖ్యాల్ రచనలకు ఉపయోగించే అన్నిరాగాలను ఠుమ్రీ, దాద్రాలకు ఉపయోగించరు. అన్యస్వరాల ప్రయోగానికి అవకాశంగల రాగాలను, మిశ్రరాగాలను ఠుమ్రీలకు ఉపయోగిస్తారు. కాఫీ, మిశ్రకాఫీ, ఖమాజ్, మిశ్రఖమాజ్, తిలంగ్, మిశ్రతిలంగ్, తిలక్‌కామోద్, దేశ్, జింఝూటి, జోగియా, భైరవి, బేహగ్, మాండ్ – ఇవి ఠుమ్రీ అంగ్ రాగాలు. దాద్రా ప్రక్రియ ఠుమ్రీ కంటే తేలికరకం రచన. దాద్రా తాళం (ఆరు మాత్రల తాళం) లో గానం చేసే రచన కనుక దీనిని దాద్రా అంటారు. కాని, కేహర్వా, రూపక్ వంటి యితర తాళాలలో కూడా కొన్ని దాద్రాలున్నాయి.

ఠుమ్రీ లేక ఠుమరీ అనే ప్రక్రియ ఎన్నో శతాబ్దాలుగా ఉత్తర భారతంలో ప్రయోగంలో వున్నప్పటికీ యిప్పుడు మనకు తెలిసిన ఠుమ్రీ మాత్రం 19వ శతాబ్దంలో – సుమారుగా 1850 ప్రాంతంలో రూపుదిద్దుకున్నదని చెప్పవచ్చు. ఆ కాలంలో ఉత్తర ప్రదేశ్‌లో అవధ్ (అయోధ్య) నవాబ్ వజీద్ అలీషా కథక్ నృత్యాన్ని, ఠుమ్రీ, చైతీ, కజరీ, ఝూలా, సావనీ వంటి ఉపశాస్త్రీయ సంగీత ప్రక్రియలనూ విరివిగా పోషించాడు. తాను స్వయంగా పెక్కు ఠుమ్రీలను రచించాడు. వాటిని తానే పాడుతూ, అభినయించేవాడు. ప్రతి సంవత్సరం వసంతోత్సవం, శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి వేడుకలు నిర్వహించేవాడు. రాసలీలా ఉత్సవాలు జరిపేవాడు. ఆయన ఆస్థానంలో బిందాదీన్ మహరాజ్, కాళికా మహరాజ్ అనే యిద్దరు గొప్ప కథక్ నృత్యకళాకారులుండేవారు. వారిద్దరూ అన్నదమ్ములు. ఎన్నో ఠుమ్రీలు రచించారు. వారి రచనలు యిప్పటికీ ప్రయోగంలో వున్నాయి. వారి కుటుంబంలోనే వారి తర్వాత తరం వారు లచ్చు మహరాజ్, అచ్చన్ మహరాజ్, శంభు మహరాజ్. అచ్చన్ మహరాజ్ కుమారుడే నేటి సుప్రసిద్ధ కథక్ కళాకారుడు బిర్జూ మహరాజ్. ఈ కుటుంబంలో అందరూ కథక్ నృత్యకళకు, ఠుమ్రీ గానానికి, అభినయానికి అంకితమైనవారు. వారి తర్వాత కాలంలో 'కదర్‌పియా', 'లలన్‌పియా', 'సనద్‌పియా', 'సుందరపియా', 'రసికపియా', కలంపేర్లతో కొందరు వాగ్గేయకారులు ఠుమ్రీలు రచించారు. ఫయ్యాజ్ ఖాన్ 'ప్రేమ్‌పియా' కలం పేరుతో ఠుమ్రీలు, దాద్రాలు రచించారు.

క్షేత్రయ్య పదాభినయ కళ 17వ శతాబ్దిలో తంజావూరు విజయరాఘవ నాయకుని ఆస్థానంలో వృద్ధి పొందినట్లుగా ఠుమ్రీ అభినయ కళ 18వ శతాబ్దిలో వజీద్ అలీషా ఆస్థానంలో వృద్ధి పొందింది. పదాలలాగానే ఠుమ్రీలు కూడా శృంగార రస ప్రధాన రచనలు. వీటిలో సంయోగ శృంగారం కంటే వియోగ శృంగార రచనలే ఎక్కువ. పదాలకు, ఠుమ్రీలకు కొన్ని తేడాలు కూడా వున్నాయి. పదాల నడక విలంబకాలంలో సాగుతుంది; పదాలన్నీ బరువైన రాగాలలో వుంటాయి; వాటిలో అన్య స్వరాలకు అవకాశం ఉండదు. కాగా, ఠుమ్రీల నడక ఎక్కువగా మధ్యలయలో సాగుతుంది. చివరలో వేగం రెట్టింపై మళ్ళీ మధ్య లయకు తిరిగి వచ్చి ముగుస్తుంది. క్షేత్రయ్య పదాలలో వున్నంత 'ఘాటు శృంగారం' ఠుమ్రీలలో ఉండదు.



**ఉస్తాద్ బర్కత్ అలీ ఖాన్**

సంగీతపరంగా చూస్తే ఠుమ్రీలకు, జావళీలకు పోలికలు ఎక్కువగా కనిపిస్తాయి. ఉత్తర ప్రదేశ్‌లో ఠుమ్రీ అవతరించిన కాలంలోనే దక్షిణాదిని జావళీ అవతరించింది. జావళీకి స్ఫూర్తి ఠుమ్రీయే. హిందూస్థానీ సంగీతం నుంచి కర్ణాటక సంగీతంలోకి వచ్చిన కాఫీ, ఖమాజ్, పీలూ, బేహాగ్ వంటి 'ఠుమ్రీఅంగ్' రాగాలే జావళీలలో కనిపిస్తాయి. ఠుమ్రీల లాగానే జావళీలు కూడా మధ్య లయలో నడుస్తాయి. ఖ్యాల్‌లోనూ, ఠుమ్రీలలోనూ, సాహిత్యం యించుమించు ఒకే రకంగా ఉంటుంది. ఖ్యాల్ రచనల్లో లాగానే ఠుమ్రీలలో కూడా గ్రామీణ మధ్యతరగతి యువతుల శృంగార భావాలు, విరహవేదనలు, ప్రణయ కోపాలు కనిపిస్తాయి. విరహోత్కంఠితలు, ఖండితలు, ప్రోషితభర్తృకలు, కలహాంతరితలు కూడా కనిపిస్తారు. భాగవతంలోని గోపికల మధుర భక్తి కూడా కొన్ని ఠుమ్రీలలో, ఖ్యాల్ రచనల్లో కనిపిస్తుంది.

**ఒక ఉదాహరణ:**

**కౌన గలీగయో శ్యామ్**
**బతాదే సఖీ**
**గోకుల్ ఢూండీ, బృందావన్ ఢూండీ।**
**ఢూండీ ఫిరే చారీ ధామా॥**
**రైన దివస మోహీ తలపత బీతీ।**
**బిసర గయే సబకామ॥**

"సఖీ.. శ్యామ సుందరుడు ఏ వీధికి పోయాడో చెప్పవూ! గోకులంలో వెతికాను, బృందావనంలో వెతికాను, నాలుగు ధామాలలోనూ వెతికాను. పనులన్నీ మానుకొని రాత్రింబవళ్ళు వెతుకుతునే వున్నాను.'' సంగీతకచేరీలలోనూ, కథక్ నృత్యకార్యక్రమాలలోనూ తరచుగా వినిపించే ప్రసిద్ధమైన ఠుమ్రీయిది. ఒక ఎల్.పి రికార్డులో ప్రభాఆత్రే కూడా ఈ ఠుమ్రీ పాడింది. రాగం మిశ్రఖమాజ్.

**భాగేశ్వరీ రాగంలో ఒక ఖ్యాల్:**

**కోనగతా భయీ మోరీరే।**
**పియా న పూఛే అకహీ బాత॥**
**ఎక బన ఢూండీ సకల బన ఢూండీ।**
**దార దార అరు సబ ఫూల పాత॥**

"నా స్థితి ఏమని చెప్పను.. ప్రియుడు నన్నసలు పట్టించుకోడం లేదు. ఆ వనం, ఈ వనం.. అన్ని వనాలూ తిరిగాను. ప్రియుని జాడ చెప్పమని కొమ్మ కొమ్మనీ, రెమ్మ రెమ్మనీ అడిగాను. ప్రతి పువ్వునీ అడిగాను."

భీమ్‌సేన్ జోషీ పాడిన "బ్రజ్‌మే ధూమ్‌మచాయే కాన్హా" అనే భీమ్ పలాసీ ద్రుత్ ఖ్యాల్, అబ్దుల్ కరీంఖాన్ పాడిన "జమునాకె తీర్" భైరవి ఠుమ్రీ, బడేగులాం అలీఖాన్ పాడిన 'సునియో నంద్‌కుమార్' భైరవి ఠుమ్రీ, "పానియా భరన్ కైసే జావూఁ" అనే మరో ఠుమ్రీ, ఇవన్నీ కృష్ణునికీ, గోపికలకు సంబంధించిన రచనలే. ఖ్యాల్, ఠుమ్రీలలో సాహిత్య సామ్యానికి ఉదాహరణలు యివి. ఈ రెండు ప్రక్రియలకూ ట్రీట్‌మెంట్‌లోనే తేడా. ఈ మధ్య భరతనాట్యం, కూచిపూడి నృత్యకార్యక్రమాలలో త్యాగరాజకృతులను సైతం అభినయిస్తున్నట్లు ఠుమ్రీ అంగ్ రాగాలలో వున్న ఖ్యాల్ రచనలను ఠుమ్రీ శైలిలో పాడుతూ అభినయించే అవకాశం వున్నది. ధ్రుపద్ సంగీతాన్ని స్త్రీలు పాడకూడదనీ, పాడలేరనీ, ఠుమ్రీలను స్త్రీలే పాడాలనీ, అవి స్త్రీలకు ఉద్దేశించినవనీ, ఖ్యాల్‌ను పురుషులు, స్త్రీలు కూడా పాడవచ్చుననీ పూర్వం ఒక అభిప్రాయం వుండేది. జైపూర్ ఘరానా విద్వాంసుడు అల్లాదియాఖాన్ ఒకే రచనను తన శిష్యుడు భాస్కర్‌బువా బఖ్లేకు ధ్రుపద్ పద్ధతిలోనూ, శిష్యురాలు, కేసర్ బాయ్ కేర్కర్‌కు ఖ్యాల్ పద్ధతిలోనూ నేర్పేవాడట.

సాహిత్యం విషయంలో ఠుమ్రీకి, దాద్రాకి కూడా తేడా వుండదు. ఖ్యాల్, ఠుమ్రీలలో కనిపించే నాయికలే దాద్రాలలోనూ కనిపిస్తారు. ఆగ్రా ఘరానా విద్వాంసుడు ఉస్తాద్ ఫయ్యాజ్ ఖాన్ రచించిన రెండు ఖ్యాల్ రచనలను యింతకు ముందు (కిందటి సంచికలో) చూశాము. ఇప్పుడు ఆయనదే ఒక దాద్రాను చూద్దాం. భైరవి రాగంలో వున్న ఈ రచనను ఆయన ఒక 78 ఆర్.పి.ఎం. గ్రామఫోన్ రికార్డులో పాడారు.

**బనావొ బతియా చలో కాహేకొ ఝూటీ।**
**వహీజావో జహాఁరహే తుమ్ సారీ రతియా॥**
**తుమ్‌తొ ఛుప్ ఛుప్ సౌతన్ ఘర్ జావత్**
**నాహీఁనాహీఁ లాగూ తిహారి ఛతియాఁ ॥**

"కల్ల బొల్లిమాటలు కల్పించి చెబుతావెందుకు? రాత్రంతా ఎక్కడ గడిపావో అక్కడికే పో। ఏదో సాకుతో నా సవతి దగ్గరికి పోతావు. ఇంక నిన్నుపట్టుకు పాకులాడను ఫో!" ఇందులో నాయిక ఖండిత. ఫయ్యాజ్ ఖాన్ కంఠస్వరం



బడీ మోతీ బాయి

సింహ గర్జనలా వుంటుంది. కాని, ఆయన ఠుమ్రీలు, దాద్రాలు గానం చేస్తుంటే ఆ నాయికల ముగ్ధ మనోహర రూపాలు మన మనో నేత్రం ముందు దర్శన మిస్తాయి. మూడు నిమిషాల రికార్డులో ఈ పాటలోని 'వహీజావో' అనే రెండు పదాలను ఆయన ఎన్నో రకాలుగా పాడతారు. అభినయానికి ఉద్దేశించి పాడుతున్నట్లుగా ఉంటుంది. దీన్ని బోల్‌విస్తార్ అనీ, బోల్ బనావ్ అనీ అంటారు. ఇది కర్ణాటక సంగీతంలోని నెరవల్ లాంటిది. ఠుమ్రీ, దాద్రాలకు యిదే ప్రత్యేక ఆకర్షణ. అభినయంలో యిదే ముఖ్యాంశంగా వుంటుంది. సాహిత్యం, సంగీతం, అభినయం – ఈ మూడింటితో కూడిన ప్రదర్శనలోనే ఠుమ్రీ, దాద్రాల సమగ్ర సౌందర్యం ఆవిష్కృత మవుతుంది. లచ్చు మహరాజ్, శంభు మహరాజ్, బిర్జూ మహరాజ్, ఉమా శర్మ, సితారా దేవి వంటి గొప్ప కళాకారుల ప్రదర్శనలలో ఆ సౌందర్యాన్ని దర్శించవచ్చు. (వీరి అభినయాల వీడియో రికార్డింగ్‌లను దూరదర్శన్ భద్రపరచింది).

ఖ్యాల్, ఠుమ్రీ, దాద్రా రచనలలో కనిపించే నాయికలందరూ గ్రామీణ మధ్య తరగతి కుటుంబాలలోని స్త్రీలే. ఆ రచనలలో వ్యక్తమయ్యే భావాలన్నీ వారివే. కాని, వాటిని అభినయించేది మాత్రం వారు కాదు. వేశ్యావాటికలలోని కళాకారిణులే వాటిని అభినయించేవారు. బ్రాహ్మణ పండితులు వారికి అభినయ విద్య నేర్పేవారు. బ్రాహ్మణులు, యితర అగ్రవర్ణాల రసికులు ఆ అభినయాలను ఆస్వాదించేవారు, ఆదరించేవారు. స్త్రీలు మాత్రం ఆ ప్రదర్శనలను చూసేవారుకారు. అందుకే ఖ్యాల్ వంటి శుద్ధ శాస్త్రీయ రచనలను గానం చేసే ఉస్తాదులకు, పండితులకు ఠుమ్రీల పట్ల చులకన భావం ఉండేది.

నిజానికి 18వ శతాబ్దికి పూర్వం ఖ్యాల్‌నూ అలాగే ఈసడించుకొనేవారు. అప్పటికి ధ్రుపద్ గొప్ప ప్రక్రియ. సుమారు వంద సంవత్సరాల క్రితం వరకు ఉత్తర భారతంలో ఠుమ్రీల గాన, అభినయాల పరిస్థితి ఎలా ఉండేదో, దక్షిణాదిని పదాలు, జావళీల పరిస్థితీ అలాగే ఉండేది. శృంగార రసప్రధాన అభినయ, గానకళలను ఆస్వాదించేవారికి, పోషించే వారికి సమాజంలో గౌరవం ఉండేది కాదు. వారు బ్రాహ్మణులైనా సరే. మరే కులం వారైనా సరే. ఠుమ్రీ పుట్టి పెరిగింది ఉత్తర ప్రదేశ్‌లోనే కనుక వాటిని పాడవలసిన విధంగా పాడగలిగిన వారు ఆ ప్రాంతపు కళాకారిణులే నన్న భావం ఉండేది. ఠుమ్రీ, దాద్రాల గానంలో సుప్రసిద్ధులైన సిద్ధేశ్వరీదేవి, రసూలన్ బాయ్, బడీ మోతీబాయ్, బేగం అఖ్తర్, గిరిజాదేవి ఉత్తర ప్రదేశ్‌లోని బనారస్ (వారణాసి)కు చెందినవారు. వారి బాణీని 'పూరబీఅంగ్' అని అంటారు. వారిది బనారస్ ఘరానా అని కూడా అంటారు.

ఖ్యాల్ గాయకులలో మొట్టమొదటగా ఠుమ్రీలను గానం చేసి, ప్రచారం చేసినవాడు కిరాణా ఘరానాకు చెందిన ఉస్తాద్ కరీంఖాన్. గ్రామఫోన్ రికార్డులలో ఆయనపాడిన ఠుమ్రీలు అచ్చమైన 'సంప్రదాయ' పద్ధతిలో లేకపోయినా అవి శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. అప్పటి వరకు ఠుమ్రీల పట్ల సాధారణ శ్రోతలకున్న చులకన భావం చెరిగిపోయింది. ఆయన మార్గంలోనే శిష్యప్రశిష్యులు రోషనారా బేగం, హీరా బాయ్, బరోడేకర్, గంగూబాయ్ హంగల్, భీమ్‌సేన్ జోషీ, ప్రభాఆత్రే వంటి వారు ఠుమ్రీలకు ప్రచారం కల్పించారు. ఫయ్యాజ్ ఖాన్ కచేరీ వేదికల మీద, గ్రామఫోన్ రికార్డులలో విరివిగా ఠుమ్రీలు, దాద్రాలు గానం చేశారు. స్వయంగా పెక్కు రచనలు కూడా చేశారు. కరీంఖాన్, ఫయ్యాజ్ ఖాన్‌ల తరానికే చెందిన మౌజుద్దీన్ ఖాన్, ప్యారా సాహెబ్, మలికా జాన్, గోహర్ జాన్, విద్యాధరీ దేవి గొప్ప ఠుమ్రీ గాయకులుగా పేరు పొందారు. వారి రికార్డులేవీ యిప్పుడు అందుబాటులో లేవు – వారి గురించి పుస్తకాలలో చదివి తెలుసుకోవలసిందే. పటియాలా ఘరానా ప్రముఖుడు ఉస్తాద్ బడేగులాం అలీఖాన్ ఠుమ్రీలకు మహర్దశ పట్టించారు. ఆయన ఠుమ్రీ రికార్డులన్నీ సూపర్ హిట్టయ్యాయి.

ఆయన తమ్ముడు బర్కత్ అలీఖాన్ ఖయాల్‌ను వదిలివేసి ఠుమ్రీల గానాన్ని స్పెషలైజ్ చేశాడు. ఆయన కంఠ స్వరం, గాయన శైలి అన్నగారి గాత్రాన్ని, శైలినే



శ్రీమతి సిద్ధేశ్వరీ

పోలివుంటాయి. అయినా, అన్నగానంలోని రంజకత తమ్ముడి గానంలో కనిపించదు. ఖ్యాల్ అయినా, ఠుమ్రీ అయినా బడేగులాంకు మరెవ్వరూ సాటిరారు. ఆయన ఠుమ్రీ శైలి అభినాయానికి అనుకూలమైనది కాదు.

అయినా, పూర్తిగా ఒక కొత్తరకం ఠుమ్రీని ఆయన ఆవిష్కరించారు. ఆయన ప్రతి కచేరీ తప్పని సరిగా ఠుమ్రీతో ముగిసేది. ఒకటో రెండో ఠుమ్రీలు పాడకపోతే శ్రోతలు వూరుకొనేవారు కాదు. ఆయన ప్రభావంతో దాదాపు అన్ని ఘరానాల వారూ కచేరీలను ఠుమ్రీలతో ముగించడం అలవాటు చేసుకున్నారు. గాత్ర విద్వాంసులే కాదు– యిప్పుడు దాదాపు అన్ని వాద్యాల కళాకారులూ ఠుమ్రీలు వాయిస్తున్నారు.

ఈ పరిణామాలతో పూరబ్ అంగ్ ఠుమ్రీలు – సిద్ధేశ్వరీదేవి, బడీమోతీ బాయ్, రసూలన్ బాయ్, బేగం అఖ్తర్‌ల తరహా ఠుమ్రీలు – వెనక బడిపోయాయి. వాళ్ళ తర్వాతి తరంలోని నైనా దేవి, శోభాగుర్తు లాంటి వారు కూడా యిప్పుడెవరూ లేరు. అయినా, కథక్ నృత్య ప్రదర్శనలలో ఠుమ్రీల అభినయ సంప్రదాయం కొనసాగుతున్నది. బిర్జు మహరాజ్ వందలాది శిష్యులను తయారు చేశారు. ఇంకా తయారు చేస్తున్నారు. ఉమా శర్మ వంటి గొప్ప కళాకారిణులు ఇంకా వున్నారు.

**భజన్‌లతో భక్తి ప్రచారం**

కరీంఖాన్, ఫయ్యాజ్ ఖాన్‌ల తరంలో దాదాపు అన్ని ఘరానాల ఖ్యాల్ గాయకులూ ఠుమ్రీలను గానం చేస్తూండగా గ్వాలియర్ ఘరానా విద్వాంసుడు విష్ణు దిగంబర్ పలూస్కర్ ఒక్కరే ఠుమ్రీలను తిరస్కరించారు. ఠుమ్రీలకు బదులుగా ఆయన భజన కీర్తనలను ప్రచారం చేశారు. స్వాతంత్ర్యోద్యమం జోరుగా సాగుతున్న కాలంలో గాంధీజీకి సన్నిహితుడుగా మెలగుతూ అప్పటి కాంగ్రెస్ మహాసభలలో తులసీదాస్, సూరదాస్, మీరాబాయ్, నర్సీమోహతా భజన్‌లను ఆయన గానం చేస్తూండేవారు. ఆయన శిష్యులు కూడా ఆ సంప్రదాయాన్ని పాటించారు. గ్వాలియర్ ఘరానాలోని మూడు నాలుగు శాఖలలో ముఖ్యమైనది పలూస్కర్ గారి శాఖ. సుప్రసిద్ధ గాయకులు ఓంకార్‌నాథ్ ఠాకూర్, వినాయక రావ్ పట్వర్థన్, నారాయణరావ్ వ్యాస్ పలూస్కర్ గారి శిష్యులే.

డి.వి. పలూస్కర్ ఆయన కుమారుడే. పలూస్కర్ గారు అచ్చమైన గాంధేయ వాది, సంగీత సంస్కర్త, భక్తి మార్గ ప్రచారకుడు. సంగీతంలో లౌకిక శృంగారాన్ని ఆయన



బేగమ్ అక్తర్

వ్యతిరేకించారు. నిజానికి 13, 14 శతాబ్దాలలోనే ఇస్లాం వ్యాప్తిని అడ్డుకోవడానికి ఉత్తర భారత మంతటా భక్తి ఉద్యమం ఆరంభ మయింది. విద్యాపతి, చండీదాస్, చైతన్య మహాప్రభు, వల్లభాచార్య, సూరదాస్, తులసీదాస్, మీరాబాయ్, కబీర్‌ల భజన కీర్తనలు విరివిగా ప్రచారంలో వుండేవి. అవన్నీ ఉపశాస్త్రీయ సంగీత శైలికి చెందినవి. వాటికి నిర్దిష్టమైన వర్ణమెట్టులుండేవి కావు. పలూస్కర్ గారు పెక్కు భజన కీర్తనలకు వర్ణమెట్టులు కూర్చి తన శిష్యుల ద్వారా వాటిని ప్రచారం చేశారు. డి.వి పలూస్కర్ గ్రామఫోన్ రికార్డులలో పాడిన భజనలన్నీ విష్ణుదిగంబర్ పలూస్కర్ గారు స్వర పరిచినవే. పలూస్కర్ గారి శిష్యులు తమ కచేరీలను భజనలతో ముగించేవారు.

* * *

ధ్రుపద్ అయినా, ఖ్యాల్ అయినా, ఠుమ్రీ, దాద్రా లైనా యివన్నీ భారతీయమైనవి. ఇవన్నీ బ్రజ భాషలోనో, మరో హిందీ మాండలికంలోనో వున్నవే గాని పర్షియన్‌లో, ఉర్దూలో వున్నవి కావు. రాగాలన్నీ మనవేగాని ఇస్లామిక్ ఫణితులు కావు. వాటిలోని భావాలన్నీ భారతీయ ప్రజాజీవితానికి, భారతీయ సంస్కృతికి సంబంధించినవే.

పాకిస్థాన్ శాస్త్రీయ సంగీతంలోని రాగాలన్నీ మన హిందూస్తానీ సంగీతంలోనివే. దుర్గ, శంకర, లలిత్, ఆభోగి, భూపాలీ, కేదార్, భైరవ్, భైరవి లాంటి రాగాలనే అక్కడి గాయకులు పాడుతున్నారు. వారంతా గ్వాలియర్, ఆగ్రా, జైపూర్, రాంపూర్, పటియాలా, కిరానా వగైరా ఘరానాల వారే. ఢిల్లీ, కలకత్తా, బొంబాయి నగరాలకు వచ్చి కచేరీలు చేస్తే మక్కా, మదీనాలను సందర్శించినంత సంబరంగా వుంటుంది వారికి.

హిందూస్థానీ సంగీతం ఇస్లామిక్ సంగీతమా ? ⓜ

# కైశికి నిషాద ప్రస్తావన

కర్ణాటక సంగీతంలో ఒక్క కైశికి నిషాదమే 27 రకాలుగా వినియోగింపబడుతున్నట్లు గురుమిత్రులు విద్వాన్ ఆకెళ్ళ మల్లికార్జున శర్మ గారు *మిసిమి* మే 2012 సంచిక *కమ్మతెమ్మెరలు* లో రాసిన మాటలు చదవగానే నాకెంతో ఆనందమూ ఆశ్చర్యమూ కలిగింది. తన జీవితమంతా సంగీత అధ్యయనానికి, పరిశోధనకు, బోధనకు వినియోగించిన ఆకెళ్ళ వంటి గొప్ప విద్వాంసులు చెప్పేమాటలు అవశ్యం శిరోధార్యాలే. ఇప్పుడు నేను రాస్తున్న ఈ చిన్ని లేఖావ్యాసం ఆయన లేఖకు సమాధానం కాదు– స్పందన మాత్రమే.

హిందూస్థానీ సంగీతంలో యిదే స్వరం (కైశికి నిషాదం) ఎన్ని రకాలుగా వినియోగింపబడుతున్నదో తెలుసుకోవాలని వుందని ఆకెళ్ళవారు రాశారు. నేను లెక్క బెట్టి చెప్పలేను గాని హిందూస్థానీ సంగీతంలో కూడా యిటువంటి ప్రయోగాలున్నాయని నేను విశ్వసిస్తున్నాను. ఒకానొక స్వరం అనేక రకాలుగా ప్రయోగింపబడడం అంటే రసోచితమైన, మనోధర్మానుగుణమైన శ్రుతుల వినియోగమేనని నేను అనుకుంటున్నాను. కైశికి నిషాదం ఎన్నో రాగాలలో వినియోగింపబడుతున్నది. ఒక్కొక్క రాగానికి ఒక్కొక్క మూడ్ వుంటుంది; ఒక్కొక్క రసభావం వుంటుంది; ఆ మూడ్‌ను, రసభావాన్ని ఆవిష్కరించడానికి అవసరమైన విధంగా కళాకారుడు ఆ స్వరాన్ని (కైశికి నిషాదాన్ని) ప్రయోగిస్తాడు; ప్రయోగించవలసి వుంటుంది. ఇంత మాత్రమే కాదు. అలా ఆవిష్కరించడానికి కళాకారుని ప్రతిభ ఎంత? ప్రావీణ్యం ఎంత? భావనా బలం ఎంత? ఔచిత్య స్పృహ ఎంత? అనే అనేక అంశాలపైన కూడా శ్రుతుల ప్రయోగం ఆధారపడి వుంటుందని నేననుకుంటున్నాను.

కైశికి నిషాదం ఒక్కొక్క రాగంలో ఒక్కొక్క రకంగా ప్రయోగింప బడుతుందా? ఒకే రాగంలో కూడా వేర్వేరు (వాగ్గేయ) రచనలలో వేర్వేరుగా ప్రయోగించబడుతుందా? ఒకటోరకం, రెండోరకం, పధ్నాలుగోరకం, ఇరవైఏడోరకం అని లెక్కబెట్టి నిలబెట్టి పట్టుకోవడం సాధ్యమేనా? సాధ్యమే అయితే అది మహాద్భుత విషయమే. అటువంటి పట్టికను తయారు చేయగలిగితే యింకా బాగుంటుంది. దాని కొక సాఫ్ట్ వేర్ రూపొందించగలిగితే సంగీత కళకు మహోపకారమే అవుతుంది. ఆ పని ఆకెళ్ళవారే చేయగలరని నా విశ్వాసం; చేయాలని నా అభ్యర్థన.

వంట రుచి వింటే ఏం తెలుస్తుంది? తింటే తెలుస్తుంది. అలాగే సంగీత రుచి చదివితే ఏం తెలుస్తుంది? వింటే తెలుస్తుంది. సంగీతంలో 'రుచి' అంటే ఏమిటి? కైశికి నిషాదం 27 రకాలుగా ప్రయోగింపబడుతున్నదంటే ఆ స్వరానికి 27 రుచులున్నాయన్నమాట. ఆ రుచులను అందించవలసిందిగా ఆకెళ్ళవారికి సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను. నా ఒక్కడి కోసం కాదు. సంగీత పరిశోధకులకోసం, విమర్శకుల కోసం, అధ్యాపకులకోసం, విద్యార్థులకోసం. ఆకెళ్ళ వారికి ఎప్పుడు వీలైతే అప్పుడు, అనుకూలమైన తేదీని ఒక పది, పదిహేను రోజులు ముందుగా తెలియజేసినట్లయితే ఆయన సోదాహరణ ప్రసంగానికి ఏర్పాట్లు చేయగలను. వేదిక, మైక్, వీడియో రికార్డింగ్ మొదలైన ఏర్పాట్లన్నీ చేయగలను. స్థానికంగా అందుబాటులో వుండే విద్వాంసులను, పత్రికా ప్రతినిధులను ఆహ్వానించగలను. మొత్తం కార్యక్రమాన్ని రికార్డ్ చేసి డివిడిగా భద్రపరుద్దాము. అంతే కాదు– ఈ ప్రయోగం జయప్రదమైతే యిదే విధంగా నెలకొక కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేనే ఏర్పాట్లు చేయగలను. కైశికి నిషాదమే కాదు – మిగిలిన స్వరాలు కూడా ఒక్కొక్కటి ఎన్ని రకాలుగా ప్రయోగింపబడుతున్నాయో ఆకెళ్ళవారు పాడి వినిపించినా, వైలిన్‌పై వాయించి వినిపించినా వీడియో రికార్డింగ్ చేయిస్తాను. ఈ రికార్డింగ్‌లు సంగీత పరిశోధకులకు రిఫరెన్స్ మెటీరియల్‌గా శాశ్వతంగా వుండిపోగలవు.

'చరిత్రగర్భంలో...' శీర్షిక క్రింద వ్యాసపరంపరను ఈ సంచికతో ముగిస్తున్నాను. ఇంకా ఘరానాలను గురించి రాయవలసి వుంది కాని వాటిని ప్రస్తుతానికి వాయిదా వేసి కర్ణాటక – హిందూస్థానీ సంగీతాల సామ్యాలను గురించి, భేదాలను గురించి విష్ణునారాయణ్ భాత్కండే, డాక్టర్ ప్రేమలతా శర్మ, రంగరామానుజ అయ్యంగార్, అలైన్‌డేనియెలో, ఆచార్య కె.సి. బృహస్పతి వంటి మహావిద్వాంసులు చెప్పిన విషయాలపై వరుసగా కొన్ని వ్యాసాలను ఆగస్టు సంచిక నుంచి రాయాలని సంకల్పించాను.

సోదాహరణ ప్రసంగానికి ఆకెళ్ళవారు అంగీకారం తెలిపేటట్లయితే ఆ కార్యక్రమంలోనే సితార్ విద్వాంసుడు స్వర్గీయ ఉస్తాద్ విలాయత్ ఖాన్‌గారి కొన్ని రికార్డింగ్‌లలో అతి సూక్ష్మమైన శ్రుతులను ఎంత అద్భుతంగా అనితరసాధ్యంగా ప్రయోగించారో వినిపించగలను. మి

# సురభి నాటక రంగం

– జి.యస్. ప్రసాద రెడ్డి

కళావనికి దేవుడు ఇచ్చిన ఒక గొప్పవరం. సురభి నాటక సమాజం తెలుగు నాటక రంగస్థలం కాదు. భారతీయ నాటకరంగమే కాదు... ప్రపంచ రంగస్థల చరిత్రను పరిశీలిస్తే నాటక రంగానికి లేని ప్రత్యేక స్థానం సురభి నాటకరంగానికి ఉంది. కొన్ని తరాలుగా, కొన్ని కుటుంబాలు, పసివాడి నుంచి ముదుసలి వరకూ రంగస్థలమే సర్వస్వంగా భావించి జీవించిన ఘనత, తెలుగునాట స్థిరపడిన సురభి వారికే దక్కింది. నటన, సంగీతం, సాహిత్యం, ఆహార్యం, రంగాలంకరణ, దుస్తులు, విద్యుద్దీపనం, వైరు వర్క్, ఇలా ప్రదర్శనకు సంబంధించిన ప్రతి విభాగంలోనూ ప్రవేశమే కాక ప్రావీణ్యం కూడా సాధించి, ప్రదర్శనలకు ప్రాణం పోసి, త్రికరణశుద్ధిగా నాటక కళకు అంకితమైన సురభి కళాకారులు ధన్యజీవులు... చిరస్మరణీయులు.



సురభి కమలాబాయి

సురభి నాటక సమాజాలన్నీ స్వయం సమృద్ధమైనవి. స్వయం పోషకమైనవి. పుట్టిన దగ్గర్నుంచీ రంగస్థల కళల్లో శిక్షణ పొందుతూ, ఆ ప్రకారంగా ప్రదర్శనలకు సన్నద్ధమౌతూ, వచ్చిన దానిలో లేదా ఉన్న దానిలో సంతృప్తి చెందుతూ 120 సంవత్సరాలు రంగస్థలం అనే రథాన్ని అలుపు లేకుండా అవిశ్రాంతంగా లాగుతూ వచ్చారు. నాటకరంగాన్ని తమ ఆరాధ్యదైవంగా, ప్రదర్శనను పవిత్ర యజ్ఞంగా భావించి, అంకిత భావంతో, అకుంఠిత దీక్షతో ప్రజలకు ఆనందాన్ని పంచి పెట్టిన సురభి సమాజాల కళా సేవానిరతి శ్లాఘనీయం.

1850 ప్రాంతంలో మహారాష్ట్ర నుండి ఆంధ్రదేశానికి వచ్చిన సైనిక జాతి రాయలసీమ ప్రాంతంలో స్థిరపడి, కొందరు వ్యవసాయం, మరికొందరు తోలు బొమ్మలాటలు. వీధినాటకాలు ప్రదర్శిస్తూ జీవితాన్ని గడుపుతూ వచ్చారు. వీరికి అరెకాపులు లేదా ఆరు మరాఠీలు అని పేరు. వీరందరూ సనాతన కుటుంబానికి చెందినవారే. అయితే రానురాను వీరి కుటుంబాలు పెరగటంతో రాయదుర్గం వారు, బాలకొండవారు, సురభివారని మూడు శాఖలుగా ఏర్పడ్డారు. ఆయా గ్రామాల పేర్లను బట్టి వీరికీ పేర్లు వచ్చాయి. రాయదుర్గం వారు వ్యవసాయరంగంలో స్థిరపడగా, బాలకొండ వారు నాటి బొంబాయి సినిమా పరిశ్రమకు తరలి వెళ్ళగా, సురభివారు దాదాపు అన్ని కుటుంబాల వారు నాటక ప్రదర్శనలు కొనసాగిస్తూ జీవితాన్ని గడుపుతూ వచ్చారు.

1895వ సంవత్సరం సురభివారి చరిత్రలో సువర్ణాధ్యాయమని చెప్పవచ్చు. కడపజిల్లా, రాయచోటి తాలూకా, సురభి గ్రామంలో రామిరెడ్డి, చెన్నారెడ్డి అనే సంపన్నుల ఇంట్లో జరిగే వివాహ సందర్భంగా కీచకవధ నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామస్థులంతా ఈ ప్రదర్శనకు ముగ్ధులయ్యారు. పులివెందుల మెజిస్ట్రేటు టి.ఎన్. గోవిందరాజులు నాయుడు ఆ ప్రదర్శనను తిలకించి, పులివెందులలో మరో ప్రదర్శన ఏర్పాటు చేసి, ఒక నాటకసమాజాన్ని నడపమని వీరికి ధన, స్థల సహాయం చేశారు. నాటి నుండి వనారస కుటుంబం సురభి గ్రామంలో స్థిరపడి సురభివారుగా పిలువబడ్డారు.

ఆ తరువాత నాటి అనంతపురం తాలూకా ధర్మవరం నివాసి రాప్తాటి సుబ్బదాసు, చెన్నారెడ్డి, రామిరెడ్డి విజ్ఞప్తి మేరకు సురభివారికి *హరిశ్చంద్ర, సారంగధర, శకుంతల* నాటకాలు రచించి, నేర్పించి, ప్రదర్శింపజేశాడు. శ్రీ శారదా మనోవినోదినీ సంగీత నాటక సభ పేరు ఈ సమాజానికి పెట్టారు. ఈ ప్రదర్శనలు రక్తి కట్టి, ప్రజల మెప్పుపొందటంతో సురభి అనేక నాటకాలు ప్రదర్శించి, తమ నైపుణ్యాన్ని

ఇతరులకూ తెలియజేసే ఉద్దేశ్యంతో సంచార నాటకాలు ప్రారంభించింది. సంచార నాటకాలకు ప్రథములు సురభి వారే. రాయచోటిలో తమ సంచారనాటక ప్రదర్శనకు నాంది పలికి, టిక్కెట్టు పద్ధతిని ప్రవేశ పెట్టారు. తర్వాత కడపలో సొంత డేరా నిర్మించి సుభద్రా పరిణయం, రుక్మాంగద నాటకాల్ని ప్రదర్శించారు.

నాడు తెలుగునాట స్త్రీ పాత్రలను పురుషులే ధరించేవారు. కానీ సురభి సమాజంలో స్త్రీ పాత్రలు స్త్రీలు, పురుష పాత్రలు పురుషులు వయోరూప గుణానుకూలంగా ధరించేవారు. సంసార స్త్రీలతో నాటకాల్ని వేయించిన ఘనత కూడా సురభి వారిదే. రాయలసీమ ప్రాంతంలో పలుచోట్ల ప్రదర్శనలిచ్చిన అనంతరం, వీరి పర్యటన సర్కారు జిల్లాలకు మళ్ళింది. 1901లో నరసారావుపేటలో ప్రదర్శించి, తదుపరి గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, బరంపురంలలో వరుసగా ప్రదర్శనలిస్తూ సంచారం చేశారు. ఆ రోజుల్లోనే బరంపురంలో ఏకధాటిగా మూడు నెలలపాటు ప్రదర్శించారు. ముందు చెప్పిన నాటకాలకు తోడుగా కాంతామతి, భల్లాణరాజు చరిత్ర నాటకాలు కూడ వీరి ప్రదర్శనల్లో చోటు చేసుకొన్నాయి. రాజమండ్రిలో చిలకమర్తి లక్ష్మీనరసింహం వీరి ప్రదర్శనలను కొనియాడాడు.

విశాఖపట్నంలో మారేపల్లి రామచంద్రశాస్త్రి *పారిజాతాపహరణం, బిల్హణీయం* నాటకాల్ని రచించి వీరికిచ్చాడు. బరంపురం నుండి తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం, పాలకొండ, విశాఖపట్నం, బందరు, బెజవాడ, వరంగల్, సికింద్రాబాద్‌లో ప్రదర్శనలిచ్చి, 1903 నాటికి సురభి చేరుకొన్నారు.

శ్రీకాకుళంలో వరఖల చింతామణి శాస్త్రి తమ *చంద్రకాంత* నాటకాన్ని వీరికిచ్చి ప్రదర్శింపచేశాడు. ప్రదర్శించే నాటకాల సంఖ్యతో పాటు ప్రదర్శనల సంఖ్య కూడా రానురాను పెరుగుతూ వచ్చింది. సికింద్రాబాద్‌లో ధర్మవరం గోపాలాచార్యులు, ఇప్పటి వరకూ సురభి రథాన్ని నడిపించిన ముగ్గురన్నాదమ్ముల ప్రదర్శనలు చూసి బహువిధాలుగా ప్రశంసించాడు. కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తర్వాత 1910 ప్రాంతంలో మద్రాసు, మైసూరు ప్రాంతాల్లో విరివిగా ప్రదర్శనలిచ్చారు. వీరు ఏ ప్రాంతం వెళ్ళినా, అక్కడ లభ్యమయ్యే ప్రదర్శనలకు కావలసిన రంగస్థల సామగ్రి, పరికరాల్ని సమకూర్చుకొంటూ ప్రదర్శనల్ని పరిపుష్టం చేసుకొన్నారు.

ఇప్పటి వరకూ సురభి ప్రదర్శనల రథాన్ని నడిపిన ముగ్గురన్నదమ్ముల్లో, అభిప్రాయ భేదాలు తలెత్తి మూడు సమాజాలుగా విడిపోయారు. ఆంధ్రదేశాన్ని రాయలసీమ, తెలంగాణా సర్కారు జిల్లాలుగా విభజించుకొని ప్రదర్శనలు కొనసాగించారు. వారి పేర్లు కృష్ణయ్య (పెద్ద కృష్ణాజీరావు), వెంకయ్య (వెంకోజీరావు), పెదరామయ్య. వీరిని కృష్ణప్ప, వెంకప్ప, రామప్పలుగా వ్యవహరించేవారు. ఈ ముగ్గురు వనారస సంజీవరావు సంతానం. సంజీవరావు సురభి కుటుంబానికి ఆద్యుడు. ఈ ముగ్గురన్నదమ్ములు తమ బాల్యావస్థలోనే తోలుబొమ్మలాట ప్రదర్శనలిస్తూ 1877 ప్రాంతంలో కడప మండలంలోని హనుమద్గుండానికి రావడం జరిగింది. ఆ హనుమద్గుండమే ఆంధ్రనాటక కళోద్ధారక వనారస గోవిందరావు జన్మస్థలం. ఈయన అసలు పేరు ఫకీరన్న.

1868లో జన్మించాడు. కలరావల్ల తల్లిదండ్రులు మరణిస్తే, అనాథగా మిగిలాడు గోవిందరావు. స్ఫోటకంతో ఆదరించే వారు లేకపోతే ముగ్గురన్నదమ్ముల తల్లి చెన్నమ్మ చేరదీసి, ఆదరించి పునర్జన్మ ప్రసాదించింది. అంతేకాక గోవిందరావును దత్తత తీసుకొని, గోవిందప్ప అని పేరు పెట్టి, ప్రేమగా పెంచింది. పగలు పశువుల్ని మేపుతూ, రాత్రివేళ రామప్ప వద్ద సంగీతం నేర్చుకుంటూ, రంగస్థల నాటకాన్ని ప్రదర్శించే అర్హత సంపాదించుకున్నాడు. 1890 ప్రాంతంలో నంద్యాలకు పారిపోయి, జ్యోతి సుబ్బయ్య కంపెనీలో చేరి, ఒక్కపూటే భోంచేస్తూ, నటన, సంగీతం నేర్చుకొని,



పౌరాణికం

మొట్టమొదటి సారిగా హరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్ర పాత్ర ధరించాడు. తరువాత తిరిగి తన వారి వద్దకు చేరుకున్నాడు.

1910లో కుటుంబాలు విడిపోయిన తరువాత తన కుటుంబ సభ్యులతోనే నాటక ప్రదర్శనలు ప్రారంభించి, లంకాదహనం, *కాంతామతి* నాటకాలలో పేరు గడించాడు. 1918లో తన రెండవ భార్య అయిన లక్ష్మమ్మ ప్రసిద్ధ నటి ఆవేటి పూర్ణిమకు జన్మనిచ్చింది. 1919లో ఏలూరు సమీపంలోని, పోలసానిపల్లి అగ్రహారంలో స్థిరపడ్డారు. తర్వాత చిన్నరామయ్య (కృష్ణాజీ దత్తపుత్రుడు) తో కలసి *దశావతారములు,* వసంతసేన నాటకాలు ప్రదర్శించారు. వీరి సమాజం పేరు శ్రీ గోవిందరాయ సురభి నాట్యమండలి.

1929లో తెనాలిలో ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు అంకురార్పణ జరిగింది. దీనికి ముఖ్యకారకుడు గోవిందరావు. ఈ సందర్భంగా ఆయనకు *ఆంధ్రనాటక కళోద్ధారక* బిరుదునిచ్చి, సత్కరించారు. 1929–30 ప్రాంతంలో రంగూన్ వెళ్ళి పలు నాటక ప్రదర్శనలిచ్చాడు. ఆ తర్వాత ఆంధ్రదేశంలో నాటక కళ వికాసానికి ప్రత్యక్షంగా, పరోక్షంగాను ఇతోధికంగా సేవలందించి 1953, డిసెంబర్, 17వ తేదీన కళామతల్లి ఒడిలోకి శాశ్వతంగా చేరుకున్నాడు.

సురభి నాటక సమాజాలు నాటకరంగానికి తమ వంతు సేవలందించి చరిత్రలో నిల్చిపోయాయి. వాటిలో ప్రస్తుతం 10 సమాజాలు మాత్రమే సురభి వారసత్వాన్ని నిలుపుతూ, ప్రదర్శనలిస్తున్నాయి. శ్రీ శారదా మనో వినోదినీ సంగీత నాటక సభ పేరుతో ప్రారంభమైన ఒక్క సమాజం, శాఖోప శాఖలుగా విస్తరించి, ఆంధ్ర ప్రేక్షకులకు కనువిందు కలిగించాయనడంలో అతిశయోక్తి లేదు. అంతే కాక, ఆంధ్రదేశంలో ప్రతి రాత్రి ఎక్కడో ఒక చోట సురభి ప్రదర్శన కచ్చితంగా ఉంటుందనడంలో ఆశ్చర్యం లేదు. ఒక్కో గ్రామంలో రోజుకో నాటకం చొప్పున 10,15 నాటకాలు ప్రదర్శించే నాటక సమాజం ప్రపంచంలో మరొకటి లేదు. అంతేకాదు ప్రపంచంలోనే ఏకైక కుటుంబ సంచార నాటక సమాజంగా “సురభి” పేరొందింది. వ్యాపార దృష్టి గల వృత్తి నాటకాలు ప్రదర్శించడం “సురభి” కళాకారులకే సాధ్యమైంది.



సురభి వాద్యాలు



సురభి నాటకం

సురభి మొదటితరం వారిలో వనారస గోవిందరావు, పెద్దరామయ్య, కమలాబాయి, జంఝూటి వెంకుబాయి, చిన్న రామయ్య ప్రఖ్యాతి చెందారు. ఇక రెండవతరం వారిలో ఎస్.ఎ. బాబురావ్, ఎస్.చంద్రరావు, ఎస్. ఎ. ప్రకాష్, ఎ. నాగేశ్వర్రావ్, పుల్లారెడ్డి, భోజరాజు, ఆవేటిపూర్ణిమ, ఆర్. సుభద్రమ్మ మూడవ తరంలో మనోహర్, శ్యామసుందర్, బాబ్జీ, ఇందిర, రాజేశ్వరి, సుమతి, జమున మొదలైన వారు ఖ్యాతి గడించారు. సినిమా, టి.వీ ప్రభావం వీరి నాటకాల మీద ఎక్కువగా పడడం, నాటక సమాజాలు, ప్రదర్శనల నిర్వహణాభారం విపరీతంగా పెరిగిపోవడం వల్ల ఈ రోజు సురభి సమాజాల సంఖ్య తగ్గింది... తద్వారా ప్రదర్శనల సంఖ్య కూడ తగ్గిపోయింది.

దాదాపు ప్రతి కళాకారుడు పాత్రను పోషించడమేకాక, సీనరాల మార్పులు, చేర్పులు,విద్యుద్దీపనం మార్పులు, పాటలు, పద్యాలు పాడడం, కరపత్రాలు పంచడం, పోస్టర్లు అంటించడం, తెరలు కట్టడం, రంగులు వేయడం, టిక్కెట్లు అమ్మడం లాంటి కార్యకలాపాలలో ఒకరికొకరు సహకరించుకుంటూ ఆబాల వృద్ధులు నాటక ప్రదర్శనలో జీవితాన్ని ముడిచేసి, నాటకాన్ని పెంచి పోషించి, పెరిగిన సురభి కళాకారులందరూ అదృష్టవంతులూ.. ధన్యజీవులు...

# అగాధం

(DE PROFUNDIS)



- ఆస్కార్ వైల్డ్

- అశ్విని.కె

*గత సంచిక తరువాయి.....*

**బ**యట ప్రపంచంలో నాకోసం ఎదురు చూసేవి చాలానే ఉన్నాయి. St. Francis of Assissi అన్నట్లు "నా సోదరుడు వాయువు, నా సోదరి వర్షం" ఎంత అద్భుతం ఈ రెండూ!

ఇంకా సూర్యాస్తమయాలు, అద్దాల కిటికీలు, గొప్ప నగరాల వ్యాపార భవనాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చిట్టా ఎక్కడాగుతుంది? ఈ ప్రపంచం అందరితోపాటు నా కోసం కూడ ఉంది కదా.

ఇప్పటి వరకు లేనటువంటి ఒక విశేషంతో బయటకు వస్తున్నాను.

*నీకు తెలుసు – నైతిక విలువల సంస్కరణను నేను ఎంతగా నిరసిస్తానో, మత సంబంధమైన సంస్కరణలను కూడ అంతగా ఖండిస్తాను. శాస్త్ర పరంగా కాకుండా మరో విధంగా మనిషి లోతును పెంపొందించ గలిగింది ఒక్క వేదన మాత్రమే. అదే నా అనుభవంలోకి వచ్చింది.*

నా విడుదల తరువాత నా మిత్రుడెవరైనా నన్ను విందుకు ఆహ్వానించకపోతే నేను అస్సలు లెఖ్క చెయ్యను. నా సంతోషానికి అలాంటి అడ్డంకులేమీ ఉండవు.

*స్వేచ్ఛతో, పూలగుత్తులతో, వెన్నెల వెలుగుతో ఎవరు సంతోషంగా ఉండరు?*

అంతే కాదు ఇప్పుడు ఈ విందులు వినోదాలతో నాకు పనిలేదు. అదృష్టవశాత్తు నా జీవితంలో ఆ పార్శ్వానికి ఇక ఆస్కారం లేదు అని చెప్పగలను. కాని నా స్నేహితుడెవరైనా కష్టంలో ఉండి, ఆ కష్టాన్ని నాతో పంచుకోడానికి ఇష్టపడకపోతే చాల బాధపడతాను. ఇంతకంటే ఎక్కువ అవమానం మరొకటి ఉండదని విచారిస్తాను. నిజానికి నాకు అతని బాధను పంచుకొనే హక్కుందని అనుకుంటాను. *ఈ ప్రపంచపు సౌందర్యాన్ని చూడగలిగిన వాడు అందులోని దుఃఖాన్ని కూడా దర్శించగలగాలి. ఆ రెండింటిలోని అద్భుతాలను తెలుసుకోగలగాలి. అందులోనే దైవాంశను స్పృశించగల అవకాశం, దేవుని రహస్యాలకు దగ్గరగా రావటానికి వీలూ ఉంటుంది.*

నా జీవితంలోకి, నా సృజనలోకి మరింత గంభీరమైన మోహావేశపు ఉద్ధతి, ఉత్సాహమూ సంయోగం చెంది ఆవిష్కరించబడవచ్చు– పరిమాణం కంటే ఉద్వేగం, ఆధునికత, కళకు ముఖ్యోద్దేశ్యం; మనం గుణాత్మకమైన కళలో లేము – దీని నుంచి మినహాయింపు మన ప్రయత్నం కావాలి.

ఇప్పటివరకూ నేను పడిన వేదనను ఏ రూపంలోనూ, మూర్తిమంతంగా ఆవిష్కరించలేను. ఈ విషయం నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. *అనుకరణ అంతమైన దగ్గర్నుంచే నిజమైన కళ ఆవిర్భవిస్తుంది.* ఒక ప్రత్యేక సంపూర్ణత నా సృష్టిలో, సృజనలో, పదాల అర్థాలు, స్వరమూర్ఛనలతో నిండుగావుండాలని ఆశిస్తాను. మరింత లోతైన అన్వేషణ ప్రభావంతో, తేలికైన నిర్మాణ పద్ధతితో పాటు కమనీయసుందరంగా కూడా రూపుదిద్దుకోవాలి.

Marsyas was 'torn from the scrabbard of his limbs' Della Vagina Della Membre Sue - ఇది కదా డాంటే చెప్పిన ఘోరమైన Tacitean వాక్యం. ఆ తరువాత ఇంక చెప్పటానికి ఏమీలేదు.

గ్రీకులన్నారు, అపోలో విజేత అని! తంత్రీవాదనే నిలకడలేని రెల్లుని జయించింది (The Lyre vanquished the reed) కాని గ్రీకులు పొరపడ్డారేమో?

ఆధునిక కళాసృష్టిలో – Marsyas దుఃఖపు రోదనలు విన్పడుతూనే వున్నాయి. ఇదే Baudelaire రచనల్లో చేదుగా వుంటుంది. Larmartine అయితే తియ్యగా తిన్నగా

వుంటుంది. Verlaine మార్మికంగా చెప్తాడు. Chopin సంగీతంలో ఈ మూర్ఛనలు మారిపోతుంటాయి. Burne-Jones స్త్రీలయితే అసంతృప్తితో అల్లాడి పోతుంటారు.

Mathew Arnold, Callicles పాటల్లో, కవితలో, తీయని తంత్రీవాదన విజయాన్నే వినిపిస్తుంది. అద్భుతమైన అంతిమ విజయాన్ని వినిపిస్తుంది-అది కూడా సంగీత సౌందర్యంతో! అందులో అంతర్లీనంగా వున్న వేదనఛాయలు, వ్యాకులపాటును సందేహాస్పదంగానే వినిపిస్తుంది.

Thyrsis బాధను తెలియజేయటానికి, Scholar Gipsy వేదనను వినిపించడానికి, ఆర్నాల్డ్‌కి – గోతే గాని, వర్డ్స్‌వర్త్‌గాని సహాయం చేయలేక పోయారు-సన్నాయి పీకతోనే-మూర్ఛనలన్నీ వినిపించాడు!! Phry Gian Faun మౌనంగా వున్నాగాని నేను వుండలేను. అదిగో ఆ జైలుగోడ పైగా కనబడుతున్న కొమ్మలకు పూలుపూసేముందు, చిగురుటాకులు గాలికి అల్లాడుతున్నట్లు – ఆ విధంగా నేను నా బాధను వెళ్ళగ్రక్కుకోవాలి.

ఇప్పుడు నా సృజనకు-ప్రపంచానికి చాలా పెద్ద అగాధం ఏర్పడింది! కాని నా కళకు నాకూ మధ్య అటువంటిదేమీలేదు. అలా అనే నేను ఆశిస్తాను.

మనందరికీ ఎవరి అదృష్టం వారికి విడిగా వుంటుంది – లేదా మన అదృష్ట దురదృష్టాలను ఎవరికి వారు కలుస్తుంటాము! నా విషయంలో అది అవమాన భారంతో నిండి అపఖ్యాతిని తెచ్చింది. దీర్ఘమైన కారాగారవాసంతో కష్టాలు, కడగండ్లు, దురవస్థ, అవమానం, వీటన్నిటిని అనుభవించాను. ఇది నాకు తగినది కాదు. కనీసం ఇప్పటికి మాత్రం.

నాకు గుర్తుంది. అప్పుడప్పుడు చెప్తుండేవాడిని నిజమైన విషాదాన్ని నేను భరించగలను. ఒకవేళ అటువంటి పరిస్థితి దాపురిస్తే ఎర్రని పోర్వను (శవం మీద కప్పే వస్త్రం) కప్పుకొని-గంభీర విషణ్ణవదనంతో భరించగలనని చెప్పాను. కాని అన్యాయంగా, ఈ ఆధునికత – ఇదంతా ఒక హాస్యాస్పద వేషంగా మార్చివేసింది. అందువలన గొప్ప జీవితసత్యాలు కూడా సర్వసాధారణమైనట్లు, అసహ్యకరమైన పద్ధతిలోనే కనబడతాయి. ఆధునికతలో ఇది పూర్తి సత్యమే.

*నిజానికి నిజజీవితంలో ఇది నిజమే!*

త్యాగమూర్తులందరూ చూసేవాడికి అసహ్యంగానే కనబడతారు. ఈ పంథొమ్మిదవ శతాబ్దం కూడా దీనికి మినహాయింపు కాదు.

నా దురవస్థకు సంబంధించినదంతా భయంకరంగానే, అథోస్థాయిలోనే, వ్యతిరేకమైన, ఏమాత్రం గౌరవప్రదం కాకుండా ఈ దుస్తులలో దారుణమైన అవతారంలో, భయంకరంగా వుంది. దుఃఖాన్ని భరిస్తున్న హాస్యగాళ్ళవలే వున్నాము. హృదయాలు పగిలిపోయిన సర్కస్ బఫూన్‌లలాగా; ఏదో హాస్యనాటకానికి వేషం వేసినట్లు మమ్మల్ని నిలబెట్టారు.

నవంబరు 13, 1895 రోజున లండన్ నుంచి ఇక్కడకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఒక అర గంటసేపు Clapham Junction లో ఫ్లాట్‌ఫారమ్ మీద ఈ ఖైదీ బట్టల్లో నిలబెట్టారు. చేతులకు బేడీలు వేశారు. ప్రపంచానికి నన్ను ప్రదర్శనకు పెట్టారు. అంతకు ముందు నన్ను ఆసుపత్రినుంచి కనీసం ఒక్కమాట కూడా చెప్పకుండా ఇక్కడకు తీసుకువచ్చారు. బహుశా ఆ క్షణంలో నాకంటే అసహ్యంగా మరేదీ వుండలేదేమో! జనం నన్ను చూసి వెకిలిగా నవ్వారు. అటుగా వచ్చిన రైలుబండి ఆగిన ప్రతిసారీ గుంపు పెరిగిపోయింది. వారందరికీ నా స్థితి ఎంతో వినోద పూరితంగా వుంది. అది నేనెవరో వారు గుర్తు పట్టక ముందు.




**ఆస్కార్ వైల్డ్ ఆణిముత్యాలు:**

1. మనందరం మురికి కూపంలోనే వున్నాం. మనలో కొందరే తళుకు తారలను చూస్తుంటారు.
2. ఆశావాదానికి పునాది భయమే.
3. లేకితనానికి గంభీరత ఒక ముసుగు.




కాని నేనెవరో తెలిసిన తర్వాత వాళ్ళు మరింత బిగ్గరగా నవ్వారు.

ఆ నవంబరు విషాద వర్షంలో అలాగే నిలబడ్డాను. నా చుట్టూ ఎగతాళి చేస్తున్న గుంపును భరిస్తూ....

ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు అదే సమయానికి రోజూ ఏడ్చాను. అదే గంటకు–అదే ఖాళీసమయంలో! ఇది మీకు అంతగా విచారించదగిన విషయం అన్పించకపోవచ్చు. కాని జైలుగది కన్నీళ్ళలో వున్న వాళ్ళకు ఇది సర్వసాధారణం. జైలులో నీవు ఏడ్వలేని రోజు – నీ గుండె రాయిలా మారినట్లే. నీ గుండెలో ఏ మాత్రం తడివున్నా, ఏడవకుండా వుండలేవు.

ఇప్పుడు, నన్ను చూసి నవ్విన వాళ్ల గురించి బాధపడుతున్నాను. వారు చూసినపుడు – నేను ఉన్నతమైన స్తంభం మీద లేను. ఆ స్తంభంలోపల వుండి పోయాను. నిజానికి ఉన్నత స్థానం అనేది ఒక ఊహాజనితమైన, అసత్యమైన స్థానం – కాని స్తంభపు లోగుట్టు భయంకరమైన సత్యం. విషాదాన్ని, దుఃఖాన్ని ఏ విధంగా చూడాలో వారు తెలుసుకోవాలి.

ఇంతకుముందు చెప్పినట్లు, ప్రతి విషాదం వెనక విషాదమే వుంటుంది. అంతేకాదు – ప్రతి విషాదం వెనుక ఒక ఆత్మ వుంటుంది. అదిగో ఆ బాధలో వున్న ఆత్మను ఎగతాళి చేయటం, భయంకరమైన విషయం.

*ఈ వింత సాధారణ ఆర్థిక ప్రపంచంలో – ప్రజలకు, వాళ్లిచ్చిందే, వాళ్లకు దక్కుతుంది!*

భౌతికమైన గుల్లను దాటి వెళ్లని వీరి ఆలోచనకు, జాలి ఎలా తెలుస్తుంది? ఎగతాళి గాక!

ఇదంతా ఎందుకు రాస్తున్నాను? దీని ప్రభావం – అదే ఈ ఖైదు ప్రదేశం – నాలో ఎంతటి చేదు అనుభవాన్ని మిగిల్చినదో, నిరాశతో నింపిందో – ఈ శిక్షకు పర్యవసానమేమిటో తెలపటానికి. అవును, ఇది నేను అంగీకరించినా, లొంగిపోయినా – నేను ఇది అనుభవించ వలసిందే.

*వసంతమంతా ఒక మొగ్గలో దాగి వుంటుంది. చందోలిపక్షి గూడు – ఎన్నో అరుణారుణ ఉషోదయాలను దాచి వుంచుతుంది. ఇంకా నాలో ఏ జీవనసౌందర్యం దాగివున్నా, మిగిలివున్నా – అది నా లొంగు బాటులోనే వుంది. అవమానం లోనే వుంది – భంగపాటు లోనే వుంది!!*

ఇప్పుడు, నా పద్ధతిలో, నా ఆలోచనలో, ఇప్పటి వరకు జరిగినవన్నీ అంగీకరిస్తూ, ముందుకు సాగిపోవాలి. నన్ను నేను నిరూపించుకోవాలి.

లోకం నన్ను ప్రత్యేక వ్యక్తిత్వంగల వానిగానే చూసింది. ఇప్పుడు, ఇంతకు పూర్వం కంటే కూడా మరీ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకోవాలి.

నా నుంచి నేను మరీ దూరంగా వెళ్లిపోవాలి. ఈ ప్రపంచం నుంచి ఆశించవలసింది, తీసుకోవలసింది, నేను తగ్గించుకోవలసివుంది.

నిజానికి నా పతనం ప్రత్యేక వ్యక్తిత్వం వలన సంభవించలేదు. వ్యక్తిత్వ లేమి వలననే జరిగింది.

అవమానకరమైన, క్షమార్హంకాని, అసహ్యకరమైన ఒకే ఒక చర్య, నా జీవితంలో: ఈ సమాజాన్ని నాకు సహాయం చేయమని, నాకు రక్షణ కల్పించమని అడగటమే. ఆ విధమైన అభ్యర్థన చేసిన తర్వాత (అది వ్యక్తి పరంగా నాకు మంచిది కాకపోవచ్చు) ఇంక ఎలాంటి క్షమార్హత వుంటుంది?

*ఆ విధంగా సమాజ శక్తుల్ని కదిలించినప్పుడు – "నువ్వు ఇప్పటి వరకూ సమాజ చట్టాల్ని ధిక్కరించి జీవిస్తున్నావు – ఇప్పుడు రక్షణెలా కోరతావు ?" అని "అవే చట్టాలు నిన్ను చుట్టు ముట్టుతాయి– వాటి శక్తి చూపుతాయి" అని మరీ హెచ్చరించింది. "నీవు రక్షణ కోరిన వారికే నీవు కట్టుబడి వుండాలి" అని కూడా ఘోషించాయి.*

దాని ఫలితమే నేను ఈ కారాగారంలో వున్నాను. ఇంతవరకూ ఎవరికీ ఇటువంటి అన్యాయం జరిగి వుండదు.

* * *

మత్స్యకారులు, గొర్రెల కాపరులు, పొలాలు దున్నేవారు, రైతులు ఇంకా ఇలాంటి మనోహరమైన సాధారణ ప్రజలు – వారికి కళ గురించి తెలియక పోవచ్చు, కానీ వారే కదా

*ఈ మట్టికి ప్రాణం – ఈ భూమికి సారం !*

---

4. జీవితం కళ లాగా వుంటుంది. కళ జీవితంలా వుండదు.
5. ప్రజలు చాల ఓర్పు గలవారు. అన్ని భరిస్తారు – మేధావిని మాత్రం చాల దూరంగా వుంచుతారు.
6. సమయ పాలన – సమయాన్ని దొంగిలిస్తుంది.

ఎవడు శత్రువు? సమాజంలోని బధిరాంధులయిన యాంత్రిక శక్తులకు ఊతమిచ్చి నిలబడే వాడే – నిజమైన శత్రువు!

మనిషిలోని చైతన్యాన్ని – సమాజంలోని వికాసాన్ని గుర్తించలేని వాడే అసలైన శత్రువు.

నేను విందుల సందర్భంలో వినోదాన్ని అందిస్తుంటే, నన్ను పనికి మాలిన వాడిగా జమకట్టారు. కాని ఒక కళాకారునిగా చూస్తే అదే ఎంతో ఉత్సాహభరితంగా, వినోదాత్మకంగా వుండేది. దానిలోని ప్రమాదం అర్థభాగమే– నేను కళాకారునిగా Ariel తో వున్నాను, Caliban తో కుస్తీ పట్టాను.

నాకు పదేళ్లుగా సన్నిహితంగా వున్న స్నేహితుడు, ఈ మధ్య నన్ను చూడటానికి వచ్చాడు– 'నిన్ను గురించి చెప్పినవేవీ నేను నమ్మలేదు' అన్నాడు. 'నువ్వు అమాయకుడివి, నీ మీద కుట్ర జరిగింది.' అని కూడా అన్నాడు. నేను ఏడ్పు ఆపుకోలేక పోయాను.

నా మీద వచ్చిన అభియోగాలన్ని – నా మీద అసూయతో చేసినవే. కాని నా జీవితమంతా అస్తవ్యస్తమైన ఆనందాల వేటలోనే గడిచిపోయిందని, ఈ విషయం నువ్వు పూర్తిగా అర్థం చేసుకుంటేనే – మన స్నేహం నిలబడుతుందని చెప్పాను.

ఇది విని అతను నిర్ఘాంత పోయాడు. అయినా మేము స్నేహితులగానే వుండిపోయాం, నిజాయితీగా!

మానసిక ఉద్వేగాలు కూడా, శారీరక, భౌతిక శక్తుల లాగానే కొద్దికాలమే వుంటాయి.

ఒక పాత్రలో ఎంత మధువు పోస్తాము? ఎక్కువ పోసినా వుండదు కదా–




అలాగే ద్రాక్షపళ్ల తొట్టిలో కాళ్లతో తొక్కే వాళ్లకు దీనితో సంబంధం లేదు కదా !

చాలా గొప్ప విషాదాలకు కారణమైన వాళ్లకు – అసలు ఆ విషయమే తెలియక పోవచ్చు.

తనను ఆహుతి చేసుకునే త్యాగి – ఆ మంటల్లోంచి దేవుని చూస్తుండవచ్చు కాని, అతనికి చితిని పేర్చిన వాడికి ఇవేమీ పట్టవు కదా . మాంసం అమ్మేవాడు – ఎద్దుని ఎలా నరికారు అని ఆలోచించడు . అలాగే చలిమంట కాగేవాడు– అడవిలో చెట్టు కూలడం వినడు . పచ్చగడ్డి కోసే వాడు– పూలు రాలి నలిగి పోవడం గుర్తించక పోవచ్చు .

గొప్ప గొప్ప ఉద్వేగాలు, ఆత్మానందం కోసమే – గొప్ప సంఘటనలను, వాటిని అందుకో గలిగిన వారే చూడగలరు.

* * *

షేక్స్పియరు సృష్టించిన రోజెన్‌క్రాంజ్ (Rosencrantz) – గిల్డెన్‌స్టెర్న్ (Gildenstern) పాత్రలు నాటక కళలో మరి దేనితోనూ పోల్చదగినవిగా నేను అనుకోను. వానిలోని అతిసూక్ష్మమైన పరిశీలన మరెందులోను కానరాదు. వీరిద్దరూ – హామ్లెట్ సహాధ్యాయులు. అతనికి తోడునీడగా వున్నారు. వారితో పాటు తీయని జ్ఞాపకాలు, ఆనందమైన రోజులను మోసుకొని వచ్చారు.

వారు అతనిని కలిసినపుడు – హామ్లెట్ మానసికంగా మోయలేని బరువు క్రింద నలిగిపోతున్నాడు. చనిపోయిన వాళ్ళు సమాధుల్లోంచి లేచి వచ్చి పగతీర్చుకోమని అతన్ని వత్తిడి చేస్తున్నారు. ఇది అతనికి ఏమాత్రం ఆనందకరమైన విషయంకాదు.

అతను కలల ప్రపంచంలో విహరించే వ్యక్తి. కాని ఇపుడు కత్తి చేతబట్టి కార్యరంగంలోకి దూకమంటున్నారు. అతని హృదయం కవితాత్మకం. కాని అతనిని సాధారణ కార్యకారణ సంఘర్షణలోనికి దిగమంటున్నారు. జీవితంలోని సత్యాన్ని దర్శించమంటున్నారు. కాని అతనికి దానిని గురించి ఏమీ తెలియదు. అంటే అతనికి బాగా తెలిసిన జీవితపు ఆదర్శసారం నుంచి దూరంగా ఉన్నాడు అన్నమాట!

ఏమి చేయాలో తెలియని సంకటంలో, అతను చేసిన తప్పు – అలా తప్పుగా నటించడమే! బ్రూటస్ పిచ్చిని, తన కార్యసాధన ఖడ్గాన్ని దాయటానికి, తన తలంపు కటారిని కప్పి పుచ్చటానికి అడ్డు పెట్టుకున్నాడు. కాని హామ్లెట్ తన పిచ్చి నటనను – పిరికి తనానికి ముసుగుగా తెరవేసుకున్నాడు.

---

7. ప్రేమించబడే వారు పేదలు మాత్రమే.
8. ఈ జీవితం ఎంత ముఖ్యమైనదంటే – మనం దానికి ప్రాముఖ్యం ఇవ్వకూడదు.
9. భయమే అన్ని ఆనందాలకు ప్రారంభ దశ.

ఈ తతంగం అంతా ఆలస్యం చేయటానికే వాడు కున్నాడు. నాటకాన్నంతా నటనతోనే గడిపాడు – నటుడు కథతో తాత్సారం చేసినట్లు. తన కార్యకలాపాలకు తనే వేగుగా మారాడు–తన మాటను తనే వింటూ 'మాటలు– మాటలు– మాటలే' అనుకుంటూ– తన చరిత్రకు కథానాయకుడుగా వుండవలసినవాడు తన విషాదానికి సాక్షిగా నిలబడి పోయాడు. ఏదీనమ్మలేని స్థితిలో, తనని తనే విశ్వసించ లేక పోయాడు. కాని ఈ సందిగ్ధత అతనికి ఏమీ సహాయకారి కాలేదు.

ఎందుకంటే అది, సందేహం నుంచి కాకుండా, మానసిక సంఘర్షణ నుంచి వెలువడింది. తెగిన తలంపు నుంచి; ఖండితాభీష్టం నుంచి; ద్వివిధ ఆలోచన నుంచి జరిగింది.

ఇందతా అతని స్నేహితులైన గిల్డర్‌స్టెర్న్‌కి, రోజెన్‌క్రాంజ్‌కి తెలియదు. వాళ్ళు నవ్వుతారు, అభివాదం చేస్తారు, పళ్ళికిలిస్తారు. ఒకళ్లు చెప్పింది మరొకరు పునరుక్తం చేస్తారు. చివరికి నాటకంలోని అంతర్నాటకం ద్వారా హామ్లెట్ రాజు మనసుని తెలుసుకుని, అతనిని సింహాసనం మీద నుంచి కిందకు తోసినపుడు, అతని మిత్రులే – హామ్లెట్ చేష్టలకు ఆశ్చర్యపోయి, అది అమర్యాద చర్య అనుకుంటారు. దానిని జీవితంలోని ఉద్వేగాల ప్రదర్శనకు అవకాశమనుకుంటారు.

*ఆస్కార్ వైల్డ్ విచారణ సమయంలో 'ఈ ప్రకృతిలో ఏదీ అసహజం కాద'న్నాడు. సరిగ్గా నూటముప్పయి సంవత్సరాల తర్వాత (ఇలాంటి సందర్భంలోనే) మనసర్వోత్తమ న్యాయస్థానం ఇవే మాటలను 'ఏది అసహజమో ఎవరు చెప్పగలరు?' అని ప్రశ్నించింది.*

*ఆస్కార్ వైల్డ్ నూటముప్పయి సంవత్సరాల ముందుగా జన్మించాడని, లేదా, ఈ నాగరక సమాజం, శతాబ్దాల కాలం వెనక బడి వున్నదని అనుకోవాలా?*

హామ్లెట్ జీవిత రహస్యానికి ఎంత దగ్గరగా వున్నా వారికి – దానిని గురించి ఏ మాత్రం ఎరుక లేకుండా వుండి పోతారు. తెలిసినా దాని వలన ఉపయోగం కూడా వుండకపోవచ్చు. వీరు, వీరే. చిన్న చిన్న పాత్రలు – మధువుని ఎక్కువగా నింపినా – ఒలికిపోయే మధుపాత్రలు!!

చివరికి ఎవరి కోసమో పన్నిన ఉచ్చులో పడి హఠాత్తుగా మరణిస్తారు. నిజానికి ఇటువంటి విషాదాంతం, వీరికి తగినది కాదు. హామ్లెట్ దీనిని ఎంత తేలికగా తీసుకున్నా వారు మరణించలేదనే అనుకోవాలి. చివరికి హొరాషియో (Horatio) హామ్లెట్‌కు అసంతృప్త సత్యాలను చేరవేయటానికి ఈ కర్కశ ప్రపంచం నుంచి, చివరి శ్వాసను తీసుకుని, నిష్క్రమిస్తాడు!

కాని, గిల్డర్‌స్టెర్న్ – రోజెన్‌క్రాంజ్ అమరులే. ఎంజెలో ఆంగ్లో ; టార్‌టాఫే (Angelo Anglo ; Tartaffe) లాగా వారి సరసన ఉండదగిన వారు. పాతతరపు స్నేహానికి కొత్తతరమందించిన విలువలు వీరు.

ఎవరైనా కొత్తగా De Amieitia రాస్తే అందులో వీరికి స్థానం కల్పించాలి. వారిని Tusculan వచనంలో అభినందించాలి. వీరు సర్వకాలాల్లోను ఉండవలసిన వారు. వీరిని బహిష్కరించటం అంటే వారిని గుర్తించి ప్రశంసించ లేకపోవటమే. వారు కేవలం ఒక పరిధిలో లేదా ఒక వృత్తంలో లేకపోవటం, అంతే.

ఆత్మావలోకనంలో అంటు రోగాలేమీ ఉండవు కదా. ఉన్నతమైన ఆలోచనలు – ఉద్వేగాలు కేవలం వాటి అస్తిత్వం లోనే భిన్నంగా ఉండిపోతాయి.

* * *

అన్నీ సవ్యంగా జరిగితే మే నెలలో నన్ను విడుదల చేస్తారు. ఆ వెంటనే R తోను, M తోను కలిసి, మరోదేశం వెళ్ళి, సముద్రతీరంలోని ఏ చిన్న ఊరికో చేరతాను.

సముద్రపుటలలు మన గాయాలను, మరకలను కడిగివేస్తాయి– Euripides ఆయన నాటకంలో Iphigeneia గురించి, చెప్పినట్లు.

ఒక నెల రోజుల పాటు నా స్నేహితులతో గడపాలని ఆశిస్తున్నాను. ఆ విధంగా శాంతిని, సత్యాన్ని పొంది గుండె బరువును తగ్గించుకోవాలని అనుకుంటున్నాను.

---

10. నా వయస్సు నాకన్నీ నేర్పలేదు.
11. జీవితంలో రెండే విషాదాలు : ఒకటి నీవు కోరుకున్నది లభించక పోవటం – రెండోది నీవు ఆశించింది అందుకోవటం.
12. సృజనకు, మొండి తనం మొదటి శత్రువు. ఒకే మూసలో పడి కొట్టుకునే వారు సృజనాత్మకంగా వుండలేరు.

నాకు కొన్ని ప్రాథమిక విషయాలపై ఎనలేని మక్కువ. ముఖ్యంగా అమ్మలాంటి సముద్రం మీద – అలాగే నేలతల్లి మీద. మనందరం ఈ ప్రకృతిని చాలా ఎక్కువగా చూస్తాం. కాని ప్రకృతిలో చాల తక్కువగా జీవిస్తాం.

ఈ విషయంలో గ్రీకులు, తెలివిగా వుంటారు. వీరు సూర్యాస్తమయాలు, పచ్చగడ్డి మీద నీడలు చూడరు. కాని సముద్రం ఈతగాళ్ళ కోసమని, పచ్చిక బయళ్లు పరుగులు తీసే వాళ్లకోసమని అనుకుంటారు.

చెట్లను, వాటి నీడకోసం ప్రేమిస్తారు. అడవిని, మధ్యాహ్నపు నిశ్శబ్దం కోసమే ఇష్టపడతారు. ద్రాక్షతోటలో బుట్టటోపి పెట్టుకుని ఎండ పడకుండా పనిచేస్తారు.

మనకు గ్రీసు దేశం అందించిన వారు రెండు రకాలు– కళాకారులు, క్రీడాకారులు. వీరి కోసమే కదా ఆ లతాతోరణాలు, ఆలివ్ ఆకుల కిరీటాలు తయారయ్యేది!

మనది వస్తు ఉపయోగ యుగమని చెప్పుకుంటాం. కాని, ఏ ఒక్క వస్తువు అవసరమూ మనకు సరిగా తెలియదు.

నీళ్ళు శుభ్రపరుస్తాయని మర్చిపోయాం. అగ్ని పునీతం చేస్తుందని, ఈ భూమి మనకు తల్లిలాంటిదని కూడా మర్చిపోయాం. దీని పర్యవసానమే మన కళ, చంద్రునితో ఉంటూ నీడలతో ఆడుకుంటోంది. కాని గ్రీకు కళ సూర్యునితోనే ఉండి అన్నింటినీ వెలుతురు లోనే సూటిగా చూస్తోంది.

నేను గాఢంగా నమ్మేది, ప్రాథమిక శక్తుల్లోనే స్వచ్ఛత ఉందని. అందుకే అక్కడికే వెళ్ళాలని, వాటి సన్నిధిలోనే జీవితం గడపాలని అనుకుంటున్నాను. నాలాగా ఆధునికంగా ఉండేవాడికి Enfant de mon siecle (Child of my century) ప్రపంచాన్ని చూడటమే ఆనందం.

నా విడుదల రోజున రేలమొక్క పూలను, దాసాని మొగ్గలను విరియటం చూసి పులకించి పోతాను. గాలి ఈ పూలను ఉయ్యాల ఊపుతూ రంగులతో నింపి నన్ను అరేబియా తీరానికి తీసుకుపోతుంది.

Linnaeus మొదటిసారిగా ఇంగ్లీషు పీఠభూమి అంతా



భార్య: కాన్‌స్టాన్స్ ; కొడుకు : సిరిల్

బంగారు రంగు గడ్డితో వాసనలు వెదజల్లుతుంటే చూసి దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు గదా!

పూలు నా ఇష్టంలో భాగమే, నా కోసం గులాబిరేకు ఒంపులో ఒక కన్నీటి బొట్టు దాగి ఉందని తెలుసు. ఇంత వరకు ఏ రంగు ఏ పూలకలశంలో దాగివున్నా, ఏ గుల్ల ఒంపులో ఏ అందం ఇమిడివున్నా నా మనసు, తెలియని సానుభూతితో స్పందిస్తూనే ఉంది. ఇది నా చిన్నప్పటి నుంచి జరుగుతూనే ఉంది.

గోతియర్ (Gautier) లాగా నేను కూడా Pour qui le monde visible Existe (For the visible world exists) వీరికోసం – కనిపించే ప్రపంచం ఉంది అనే వాళ్ళలో ఒకడిని.

కాని, ఈ అందాల రూపం వెనుక ఎంత సౌందర్యం ఉన్నా, ఏదో చైతన్యం దాగి ఉంటుంది. దాని స్వరూప స్వభావాలే ఈ రంగులు, ఈ ఒంపులు. అదిగో, ఆ చైతన్యంతో నేను జతకట్టాలని ఉవ్విళ్లూరుతున్నాను.

*అబ్బా! ఈ మాటల సందడితో, ఈ మనుషుల గుంపులతో విసిగిపోయాను.*

కళలోని మార్మికత, జీవితంలోని మర్మం ఈ ప్రకృతిలోని ఆధ్యాత్మికతా– వాటికోసమే నేను చూస్తున్నాను. ఈ అన్వేషణ నాకెంతో అవసరమైనది.

---

13. మన తప్పులన్నిటికీ అనుభవాలని అందమైన పేరు పెట్టుకున్నాం.
14. కాలం ధనంలా ఖర్చయిపోతుంది.
15. నిద్రా? అది చావుకి తమ్ముడు.

అన్ని రకాల విచారణలు జీవితంలో పరీక్షలే. అన్ని రకాల శిక్షలు మరణశిక్షలవంటివే. ఇప్పటికి మూడుసార్లు నన్ను విచారించారు. మొదటిసారి బోను దిగినప్పుడు నన్ను బందీ చేశారు. రెండో విచారణ తరువాత బందిఖానాకు తరలించారు. మూడోసారి విచారించి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షకు పంపారు.

మనం నిర్మించుకున్న ఈ సమాజంలో నాకు స్థానం లేదు. అది స్థానం కల్పించలేదు కూడా. కాని ఈ ప్రకృతిలో నాకు సాంత్వన దొరుకుతుంది. చల్లని వర్షపు జల్లులు అందరిమీద ఒకే రకంగా కురుస్తాయి. బండరాతి పగుళ్ళలో నాకింత గూడు దొరకకపోదు. పర్వతసానువుల రహస్య నిశ్శబ్దంలో నేను నా దు:ఖాన్ని పొగులుకుంటాను.

ప్రకృతిమాత నక్షత్ర దీపాలను నా కోసం వెలిగిస్తుంది. ఆ వెలుతురులో నేను ఈ చీకటిలో తూలి పడకుండా నడుస్తాను. నా అడుగు జాడలపై గాలి వీస్తుంది - మరెవరూ నా కష్టాల దారివెంట రాకుండా.

ఆ తల్లి నన్ను తన పవిత్ర జలాలతో పునీతుణ్ణి చేస్తుంది - చేదు తృణకాష్ఠాలతో కడిగి పరిపూర్ణునిగా మారుస్తుంది....



## ఈ రచన నేపథ్యం :

ఆస్కార్ వైల్డ్ కారాగార శిక్షాసమయంలో లోనైన దుఃఖాన్ని, ఆ వేదన సాంద్రతను కొంతవరకైనా ఆకళింపు చేసుకోగలిగితే ఈ రచనలోని వ్యధాపూరితమైన అగాధాన్ని, అందులోని చీకటిని అవగాహన చేసుకోవటానికి ఆస్కారముంటుంది.

బాధ అనేది అంతర్గతమైన, మానసిక చీకటి ప్రయాణం. దారి పొడవునా రాళ్ళూ-రప్పలు, మోళ్ళూ-పొదలు, గాయాలనెత్తుటి ఊట; ఇంకా ఎన్నో మనం తడమగలిగితేనే ఈ అగాధం లోని అంధకారం అగపడుతుంది, అవగత మవుతుంది. అతని దుఃఖపులోతుల చీకటిలో నుంచే వెలుతురు రేకలు పొడసూపుతాయి.

నేను చూడగలిగాను. మీరూ చూడగలరు..
ఇది ఎంత విషాదమో అంత రమణీయం..
ఎంత కర్కశమో అంత కమనీయం.

ఒక్క విషయం మనం గుర్తుపెట్టుకోవాలి. అతని శిక్షాకాలంలో చివరి మూడు నెలల్లోనే పుస్తకాలు గాని, రాయటానికి కాయితాలు గానీ అందినాయి. అదీ రోజుకి ఒక కాగితం మాత్రమే ఇచ్చేవారు. అది అయిపోయిన తరువాత వాళ్ళే తీసుకునేవాళ్ళు. అతను కోరినట్లు వాటిని అతని మిత్రునికి పంపలేదు. అప్పటి అతని మానసిక స్థితిలో ఎంతవరకూ రాసాడో (ముందురోజు) ఎలా గుర్తుంచుకున్నాడో అతనికే ఎరుక. విడుదల తరువాతనే ఈ రచన అతని చేతికి వచ్చింది. మళ్ళీ తిరగ రాసిన దాఖలాలు లేవు. అందుకనే మనకు ఈ రచనలో పునరుక్తి, ఖండితాలు కనిపిస్తాయి.

అతను చనిపోయిన ఎనిమిది సంవత్సరాలకు (అతని వీలునామాలో యాభై సంవత్సరాల తరవాతనే ముద్రించాలి అని ఉన్నా) మొదటగా కొంతభాగం ముద్రించబడింది. ఇదీ ఈ రచన నేపథ్యం. పూర్తి పాఠం యాభై సంవత్సరాల తర్వాత వెలుగు చూసింది.

దీనికి DE PROFUNDIS అనే శీర్షిక ఆస్కార్ వైల్డ్ పెట్టినది కాదు. – అశ్విని.కె



**పారిస్‌లోని ఆస్కార్ వైల్డ్ లిప్‌స్టిక్ సమాధి**

## విచారణ

**1892**లో లార్డ్ ఆల్ఫ్రెడ్ డగ్లస్, ఆస్కార్ వైల్డ్, స్వచ్ఛందంగా ఇద్దరూ ప్రేమికుల్లాగే కలసి తిరిగారు. ఇది అసహజంగా భావించిన యిరుపక్షాల హితైషులూ వెంటనే ఈ సంబంధాన్ని తెంచుకోమని సూచించారు. సలహాలిచ్చారు.

ఆల్ఫ్రెడ్ తండ్రి, మార్క్విస్ ఆఫ్ క్వీన్స్‌బెరీ కొడుకును తీవ్రంగా మందలించాడు. ఈ స్నేహం మానుకోకపోతే, పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించాడు. ముఖ్యంగా, పెద్దకొడుకు వైకౌంట్ డ్రమ్‌లార్నింగ్ మరణం తర్వాత ఆయన బెంగ మరింత ఎక్కువై మాటవినకపోతే, ఆల్ఫ్రెడ్‌కు అలవెన్స్, భత్యం, ఆపేస్తానన్నాడు. అయినా కొడుకు ఆయన మాట లెక్క చెయ్యలేదు. మార్క్విస్ ఆఫ్ క్వీన్స్‌బెరీ, ఆస్కార్ వైల్డ్ వెంటపడి వేధించడం మొదలుపెట్టాడు.

1895లో, తన నాటకాలు *ఏన్ ఐడియల్ హజ్బెండ్, ది ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్* ఘనవిజయంతో ఆస్కార్ వైల్డ్ కీర్తి శిఖరాల నధిరోహించాడు. ప్రేక్షకులాయనకు బ్రహ్మరథం పట్టారు. విహారయాత్రల నుండి తిరిగి వచ్చిన వైల్డ్‌కు, క్లబ్బులో, క్వీన్స్‌బెరీ పెట్టివెళ్లిన "For Oscar Wilde, posing sodomite" అనే కార్డు కనిపించింది.



ఏది అసహజం?

ఈ అవమానాన్ని భరించలేని వైల్డ్, ఆల్ఫ్రెడ్ ప్రోత్సాహంతో క్వీన్స్‌బెరీ మీద పరువు నష్టం దావా వేశాడు. విచారణ ప్రారంభమైన తర్వాత వైల్డ్ తన అభియోగాన్ని వుపసంహరించు కున్నాడుగాని, క్వీన్స్‌బెరీ ఆరోపణలో నిజముందని తీర్పు చెప్పాడు జడ్జి. అధికారులు వెంటనే వైల్డ్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఇతర పురుషులతో అసభ్యకరంగా ప్రవర్తించాడని కోర్టు తీర్మానించింది.

అప్పటికి అంటే, ఏప్రిల్ 1895 నాటికి అమల్లో వున్న లబూషెర్ సవరణ ప్రకారం యిది నేరం. ప్రజల్లో, వైల్డ్ అభిమానుల్లో చర్చలు కూడా జరిగాయి. కొందరు అతనికి వ్యతిరేకంగా సాక్ష్యాలు చెప్పారు.

వైల్డ్ ఆరోపణలన్నీ నిరాకరించాడు తనేమీ నేరం చేయలేదని, తాను అసహజమైన పనులేమీ చేయలేదని వాదించాడు. కోర్టువారు, జ్యూరీ కూడా ఒక నిర్ణయానికి రాలేకపోయారు. పునర్విచారణ ప్రారంభమైంది. మూడు సార్లు విచారణ తరువాత చివరికి రెండేళ్ళపాటు వైల్డ్‌కు కఠినకారాగార శిక్ష విధించబడింది.

ఆస్కార్ వైల్డ్ లాంటి ప్రతిభావంతుడు శతాబ్దకాలం ముందుగా పుట్టి తప్పు చేశాడా?

## కారాగారం

పెంటన్ విల్, వాండ్స్‌వర్త్, రీడింగ్ జైళ్ళల్లో వివిధ సమయాల్లో వైల్డ్‌ను నిర్బంధించారు. అక్కడ చాలీచాలని ఆహారం, శారీరక శ్రమ, కఠినమైన పరిస్థితులతో అతని ఆరోగ్యం పాడైంది. ఆకలి, నిద్రలేమి, యితరవ్యాధులు అతణ్ణి మరింత కుంగదీశాయి.

పెంటన్ విల్‌లో, ఆర్.బి.యన్ హాల్డేన్ అనబడే సంస్కరణాభిలాషియైన ఒక పార్లమెంట్ సభ్యుడు ఆయనను కలిసి, మతపరమైన, చారిత్రక లేదా విద్యాపరమైన గ్రంథాలను అందించడానికి కృషి చేశాడు. వాండ్స్‌వర్త్ జైల్లో వున్నప్పుడు, ఒకసారి అకస్మాత్తుగా కిందపడిపోయి వైల్డ్ కుడిచెవి (కర్ణభేరి)కి గాయమైంది. రెండు నెలలపాటు జైలు ఆసుపత్రిలో గడిపాడు వైల్డ్. ఆ తర్వాత, మిత్రుల సహకారంతో, అతణ్ణి రీడింగ్ జైలుకు బదిలీ చేశారు. అక్కడ శరీర శ్రమ కాస్త తగ్గింది. చదువుకోవటానికి పుస్తకాలు కూడా ఇచ్చారు. కాని రాయటానికి అనుమతి లేదు. రచన చేయలేని రచయిత, మనోవేదనతో, అధికారులు విధించిన పనులు కూడా చేయలేకపోవటంతో, రీడింగ్ జైలు వార్డెన్ కల్నల్ ఐజాక్‌సన్ అతడికి శిక్షలు విధించాడు. అవీ చెయ్యలేనపుడు, అదనంగా మరిన్ని శిక్షలు విధించాడు.

విడుదల తరువాత వ్రాత ప్రతిని ఆస్కార్ వైల్డ్, రాస్‌కు అందజేశాడు. అప్పటికి దానికి అతను పెట్టిన శీర్షిక Epistola: In Carcere et Vinculis. (లేఖ: నిర్బంధలో, సంకెళ్లతో) రెండు కాపీలు తీసి ఒకటి డగ్లస్‌కు, ఒకటి తనకు ఇవ్వమని కూడా చెప్పాడు. పెద్ద ఉత్తరం కనుక రాస్ దానిని కొన్ని నెలల దాకా టైపు చేయించినట్లు లేదు. 1905లో క్వీన్స్‌బెరీ కుటుంబానికి సంబంధించిన అన్ని అంశాలను తొలగించి *డిప్రోఫన్‌డిస్* పేరుతో దానిని రాస్ ప్రచురించాడు. తరువాత మూడేళ్ళలో ఎనిమిది సార్లు అచ్చయింది. *డిప్రోఫన్‌డిస్* (From the Depths) ఇది Psalm 130 లోనుంచి తీసుకున్నాడు. 1908లో వైల్డ్ వ్రాసిన మరో మూడు లేఖలు కూడా కలిపి *డిప్రోఫన్‌డిస్*ను రాస్ మళ్లీ ప్రచురించాడు. ఆ తరువాత వ్రాతప్రతిని బ్రిటిష్ మ్యూజియమ్‌కు విరాళంగా ఇచ్చి 1960 దాకా వాటిని ముద్రించకూడదని ఒప్పందం కూడా చేసుకున్నాడు.

1949లో ఆస్కార్ వైల్డ్ కుమారుడు వివియన్ హాలెండ్ పూర్తి పాఠం ప్రచురించాడు గాని అందులో అచ్చుతప్పులు అనేకం వచ్చాయి. 1960లో బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న అసలు ప్రతిని పరిష్కరించి, *లెటర్స్ ఆఫ్ ఆస్కార్ వైల్డ్*లో భాగంగా ప్రచురించాడు రూపర్ట్ హార్ట్ డేవిస్ అనే ఆయన. వ్రాతప్రతి కాపీని ఫోటో తీసి 2000 సం॥లో యథాతథంగా బ్రిటిష్ మ్యూజియం ప్రచురించింది.

– ము.పా.సా

# వార్తా వాణి

*- వోలేటి పార్వతీశం*

***ఆకాశవాణి బాణి***

గతసంచిక తరువాయి...

**ఆ**కాశవాణి వార్తలు చదువుతున్నది... అని రేడియోలో వినబడగానే, వాచీలు దిద్దుకునే అలవాటు, రేడియోలకి చెవులు అప్పగించిన సన్నివేశాలు, పచ్చని జ్ఞాపకాలుగా తెలుగువారి స్మృతుల్లో ఇంకా చెదరి పోలేదు. రేడియో జన జీవితాన్నుంచి విడదీయలేని ఒక అంశం, నిన్న, మొన్నటిదాకా, రేడియో ఇంటింటా ఒక అపూరూపమైన వస్తువైపోయింది. ఒకవేళ రేడియో ఇంట లేకపోతే, అటువంటి వారికోసం, పార్కుల్లోనో, పంచాయితీ ఆఫీసుల్లోనో వుండే రేడియోలు, ప్రజల కోసం గొంతు విప్పేవి. దేశవ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విశేషాల్ని వార్తల రూపంలో జనుల చెవుల్లో నింపేవి.

స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచీ, వార్తాపత్రికలు ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషించినా, కాస్తో కూస్తో అక్షర జ్ఞానం వున్నవారికి మాత్రమే అవి ఎక్కువగా ఉపయోగపడేవి. ఏమాత్రం అక్షర జ్ఞానం లేనివారికి సహితం, వార్తలు అందించిన ఘనత ఆకాశవాణిదే. రేడియో వార్తలకు విశేషమైన ప్రాచుర్యం వుండేది. ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటుంది. ప్రైవేటు యాజమాన్యాల అజమాయిషీలో వుండే పత్రికలకు, సర్క్యులేషన్ రీత్యా పోటీనెలకొని వుండే కారణంగా, ఆ పత్రికల్లో వచ్చే వార్తల్లోని నిజానిజాలు ఎప్పుడూ చర్చనీయాంశంగా వుండేవి. ఛానెల్స్ కూడా పెరిగిపోయిన కారణంగా, ఈ అయోమయస్థితి, ద్విగుణీకృతమైంది.

ఈ పరిస్థితికి పూర్తిగా భిన్నంగా రేడియోవార్తలు విశ్వసనీయతకు మారుపేరులా నిలిచాయి. ఈ విశ్వసనీయత ఆకాశవాణి వార్తకు, మిగిలిన మాధ్యమాలకు చెందిన వార్తకు ఏ విధమైన భేదం వుంటుందో కాస్త సోదాహరణంగా గమనిద్దాం. ఒక క్రీడావిశేషాన్ని ఉదాహరణంగా తీసుకుందాం.

భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగితే, అందులో భారత్ ఓడిపోతే, ఆ వార్తను ప్రచురించే విధం, ప్రసారం చేసే విధం ఎలా వుంటాయో గమనించండి.

చేజేతులా ఓడారు. మళ్లీ విఫలమైన భారత్ మిడిలార్డర్. ఇటువంటి శీర్షికలు ఏర్పడతాయి. గెలవాల్సిన మ్యాచ్‌ను భారత్ చేజేతులారా, దక్షిణాఫ్రికాకు సమర్పించుకోవడం ద్వారా ప్రపంచకప్‌లో తొలి పరాజయాన్ని అందుకుంది. సచిన్ టెండూల్కర్ బ్రహ్మాండమైన సెంచరీ చేసినా, బాటింగ్‌లో మిడిలార్డర్ వైఫల్యం, పసలేని బౌలింగ్‌లు మన జట్టును పరాజయం బాట పట్టించాయి. అంటూ సాగుతుంది. వార్తాకథనం. కానీ రేడియోలో వార్త అలా వుండదు. ప్రపంచ కప్ క్రికెట్ పోటీలో భాగంగా, గ్రూప్ 'బి'లో భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య నాగపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు గెలుపొందింది. 296 పరుగుల విజయ లక్ష్యాన్ని సౌతాఫ్రికా జట్టు 494 ఓవర్లలోనే ఛేదించింది. అంతకు మునుపు భారత్ ఇన్నింగ్స్‌లో అత్యధికంగా, సచిన్ టెండూల్కర్ 111 పరుగులు చేసి, ప్రపంచ కప్ లీడ్ దశ మ్యాచ్‌ల్లో అత్యధికం సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డులకెక్కారు. ఇలా ప్రాధాన్యతాంశ నిర్ణయంలోనూ, వాక్యనిర్మాణంలోనూ ఆకాశవాణి వార్త తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది.

ప్రసార వ్యవధికి అనుకూలంగా, వార్తల నిడివిని తీర్చిదిద్దడం రేడియో వార్తలకు ప్రత్యేకం. జాతీయవార్తలైనా, ప్రాంతీయవార్తలైనా, 10 ని॥ల ప్రసారవ్యవధికి మించవు.

---

డాక్టరు వోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

ఇటీవలి కాలంలో జాతీయవార్తలు కూడా, హైదరాబాద్ కేంద్రం నుండే ప్రసారం కావడం గమనార్హమైన విషయం. సరిగ్గా 5 ని॥ల వార్తా ప్రసారంకాగానే, "ఆకాశవాణి వార్తలు మీరు వింటున్నారు." అంటూ ఒక గుర్తింపు వాక్యాన్ని చదవడం.

వార్తలు చదివే విధానంలో కేవలం గత కాలపు మాటగానే కాదు, వర్తమానపు బావుటాలా కూడా నిలిచింది. రేడియోలో ఒక వార్త ప్రసారమైతే అది నూటికి నూరు పాళ్ళు నిజమన్నది ప్రజల విశ్వాసం.

ఆరోజుల్లో కేవలం దిన పత్రికలను ఉదయం ఎడిషన్లు మాత్రమే ఉండేవి కనుక, రోజంతా జరిగిన పరిణామాలను మర్నాడు ఉదయం దినపత్రికలో చదువుకునే వాళ్ళం. ఆకాశవాణి అందుబాటులోకి వచ్చాకా, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, వేళల్లో వార్తా ప్రసారాలు వుండేవి కనుక, ఎప్పటి కప్పుడు తాజాసమాచారం తెలుసుకునే అవకాశం కలిగింది. తాజా సమాచారాన్ని వేగంగా అందుకునే గొప్ప సౌకర్యం రేడియోవల్లనే కలిగింది.

తెలుగులో వార్తాప్రసారాలు రెండు రకాలుగా వుండేవి. ఒకటి జాతీయస్థాయి వార్తలు, రెండు ప్రాంతీయ వార్తలు. ఢిల్లీ కేంద్రంగా ప్రసారమయ్యే వార్తల్లో దేశవ్యాప్త వార్తలుండేవి. విజయవాడ, హైదరాబాద్‌లు కేంద్రంగా ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తల్లో రాష్ట్ర వ్యాప్త వార్తలుండేవి. కొంగర జగ్గయ్య, పన్యాల రంగనాథరావు, అద్దంకి మన్నార్, కందుకూరి సూర్యనారాయణ, జోలెపాళెం మంగమ్మ, మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి, తిరుమల సెట్టి శ్రీరాములు, డి. వెంకట్రామయ్య వంటి గొంతులు, ఆకాశవాణి వార్తల్ని స్వరసంపన్నం చేశాయి.



ఆచంట జానకీరామ్

ఆకాశవాణి వార్తా ప్రసారాల్లో కేవలం వార్తలే వుంటాయి తప్ప, వార్తా వ్యాఖ్యానాలుండవు. పత్రికల్ని గమనిస్తే ఒక సంఘటన ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో వంటి వివరాలుంటాయి. రేడియో వార్తల్లో అలాంటివి వుండవు. రేడియో వార్త ఏమి జరిగిందో మాత్రమే చెబుతుంది. అంటే వార్త వార్తగా మాత్రమే ప్రసారమవుతుంది. ఇతర వ్యాఖ్యానాలుండవు. Time Mangement ని తెలియజేసే ఒక గొప్ప ప్రసార సూచిక.

ఆకాశవాణి వల్ల బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన మరొక ప్రక్రియ రూపకం. Feature అనే ఇంగ్లీషు మాటకి సమానార్థకంగా ఈ మాట ఎక్కువ వినియోగంలో వుంది. ఈ రూపకం అనేది లక్షణ గ్రంథాలు మనకి చెప్పే, దశవిధరూపకాలకి సంబంధించినది కాదు. ఆ రూపకాలు వేరు. ఈ రేడియో రూపకం వేరు.

ఆకాశవాణి ఆవిర్భావం తర్వాత అనేక ప్రక్రియలు కొంత ప్రత్యేక ప్రతిపత్తిని కలిగించుకున్న విశేషాల్ని మనం ధారావాహికంగా ముచ్చటించుకుంటూనే వున్నాం. కథ, కవిత, నాటిక, ప్రసంగ చర్చ ఇటువంటి ప్రక్రియలన్నీ శ్రవ్యమాధ్యమంలోని తమ ప్రత్యేకతను బాగా ప్రకటించుకున్నాయి. అలాంటి మార్గంలోనిదే ఈ రూపకం కూడా.

ఏమిటీరూపకం అంటే? ఏదైనా ఒక విషయాన్ని వివరించేటప్పుడు, ఆ అంశాలన్నీ సంబంధించిన బహుముఖాలను, ఒక ప్రత్యేకమైన నెరేషన్‌తో వివరించడం. ఈ రూపక లక్షణం. ప్రసంగంలో కూడా ఈ పని చేయవచ్చును కదా? అనిపిస్తుంది. ప్రసంగధోరణి వేరు. రూపకం ధోరణి వేరు. ఇందులో భిన్న స్వరాలుంటాయి. వివరాల విశదీకరణ వాస్తవాల పట్టికలా కాకుండా, సృజనాత్మకంగా ఉంటుంది. కల్పనకు ఆస్కారం లేని ప్రసంగం కన్నా, కథనంలో ఆసక్తిగాసాగే రూపకం, కవితాత్మక వాక్యాల ప్రయోగంతోసాగే రూపకం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఒకటికన్నా ఎక్కువ గొంతులు వినబడతాయి కనుక వైవిధ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రూపకాల రూపకర్త ఆచంట జానకీరామ్ సేవలు చిరస్మరణీయులు.

శ్రవ్య మాధ్యమంలో డాక్యుమెంటరీకన్నా రూపకం ఎక్కువ ఆదరణకు నోచుకుంది. కారణమేమిటంటే, డాక్యుమెంటరీ అనేది వాస్తవాలను, గణాంకాలను పొందుపరచిన శ్రవ్యపత్రంలా వుంటుంది. కానీ రూపకం అలాంటిది కాదు సృజనకు ఎంతో ఆస్కారమున్న ప్రక్రియ. రూపకం అనే ప్రక్రియలో ఒదగని అంశం లేదు. సాహిత్య సంబంధమైన అంశాలపైన రూపకాలు వచ్చాయి.



దేవులపల్లి కృష్ణశాస్త్రి

సామాజికాంశాలపైన రూపకాలు వచ్చాయి. పర్యావరణ పరిరక్షణమైన రూపకాలు వచ్చాయి. నిరక్షరాస్యతపైన రూపకాలు వచ్చాయి. దైహికమైన, మానసికమైన ఆరోగ్య అంశాలపైన, రూపకాలు వచ్చాయి. మారుతున్న మానవీయ విలువలపైన రూపకాలు వచ్చాయి. ఇలా అంశమేదైనా, రూపకం మాత్రం శ్రవ్య మాధ్యమంలో ఒక ప్రస్ఫుటమైన ముద్రను వేసింది.

డెబ్భైయవ దశకంలో యువవాణిలో ప్రసారమైన ఈ శిలలకు శిల్పి ఎవరు? శీర్షికతో, భూ, భౌతిక శాస్త్రం పైన వచ్చిన రూపకం, ఉత్తమ కార్యక్రమంగా పురస్కారాన్ని పొందింది. అలాగే, 'అక్షరం నుంచి అనంతానికి', శీర్షికతో, ఎన్‌సైక్లో పీడియాలపైన వచ్చిన రూపకం, విశేషమైన సంఖ్యలో శ్రోతలను ఆకట్టుకుని, ప్రజాదరణకు నోచుకున్న ధారావాహికమైంది.



శారదా శ్రీనివాసన్

ఇక లలిత గీతాలు నేపథ్యంగా, అపురూపమైన ఆణిముత్యాల్లాంటి సంగీతరూపకాల్ని ఆకాశవాణి ప్రసారం చేసింది. "రాట్నమే శ్రీరామరక్ష" పేరుతో మహాత్ముని, స్వదేశీవస్త్ర ఉద్యమం స్ఫూర్తిని ప్రచారం చేసిన రూపకం, శ్రీమతి శారదా శ్రీనివాస్, చిరంజీవి, జీడిగుంట రామ చంద్రమూర్తి వంటి కళాకారులు చిరస్మరణీయం చేశారు.

అలాగే, "కృష్ణాగోదావరులు" పేరుతో ప్రసారమైన సంగీత రూపకం, జీవనదుల వైశిష్ట్యాన్ని, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతని మనకు కళ్ళకు కట్టించింది. "వేణు కుంజ"మనే దేవులపల్లి వారి సంగీత రూపకాన్ని ఆకాశవాణి ప్రసారం చేసివుండకపోతే, 'కార్తిక రాతిరిలో కరిమబ్బుంటుందా? నీలిమేఘమాకాశము విడిచి నేలనడుస్తుందా?' అన్న పల్లవితో సాగే అద్భుతం గీతం మనకి దక్కివుండేది కాదేమో?

రామప్ప రూపకాన్ని ఆకాశవాణి ప్రసారం చేసింది కనుకనే, డా॥ సి. నారాయణరెడ్డి గారి అపురూప గీతం, "ఈ నల్లని రాలలో ఏకన్నులు దాగెనో, ఈ బండలమాటునా, ఏ గుండెలు మ్రోగెనో" ఊపిరి పోసుకుంది.

చైత్రమాసం ఆరంభంలో, ఆరు ఋతువులకు ప్రతీకగా ఆరుగురు కవులు రచించిన ఆరు పాటల సంగీత రూపకం, చైత్యరథం, ఆరు రుచుల ఉగాది పచ్చడిలా చిరకాలం శ్రోతలకు గుర్తుండి పోయే రూపకం. 'మంచు ముసుగు ఆవలత్రోసి మలయ పవనుడోసరిలగ, మూతి ముడిచి మాలతి తన మొగము చాటు చేసుకొనియె"– మధు మాసమెడానినదా? మాలతి విరబూసినది" ఇటువంటి భావచిత్రాలకు ప్రతీకగా, శశాంక *వసంత శోభ* రూపకం సాగడం గమనార్హమైన విషయమేమంటే తదనంతర కాలంలో ఆకాశవాణి రూపకాలలో గొప్ప ప్రయోగాలు జరిగాయి. భావ చిత్రాలను, శ్రవ్యచిత్రాలు ఆక్రమించాయి. పౌరాణిక పాత్రలు, సన్నివేశాలు వుండే చోట్ల, తాత్త్విక భూమికలు పరచుకున్నాయి.



శశాంక

'మాట–మౌనం' ఇంద్రగంటి శ్రీకాంతశర్మ రచించి, కలగా కృష్ణమోహన్ స్వరపరచిన రూపకం జాతీయ పురస్కారాన్ని అందుకుంది. మౌనంలోంచి, వచ్చిన మనిషి మౌనం లేనే చేరాడు. మధ్య లోనే మాట నేరుస్తాడు. యుగాలతో మాటలు మారినా, మౌనం శాశ్వతమనే తాత్త్విక చింతనకు అద్భుత ఆవిష్కర రూపకం.

అలాగే మనిషికి రెండు తలుపులుంటాయి, ఒకటి బయటి తలుపు. రెండవది లోపలి తలుపు. బయటి తలుపుతో బాహ్యామే కనిపిస్తుంది. లోపలి తలుపు తెరిస్తేనో, అంతర్దర్శనమూ జరుగుతుంది. అనే మౌలిక స్ఫురణ ఈ రచన ఊపిరి. ఇది కూడా జాతీయ పురస్కారాన్ని అందుకుంది.

ఉదయాస్తమానాల మధ్య ఒక వర్షపు రోజు కలిగించే వివిధ అనుభూతుల ఆవిష్కరణ వర్షానందిని, శ్రవ్య రూపక మాధ్యమం లో ఒక గొప్ప ప్రయోగం.

ఆకాశవాణి ప్రాణ ప్రతిష్ఠ చేసిన రూపకం అద్భుతమైన పరిణామదశకు చేరుకుంది. మి



# జపాన్‌లో వసంతం

- రీతా రాణి పాలీవాల్

**పూ**లను చూడండి పిలుస్తున్నాయి 'సాకురా' రండి
వసంత ఋతువు
రెండో నెల పూర్ణిమ వెన్నెల్లో
పుష్పిస్తున్న సాకురా చెట్టు కింద
నా అంతిమ శ్వాసను తీసుకొంటాను

- 'షిన్ కొకిన్ వాకా-శు'లో సంకలితం

**ఆ**సక్తికరమైన విషయం ఏమంటే సాకురా చెట్టుకింద అంతిమ శ్వాసను తీసుకోవాలనుకొనే 'సాయి గ్యోహ' కోరిక నెరవేరింది. అతను వసంత ఋతువు సౌందర్యంలోనే యీ ప్రపంచం నుండి వీడ్కోలు పలికాడు. యిది తన సమకాలికుల ద్వారా వుత్తమ కవితగా పేర్కొనబడింది. ఇలా వసంత ఋతువు ఆగమనం రకరకాల అందమైన పూలతో అలంకరింపబడి వుంటుంది. సాకురా జపనీయుల అత్యంత ప్రియమైన పుష్పం. పుష్పిస్తూనే ప్రకృతిలోనూ, జీవితంలోనూ ఒక విశిష్టమైన ఉల్లాసంతో కూడిన సౌందర్యం కన్పిస్తుంది. దీనికి కారణం శిశిరం తరువాత నగ్నంగా నిలబడిన వృక్షాల్లో అన్నింటికంటే ముందు సాకురానే వసంత సూచననిచ్చి దానిని నలువైపులా వ్యాపింపజేస్తుంది.

మార్చి నెల చివర్లో, ఏప్రిల్ నెల ఆరంభంలో సాకురా వృక్షాలు పూలతో నిండి వుంటాయి. కొండలు, లోయలు, సెలయేళ్ళు, సరోవర తీరాలు, ఉద్యాన వనాలు, భవనాలు, రహదారులకు అటు, యిటు, యిళ్ళల్లోని తోటల్లో వున్న సాకురా వృక్షాలకి ఎక్కువగా పూసిన గులాబి పూలతో నిండి, వీచే వసంతపు గాలిచే వూగుతూ వుంటాయి; కోమలమైన పూరేకులు రాలుతూ వుంటాయి. నలువైపుల తేలికైన గులాబి ముత్యాల్లా పూరేకులు గాలిలో తేలుతూ, రెప-రెపలాడుతూ, పూరేకులు రాలుస్తూ వీటి కొమ్మలు పూలతో నిండుగా వుంటాయి, ఆకులు వుండవు. శశిర ఋతువు తరువాత సాకురాలో మొదట పూలు పూసి తరువాత ఆకులు చిగురిస్తాయి. చుట్టూ వున్న వాతావరణం ఒక్కసారిగా గులాబిలా వుంటుంది. కాని, వసంతపు యీ సౌందర్యం ఎంత తొందరగా వస్తుందో, అంతే తొందరగా చిందర-వందర అయి పోగు- పోగుల్లా రాలిపోతుంది. వేగంగా వీచే గాలి తాకిడి, నిరంతరం కురిసే జడివాన కొమ్మలను కుదించి వేస్తూ పూలను రాల్చేస్తూ వుంటాయి. మళ్ళీ ప్రశాంత మహాసాగరంలో నుంచి లేచే మేఘాలు ఆవరించి వేగంగా వీచే గాలివాన కోమలమైన సాకురా రేకులను నిర్దయగా వేరుచేస్తుంది.

పుష్పిస్తున్న సాకురాను చూసిన జపనీయుల మానస రాగం ఉల్లాసంతో నిండిపోతుంది. దీని శాంతమైన, కోమలమైన సుకుమారత్వాన్ని ప్రశంసిస్తూ దానిని తమ మనసుల్లో సమీకరించు కోవాలనుకొంటారు. ప్రజలు హానామీ (పూలను చూడండి) కోసం యిళ్ళలో నుంచి బయటికొస్తారు. పర్వతాలు, ఉద్యాన వనాలు, సరస్సుల తీరాన, వుండే సాకురా వృక్షాల కింద కూర్చొంటారు. సన్నిహితులతో తీరిక క్షణాల ఆనందాన్ని పొందుతూ సెలవును గడుపుతారు.

**పౌరాణిక కథ-సాకురా:**

జపాన్ ప్రాచీన రాజధాని అయిన నారాకి దగ్గర్లో వుండే యోశినో కొండలపై పెరిగే బనైలే అనే సాకురా వృక్షాల నుంచి వందల రకాలు వృద్ధి చెందాయి. వీటిల్లో నుంచి 19 వ శతాబ్దంలో 'టోక్యోలో పెంచబడిన' 'సోమేయీ-యోషిగో' రకానికి చెందిన ప్రజాతి నేడు జపాన్ దేశపు క్లాసిక్ సాకురాగా ప్రసిద్ధి చెందింది. సాకురా పుష్పం యొక్క సాంస్కృతిక వంశం పౌరాణిక రాజకుమారి 'కొనోహానా నో సాకురా' తో ప్రారంభమౌతుంది. రాజకుమారి సాకురా వివాహం సూర్య దేవి అమాత రేసు పుత్రుడు రాజకుమారుడైన నినిగీతో

అనువాదం: పి.మస్తాన్ ఖాన్, ఫోన్ : 9985981901

జరిగింది. రాజకుమారుడు సిసిగీ వివాహం కోసం జపాన్ భూమిపై తన చేతిలో అమాత రేసు తోటలోని వరి కంకిని తెచ్చి, జపాన్ భూమిలో నాటాడు- దీనితో జపాన్ ధన-ధాన్యాలతో సుసంపన్నం అయింది. రాజకుమారి సాకురా పేరుపైనే యీ వృక్షానికి 'సాకురా' అనే పేరొచ్చిందని, యీ వృక్షంలో రాజకుమారి ఆత్మ నివసిస్తున్నదని జపనీయులు విశ్వాసం.

క్యోటోలో జరిగే ఒక ఉత్సవ సాంప్రదాయం ప్రకారం మందిరాల్లోకి భిక్షువులు సాకురా వృక్షంలో వుండే ఆత్మతో యిలా కోరుకొంటూ ప్రార్థిస్తారు - సాకురా పూలు దీర్ఘ జీవులై వుంటూ, ఎక్కువ రోజులు వికసిస్తూ వుండాలి. పూలు వికసించిన వెంటనే వర్షంచే పూరేకులు రాలిపోతే వరిపంట సరిగా పండక పోవచ్చు అనడానికి పూర్వ సూచనగా లేక భవిష్యత్తు సంకేతంగా విశ్వసిస్తారు.

**కవిత్వంలో సాకురా:**

సాకురాని ప్రాచీన హెయికే రాజవంశ కాలపు భవ్యకళల మూల తత్త్వంగా పేర్కొనవచ్చు. కవి సాయిగ్యో దీని సౌందర్యాన్ని చూసి గీతాలు పాడాడు. చిత్రకారులు, యమాకో-యే-చీరకో', (గుడ్డపై చిత్రాలు) చిత్రాలు గీశారు. వెదురుతో చేసిన కర్టెన్లపై దీని కుసుమించిన పుష్పపుంజాన్ని అల్లడంలో తమ సాధన యొక్క పూర్ణత్వంగా భావించారు. కాస్త ముందుకెళ్ళి సాముురాయి యుగాలు సాంప్రదాయక వారసత్వ స్వరూపాన్ని పొందిన సాకురా ఆసక్తిని యీ యోధులు తమదైన శైలిలో అస్త్రాల్ని, కవచాల్ని సాకురా పూలతో, ఆకులతో అలంకరించుకొన్నారు. అతి తక్కువ వ్యవధిలో పుష్పించి పోగులై రాలిపోయే సాకురా పూలు


వసంతకాలంలో పూవులు

జీవితపు నశ్వరత్వం, క్షణ భంగురపు సుమధుర విచార, సుఖ-దుఃఖాల, జ్ఞాన ప్రతీక రూపంలో ప్రాచీన కాలంనుంచే ప్రజలకు అత్యంత ప్రియమై, దయా పాత్రమైంది. చిత్రకారులు తమ కుంచెతో చిత్రీకరిస్తున్నారు. కవులు దీని సుకుమార సౌందర్య గానం చేస్తూ దీనిలయను తమ శబ్దలయలో మమేకం చేయాలని ప్రయత్నిస్తున్నారు. సాకురా క్షణభంగురత వారిని వెంటాడుతూనే వుంటుంది. పదో శతాబ్దికి చెందిన కవితా సంగ్రహం 'కోకింశు' (ప్రాచీన మరియు ఆధునిక కవితలు) లో సంకలితమైన కవితల్లో -

**మెత్తని యెండలో స్నానించిన**<br>
**వసంతపు యీ శాంత దినం**<br>
**మేఘాల్లేని స్వచ్ఛమైన ఆకాశం**<br>
**మరి యెందుకు సాకురా పూలు**<br>
యింత అధైర్యంగా రాలిపోతున్నాయి - కీనో తోమోనోరి

సాకురా పూలు పుష్పించడం మనసుకు ఎంత సుఖము లభిస్తుందో, అవి రాలిపోవడం కలచి వేస్తుంది. మరికొన్ని రోజులు పుష్పిస్తూ వుంటే బాగుండేది అనిపిస్తుంది. అయితే మళ్ళీ జీవితపు అనిత్యత బోధపడిన వెంటనే యిది ఒక నియమం అని ఒప్పుకొంటాం. 9వ శతాబ్దపు కవి ఫూజికారా యోషిఫుసా (804-872) యొక్క కవిత జర్జరమై పోతున్న శరీరంలో వసంతపు లయ కొత్త వుత్సాహాన్ని కల్గిస్తున్నది-

**దొర్లి పోతున్న వయసు మీదికి వచ్చినపుడు**<br>
**నిజంగా ముసలి వాడినయ్యాను నేను**<br>
**రెండు అభిప్రాయాలు లేవు యిందులో**<br>
**అయితే / కాని**<br>
**సాకురా వృక్షాల్ని చూస్తున్నపుడు**<br>
**యెంతో యవ్వనం అవుతోంది నా మనసు -**

18వ శతాబ్దానికి చెందిన కవి కామోనో మాబూచి (1697-1769) పుష్పిస్తున్న సాకురాని చూసి ఆహ్లాదితుడై, విస్మితుడై ప్రపంచంలోని ప్రజలందరికి అనిర్వచనీయ సాకురా అందాన్ని చూపించాలనుకొంటాడు. తను ఎంతగా అనుభవించి, వాటిగురించి చెప్పి, వినిపించి, అర్థం చేయించినను, సాకురాతో పుష్పిస్తున్న కొండలు ఎంత అందంగా వుంటాయో ప్రజలు తమ కళ్ళతో చూడనంత వరకు అర్థం చేసుకోలేరు -

**యిది నిజం చేయుగాక**<br>
**భూమి పైనివసించే వారందరూ**<br>
**మా యీ నేలపైకి వస్తే**<br>
**యీ యాషినో కొండలపైకి చేరుకొంటే**<br>
**పుష్పించిన సాకురాను చూడగలరు.**

19వ శతాబ్దానికి దాతే చిహిరో (1803-1877) సాకురా పూలకు వుండే సహనశక్తిచే ముగ్ధుడైనాడు. తుఫాను నీటి ఘాతానికి తమజీవితాన్ని కోల్పోయినను, తమ మనసును మాత్రం మైలపరచవు అంటాడు -

**పుష్పించి చెల్లా-చెదురైనాయి**
**గాలి, వర్షపు యిష్టం పై తనను అప్పగించి**
**సాకురా పూలు మిగల్లేదు యిప్పుడు**
**అయితే వాటి మనసు శాంతంగా వుంటుంది ఎల్లప్పుడు.**

**సాహిత్యంలో సాకురా:**

జపాన్ సాహిత్యం అందులోని వృత్తాంతము సాకురా బింబాలతో, ప్రతీకలచే నిండి పోయింది. 'మాగ్యోషు' (ప్రాచీన 10 వేల కవితల సంపుటి) కవితల్లో ప్రేమ కోమల భావం సాకురా పుష్పాలు, గాలి, చంద్రుడు, పక్షులు మొదలైన ప్రాకృతిక బింబాల ద్వార అభివ్యక్తమయింది. కోమలమైన, సుకుమారమైన అభివ్యక్తి కోసం సాకురా ఉపమానాన్నే ప్రయోగించారు. సుప్రసిద్ధ కాబుకీ నాటకాల శీర్షిక, 'యోషిత్సునే సేన్ బాఁన్ జాకురా' (యోషిత్సునే మరియు వేయి సాకురా వృక్షాలు) గా వుంది. 'సుకేరేకు యుకారి నో యెదో జాకురా' (యెదో యొక్క సాకురా పుష్పం సుకరేకు) యోషిత్సునే, సుకేరేకు యిద్దరు తమ సుకుమారతకు, లోకప్రియులుగా, పరిచితులు, సుకెరేకు తన యవ్వనంలోని సౌందర్యం కారణంగా యేదో గెయిశా సమాజంలో అతి ప్రియుడైనాడు.

యోధాత్సునే శౌర్య పరాక్రముడే కాక, అత్యంత సుకుమారుడు మానవీయతతో పరిపుష్టుడైన వాడు కూడానూ. యితని వీరగాథలు సాకురాతో ముడిపడి వున్నాయి. 'గేంజి హేయి కేయి' యుద్ధ కథల్లో గెయికె వంశ కిశోరం రాజకుమారుడు, 'అత్సుమోరీ' కథల్లో అత్సుమోరీ సాకురాలు అందంగా, సుకుమార, మనోహరమైన యోధులుగా వర్ణింపబడ్డారు. యీ కథ పై ఆధారపడిన 'కుమగాయి జిన్యా' (కుమాగాయి యుద్ధ శిబిరం) నాటకంలో యోశిత్సునే తన సేనాపతి కుమగాయికి ఆదేశాన్నిస్తూ సందేశం పంపించాడు. అందులో హెయికే వంశానికి చెందిన ఏకైక వుత్తరాధికారి ప్రాణాలు కాపాడ్డానికి ప్రతీకాత్మక భాషలో యిలా అంటాడు - "ఎవరైనా ఒక సాకురా కొమ్మను నరికితే దాని మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వుంటుంది". సేనాపతి కుమగాయి తన స్వామి ముందు అతని ఆజ్ఞాపాలనకు సంబంధించిన ప్రమాణాన్ని సమర్పిస్తాడు. శబ్దాల్లో - మాటల్లో కాదు సాకురా కొమ్మను చూపించి కఠోరమైన కర్తవ్యపాలన యొక్క వేదనను భరిస్తూ సమురాయి అస్త్రాల్ని త్యజించి బౌద్ధ భిక్షువుగా మారుతారు. జపాన్ చరిత్ర క్షత్రియ యోధుల శౌర్యం, వీరత్వపు బలిదానాన్ని ఆదర్శంగా భావించే వుత్సాహం మరియు కర్మనిష్ఠతో కూడినది. సాకురా రాలిపోవడం, దాని కోమల సౌందర్యం వెంట-వెంటనే దూరమై మనసులో విరాగ వుద్రేకాన్ని కల్గిస్తుంటుంది. జీవితపు నశ్వరత్వాన్ని, అనిత్యతను తెలియజేస్తూ సాంసారిక వైభవాన్ని త్యజించే సందేశాన్ని యిస్తూ వుంది.

**సాకురా రకాలు:**

ప్రాచీన జపానీయులకు మనోహరం కల్గించే సాకురా శిలలతో కూడిన కొండభూమిపై వుండే 'బనైలా' కొండ రకపు సాకురా (యామా-జాకురా) వుండేది. శిశిర ఋతువులో నగ్నంగా వున్న యామా సాకురా వృక్షం ఏప్రిల్ నెల ప్రారంభంలో ఎర్రని రేకులతో, తేలికైన గులాబి పూలతో నిండి వుండేది.

నేడు జపాన్ మొత్తం కన్పిస్తూ సర్వవ్యాప్తమయినా కొత్తరకం సాకురా 1872 లో టోక్యోలోని సోమేయి నర్సరిలో వృద్ధి చేయబడింది. వోషిమా-జాకురా మరియు ఏదో హిగాన్ తో వృద్ధి అయిన యీ రకపు విశిష్టత తొందరగా ఎక్కువగా పుష్పిస్తాయి. దీని కారణం యిందులో పూలు ముందు పుష్పించి తరువాత చిగుర్లు తొడుగుతాయి. ఒక వారం పదిరోజులకోసం చెట్టునిండా తేలికైన గులాబీలు పూస్తాయి.

వొక్కొక్కటిగా పూరేకులు రాలి పోతుంటాయి. కొత్త ఆకులు చిగురుస్తుంటాయి. ఏప్రిల్ రెండవ వారం పూర్తయ్యే సరికి ఎర్రని పూలరేకులు తగ్గిపోతాయి. మూడో, నాలుగవ వారంలో అదే వృక్షం పూర్తిగా మొలకెత్తిన ఆకులతో పచ్చగా కన్పిస్తుంది. 'వోషిమా-సాకురా' పూలు రాలి పోయిన తరువాత రెండవ రకపు 'హిందోర-సాకురా' (వూగే సాకురా) పుష్పిస్తుంది. దీనిని 'వూగే సాకురా' అని అంటారు. ఎందుకంటే పూలతో నిండిన దీని కొమ్మలు మర్రిచెట్టు వూడల్లా వ్రేలాడుతూ వుంటాయి. దీని రేకులు వాన చినుకుల్లా టప-టప మని నిరంతంర కిందికి రాలుతూ వుంటాయి. దీని రంగు వోషిమా-సాకురా కంటే కొద్దిగా గులాబీగా వుంటుంది. సాక్యోజునిచిరో తానాజాకి నవల 'సాసా

మేయుకి'లో క్యోటో ప్రాంతపు హెయికె రాజవంశం ద్వార నిర్మింపబడిన దేవాలయపు విశిష్టమైన హిదారే జాకురా గూర్చి చిత్రించడమైంది. యిది కిందికి భూమివైపు వూగుతున్న కొమ్మల్లోనుంచి పూరేకులు రాలుతూ వుండడం వలన దీనిని ఆంగ్లంలో– weeping cherry blossom అంటారు.

**సాకురా తత్త్వం – హానామీ:**

వసంతంలో వికసించిన పూలను చూడడాన్ని 'హానామి' అంటారు. 'హానా' అంటే పూలు అని 'మీ' అంటే దర్శించడం అని అర్థం. హానామీ మరియు 'మోమీజీ' జపానీయుల్ని ఎంతగా ప్రసన్నం చేస్తాయంటే, వారు శరద్, వసంతపు యీ ప్రాకృతిక వైభవాన్ని తమ జీవితంలోకి అనువదించు కోవాలని శక్తి కొలది ప్రయత్నిస్తారు. ఒకరకంగా యిది జపాన్ యొక్క జాతీయ పండుగలా వుంటుంది. యిందులో ప్రతి ఒక్కరు పాల్గొంటారు. ప్రకృతిలో తాదాత్మతని, సామరస్యపు స్వరాన్ని కలుపుతూ ప్రజలు తమ మిత్రుల్ని, బంధువుల్ని ఆహ్వానించి కుటుంబ సమేతంగా గుమి గూడతారు. పార్కులు, సెలయేళ్ళు, కొండల వైపున్న దేవాలయాలు, మందిరాల తోటల్లోకి వందల – వేల సంఖ్యల్లో ప్రజలు చేరుకొంటారు. పెద్ద సంఖ్యలో వుండే ప్రజలు క్యాకు కార్డర్, డిజిటల్ కెమెరాలతో కన్పిస్తారు.

వీస్తూవున్న గాలిచే వూగే పుష్పించిన కొమ్మల లయను, రాలి పోతున్న పూరేకుల కోమలమైన సున్నితత్వాన్ని, భూమిపై చెల్లాచెదురైన, నీళ్ళపై యీదుతున్న పూరేకుల దుప్పటిని తమ కెమెరాలలో బంధిస్తుంటారు. నేటి ప్రపంచం టెక్నాలజీ చే వేగవంతమైంది. కవిత్వం రాసేకంటే, 'కరావోకే' పాటల ధ్వని ఎక్కువగా రంజింప చేస్తోంది. చప్పట్లు చరుస్తూ, పాడుతూ 'సాకే' (జపాన్ వరితో చేసిన సారాయి) గుక్కతో పాటు సిగరెట్లు దమ్ము లాగుతూ, సంభాషిస్తూ మెల–మెల్లగా రాలిపోతూ పూరేకుల మధ్య ప్రజలు భోజనం చేస్తూ పిచ్చాపాటి ఆనందాన్ని అనుభవిస్తుంటారు. సెలయేళ్ళలో, కందకాల్లో నౌకా విహారము చేస్తారు. దాని క్షణభంగురత, శృంగార కథకి చెప్పేనీటిపై తేలుతున్న పూరేకుల దుప్పటిని తెడ్డుతో చీల్చుకొంటూ గులాబి వసంతంచే తాదాత్మ్యం చెందుతారు. పిల్లలు, వృద్ధులు యువకులు, ప్రేమజంటలు, స్వదేశీ–విదేశీయులు హానామీలు అందరూ పాల్గొంటారు. అతివృద్ధుల్ని వారి కుటుంబీకులు 'వీల్‌చైర్స్'లో తీసుకొస్తారు–హనామీ కోసం జపానీయుల ఆయుఃప్రమాణం అందరికంటే యెక్కువే. పెద్ద సంఖ్యలో పాల్గొనే వృద్ధులకు తమ స్నేహితుల్ని, పరిచితుల్ని కలిసి పరి శుద్ధమైన గాలికి శ్వాసించే అవకాశం కల్గుతుంది. వసంతపు ఆగమనానికి కచ్చితమైన తేది తెలీదు. మొదట యీ వసంతం దక్షిణ జపాన్‌లోని క్యూశూ పరిసరాల్లో ప్రశాంతమైన ఆకాశం కింద సాకురా మొగ్గయి మెల–మెల్లగా చిట్లడం ప్రారంభిస్తాయి. వసంతం దక్షిణాన క్యూశూ నుంచి ప్రారంభమై వుత్తరాన హొక్కాయిడో వైపుకు వ్యాపిస్తుంది. వాతావరణ విభాగము వుత్సాహంతో క్యూశూలో సాకురా పదిశాతం వికసించిందని టి.వి.లో రిపోర్టు జారీ చేస్తుంది. బుధవారం వరకు యిది 20% పుష్పిస్తుందని, వచ్చే సోమవారం మధ్యాహ్నానికి యిది పూర్తిగా పుష్పిస్తుంది. అప్పుడు జపాన్ ప్రజలు 'హానామీ' సాకుతో కొద్దిసేపు ప్రకృతి చెంతలోకి వెళ్ళి తనమనసులో మనసు కలుప వచ్చని ఆలోచిస్తారు.

జపాన్‌లోని వివిధ ప్రదేశాల్లో సాకురా వుత్సవం 'హానా మత్సురీ' ఏర్పాట్లు రంగు రంగుల కార్యక్రమాల రూపంలో, విందులా జరుగుతాయి. అత్యధిక మందిరాల్లో బుద్ధ భగవానుడి జన్మదినం 'హానామత్సురీ' (పుష్పోత్సవం) జరుగుతుంది. యీ సందర్భంగా బుద్ధ భగవానుడి అవతారకథలు, బుద్ధుని తల్లికి తెల్ల ఏనుగు కన్పించడం లాంటి కథలను పిల్లల ద్వారా నాటక ప్రదర్శనలు జరుగుతాయి. కాబూకీ నాట్యం చేసేవారు యీ ఋతువుల్లో సాకురా వృక్షాల కింద ప్రాకృతిక ఆవరణలో, 'సాకురా కాబుకీ' నీ ప్రదర్శిస్తారు. ప్రకృతి ఒడిలో కాబుకీని ప్రదర్శించడం వలన మరింత ఆకర్షణీయంగా వుంటుంది.

జపాన్ దేశపు అత్యంత ప్రాచీనమైన రంగస్థలం శిజువోకాలోని కాంపిరా దేవాలయం వద్దవున్న 'కానామారుజా' రంగస్థలం. 1835లో నిర్మితమైన యీ రంగస్థలంలో నేటికి యెదో కాలపు పరిస్థితులలోనే నాటక ప్రదర్శన జరుగుతోంది. ఒక సంవత్సరంలో మూడు నెలలు యీ ప్రదర్శన జరుగుతుంది. యీ ప్రదర్శన సాకురా పుష్పిస్తూనే ఏప్రిల్ నెలలో ప్రారంభమౌతుంది. యీ రంగస్థలం లోపల నిరంతరం రాలిపోయే సాకురా పూల సౌందర్యాన్ని ప్లాస్టిక్ సాకురా పూరేకులను చెల్లా చెదురుగా పడివున్నట్లు అలంకరిస్తారు. తక్కువ స్థలంలో ఎక్కువ ప్రయోజనాన్ని సాధించుకోవడంలో జపానీయులకు మరెవ్వరూ సాటిరారు. యింటి ఆవరణలో కొద్ది స్థలాన్ని కేటాయించి అందులో సాకురా మొక్కలను నాటాలనే ప్రయత్నం కన్పిస్తుంది. ఒకసారి నాటితే యిక దాని గూర్చి చెప్పలేనంతా..... మి

# చివరి తత్త్వవేత్త

- ముక్తవరం పార్థసారథి



విట్‌గెన్‌స్టీన్

తనే 'చివరి' తాత్త్వికుణ్ణని ప్రకటించుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. సోక్రటీస్, ప్లేటో లాంటి గ్రీకు తత్త్వవేత్తలతో ప్రారంభమై, యిరవై అయిదు శతాబ్దాలుగా సాగిన పాశ్చాత్య తాత్త్విక ప్రస్థానం చివరికి చేరింది. నేనే చివరి తత్త్వవేత్తనని చెప్పుకోవడం వెనక అదీ ఆయన అభిప్రాయం.

లుడ్విగ్ విట్‌గెన్‌స్టీన్ తార్కిక ప్రతిభ అసామాన్యం. తాత్త్విక సమస్యల్ని చర్చిస్తున్నప్పుడు వచ్చే సమస్యలకు పరిష్కారం ఎలా దొరుకుతుంది? సింపుల్ అన్ని సమస్యల్నీ తర్కబద్ధంగా విశ్లేషించాలి. తర్కానికి లొంగని మెటాఫిజిక్స్, ఈస్థటిక్స్, ఎథిక్స్, చివరికి ఫిలాసఫీ అయినా ప్రస్తుతం చర్చనీయాంశం కాదు. తాత్త్విక చర్చలను, తార్కిక విశ్లేషణలుగా మార్చే ప్రయత్నం ఒకసారి కాదు, రెండుసార్లు చేశాడు విట్‌గెన్‌స్టీన్. మొదట ఆయన కథాకమామిషు ఏమిటో తెలుసుకుందాం. 1889లో, ఏప్రిల్ 26 నాడు జన్మించాడు విట్‌గెన్‌స్టీన్. తండ్రి ప్రముఖ పారిశ్రామికవేత్త, అపరకుబేరుడు. మొత్తం యూరోపులోనే అంతటి ధనవంతుడు లేడు. ఇక యింట్లో ఆయన నియంతకేమీ తీసిపోడు. అయినా, సాంస్కృతికపరంగా ఆయన అభిరుచి గొప్పది. Brahms లాంటి సంగీతకారులు యింటికి వచ్చి మరీ కచేరీలిచ్చేవారు. అయితేనేం, కుటుంబసభ్యులకు మాత్రం ఆయనను చూస్తే హడల్. లుడ్విగ్ అన్నలు నలుగురు భయంతో, బిక్కచచ్చి హోమోసెక్సువల్స్‌గా మారారు. తరువాతి రోజుల్లో, (వీళ్లలోని) ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వియెన్నాలో, సిగ్మండ్ ఫ్రాయిడ్ యింటికి అల్లంత దూరంలో పెరిగాడు లుడ్విగ్. 1903లో, లింజ్ నగరంలోని ఒక స్కూల్లో గణితం, సైన్సు చదువుకున్నాడు. కాకతాళీయంగా, ఆకాలంలో, హిట్లర్ కూడా అక్కడే విద్యార్థిగా వున్నాడు. ఇద్దరిదీ ఒకే వయసు. బహుశా, క్లాస్‌మేట్స్ కూడా అయి వుండవచ్చు.

ఆ తర్వాత, బెర్లిన్‌లో రెండేళ్లపాటు మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యసించాడు విట్‌గెన్‌స్టీన్. 1908లో, ఇంగ్లండు వెళ్లి మాంచెస్టర్ యూనివర్సిటీలో ఏరోనాటిక్స్‌లో పరిశోధన చేశాడు. ఆ క్రమంలోనే, తన జీవిత గమ్యం ఏం కాబోతున్నదో తొలిసారి గ్రహించాడు. అప్పటికతడికి ఫిలాసఫీ గురించి ఏమీ తెలియదు. బ్రిలియంట్ కాదుగాని తెలివైనవాడే అన్నారు సహవిద్యార్థులు. కాకపోతే కొద్దిగా "ఎక్సెంట్రిక్". మర్యాదగానే ఉండేవాడు. కాని వున్నట్టుండి అణచుకోలేని కోపంతో అందరి మీదా అరవటం ఆశ్చర్యం కలిగించేది. అయితే, నలుగురితో కలిసితిరగటం, 'సోషల్'లా వుండటం ఎలాగో విట్‌గెన్‌స్టీన్‌కు తెలియదు. క్షణం విరామం లేకుండా రోజంతా కష్టపడి పనిచేసి సాయంత్రం బాత్‌టబ్‌లో పడుకుని ఆత్మహత్య గురించి ఆలోచించటం అతడి రొటీన్ అన్నారు.

తన రీసర్చ్ ప్రాజెక్ట్‌లో భాగంగా, ప్రొఫెల్లర్ డిజైన్ చెయ్యటానికి పూనుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. ఈ క్రమంలో తలెత్తిన సమస్యలు అతణ్ణి మాథమాటికల్ థియరీ గురించి తెలుసుకోవటానికి ప్రోత్సహించాయి. సరిగ్గా అక్కడే అతడి జీవితం మలుపుతిరిగింది. కేంద్రీకరించిన మేధోశక్తితో ఆలోచనలు కొత్తదారుల్లో పయనించాయి. ప్రొఫెల్లర్ ఏమైందో తెలియదుగాని గణిత శాస్త్రమూలాల గురించిన అన్వేషణ ప్రారంభమైంది. ఈ దృశ్యజగత్తుకు ఆధారమేది అనే ప్రశ్న ఎదురైంది. అవును అసలు, తెలుసుకోవలసిన విషయం అదీ. ఈ కాలంలోనే అతని సోదరులు ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రికి క్యాన్సర్ అని తెలిసింది.

ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

గణితశాస్త్ర మూలాల గురించి యిప్పటికే పరిశోధించిందెవరు? బెర్ట్రండ్ రసెల్ రాసిన 'ప్రిన్సిపల్స్ పల్స్ ఆఫ్ మాథమాటిక్స్' క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. అప్పటికి ఆ రంగంలో వచ్చిన అత్యాధునిక ప్రామాణిక గ్రంథం అదే. గణిత శాస్త్రసూత్రాలన్నీ ప్యూర్ మాథమాటిక్స్. అయితే, రసెల్ నంబర్లను కొన్ని క్లాసెస్‌గా విభజించి మరీ నిర్వచించాడు. ఈ రంగంలో పరిశోధనకొనసాగిస్తూ, 1911లో, కేంబ్రిడ్జిలో వున్న రసెల్‌ను చేరుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. ఇంజనీరింగ్‌కు స్వస్తిపలికి, అతడి వద్ద ఫిలాసఫీ నేర్చుకోవాలనుకున్నాడు.

అప్పటికి, రసెల్, యూరోప్‌లోని ప్రముఖ ఫిలాసఫర్లలో ఒకడు. విట్‌గెన్‌స్టీన్ ఫిలాసఫీ గురించి ఒక్క పుస్తకం కూడా చదవలేదు. అయినా, రసెల్‌కతడు కొరకరానికొయ్యే. లేదా గురువును మించిన శిష్యుడే. రాత్రి-పగలు అని తేడాలేకుండా రసెల్‌తో కూర్చొని 'ఫిలాసఫీ', కొన్నిసార్లు 'లాజిక్', అప్పుడప్పుడూ 'ఆత్మహత్య'ల గురించి చర్చించేవాడు. "రహస్యాన్ని శోధించి తెలుసుకోవాలి లేదా చావాలి." అనే తత్త్వం అతనిది. ఆత్మానుభవం గురించి రసెల్ చెప్పిన దాన్తో అతడంగీకరిచలేదు. స్వానుభవం వల్ల జ్ఞానార్జన సాధ్యంకాదు. విట్‌గెన్‌స్టీన్ ప్రకారం జ్ఞానమంటే తర్కమే. ఉదాహరణకు, ఒకసారి రసెల్ "ఈ గదిలో ఖడ్గమృగంలేదు" అన్నాడు. విట్‌గెన్‌స్టీన్ అంగీకరించలేదు. లాజికల్‌గా, అక్కడ ఖడ్గమృగం వుండే అవకాశముంది. కుర్చీలవెనకా, బల్లలవెనకా వెదికారు కనిపించలేదు. అయితే మాత్రం రసెల్ లాగ లేదని ఖచ్చితంగా ఎలా చెప్పగలం?

విట్‌గెన్‌స్టీన్ చేస్తున్నది మూర్ఖపు వాదన కాదని తెలుసుకోవటానికి రసెల్‌కు ఎక్కువ రోజులు పట్టలేదు. అయితే, తన శిష్యుడు తర్కశాస్త్ర ప్రాథమిక సూత్రాలను మరింత బాగా అధ్యయనం చెయ్యాలి. తన పరపతిని ఉపయోగించి, కేంబ్రిడ్జిలో వున్న ప్రముఖ లాజిషియన్ W.E. Johnson వద్ద విట్‌గెన్‌స్టీన్ లాజిక్ నేర్చుకోవటానికి ఏర్పాట్లు చేశాడు రసెల్. అయితే, అదో ప్రహసనంగా ముగిసింది. "అతని వద్ద నేను నేర్చుకోవలసిందేమీ లేదని ఒక గంటలోనే తెలిసిపోయింది" అన్నాడు విట్‌గెన్‌స్టీన్. అవును మా మొదటి పరిచయంలోనే అతడు నాకు లాజిక్ నేర్పించే ప్రయత్నం చేశాడు" అన్నాడు జాన్సన్. దూకుడు, పరుషవాక్కు, ఎదటివ్యక్తి మాట ఆలకించే ప్రయత్నం కూడా చేయకపోవటం విట్‌గెన్‌స్టీన్ వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణాలు.

ఇలాంటి మనిషితో గడిపిన రోజుల్ని, "most exciting intellectual adventures of my life" గా వర్ణించాడు రసెల్. ఇద్దరూ మాథమాటికల్ లాజిక్ చర్చించారు. ఇదెంత సంక్లిష్టమైన విషయమంటే, లోకంలో అరడజను మంది మాత్రమే (ఆరోజుల్లో) అర్థం చేసుకోగలిగే వాళ్లని అంటాడు. ఐనా, "రెండేళ్లలోనే నేను నేర్పగలిగిందంతా నేర్చుకున్నాడతడు" అంటూ కితాబిచ్చాడు రసెల్. దీన్ని మరో అర్థంలో చెప్పుకొంటే యింక రసెల్ చెయ్యగలిందేమీలేదు. ఫిలాసఫీని ముందుకు తీసుకుపోగలిగినవాడు తనే అని కూడా విట్‌గెన్‌స్టీన్ రసెల్‌ను నమ్మించాడు. అలా, తనకు ఫిలాసఫీనేర్పిన రసెల్ కృషికి ముగింపు పలకటమేగాక, దాన్ని ధ్వంసం చెయ్యటానికే పూనుకున్నాడు. అతడి మేధోపటిమ అపారమైనది. సత్యాన్వేషణలో, తర్కం అనే పరశువుతో అడ్డొచ్చిన వాళ్లెవరైనా సరే, శిరచ్ఛేదం చెయ్యటానికి వెనుకాడలేదు. యాధృచ్ఛికంగా ఫిలాసఫీలో తలదూర్చినా విట్‌గెన్‌స్టీన్‌కు అదే జీవన్మరణ సమస్యగా మారింది. 'ఫిలాసఫీ'ని యింత సీరియస్‌గా తీసుకోని వాళ్ళను అతడు అసహ్యించుకున్నాడు.

జీవితలక్ష్యాన్ని యింత స్పష్టంగా చూడగలిగిన విట్‌గెన్‌స్టీన్, ఆ వెంటనే అధ్భుతాలేమీ సాధించలేదు. తనలో హోమోసెక్సువల్ లక్షణాలున్నాయని మాత్రం గ్రహించాడు. యువకులతో ఒంటరిగా మేధోపరమైన సంభాషణలు కొనసాగించాడు. కాని 'ఈ లక్షణం' వాటిని మలిన పరుస్తుందేమోననే భయంతో, వాళ్లతో గాక, మరెక్కడో, పార్కుల్లో రాత్రులు గడిపి యింటికి చేరుకోవటం అలవాటు చేసుకున్నాడు. జీవితంలోని పరస్పరవిరుద్ధమైనకోరికలతో, మానసికమైన ఒత్తిడి పెరిగింది. ఒక వైపేమో అసమానమైన, అరుదైన జీనియస్. మానవమేథోసారగమథనంలో కొత్త సత్యాలను ఆవిష్కరించబోతున్నాడు. మరో వైపు అణచుకోలేని కోరికలు. వియెన్నా వెళ్లి, తండ్రి మరణం తర్వాత, కేంబ్రిడ్జికి తిరిగి వచ్చి 'లాజిక్'తో యుద్ధం పునః ప్రారంభించాడు.

1913లో, మరో యువ మాథమేటీషియన్ డేవిడ్ పిన్సెంట్‌తో కలిసి నార్వేలో కొన్నాళ్లు గడిపాడు విట్‌గెన్‌స్టీన్. ఇద్దరూ స్కూలు కుర్రాళ్లలా ఎంజాయ్ చేశారు. "రోజూ అనేక గంటలపాటు 'లాజిక్' గురించి చర్చించాడు. ఆ క్రమంలో తనలో తనే ఏదో గొణుక్కుంటాడు - కొంత జర్మన్, కొంత ఇంగ్లీష్‌లలో, ప్రశాంతగానే వుంటాడు. కాని అంతలోనే అకారణంగా రెచ్చిపోతాడు. ఎదుటి మనిషి మీద పెత్తనం

చలాయించాలనే తనమాతని స్థితి అన్నాడు పిన్సెంట్. విట్‌గెన్‌స్టీన్ మానసికస్థితి దిగజారింది. అది వున్మాదమో కాదో చెప్పలేని స్థితి. గురువుగారికి పిచ్చెక్కిందనే అనుకున్నాడు పిన్సెంట్. రసెల్ కనుగొనలేని Logical Foundation for Mathematics తనకు తెలిసిందని గ్రహించాడు. విట్‌గెన్‌స్టీన్. అయితే ఒక భయం పట్టుకుంది. తన ఆవిష్కరణలు ప్రపంచానికి తెలిసేలోగా తను చచ్చిపోతాడు. అర్జెంటుగా రసెల్‌కు సందేశం పంపించాడు. వీలైనంత త్వరలో తాము సమావేశం కావాలి. రసెల్ ఎక్కడ తప్పుచేశాడో తనాయనకు వివరిస్తాడు. సెలవుల నుండి తిరిగి వచ్చిన విట్‌గెన్‌స్టీన్ రసెల్‌తో సమావేశాలు కొనసాగించాడు. అదొక ఉద్విగ్నస్థితి. వాక్ప్రవాహం కొనసాగింది. తన శిష్యుడి వాదన రసెల్‌కు సరిగా అర్థంకాలేదు. "మాట్లాడటమెందుకు కాగితం మీద రాయమన్నాడు." విట్‌గెన్‌స్టీన్ నిరాకరించాడు. చివరకు ఒక స్టెనోగ్రాఫర్ తమ సంభాషణను రికార్డు చెయ్యటానికి అతణ్ణి ఒప్పించాడు రసెల్.

విట్‌గెన్‌స్టీన్ తొలి రచన Notes on Logic కు ఆధారం ఈ స్టెనోగ్రాఫర్ తీసుకున్న నోట్సే. (రసెల్ నంబర్లను క్లాసెస్‌గా నిర్వచించాడని యిప్పటికే తెలుసుకున్నాం.) సులభంగా కనిపించినా కొన్ని మౌలికమైన విషయాలను ప్రతిపాదించాడు విట్‌గెన్‌స్టీన్. (ఉదాహరణకు 'A' 'A' రెండూ ఒకటే.) Classes లో ఉన్న తేడాలను మనం ప్రతీకలుగా మాత్రమే గుర్తించవచ్చు. వీటిని పదాల్లో చెప్పటం సాధ్యంకాదు. అంటే, ఉచ్ఛరించటానికే వీలుపడదు. ఇలాంటి Concepts ని అర్థం చేసుకోవటం కూడా కష్టమే. విట్‌గెన్‌స్టీన్ చెప్పింది రసెల్ కొక్కడికే అర్థమైవుంటుంది. "తను నిజమనుకున్నది చెప్పి ఊరుకుంటే లాభం లేదు. అదెందుకని నిజమో వాదనా పూర్వకంగా నిరూపించాలని చెప్పాను. కాని అలాంటి వాదనల వల్ల ప్రతిపాదనలోని అందం తగ్గుతుందనీ, గులాబీ పువ్వును మురికి చేతులతో ముట్టుకున్నాట్టుగా వుంటుందనీ అన్నాడు" అని రాశాడు రసెల్. విట్‌గెన్‌స్టీన్ ఒక పర్ఫెక్షనిస్టు. అతను చెప్పింది మనం తక్షణమే, సంపూర్ణంగా అర్థం చేసుకోలేకపోతే, దాని గురించి చర్చించటమే అనవసరం.

ఈ Notes on Logic లో, ఫిలాసఫీ గురించి విట్‌గెన్‌స్టీన్‌కున్న అభిప్రాయాలను కొన్ని మనకు స్పష్టంగానే తెలుస్తాయి. అవి చాలా Original అభిప్రాయాలనటంలో సందేహంలేదు. కనీసం, 1912లో మరెవరూ అలా ఆలోచించలేదు. ఫిలాసఫీలో నిర్ధారణలుండవు. అది కొన్ని వివరణలకు మాత్రమే పరిమితం. ఫిలాసఫీ వాస్తవికతను ప్రతిబింబించదు. శాస్త్రీయ పరిశోధనలను అంగీకరించదు, నిరాకరించాడు. లాజిక్, మెటాఫిజిక్స్ కలిస్తే ఫిలాసఫీ. లాజిక్ ఆధారంగానే ఫిలాసఫీని అర్థం చేసుకోవాలి. అయితే, ఈ క్రమంలో వ్యాకరణ సూత్రాలను దూరంగా పెట్టాలి." ఇలాంటి ప్రతిపాదనలు వాస్తవిక పరిస్థితులను అర్థం చేసుకోవటానికి ఎంత మాత్రం సాయపడవు. పైగా, ఈయన భాషా సమస్యల గురించి ఎక్కువ వ్యాఖ్యానిస్తున్నాడా అనిపిస్తుంది.

విట్‌గెన్‌స్టీన్ ప్రకారం ఫిలాసఫీ అంటే లాజిక్. అతణ్ణి అర్థం చేసుకోవటానికి ప్రాతిపదిక ఇదే. ఈ ఒక్క విషయాన్ని వివరించటానికే అతడు తన శేషజీవితమంతా కృషి చేశాడని కూడా చెప్పవచ్చు. ఫిలాసఫీలో తను కొత్తదారుల్లో పయనించబోతున్నానని తెలుసుకున్నాక, పాత ఫిలాసఫర్లు ఏం వ్రాశారో తెలుసుకోవాలనుకుని "తొలి నుండి అందర్నీ చదివాడు. అధ్యయనం చేశాడు. గొప్పవాళ్లు, మహానుభావులు, తను యిన్నాళ్లూ ఆరాధించిన వాళ్లు యింత మూర్ఖంగా ఆత్మద్రోహం చేసుకుంటూ యింత తప్పులతడక వ్రాతలు ఎలా వ్రాశారని విస్తుపోయాడు" అంటాడు పిన్సెంట్.

కొత్త సత్యం ఆవిష్కరించబడే సమయం ఆసన్నమైంది. నార్వేకు వెళ్లి ఒంటరిగా, రెండేళ్లక్కడ గడపాలనుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. ఒంటరికగా అంటే ఒంటరిగా కాదు. 'లాజిక్' అనే తన యిష్టసఖితో. ఇది 'ఉన్మాదచర్య' అనుకున్నాడు రసెల్. వెళ్లకుండా నిరోధించటానికి తీవ్రంగా ప్రయత్నించాడు. అక్కడ చీకటిగా వుంటుందన్నాడు. తనకు వెలుగంటే అసహ్యమన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఒంటరిగా ఎలా వుంటావంటే, మనుషులతో సంపర్కం మానసిక వ్యభిచారమన్నాడు. "నీకు పిచ్చెక్కిందంటే", తననలా పుట్టించినందుకు భగవంతుడికి సదా కృతజ్ఞుణ్ణన్నాడు.

అంతే, ఎంతమంది ఎన్ని ప్రయత్నాలు చేసినా, విట్‌గెన్‌స్టీన్ నార్వేవెళ్లకుండా ఆపలేకపోయారు.

ఉత్తర ధృవానికి సమీపంలో వుంటుంది నార్వే. ఆదేశానికి ఉత్తరానవున్న ఒక కుగ్రామానికి చేరుకుని, తొంభైమైళ్లు బోటులో ప్రయాణించి మరో ఏకాంత ప్రదేశంలో నివాసం ఏర్పరుచుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. యూరోపులో సర్వ సుఖాలకూ, సదుపాయాలకూ అలవాటు పడిన మనిషి అక్కడ

మనగలగటం కష్టమే. కాని విట్‌గెన్‌స్టీన్ ప్రత్యేకతే అది. అది ఒంటరి జీవితం. నెలల తరబడి చీకటిగా ఉంటుంది. 'లాజిక్' మీద కృషి కొనసాగిందక్కడ. త్వరలోనే, "నాకు పిచ్చెక్కేలా వుంది" అంటూ రసెల్‌కు రాశాడంటే మనం ఆశ్చర్య పడనక్కర్లేదు. అయితే, ఆయన మానసిక పరిస్థితి ఎలా వున్నా, ఆ ఉత్తరాల్లో 'లాజిక్' గురించిన కొన్ని అద్భుత ఆవిష్కరణలు కూడా తళక్కుమన్నాయి. రసెల్, మాథమాటిక్స్‌కు Logical Foundation గురించి logic కు Foundation అని పరిశోధించాడు.

లాజికల్ ప్రతిపాదన నిజమోకాదో స్పష్టంగా తెలిసిపోయిందన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఉదాహరణకు "పండు ఎర్రగావుంది. ఎర్రగాలేదు." అంటే అది టాటాలడీ (ఎప్పుడూ నిజమే) అవుతుంది. పండు, ఎర్రగావున్నా, లేకపోయినా ఆ ప్రతిపాదన నిజమే అవుతుంది. "పండు ఎర్రగా లేదు. కాని ఎర్రగా లేదని అనలేం." అంటే ఆ ప్రతిపాదనలో అంతర్‌వైరుధ్యం స్పష్టం. ఒక ప్రతిపాదన టాటాలడీయో కాదో తెలుసుకోవాలంటే కొన్ని మౌలిక సూత్రాలవాదం అదే లాజిక్‌కు basis అన్నాడు విట్‌గెన్‌స్టీన్.

'పిచ్చెక్కటం' లాంటి చిన్నవిషయాలకు భయపడి, తన చీకటి స్వర్గం వదిలి వచ్చే స్వభావం కాదామనది. తల్లికి జబ్బుగా వుందని తెలియటంతో వియెన్నా వెళ్లక తప్పలేదు. డబ్బుకెప్పుడూ కొదవలేదు. ఇప్పుడు బాగా ఆస్తి కలిసి వచ్చిందని కూడా తెలిసింది. అయితే, వారసత్వంగా సంక్రమించిన సంపద తనకు అవరోధం కాగూడదని దాన్ని వీలైనంత త్వరగా వదిలించుకోవటానికి ప్రయత్నించాడు. అనేక మంది ఆస్ట్రియన్ కవులకు గుప్తదానాలు చేశాడు. అందులో ఒకడు Rilke Trackl, ప్రముఖ కవి.

మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభం కావటంతో ఆస్ట్రో-హంగేరియన్ సైన్యంలో చేరి స్వచ్ఛందంగా సేవలందించాడు విట్‌గెన్‌స్టీన్. అతడి మిత్రుడు పిన్సెంట్ బ్రిటిష్ సైన్యంలో చేరాడు రెండూ శత్రుపక్షాలు.

ఆస్ట్రియాలోనే పెద్దపేరున్న విట్‌గెన్‌స్టీన్ కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి, సైన్యంలో, ఆఫీసర్‌గా చేరటంచాలా సులభం. కాని మామూలు సైనికుడిగా వుండటానికే యిష్టపడ్డాడు. ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం అనటంలో సందేహం లేదు. తూర్పు సరిహద్దులో, రష్యన్లతో తలపడే దళంలో ఉన్నాడు విట్‌గెన్‌స్టీన్. యుద్ధరంగంలో డ్యూటీ చేస్తున్నప్పుడు కూడా లాజిక్ గురించీ ఫిలాసఫీ గురించీ నోట్స్ రాసుకుంటూనే వున్నాడు. సైన్యంలో చేరి, ప్రాణాల్నిపణంగా పెట్టినప్పుడు కూడా విట్‌గెన్‌స్టీన్‌కు ఆత్మహత్య గురించిన వూహలు తొలగిపోలేదు. ధైర్యంగా పోరాడినందుకు, అధికారుటాయన్ని రెండు మెడల్స్‌తో గౌరవించారు. (మనకు తెలిసిన మరొక సైనిక-ఫిలాసఫర్ సోక్రటీస్).

జీవితం ఒక "Intellecual Problem and a moral duty" అన్నది విట్‌గెన్‌స్టీన్ అభిప్రాయం. యుద్ధరంగంలో కూడా అతడి అంతస్సంఘర్షణ తగ్గలేదు. ఆత్మహత్యను గురించిన ఆలోచనలు తరచూ వేధించాయి. ఒక సెలవురోజున పుస్తకాల షాపుకెళ్లిన విట్‌గెన్‌స్టీన్‌కు టాల్‌స్టాయ్ రాసిన Gospels in Brief కనిపించింది. తను క్రైస్తవ వ్యతిరేకి. కుటుంబ నేపథ్యం వల్ల మతమంటేనే అసహ్యించుకున్నాడు. కాని టాల్‌స్టాయ్ పుస్తకం చదివి క్రైస్తవంలో విశ్వాసం పెంచుకున్నాడు. తన మేధోపరమైన అన్వేషణకూ, మత విశ్వాసాలకూ మధ్యనున్న వైరుధ్యాలను పరిష్కరించటానికి పూనుకున్నాడు.

నోట్‌బుక్స్‌లో లాజిక్‌తోపాటు మతపరమైన వ్యాఖ్యానాలు కూడా చేరాయి. అయితే, అందులో ఒక లాజికల్ విశ్లేషణ ఉంటుంది. "ఈ లోకం ఉందని తెలుసు. అందులో వీక్షించే కన్నులా నేనున్నాను."

ఈ లోకంలో కొన్ని సమస్యలున్నాయి. వాటినే మనం 'అర్థంవెదకటం' అంటున్నాం. కాని లోకానికి అర్థం లోకంలో లేదు. దాని వెలుపల ఉంది. "జీవితానికి అర్థం అంటే లోకానికర్థం-దాన్నే మనం దేవుడంటాం." ప్రార్థనకంటే జీవితార్థాన్ని అన్వేషించమని విట్‌గెన్‌స్టీన్ అభిప్రాయం (అంటే, దేవుణ్ణి నమ్మని రోజుల్లో కూడా). జీవితమంతా అతడు ప్రార్థిస్తూనే వున్నాడన్నమాట. అది అతడి స్వభావం. తానెప్పుడూ ఏ తప్పూ చెయ్యలేదనే గట్టినమ్మకం.

ఆ తర్వాత ఇచ్ఛ, సంకల్పం - గురించి ఆలోచించాడు విట్‌గెన్‌స్టీన్. ప్రారంభం నుండే అతడి జీవితాన్ని శాసించిందిదే. సంకల్పం వల్లనే మనకు లోకంతో సంపర్కం ఏర్పడుతుంది. అది మంచిదీ, చెడ్డదీ కావచ్చు. అంటే లోకానికి మనం కల్పించుకునే అర్థంలో మన సంకల్పవే ముఖ్యపాత్రపోషిస్తుంది. కాని, సంకల్పం, మంచిదో, చెడ్డదో

ఎలా తెలుస్తుంది? ఎవరు నిర్ణయిస్తారు? అసలా రెండు పదాల అర్థమేమిటి? సంకల్పం లోకంలో ఒక భాగమే అయితే, ఈ లోకాన్ని అర్థం చేసుకోవటానికి దాన్ని వెలుపలినుండి చూడవలసిన అవసరమే వుంటే, ఈ రెంటికీ (సంకల్పం-అర్థంచేసుకోవటం) ఏమిటి సంబంధం?

సహజంగానే వాదించటానికి నిరాకరిస్తాడు విట్‌గెన్‌స్టీన్. "వాదన పువ్వు అందాన్ని మలినం చేస్తుంది". తాత్త్విక చర్చల్లో ఇలా మాట్లాడటం ఒక చెడ్డ అలవాటని రసెల్ అతన్ని చాలాసార్లు మందలించాడు. ఇప్పుడు మరోసారి హెచ్చరించటానికి రసెల్ అందుబాటులో లేడు. యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలకుగాను బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని నిర్బంధించింది. అకస్మాత్తుగా వాదించటానికి నిరాకరించే ఈ దురలవాటే విట్‌గెన్‌స్టీన్‌కి కొంత అపఖ్యాతి తీసుకువచ్చింది. అయితే ఈ లోపం అతడు గుర్తించలేదా? ఒక ప్రతిపాదన చేసి దాన్ని వివరించక పోవటమంటే ఎవరో మార్మిక వాదులు తమకు తోచింది చెప్పి 'ఇదింతే' అన్నట్టుగా వుండదా?



బెర్ట్రండ్ రసెల్

1918లో అధికారులు అతణ్ణి ఆఫీసర్‌గా ప్రమోట్ చేసి ఇటిలియన్ యుద్ధరంగానికి పంపించారు. ఇన్నాళ్లుగా అతడు అప్పుడప్పుడూ పిన్సెంట్‌తో వుత్తర ప్రత్యుత్తరాలు కొనసాగిస్తూనే వున్నాడు. "మావాడు మరణించాడు. వాడికి నువ్వంటే ఎంతిష్టమో" అంటూ రాసింది పిన్సెంట్ తల్లి. తన తొలి ముఖ్యరచనను డేవిడ్ పిన్సెంట్ స్మృతికి అంకిత మిచ్చాడు విట్‌గెన్‌స్టీన్. 1918లో ఇటలీ విజయంతో యుద్ధం ముగిసింది. పరాజితలైన ఆస్ట్రియన్లు చెల్లాచెదరై దొరికిన రైలెక్కి ఎలాగోలా సరిహద్దులు దాటేరు. కాని, పిరికితనమంటే తెలియని లెఫ్టినెంట్ విట్‌గెన్‌స్టీన్ పారిపోవటానికి నిరాకరించాడు. ఇటాలియన్లకు బందీగా చిక్కిన విట్‌గెన్‌స్టీన్ వద్ద యిన్నాళ్లు తను రాసుకున్న నోట్సుపుస్తకం దొరికింది. అదే చరిత్ర సృష్టించిన Tractatus-Logico-Philosophicus. ఆధునిక తాత్త్విక చరిత్రలో అంతకన్న ముఖ్యమైన గ్రంథం మరొకటిలేదు. అందులోని మొదటి వాక్యంతోనే స్పష్టమవుతుంది. తాత్త్విక అవగాహనకొత్త దశకు చేరుకున్నదని. ఈ ప్రతిపాదనలు, తెలుగులో కన్న, ఇంగ్లీషులోనే ఎక్కువ సులభగ్రాహ్యంగా వుంటాయి.

1. The world is all that is The case.

లోకం వుంది. అంతే

1.1: The world is the totality of facts, not of things.

లోకం ఒక యదార్థ సత్యాల సమాహారం. వస్తువుల సముదాయం కాదు.

ఏ ఒక్క దాని గురించీ, వివరణ యివ్వకుండానే, అనేక ప్రతిపాదనలు కొనసాగుతాయి.

1.13. The facts in logical space are the world.

తర్కానికి లొంగే యదార్థసత్యాలు (మాత్రమే) ఈ లోకం.

1.2. The world divides into facts.

యదార్థసత్యాలుగా ఈ లోకం విభజింపబడుతుంది. ఇక, చివరి ప్రతిపాదన చదివి మనం ఉలిక్కిపడక తప్పదు.

7. What we cannot speak about, we must pass over in silence.

మాట్లాడలేని విషయాల గురించి మాట్లాడకూడదు.

రెండు మూడు పదాల్లో, సంక్షిప్తంగా యింత ప్రగాఢ తాత్త్వికతను వ్యక్తం చేసిన మహానుభావులు చరిత్రలోనే అరుదుగా కనిపిస్తారు. అంలాంటి కొందరు: సోక్రటీస్–know thyself నిన్ను నువ్వు తెలుసుకో. Descartes: I Think, therefore I am. Nietzsche - God is dead.

గంభీరమైన విషయాలను సులభంగా చెప్పటం విటిగెన్‌స్టీన్‌కే సాధ్యపడింది. ఇది ఫిలాసఫీయా లేక కవిత్వమా అని కొన్ని సార్లు ఆశ్చర్యం వేస్తుంది.

మనం మాట్లాడుకోగలిగిన విషయాలను, అర్థవంతంగా వివరించటానికి చేసిన ప్రయత్నం Tractatus.

**ఇంకావుంది....**

# భారతీయులు హిందువులుగా ఎలా మారారు?

– ఫజులుల్లా ఖాన్

హిందు అనే పదం గుప్తరాజుల అనంతరం అనగా క్రీ.శ. ఐదవ శతాబ్దం నుంచి వాడుకలోకి వచ్చింది. మొదటిసారిగా అరబ్బులు ఈ పదాన్ని ఉపయోగించారు. ఆ తర్వాత ఇండియాలో నివసించే ప్రజలను ప్రస్తావించే సందర్భంగా ఇతరులు ఈ పదం వాడారు.

గుప్త సామ్రాజ్యం పతనం కావడంతో బ్రాహ్మణులు తమ ప్రయోజనాలను కాపాడే విదేశీ దండయాత్రికులను ఆహ్వానించారు. రాజపుత్రులు ఈ విధంగా రంగం మీదికి వచ్చారు. రాజపుత్రుల పుట్టుకకు సంబంధించిన కచ్చితమైన ఆధారాలేవీ చరిత్రకారులకు అందలేదు. బ్రాహ్మణవాదానికి పునఃప్రతిష్ట చేయడానికి బ్రాహ్మణులు రాజపుత్రుల్ని క్షత్రియులుగా హోదా ఇచ్చి తమకు అనుకూలంగా వాడుకున్నారు. రాజపుత్రుల సాయంతో బౌద్ధాన్ని బ్రాహ్మణవాదం పరమక్రూరంగా అణచివేసింది. 8 నుంచి 10వ శతాబ్దం వరకు బౌద్ధ ఆరామాలను కూలగొట్టారు. భిక్షువులను హతమార్చారు. గ్రంథాలను తగలబెట్టారు.

యుద్ధప్రియులైన రాజపుత్రులు నిరంతరం పరస్పరం కలహించుకుంటూ చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయారు. బ్రాహ్మణపురోహితులు, రాజపుత్రులు కలగలసి ప్రజల్ని దోచుకునేవారు. రాజప్రాసాదాల కోసం, దేవాలయాల కోసం ప్రజలను పీల్చి పిప్పి చేశారు. దేవాలయాల నిర్మాణం విస్తృతంగా జరిగింది. దేశమంతా దేవాలయాలు వెలిశాయి. దేవాలయాలలోనే బంగారు, వెండి రాసుల్ని దాచారు. ప్రజలను ఎవరూ పట్టించుకోలేదు.

రాజపుత్రులు నిరంతరం తాగి, తందనాలాడి సుఖలాలసులయ్యారు. రాజులు నిరంతరం సంపదకోసం, స్త్రీల కోసం కలహించుకుంటూ వుండేవారు. పురోహితులు దేవాలయ ప్రలోభాల్లో మునిగి తేలుతుండేవారు. భారతదేశం భారతీయ రాజులు, పురోహితుల చేతుల్లోనే వెన్నుపోటుకు గురయ్యింది. ముస్లింలను భారత దేశంపైకి దండెత్తవలసిందిగా భారతీయులే ఆహ్వానించారు.

బ్రాహ్మణులు శతాబ్దాల తరబడి తమ పట్టును కొనసాగించారు. గ్రీకులు, సింథియనులు, చైనీయులు, హూణులు తదితర విదేశీయులతో బ్రాహ్మణులు నిత్యసంబంధ బాంధవ్యాలను కొనసాగించారు. తమకు కొరకరాని కొయ్యగా మారిన రాజును కూలదొయ్యడానికి విదేశీయుల సహాయం కావలసి వచ్చినప్పుడల్లా వాళ్ళు వాయువ్య ప్రాంతంలో తమ పట్టును ఉపయోగించుకొని విదేశీయులను దేశంలోకి దండయాత్రలకు ఆహ్వానించారు.

బుద్ధుడు, అశోకుడు కూడా బ్రాహ్మణవర్గంతో ప్రత్యక్ష యుద్ధానికి తలపడకుండా జాగ్రత్తపడ్డారు. రాముడు, సీతలకు పట్టిన గతి క్షత్రియ రాజుల వినాశనం, తదితర సంఘటనలు పునరావృతం కాకుండా వారు జాగ్రత్తపడి వుండవచ్చు.

ముస్లిం అనే పదం పదమూడవ శతాబ్దం నుంచి వాడుకలోకి వచ్చింది. అరబ్బులను, టర్కులను, పర్షియన్‌లను రాజకీయపరంగానే ప్రస్తావించారు తప్ప మతపరమైన అర్థంలో కాదు. తుర్క్‌లు తురుష్కులుగా, అరబ్బులు యవనులుగా పిలువబడ్డారు.

భారత ఉపఖండంలో వివిధ ప్రాంతాల్లోకి వివిధ కాలాల్లో ముస్లింలు వచ్చారు. అన్ని ప్రాంతాల్లోకి వారు ఒకే సమయంలో రాలేదు. అరబ్బులు క్రీ.శ.ఎనిమిదవ శతాబ్దంలో సింధు ప్రాంతాన్ని జయించి తమ పరిపాలనను వ్యవస్థాపించారు. టర్కులు పదకొండవ శతాబ్దంలో పంజాబ్‌లోని కొంత భాగాన్ని ఆక్రమించారు. పదమూడవ శతాబ్దంలో తమ అధికార

డాక్టరు ఫజులుల్లా ఖాన్, ఫోన్ : 9948254564

ప్రాబల్యాన్ని ఉత్తర భారతంలోని విస్తృత ప్రాంతాలకు విస్తరింపచేశారు. ముస్లిం పాలక వంశాలు మొదట 14వ శతాబ్దంలో దక్కన్‌లో మత అధికారాన్ని స్థాపించారు. దూరంగా వున్న దక్షిణంలో తర్వాత చాలా కాలానికి ముస్లిం పాలకులు తమ ఏలుబడి సాగించారు. ఈ విధంగా ముస్లిం పాలన ఏర్పాటుకు సంబంధించి ఒకే ఒక సమయమంటూ ఏదీ లేదు. ఆరేబియాలో ఏడవ శతాబ్దంలో ఇస్లామ్‌కు ప్రాతిపదిక సామాజిక సమానత్వం. కాని 13వ శతాబ్దినాటికి భారతదేశంలో ఇస్లాంకు మూలం పరమ రాచరిక వ్యవస్థ స్థాపనగా రూపొందింది. రాజరిక వ్యవస్థలూ, పాలక వర్గాలు సామాజిక సమానత్వ భావనకు వ్యతిరేకమైనవి. అంతే గాక ఇస్లాంకు వివిధ ప్రజలు వివిధ రకాల అర్థాలు ఇచ్చుకున్నారు.

అల్లాఉద్దీన్ ఖిల్జీ, మహమ్మద్ తుగ్లక్, అక్బర్, ఔరంగజేబు, ఉలేమా, సూఫీ తత్వవేత్తలు అంతా ఇస్లాంను నమ్మినవారే అయినప్పటికీ ఇస్లాం అంటే ఎవరి అర్థాలు వారు ఇచ్చుకున్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో కానీ, వ్యక్తి గత జీవితంలో కానీ అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఇస్లాం నిబంధనలను పాటించలేదని ఆయనకు సమకాలీన చరిత్రకారుడైన జియా బరానీ రాశారు. తిరుగుబాటుదారులైన హిందూ జమీందార్లను, ముస్లిం ఇక్తదార్లను అణచివేయడానికి అల్లావుద్దీన్ ఖిల్జీ గట్టి చర్యలు తీసుకున్నాడు. అయితే వాస్తవాల్ని దాచి కొంత మంది చరిత్రకారులు అల్లావుద్దీన్ ఖిల్జీని మతోన్మాదిగా, హిందువులంటే బొత్తిగా సహించలేని వాడుగా చిత్రించారు.

ఆరేబియాలో ఆవిర్భవించిన ఇస్లాం సమకాలీన ప్రపంచంపై గణనీయమైన ప్రగతిశీల ప్రభావాన్ని ప్రసరించింది. ప్రవక్త మహమ్మద్ గొప్ప సామాజిక మార్పు కోసం ప్రయత్నించారు. ఒకే భగవంతుడు అనే భావన, సామాజిక సమతా భావనను సూచించింది. ప్రతి ఒక్కరూ ఎదుటి వారికి సమానమే. ఈ విధంగా ముస్లిం భ్రాతృభావం (మిల్లత్) ఈ మౌలిక భావన నుంచి ఆవిర్భవించిందే. ఫలానా వారే పాలక వర్గంగా ఉండాలని కానీ, ఫలానా వారే మత పెద్దలుగా వుండాలని ఇస్లాం ప్రబోధించదు.

అభివృద్ధి చెందిన నాగరికత, పరిపాలనా వ్యవస్థగల పర్షియాపై ఇస్లాం విజయం సాధించింది. వివిధ ప్రాంతాల్లో విస్తరించిన ఇస్లాం విస్తారమైన సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. తమకు దైవికమైన హక్కులున్నాయంటూ రాజుల నాయకత్వాన పాలకవర్గం ఒకటి బయలుదేరింది. 11, 13వ శతాబ్దంలోనూ ఆ తర్వాతనూ తమ సామ్రాజ్యాలను విస్తరింపచేసిన వారిని గమనించినట్లైతే వారు మతపరమైన విశ్వాసాలతో నిమిత్తంలేకుండానే తమ సామ్రాజ్యాలను విస్తరించారు. సాహసవంతమైన పోరాట వర్గంగా టర్క్‌లు భారతదేశానికి సామ్రాజ్య విస్తరణకు వచ్చారే తప్ప మత విస్తరణ కోసం వచ్చిన వారు కాదు. తమ సామ్రాజాన్ని స్థాపించిన టర్కులు దాదాపు 12 వేల మంది సైనికులతో ఇక్కడకు వచ్చారు. తమ ఉన్నత స్థాయి సైనిక నిర్మాణం ద్వారా, ఎత్తుగడల ద్వారా వారు హిందూ పాలకులను ఓడించారు. తమ పాలనా సిబ్బందిని కేంద్రం నుంచి గ్రామస్థాయికి తరలించకుండా జాగ్రత్త పడ్డారు. ఎందుకంటే తాము అధిగమించలేనంత ప్రతిఘటన ఎదుర్కోవలసి వుంటుందని గ్రహించిన టర్కులు మహాపాలకులను జయించాక హిందూ పాలక వర్గంలోని కిందిస్థాయి వారితో అనగా రాజులతో, రాణాలతో, జమీందారలతో, చౌదరీలతో రాజీ చేసుకున్నారు. రాజీ షరతులు ఇవి. జమీందార్ల వగైరాల భూమి స్వాధీనం చేసుకోబడదు. వారి భూమి వారికే వుంటుంది. వారి హోదాకు, ప్రత్యేక సౌకర్యాలకు కూడా హామీ వుంటుంది.

వారు చేయాల్సిందల్లా సుల్తాన్‌కు ఏటా నిర్ణీత మొత్తంలో కప్పం చెల్లించాలి. వారు సకాలంలో ఎంత కాలం పాటు సుల్తాన్‌కు కప్పం చెల్లిస్తారో ఒకరిపై మరొకరు ఎంత కాలం దాడులు చేసుకోకుండా వుంటారో అందాకా వారు తొలగించబడరు. వారి భూముల పాలనా వ్యవహారంలో సుల్తాన్ జోక్యం వుండదు. వారు కప్పం చెల్లిస్తున్నారంటే దాని అర్థం సుల్తాన్ సార్వభౌమాధికారాన్ని ఆమోదించినట్లే.

ఈ విధంగా పరిపాలనలోని కింది మెట్లన్నీ హిందువుల చేతుల్లోనే పూర్తిగా ఉండిపోయాయి. టర్కులు తమ సామ్రాజ్యాలను వ్యవస్థాపించుకోవడంలో వారికి సహాయపడింది హిందువులే. వారి కోసం వారి పరిపాలనా వ్యవహారాలను నిర్వహించింది కూడా హిందువులే. హిందువుల తోడ్పాటే లేకపోతే టర్కులు దీర్ఘకాలం పాటు భారతదేశంలో నిలవగలిగేవారు కాదు.

హిందువులు కూడా పాలకవర్గంలో భాగంగా తయారయ్యారు. ఆ హిందువులు, టర్కులు రైతుల అదనపు ఉత్పత్తిపైనే జీవించారు. ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన వారిని లేక అవిధేయత వ్యక్తం చేసిన వారిని మాత్రమే మతం మార్చు కోవలసిందిగా సూచించారు. ఇలాంటి సందర్భాలలో

వారి ప్రాముఖ్యత దృష్ట్యా వారిని క్షమించి, ప్రభుత్వం పట్ల వారు తిరుగులేని విధేయత ప్రకటించేలా చూడాలని ప్రభుత్వం కోరుకుంది. సొంత మతాన్ని వదులుకొని చక్రవర్తి మతాన్ని స్వీకరించడాన్ని ఆ కాలంలో విధేయతగా పరిగణించేవారు. షాజహాన్, ఔరంగజేబుకు సన్నిహితంగా వుండే ముఖ్యమైన వ్యక్తులు, రాజకీయంగా కీలకపాత్ర వహించే కొన్ని కుటుంబాలనూ ఇస్లాం మతస్తులుగా మారడాన్ని వక్రీకరించి మొత్తం హిందువులను ముస్లింలుగా మార్చారని చిత్రీకరించారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. నిరంతరం విధేయులుగానూ, సమర్థులుగానూ వుండిన హిందూ రాజులను కానీ, రాణాలను కానీ, రాజపుట్ ప్రభువర్గాలను కానీ ఇస్లాం మతం పుచ్చుకోవలసిందిగా కోరిన దాఖలాలు లేవు.

హిందువులు ముస్లింలుగా మారడానికి హిందువులపై విధించిన నిర్బంధమే జిజియా అని కొంత మంది వితండవాదం చేస్తున్నారు. అయితే వారు ఒక విషయం మరిచిపోతున్నారు. హిందువులు ముస్లింలు అయ్యాక కూడా జకాత్ చెల్లించాలి. కేవలం ముస్లింలపైనే విధించే పన్ను జకాత్.

నిజంగా జిజియా పన్నుకే భయపడి హిందువులు ముస్లింలుగా మారారా? కేవలం కొద్దిపాటి పన్ను మినహాయింపు పొందడానికి మతం మార్చుకొని తమ మతాన్ని అంత చౌకగా పరిగణించారా? ఒక ఏడాదిలో మిగిలి వున్న ఆదాయంపై వెయ్యికి రెండున్నర శాతం జకాత్‌ను ముస్లింలు, జిజియాను హిందువులు చెల్లించాల్సి వుండేది. దాన్ని బైతుల్‌మాల్‌గా పరిగణించేవారు. అప్పట్లో అయితే రాజు ఖజానాకు బైతుల్‌మాల్ చేరేది. ఆ డబ్బును రాజు పేదసాదల సంక్షేమం కోసం ఖర్చుపెట్టాలి. ముస్లింలలో ఇప్పటికీ జకాత్‌ను కచ్చితంగా తీసి రంజాన్ నెలలో పేదలకు పంచే సాంప్రదాయం కొనసాగుతూనే వుంది.

హిందువులను ఇస్లామ్‌లోకి మార్చుకోవడానికే దేవాలయాలను కూల్చివేశారనే వాదనలలోనూ పసలేదు. దేవాలయాలను పడగొట్టడం ద్వారా హిందువులను ఇస్లాంలోకి మార్చవచ్చునని ఎవరూ ఊహించరు. దేవాలయాల్ని పడగొట్టితే ఇస్లాం పట్ల ప్రేమకాదు, ద్వేషమే పుట్టేది కాబట్టి వారిని ముస్లింలుగా మార్చడానికి కాక మరే ప్రయోజనం కోసమో అయివుంటుందని కచ్చితంగా చెప్పవచ్చు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే సాధారణంగా శత్రువుల భూభాగంలోని దేవాలయాలనే ధ్వంసం చేశారు కాని సుల్తాన్ సామ్రాజ్యంలోని దేవాలయాల్ని ధ్వంసం చేయలేదు.

1020లో మహమ్మద్ ఘజనీ గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయాన్ని దోచుకున్నప్పుడు అపారమైన సంపద లభించింది. ఘజనీ సోమనాథ్ దేవాలయం నుంచి కొల్లగొట్టిన సొమ్ములో పదో వంతు కూడా భారతదేశంలోని ఏ రాజు ఖజానాలోను లేదు. అంతటి సంపదను దేవాలయాల వెనుక పురోహితులు పోగు చేశారు. నాట్యాలతో, గానాబజానాలతో బ్రాహ్మణుల కోరికలన్నీ తీర్చే కల్పవల్లిగా దేవాలయం వుండేది.

ఔరంగజేబు హయాంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు, తిరుగుబాటు చేయడానికి దేవాలయాలు కేంద్రాలుగా వుండేవి. కాబట్టి శత్రుభూభాగంలోని దేవాలయాలను పడగొట్టడమంటే సుల్తానుల విజయ సంకేతం అది. సుల్తానులే కాదు హిందూ పాలకులు కూడా ఇలాగే దేవాలయాలను పడగొట్టారు.

శుభతవర్మన్ (1193-1210) గుజరాత్‌పై దండెత్తి దబాయ్, క్యాంబేలలోని జైనదేవాలయాలను దోచుకున్నాడు. కాశ్మీర్ పాలకుడు హర్షుడు తన ఖజానాను నింపుకోవడానికి గాను తన భూభాగంలోని నాలుగు దేవాలయాలు మినహా అన్ని దేవాలయాలను ధ్వంసం చేసి అక్కడి సంపద తీసుకెళ్ళాడు. అప్పుడు ఒక్కరు కూడా నిరసన వ్యక్తం చేయలేదు. డబ్బు మరింత అవసరమై తన భూస్వాములు చెల్లించాల్సిన కప్పం పెంచే సరికి ఆయనను శ్రీనగర్ వీధుల్లోకి ఈడ్చుకొచ్చి చంపిపారేశారు. హర్షుడు దేవాలయాలను పడగొట్టడం పథకం ప్రకారం వ్యవస్థీకృతంగా నిర్వహించాడు.

హర్షుడు "దేవోత్పాత నాయక" (అంటే అర్థం దేవుళ్ళని పడగొట్టే అధికారి) అనే అధికారిని నియమించాడు. అతని పని దేవాలయాలను దోపిడీ చేయడమే అని కల్హణుడు తన రాజతరంగిణిలో తెలిపాడు. దేవాలయాలను పడగొట్టే వాడంటే ఇక్కడ మతపరమైన అర్థంలో విగ్రహారాధన వ్యతిరేకి అని కాదు. అసలు అర్థం సంపద కోసం అతడు దేవాలయాలను పడగొట్టి ఆ సంపదను ఇతర ప్రయోజనాలకు వాడుకున్నాడు అని. ముస్లిం పాలకుల కాలంలో సామూహిక స్థాయిలో మతాంతరీకరణ జరగలేదనేది చారిత్రక వాస్తవం. ఇక్కడ ఒక

విషయం గమనించాలి. అశోకచక్రవర్తి బౌద్ధం వ్యాప్తి చేసేందుకు పరుగులుతీస్తే, ప్రజల్ని బౌద్ధులుగా మార్చడానికి ప్రయత్నిస్తే, అందుకోసం రాజ్యాంగ యంత్రాన్ని అధికారికంగా వినియోగిస్తే, మనమేమో ఆయన్ను గొప్ప చక్రవర్తిగా పరిగణిస్తున్నాం. ముస్లింల పాలనలో మతాంతరీకరణలో ఆసక్తి వ్యక్తం చేయకపోయినప్పటికీ తప్పుడు వ్యాఖ్యానాలతో చరిత్రను వక్రీకరిస్తున్నారు.

ముస్లిం పాలనలో సర్వసంపూర్ణమైన లౌకిక ప్రభుత్వం కొనసాగిందని చెప్పడం నా ఉద్దేశం కాదు. లౌకిక ప్రభుత్వ భావనే ఆధునిక భావన. చారిత్రకంగా మధ్యయుగ శతాబ్దాలకు కానీ అంతకు ముందు శతాబ్దాలకు కానీ ఆ భావనను అన్వయించలేము కాబట్టి, ఒక వేళ ప్రభుత్వం మతం మార్పిడి కార్యక్రమంలో పాల్గొన్నప్పటికీ అశోకుని విషయంలో అర్థం చేసుకున్నట్లే దీనిని కూడా మనం అర్థం చేసుకోవాలి.

ఏదేమైనా మధ్యయుగంలో ముస్లిం పాలకులు రాజకీయాలను మతం కోసం వాడుకోడానికి బదులుగా మతాన్ని రాజకీయాల కోసం వాడుకున్నారు. సుల్తానులు ఎక్కువగా వేతనాలిచ్చి తమకు అనుకూలంగా వుండే ఉలేమాలను నియమించుకున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలపై తమ పలుకుబడిని ఉపయోగించవలసిందిగా ఉలేమాలను కోరారు. ఎవరో కొద్ది మంది మినహా మొత్తానికి ఉలేమాలందరూ సుల్తాన్ ఆదేశం పాటించడానికి సుల్తాన్‌కు అనుకూలంగా ఇస్లాంను వ్యాఖ్యానించడానికి కుతూహలం వ్యక్తం చేశారు.

షరియత్ ప్రకారం నలుగురు భార్యలకు అనుమతి వుంది. అయితే చక్రవర్తికి తొమ్మండుగురు సతీమణులు వుండేవారని అక్బర్ కాలం నాటి రాజాస్థాన చరిత్రకారుడు బరౌనీ అంటారు. అక్బర్ ఈ విషయంలో ఉలేమాల సమావేశం ముందు ప్రతిపాదించాడు. ఉలేమాలలో ఒకరు చక్రవర్తి మెహర్బానీ సాధించడానికి గాను ఇస్లాం శాసనం ప్రకారం ముస్లింలకు 2-2, 3-3, 4-4, మొత్తం 18 మంది భార్యలుండవచ్చని సూచించారు. ఇతరులేమో అతను మరీ దూరం వెళుతున్నాడని భావిస్తూ 2, 3, 4 అనగా తొమ్మిది మంది భార్యలు కలిగి వుండడం చట్టసమ్మతమేనని సూచించాడట. వివిధ రకాల గ్రూపుల మధ్య, వ్యక్తుల మధ్య అంతులేని పోరాటాలు సాగాయి. మతపరమైన గ్రూపులు, ప్రాంతీయ గ్రూపులు, జాతి పరమైన గ్రూపులు నానారకాల గ్రూపుల మధ్య ఇట్టి పోరాటాలు సాగాయి. ముస్లిం ప్రభువర్గాలు సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాయి. వాళ్లల్లో వాళ్లే తన్నుకున్నారు. హిందువులూ అంతే, వీరు ఇతరులతో ఎలా పోట్లాడారో పరస్పరం వాళ్లల్లో వాళ్లే కలహించుకున్నారు. ఇదంతా ఆదాయం (పన్ను) కోసమో, రాజకీయ అధికారం కోసమో అయినప్పటికీ వారి మధ్య ఒక ఉమ్మడి స్వభావం ఉండేది.

ముస్లిం ప్రభువర్గాలు, హిందూ ప్రభువర్గాలు ఇద్దరికీ ఆధారం పన్నులే. అంటే రైతులు తమ అదనపు ఉత్పత్తి నుంచి చెల్లించే పన్నులతోనే వారు బతికారు. హిందూ ప్రభువర్గాలు, ముస్లిం ప్రభువర్గాలు ఇద్దరూ కూడా ప్రజల్ని దోచుకుతిన్నారు.

మరాఠీ, మొగల్, ఆఖరుకు బ్రిటిష్ పన్నుల విధానాలు కూడా దాదాపు ఒకే మాదిరిగా ఉంటాయి. వాస్తవ పరిపాలనలో మతతత్వం పనిచేసే అవకాశం లేదు అని తెలుస్తుంది. ప్రపంచంలో అన్ని చోట్లలాగే భారత రాజ్యాల రాజకీయాలను కూడా మతపరమైన అవసరాలు కాక ఆర్థిక రాజకీయ అవసరాలే నడిపాయని భారత రాజకీయ చరిత్రను జాగ్రత్తగా అధ్యయనం చేసుకుంటే స్పష్టంగా తెలిసేది. పాలకులు, తిరుగుబాటుదార్లు ఇరువురు కూడా తమ భౌతిక ప్రయోజనాలకు, దురాశలకు మత నినాదాలను ముసుగుగా మాత్రమే వాడుకున్నారు.

ఆనాటి సాంస్కృతిక రంగంలో సహకారం, సమైక్యత ఉన్నట్లు, పైభాగంలో ఉమ్మడి సంస్కృతి కింద గ్రామ స్థాయిలో హిందూ ముస్లిం సామరస్య సంబంధాలు ఉన్నట్లు సామాజిక, సాంస్కృతిక చరిత్ర తేటతెల్లం చేసి వుండేది.

18వ శతాబ్దంలోనూ ఆ మాటకొస్తే 20వ శతాబ్దంలోనూ ఒక పైవర్గపు ముస్లింకు క్రింది వర్గపు ముస్లింతో కంటే పైవర్గంలోని హిందువుతోనే ఎక్కువ సాంస్కృతిక సారూప్యతలుండేవి. ఒక పంజాబీ హిందువు బెంగాలీ హిందువు కంటే పంజాబీ ముస్లింకే దగ్గరగా వుండేవాడు.

అలాగే బెంగాలీ ముస్లిం పంజాబీ ముస్లిం కన్నా బెంగాలీ హిందువుకే దగ్గరగా వుండేవాడు. మతం మూలానే కాక తెగ, కులం వగైరాల వల్ల కూడా సమాజంలో విభజనలు, భిన్నత్వాలున్నట్లు సామాజిక సాంస్కృతిక చరిత్ర స్పష్టం చేస్తోంది.

భారతదేశంపై ముస్లిం దండయాత్రికులు రావడం వలన జరిగిన ఒక ముఖ్యమైన పరిణామం ఏమిటంటే హిందూ సమాజానికి బ్రాహ్మణులు తిరుగులేని నాయకులయ్యారు. వారి మాటే శాసనమయింది. కేవలం మూడు కులాలకే అంటే ఉన్నత వర్గాల ప్రజలకే బ్రాహ్మణులు పురోహితులుగా గతంలో చెప్పుకునే వారు. శూద్రులు, ఇతర భారతీయులను దూరంగానే వుంచారు. ముస్లిమేతరులందరినీ హిందువులని పిల్చారు. అంటే వాళ్ల ఉద్దేశ్యం ముస్లింలు కాని వారని మాత్రమే.

ఈ విధంగా మొట్ట మొదటి సారిగా మొత్తం భారత ప్రజానీకం అంతా బ్రాహ్మణుల ఆధిపత్యం కిందకు ఈడ్చుకురాబడ్డారు. కోట్లాది మంది ప్రజానీకం హిందూ అనే ఐక్యత భావంతో బ్రాహ్మణ పురోహితుల పాదాక్రాంతమైయ్యారు. అసలు హిందూ అన్న పదమే విదేశీయమైనది. హిందువులు ఏ సంస్కృత గ్రంథంలోనూ ఆ పదాన్ని ఉపయోగించలేదు. ఇలా భారతీయులు హిందువులయ్యారు. వారి మతం హిందూమతమైంది. బ్రాహ్మణ మతం హిందూ మతమైంది. అది ముస్లింలు కాని వారందరి మతం అయింది. మొత్తం హిందువులను బ్రాహ్మణులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. మరో ప్రక్క బ్రాహ్మణులు తమ స్వప్రయోజనాల కోసం ముస్లిం రాజులకు అనుకూలంగా పనిచేశారు. కేవలం బ్రాహ్మణులే కాదు అగ్రవర్ణాల వారు సైతం ఇస్లాం స్వీకరించారు. కాని కులాధిక్యతను మాత్రం వారు వదులుకోలేదు. పశ్చిమోత్తర రాష్ట్రాలలో వారు ఇస్లాం స్వీకరించినా జాట్ కులస్తులుగానే మిగిలిపోయారు. గంగా, యమునా తీరంలో అట్టడుగువర్గాల నామశూద్రులు అత్యధికంగా ఇస్లాం స్వీకరించారు. బీహారు, బెంగాలు రాష్ట్రాలలో వీరు అస్పృశ్యులతో సమానం.

ఇస్లాం విదేశీయమే. కాని ముస్లింలు విదేశీయులు కారు. వారంతా పూర్వ దశలో హిందువులే. హిందూ సమాజంలోని కుల విభేదాలతో విసిగిపోయి చాలా మంది మతం మార్చుకున్నారు. హిందూ సమాజంలోని కుల విభేదాలే ఇస్లాం వ్యాప్తికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మి




**మిసిమి**
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

**బహుమతి**

పొందండి!

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**





ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 7. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 8. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi



# యానాం
# ఆంధ్రలో ఎందుకు విలీనం కాలేదు?

- బొల్లోజు బాబా

యానాం అనేది 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాచే ఆవరింపబడిన ఒక చిన్న ప్రాంతం. ఇక్కడి ప్రజల మాతృభాష తెలుగు. వీరి సంస్కృతి సాంప్రదాయాల మూలాలు పొరుగునున్న తెలుగువారితో ముడిపడి ఉన్నాయి. అలాంటప్పుడు యానాం భారతావనిలో విలీనమైనపుడు సమీప ఆంధ్రాలో ఎందుకు కలిపేయలేదన్న ప్రశ్న సహజంగా ప్రతిఒక్కరికీ కలుగుతుంది.

1953 లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడే సమయానికి యానాం ఫ్రెంచివారి పాలనలో ఉంది. ఆ తరువాత 1956 లో భాషాప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయానికి ఫ్రెంచివారు ఇక్కడ నుంచి భౌతికంగా నిష్క్రమించినా, యానాంపై భారతదేశానికి చట్టపరమైన హక్కు ఇంకా రాలేదు. కనుక ఆ సమయాలలో యానాన్ని సమీప తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగం చేయాలన్న ఆలోచనే ఎవరికీ ఉండకపోవచ్చు. ఎందుకంటే అప్పటికింకా యానాం విమోచనం చెంది భారతావనిలో విలీనమైన తరువాత కూడా దీనిని సమీప ఆంధ్రప్రదేశ్‌లో కలపకుండా ప్రత్యేకంగా ఉంచటానికి ప్రధాన కారణం ఫ్రెంచివారు వెళ్ళిపోయేముందు భారత ప్రభుత్వంతో చేసుకొన్న ఒక ఒప్పందం. ఫ్రెంచివారు తమ కాలనీలైన యానాం, పాండిచ్చేరీ, మాహె, కారైకాల్‌లను స్వతంత్ర్య భారతావనికి అప్పగించి వెళ్ళేప్పుడు, భారత ప్రభుత్వంతో 1956, మే 28 న ట్రీటీ ఆఫ్ సెషన్ (Traite de Cession) ను చేసుకొన్నారు.

ఈ ఒప్పందములో ఆర్టికల్ 2 ఇలా చెపుతుంది.

The Establishments will keep the benefit of the Special Administrative Status in force prior to 1 November 1954. Any constitutional changes in this Status which may be made subsequently shall be made after ascertaining the wishes of the people.

(సారాంశం: ఈ స్థావరాలన్నీ, 1 నవంబరు 1954 కు పూర్వము కలిగి ఉండినటువంటి *ప్రత్యేక పరిపాలనా హోదాను* నిలుపుకుంటాయి. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను తెలుసుకొన్న తరువాతే రాజ్యాంగపరంగా ఈ హోదాను మార్చవలసి ఉంటుంది)

1954 కు పూర్వం ఈ ప్రాంతాలు స్వతంత్ర్య భారతావనిలో కలువకుండా ప్రత్యేకంగా ఫ్రెంచివారి పాలనలో ఉన్నాయి. భారత స్వాతంత్రానికి ముందుకూడా ఇవి బ్రిటిష్ వారి పాలనకు అతీతంగానే ఉన్నాయి. పై క్లాజులో ఆ ప్రత్యేకతను నిలబెట్టమని ఫ్రెంచి ప్రభుత్వం కోరింది. అంటే ఈ ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలనా హోదా కల్పించమని ఫ్రెంచివారు వెళ్ళిపోయేముందు అడిగిన చివరి కోరిక. ఈ హోదాను మార్చాలంటే ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాన్ని ఒక రిఫరెండం ద్వారా తెలుసుకోవలసి ఉంటుంది. ఈ ఒప్పందానికి అనుగుణంగా భారతప్రభుత్వం 1 జూలై, 1963న జరిపిన రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రాంతాలను యూనియన్ టెరిటరీ ఆఫ్ పాండిచ్చేరీగా ఏర్పరచింది. అలా వీటిని కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పరచి ప్రత్యేక హోదా కల్పించి ఫ్రెంచి ప్రభుత్వానికి ఇచ్చిన మాటను భారత ప్రభుత్వం నిలబెట్టుకొంది.

ఈ ప్రాంతాలను సమీప రాష్ట్రాలలో విలీనం చెయ్యాలని మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్నపుడు ఒక ప్రయత్నం జరిగింది. అంటే యానాన్ని ఆంధ్రాలోను, పాండిచ్చేరీ, కారైకాల్‌లను తమిళనాడులోను, మాహేను కేరళలోను విలీనం చేయటానికి. ఆ ప్రతిపాదనను ఈ ప్రాంతాల ప్రజలు ముక్తకంఠంతో ప్రతిఘటించారు. మొరార్జీ దేశాయ్ కూడా 1954 నాటి ఒప్పందాన్ని చూసి ఆ ప్రయత్నాన్ని విరమించు కున్నాడని అంటారు. ఎందుకంటే ఈ ఒప్పందంలోని 30వ ఆర్టికల్‌లో – ఈ ఒప్పంద ఉల్లంఘనకు సంబంధించిన

బొల్లోజు బాబా, ఫోన్ : 9849302443

ఫిర్యాదుల పరిష్కారానికై అంతర్జాతీయ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పించబడింది. 1990లో పాండిచ్చేరికి కొత్తగా నియమించబడిన గవర్నరు శ్రీమతి చంద్రావతి పాండిచ్చేరిలో ఇంకా బతికి ఉన్న ఫ్రెంచి సంస్కృతి, ఫ్రెంచి నేషనల్స్ అందుకొంటున్న ఫ్రెంచి పింఛనులు, ఫ్రాన్స్ పర్యవేక్షించే విద్యాసంస్థలు ఉండటాన్ని చూసి, "పోర్చుగీస్, బ్రిటన్‌పాలిత ప్రాంతాలలో ఆయా వలసపాలకుల ఉనికి కనిపించదని పాండిచ్చేరికి ఇంతటి స్వేచ్ఛ, ప్రత్యేకతను కల్పించటం ద్వారా నెహ్రూ తప్పు చేశాడేమోనని" వ్యాఖ్యానించారు. ఆ తరువాత ఫ్రెంచి అంబాసిడర్ ఆండ్రూ లెవిన్ ఈమెను కలసి, పాండిచ్చేరి చారిత్రక ప్రాముఖ్యతను ఫ్రాన్స్ ఈ ప్రాంతాలను భారత్‌కు అప్పగించేటపుడు ఇరుదేశాలు చేసుకొన్న ట్రీటీ ఆఫ్ సిషన్ వివరించినపుడు ఆమె విస్మయానికి గురయ్యారట. ఇదే విషయాన్ని భారత మినిస్ట్రీ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ శాఖాధికారుల వద్ద లెవిన్ ప్రస్తావించినపుడు, "1956 నాటి ట్రీటీకి వ్యతిరేకంగా ఆలోచనచేసే ఉద్దేశ్యం భారత్‌కు లేదని, ఆమెకు చారిత్రక అవగాహన లేకపోవటం వల్ల అలా వ్యాఖ్యానించి ఉంటారు" అని వారు వివరణ ఇచ్చారట.

ఈ అంశంపై అవగాహన కలిగిన విద్యావేత్తలు, చరిత్రకారులు అనేక మంది శ్రీమతి చంద్రావతి వ్యాఖ్యలను ఖండించారు. వారిలో 1954 లో పాండిచ్చేరిలో భారత కమిషనర్‌గా పనిచేసిన భారత అధికారి అయిన కేవల్ సింగ్ వ్రాసిన "Pondicherry and Goa - Historical Contrast -- Times of India 12 April, 1990" అనే వ్యాసం ప్రముఖమైనది. (Ref.DES ANCIENTS COMPTOIRS DE L'INDE?/Future of French India Veterans? by Andrew Lewin published in CIDIF letters Nov 2010)

**1723 జనవరి, 23 న కుర్టన్ వ్రాసిన ఈ ఓ లేఖలో తాను ఎంపిక చేసిన ప్రదేశాన్ని "యానాం" గా పేర్కొన్నాడు. ఈ ప్రాంతం 1757 లో బుస్సీకి ఈనాంగా ఇవ్వబడింది. జననానుడిలో ఈనాంగా ఇవ్వబడిన ప్రదేశం కనుక యానాం గా మారిందని తెలుస్తున్నది.**

యానాం ని ఆంధ్రలో కలపకుండా ప్రత్యేకంగా ఉంచటానికి మరొక ప్రధాన కారణం ఆనాటి స్థానిక నాయకుల దార్శనికత. భారతావని నుంచి బ్రిటిష్ వారు వైదొలగిన తరువాత అందరి కళ్ళు ఫ్రెంచి వారిమీద పడ్డాయి. ఈ కాలనీలలో కూడా జాతీయవాద భావనలు బలపడి ఫ్రెంచి పాలననుండి విముక్తి పొందాలన్న ఆకాంక్ష ప్రజలలో పెరగసాగింది. అప్పటికే నెహ్రూ "ఫ్రెంచి కాలనీలు భారతదేశ ముఖంపై మొటిమల వలె ఉన్నాయని" వర్ణించాడు. భారతావనిలో తమ కాలనీల మనుగడ ఇక అసాధ్యమన్న నిర్ణయానికి ఫ్రాన్స్ వచ్చేసింది. కానీ ఈ కాలనీలను భారత్‌కు అప్పగించటానికి వారి రాజ్యాంగంలోని ఆర్టికల్ 27 ప్రకారం రిఫరెండం (ప్రజలందరి అభిప్రాయం తెలుసుకోవటం) తప్పనిసరి అని పట్టు పట్టింది. (Article 27 of the Constitution of the France Fourth Republic stipulates that " no surrender, no exchange, no addition of territory shall be valid without the consent of the peoples concerned" అని స్పష్టంగా చెపుతుంది.) వదులుకోవటం తప్పనిసరైతే హుందాగా అప్పచెప్పాలే తప్ప అవమానకర పరిస్థితులలో చేజార్చుకోకూడదని ఫ్రాన్స్ భావించింది.

ఈ పరిస్థితులలో 1948 లోనే భారత-ఫ్రెంచి ప్రభుత్వాలు ఒక ఒప్పందం చేసుకున్నాయి. దీని ప్రకారం ఈ ప్రాంత ప్రజలు తాము భారతదేశంలో కలవాలా ఒద్దా అనే విషయాన్ని రిఫరెండం ద్వారా తేల్చుకోవాలి. ఈ రిఫరెండం తీర్పు అది జరిగిన ప్రాంతానికే పరిమితమై ఉంటుంది. అంటే ఒక ప్రాంతం ఫ్రెంచివారితో ఉండాలనుకొంటే ఉండొచ్చు. మరొక ప్రాంతం విడిపోవాలనుకొంటే విడిపోవచ్చు. అప్పటికి మొత్తం అయిదు ఫ్రెంచి కాలనీలు ఉండేవి. అవి పాండిచ్చేరి, మాహె, కారైకాల్, యానాం మరియు బెంగాల్ వద్దకల చంద్రనాగూర్‌లు. పై ఒప్పందానికి అనుగుణంగా చంద్రనాగూర్ 19, జూన్ 1949న రిఫరెండం జరుపుకొంది.

7587 ఓట్లు భారతావనిలో విలీనానికి అనుకూలంగాను, 114 ఓట్లు వ్యతిరేకం గాను పోల్ అయ్యాయి. అలా తొందరపడి రిఫరెండం జరుపుకోవటం వల్ల చంద్రనాగూర్ ఈనాడు ఈ అనంత భారతావనిలో ఉండే వేనవేల మున్సిపాలిటీలలో ఒకటిగా కనుమరుగైంది. చంద్రనాగూర్‌లోని స్థానిక నాయకులందరూ పొరుగునున్న బెంగాల్ రాష్ట్ర కమ్యూనిష్టు నాయకుల ప్రభావంలో ఉండి ఆ ప్రాంతాన్ని విదేశీపాలనా చెర నుండి విడిపించి పొరుగునున్న బెంగాల్‌లో విలీనం చేయించటంలో కృతకృత్యులయ్యారు. కానీ అప్పటి యానాం నాయకులు పొరుగునున్న ఆంధ్రా నాయకుల ప్రభావంలో కాక పాండిచ్చేరి నాయకుల నాయకత్వంలో నడిచారు. దీన్ని బట్టి చూస్తే అప్పటి యానాం నాయకులు ఆంధ్రావైపు ఎక్కువగా మొగ్గుచూపి ఉన్నట్లయితే



Gallois E అనే ఫ్రెంచి చిత్రకారుడు
గీసిన యానాం హిందూ, ముస్లిం, క్రిస్టియన్
యువతుల చిత్రాలు (1946)

చంద్రనాగూర్ వలెనే యానాం కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏ విశిష్టతా లేని ఒక పంచాయితీగా మిగిలిపోయేది. కాకినాడ మున్సిపల్ కూడా యానాన్ని భారతావనిలో కలిపివేయాలని తీర్మానం చేసింది. కానీ అప్పటి యానాం నాయకులు ముందు చూపు కలిగి పాండిచ్చేరితో ఉన్న సంబంధాలను తెంపుకోలేదు. అపుడు మాత్రమే యానాం ప్రజలకు మేలు జరుగు తుందని భావించారు. ఇది వారి దార్శనికతకు, రాజకీయ పరిణతికి నిదర్శనంగా చెప్పవచ్చు. పాండిచ్చేరి నాయకులు యానాన్ని పాండిచ్చేరిలో ఒక అంతర్భాగంగా చూసారు తప్ప వేరుగా చూడలేదు.

ఈ మిగిలిన నాలుగు ప్రాంతాల ప్రజలు ఫ్రెంచి వారిని అంత సులభంగా చేజార్చుకోవటానికి ఇష్టపడలేదు. భారతప్రభుత్వం కూడా పరిస్థితులు పక్వానికొచ్చే వరకూ ఎదురుచూసింది. హైదరాబాద్‌లోలా సైనిక పదఘట్టనలతో బలప్రయోగానికి సాహసించలేదు. అందునా ఇది దేశాల నడుమ వ్యవహారమాయె!

1948 డిసెంబరు, 19న జైపూరులో జరిగిన కాంగ్రెసు ప్లీనరీ సమావేశాలలో "స్వతంత్రభారతావని ఏర్పడిన తరువాత, ఈ గడ్డపై విదేశీ పరిపాలన కొనసాగటం అసమంజసమే కాక దేశసమైక్యతకు భంగం కలిగించే విషయం" అని ఫ్రెంచివారినుద్దేశించి కాంగ్రెసు పార్టీ తీర్మానం చేసింది. ఆ తరువాత 1950 సెప్టెంబరు, 21న నాసిక్‌లో జరిగిన సమావేశాలలో కాంగ్రెసు పార్టీ మరలా "దేశంలోని విదేశీ పాలితప్రాంతాలు స్వతంత్ర భారతదేశంలో విలీనం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని" పునరుద్ఘాటించింది.

1952 నాటికి పాండిచ్చేరిలో ప్రజలు ఫ్రెంచి వ్యతిరేక, అనుకూల వర్గాలుగా చీలిపోవటంతో ఒక రకమైన భయానక వాతావరణం నెలకొని ఉంది. చిన్న చిన్న ఘర్షణలు, కొట్లాటలతో అట్టుడికి పోతూండేది. యానాంలో కూడా ఇదే పరిస్థితి ప్రతిబింబించేది. అక్టోబరు 22న భారతభూభాగం నుంచి కొంతమంది సాయుధులు, పాండిచ్చేరిలోకి ప్రవేశించి అక్కడి ఫ్రెంచి పౌరులపై దాడిచేసి గాయపరిచారు. ఈ ఉదంతాన్ని నెహ్రూ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన "ఫ్రెంచి వారు భేషరతుగా ఈ ప్రాంతాలను భారతదేశానికి స్వాధీనం చేయాలనీ, అలాచేసినట్లయితే ఈ ప్రాంతాల ప్రజల సాంస్కృతిక, భాషా, ఆచార, చట్టపరమైన హక్కులకు రక్షణ కల్పించగలనని'' హామీ ఇచ్చాడు. ఫ్రెంచి వారు కోరుతున్నట్లుగా ఈ ప్రాంతాలలో రిఫరెండం జరిపించటానికి భారతప్రభుత్వం అంగీకరించక పోవటానికి కారణం కాశ్మీర్ లో కూడా ప్లెబిసైట్ (రిఫరెండం) జరపాలని పాకిస్తాన్ పట్టు పడుతుందన్న అనుమానం ఉండటం. యానాం విమోచనం, డిఫాక్టో ట్రాన్స్‌ఫర్, ట్రీటీ ఆఫ్ సిషన్, డి జ్యూర్ ట్రాన్స్‌ఫర్ మరియు విలీనము.

పై పదాలన్నీ ఒకే విధంగా అనిపించినప్పటికీ వాటి అర్థాలలో చాలా వ్యత్యాసముంది. ఇవన్నీ అంతర్జాతీయ స్థాయి ఒప్పందాలు. యానాం ఎందుకు ఆంధ్రాలో విలీనం కాలేదో, యానాం ప్రత్యేకత ఏమిటో పై అంశాల ప్రాముఖ్యతను తెలుసుకొంటే మరింత అర్థమవుతుంది.

**విమోచనం:** యానాంలో ఫ్రెంచి పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం పతాక స్థాయిని చేరుకొని 1954, జూన్ 13న ఉద్యమకారులు అప్పటి యానాం అడ్మినిస్ట్రేటరు నుంచి అధికారాలను స్వాధీనపరచుకొని, తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. తదుపరి ఫ్రెంచి జాతీయ జండాను అవనతం చేసి భారతదేశ పతాకాన్ని ఎగురవేసి యానాం, ఫ్రెంచి పాలన నుండి "విమోచనం" చెందిందని ప్రకటించారు. ఈ మొత్తం ఉద్యమంలో పాలుపంచుకొన్న ఆనాటి నాయకులలో, దడాల రఫేల్ రమణయ్య, మద్దింశెట్టి సత్యానందం, కనకాల తాతయ్య, కామిశెట్టి వరప్రసాదరావు నాయుడు, కోన నరసయ్య, యర్రా సత్యనారాయణమూర్తి, భయంకరాచారి వంటివారు ప్రముఖులు. ఫ్రెంచి ప్రభుత్వం మాత్రం ఈ ఉద్యమాన్ని, ప్రభుత్వం పై జరిగిన ఒక "ముట్టడి" గా (Coup de' etat Yanaon) అభివర్ణించింది. 1956 మే, 28 న ఫ్రాన్స్-భారతదేశాల నడుమ జరిగిన ట్రీటీ ఆఫ్ సిషన్ ఒప్పందంలో – యానానికి సంబంధించి 1954, జూన్ 13

తరువాత అన్ని అధికారిక/అనధికారిక వ్యవహారాలకు తనకు ఏ విధమైన సంబంధం లేదని ఫ్రాన్స్ విస్పష్టంగా చెప్పటాన్ని బట్టి యానాంలో ఫ్రెంచి పాలన 1954, జూన్ 13 తో చారిత్రికంగా ముగిసినట్లు భావించాలి.

**డిఫాక్టో ట్రాన్స్ఫర్:** ఫ్రెంచికాలనీల భవితవ్యం తేల్చటానికి 1954, అక్టోబరు 18న పాండిచ్చేరిలోని కీఝారు వద్ద ఈ కాలనీల ప్రజాప్రతినిధులతో జరిగిన రిఫరెండంలో – ఫ్రెంచి పాలనను కోరుతూ 7 ఓట్లు, భారతదేశంలో విలీనానికి అనుకూలంగా 164 ఓట్లు రావటంతో ఫ్రెంచి ప్రభుత్వం ఈ కాలనీలను భారతదేశానికి యథాతథంగా అప్పగిస్తూ అక్టోబరు, 26న ఒక ఒప్పందం చేసింది.

ఈ ఒప్పందం ద్వారా ఫ్రెంచి ప్రభుత్వం 1954 నవంబరు, 1న పాండిచ్చేరి, మాహే, కారైకాల్ మరియు యానాంలను భారత ప్రభుత్వానికి యథాతథ స్థితిలో అప్పగించింది. కనుక నవంబరు 1ని డీఫాక్టో ట్రాన్స్ఫర్ దినంగా పరిగణిస్తారు. ప్రజలందరూ పాల్గొనే రిఫరెండం జరపాలని మొదట్లో పట్టు పట్టిన ఫ్రెంచి ప్రభుత్వం తన పట్టు సడలించుకొని, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొంటే చాలని సరిపుచ్చుకొంది. ప్రజలు పాల్గొనే రిఫరెండంలో ఫలితం తనకు అనుకూలంగా రాకపోతే విచిత్రమైన పరిస్థితి ఏర్పడుతుందన్న అనుమానంతో భారత్ చేసిన ఒత్తిడి ఫలితమిది. (రి.అవర్ సీక్రెట్స్ ఇన్ అదర్స్ ట్రంక్స్– ఎ.జి.నూరాని, ఫ్రంట్‌లైన్ పత్రిక జూలై 2005)

**ట్రీటీ ఆఫ్ సిషన్**: ఫ్రెంచి కాలనీలను భారత్‌కు అప్పగించినా, అవి చట్ట పద్ధతిలో భారతదేశంలో విలీనం కావటానికి మరో ఒప్పందం 1956 మే 28న జరిగింది. దీని ద్వారా ఈ ప్రాంత సార్వభౌమాధికారాలను భారతదేశానికి అప్పగించటం జరుగుతుంది. ఈ ఒప్పందం ద్వారా పాండిచ్చేరిలో రెండు భవనాలను ఫ్రాన్స్ తన ఆధీనంలో ఉంచుకొని (అవి Rue de Marine లో ఫ్రెంచి కౌన్సిలేట్ కొరకు ఒక భవనం, Victor Simonel వీధిలో కల French College భవనము) మిగిలిన ప్రాంతాలను భారత్‌కు ఇచ్చివేసింది. ఈ ఒప్పందానికి ఫ్రెంచి పార్లమెంటు వేయాల్సిన ఆమోదముద్ర ఫ్రాన్స్–అల్జీరియన్ యుద్ధం జరుగుతున్న కారణంగా ఆలస్యం జరిగింది. (అల్జీరియా కూడా ఒక ఫ్రెంచి కాలనీయే. ఇది స్వాతంత్ర్యం కొరకు ఫ్రాన్స్‌తో యుద్ధమే చేయవలసివచ్చింది.)

**డి జ్యూర్ ట్రాన్స్ఫర్:** 1962లో అల్జీరియా యుద్ధం ముగిసింది. 1962లో ఫ్రెంచి పార్లమెంటు ట్రీటీ ఆఫ్ సిషన్‌కు ఆమోద ముద్రవేసింది. దరిమిలా 1962, ఆగష్టు 16న ఫ్రాన్స్ ప్రభుత్వం ఈ కాలనీల "సార్వభౌమాధికారాల్ని" భారత ప్రభుత్వానికి బదలాయించింది. కనుక ఆగష్టు 16ను డి జ్యూర్ ట్రాన్స్ఫర్ దినమని పిలుస్తారు. ఇది పాండిచ్చేరి ప్రభుత్వ అధికారిక స్వాతంత్ర్యదినం. ఆ విధంగా ఈ కాలనీల ప్రజలు రెండు స్వాతంత్ర దినోత్సవాలను జరుపుకొంటారు. ఒకటి భారత స్వాతంత్ర్యదినమైన ఆగష్టు 15 రెండవది ఆగష్టు 16న జరుపుకొనే డి జ్యూర్ ట్రాన్స్ఫర్ దినం.

**విలీనము:** ఈ ప్రాంతాల ఫ్రెంచి సంస్కృతి, సాంప్రదాయాలను సంరక్షిస్తానని ఫ్రెంచి ప్రభుత్వానికి ఇచ్చిన హామీల కనుగుణంగా భారతప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి, ఈ నాలుగు ప్రాంతాలను 1963 జూలై, 1న యానియన్ టెరిటరీ ఆఫ్ పాండిచ్చేరిగా ప్రకటించింది. ఈ ప్రక్రియతో ఈ ఫ్రెంచి కాలనీలు భారతావనిలో విలీనం కావటం పూర్తయింది.

పదహారవ శతాబ్దం నుంచీ ఫ్రాన్స్ ప్రపంచవ్యాప్తంగా కాలనీలను నిర్మించటం మొదలెట్టింది. ఇరవయ్యవ శతాబ్దం నాటికి ప్రపంచం మొత్తం మీద 8.5% భూమిని చేజిక్కించుకొంది. స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు అనేక ప్రాంతాలకు స్వాతంత్ర్యం ప్రకటించి తప్పుకొంది. కానీ కొన్ని కాలనీలు ఈ నాటికీ ఫ్రాన్స్ పరిపాలనలోనే కొనసాగుతున్నాయి. ఒకప్పటి ఈ ఫ్రెంచికాలనీలు పారిస్‌కు కొన్నివేల మైళ్ళదూరంలో ఉన్నప్పటికీ, ఫ్రెంచ్ ఓవర్‌సీస్ డిపార్ట్‌మెంట్స్' అనే పేరుతో పిలువబడుతూ నేడు యూరోపియన్ యూనియన్‌లో ఫ్రాన్స్ అంతర్భాగాలుగా పరిగణించబడుతున్నాయి. ఇవి మార్టినిక్, గాడెలూప్, రీయూనియన్, ఫ్రెంచ్ గయానాలు. ఈ ప్రాంతాల జీవన ప్రమాణాలు ఫ్రాన్స్‌లోని ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోవు. అక్కడి యువకులు 'ఫాషన్‌లు' తెల్లారే సరికల్లా ఇక్కడ ప్రత్యక్ష మవుతాయి. ఈ ప్రాంతం నుండి సెనేట్‌కు జనాభా ప్రాతిపదికన ప్రాతినిథ్యం ఉంది. ఇక భారతదేశంలోని ఫ్రెంచి కాలనీల విషయానికి వచ్చేసరికి



ఆర్డరు ఆఫ్ నేషన్ పొందిన ఏకైక భారతీయుడు: సమతం కృష్ణయ్య

1947లోనే ఫ్రెంచి ప్రభుత్వం వీటిని ఫ్రెంచి ఓవర్‌సీస్‌లు అని (సముద్రాంతర ఫ్రాన్స్ భూభాగాలు) నామ కరణం చేసింది. ఇలా చేయటం ద్వారా ఈ కాలనీలన్నీ ఫ్రాన్స్ అంతర్భాగాలని ప్రపంచానికి చెప్పటానికి ప్రయత్నించింది. కానీ 1954లో ఈ ప్రాంతాల ప్రజలు ప్రదర్శించిన అచంచలమైన భారతదేశభక్తికి ఫ్రెంచి ప్రభుత్వం తలొగ్గాక తప్పలేదు. భారతప్రభుత్వం కూడా సంయమనం పాటించి దౌత్యపరంగానే ఈ ప్రాంతాలను ఫ్రాన్స్ నుంచి పొందింది. పాండిచ్చేరి, మాహే, కారైకాల్ మరియు యానాంలలో ప్రప్రథమంగా యానావే "విమోచనం" చెందినట్లు ప్రకటించుకొంది.(ఆ తరువాత మాహే). పాండిచ్చేరి, కారైకాల్‌లలో అలా జరగలేదు. ఈ విషయంలో ఈ ఫ్రెంచి కాలనీలలో "విమోచనం" అనేది ఒక్క యానాం, మాహేలకు మాత్రమే ఉంటుంది. మిగిలిన ప్రాంతవాసులు డిఫాక్టో ట్రాన్స్‌ఫర్‌దినం మాత్రమే జరుపుకొంటారు. ఆ విధంగా యానాం "క్రాంతదర్శి" గా చరిత్రకెక్కింది. యానాంని ఆంధ్రాలో కలపకపోవటం వెనుక ఇంతటి చరిత్ర దాగి ఉంది.

**తెలుగు భాషకు సేవలందించిన ఫ్రెంచిదేశస్థులు:** కాంబెల్, సి.పి.బ్రౌన్ వంటి బ్రిటిషు దొరలు తెలుగుభాషకు చేసిన సేవలు అందరకూ తెలిసినవే. కానీ వీరందరికంటే చాలా ముందుగానే కొందరు ఫ్రెంచి దేశస్థులు ఆ రకమైన కృషి జరిపారు. తెలుగు భాషాధ్యయనంలో బ్రిటిష్ వారికి ఫ్రెంచి వారే స్ఫూర్తిగా నిలిచారనేది ఒక చారిత్రిక వాస్తవం.

ఫాదర్ Pierre de La Lane (1669-1748) అనే ఫ్రెంచి దేశస్థుడు 1729 లో 'అమరసింహం' అనే తెలుగు నిఘంటువు మరియు వ్యాకరణ పుస్తకాన్ని రచించాడు. తెలుగును లోతుగా అధ్యయనం చేసిన మొదటి యూరోపియన్ ఇతనేనని చరిత్రకారుల అభిప్రాయం. G.L.Coeurdoux (1691-1777) అనే ఫ్రెంచి దేశస్థుడు 1760 ప్రాంతా లలో తెలుగు-సంస్కృత- ఫ్రెంచి త్రిభాషా నిఘంటువును, తెలుగు-ఫ్రెంచి, ఫ్రెంచి-తెలుగు నిఘంటువులను కూర్చు చేశాడు. బ్రిటిషర్లయిన కాంబెల్ 1821లోను, బ్రౌను 1852 లోను తమ తెలుగు నిఘంటువులను, ఆర్డెన్ 1872లో తెలుగు వ్యాకరణ పుస్తకాన్ని రచించారు.

**భారతదేశంలో ఫ్రెంచి రాజ్యస్థాపనకై పాటుపడిన డూప్లే విగ్రహాన్ని పాండిచ్చేరి నుంచి తొలగించవద్దని, ఒకవేళ తొలగించేటట్లయితే దానిని ఫ్రాన్స్‌కు అప్పగించమనీ ఫ్రెంచి ప్రభుత్వం కోరింది. డూప్లే విగ్రహం నేటికీ పాండిచ్చేరీ బీచ్ రోడ్‌లో చూడవచ్చును.**

వీటన్నింటికీ దాదాపు ఒక శతాబ్దం క్రితమే ఫ్రెంచివారు వెలువరించిన నిఘంటువులు ప్రేరణ మరియు మాతృకలు అయివుండవచ్చునన్నది సత్యదూరం కాకపోవచ్చు.

Etienne Le Gac (1671-1738) అనే ఫ్రెంచి దేశస్థుడు 1729లో అనేక వేమన పద్యాలను సేకరించి ఫ్రాన్సు పంపించాడు. (ఫ్రాన్సు మ్యూజియంలో ఉన్న వీటి వ్రాత ప్రతులు ఆరుద్ర కృషితో ఆంధ్రదేశానికి వచ్చాయి) వాటిని 1806లో అబ్బీ దుబాయిస్ అనే ఫ్రెంచి దేశస్థుడు ఫ్రెంచి భాషలోకి అనువదించి ప్రచురించాడు. ఈ పుస్తకాన్ని 1824లో బ్రౌను చదివి వేమనంటే పిచ్చి అభిమానాన్ని పెంచుకొని, తరువాత 1829లో వేమన పద్యాలకు తన ఇంగ్లీషు అనువాదాన్ని వెలువరించాడు. లె గాక్ సంజీవనాథస్వామిగా తన పేరుమార్చుకొని, పాంకోళ్ళు ధరించి, శాఖాహారం భుజిస్తూ కాషాయ వస్త్రాలు ధరిస్తూ సాత్వికజీవనాన్ని గడిపేవారట. (రి. సమగ్రాంధసాహిత్య చరిత్ర–ఆరుద్ర)

Francis Ricci అనే ఫ్రెంచి దేశస్థుడు తను స్థాపించిన స్కూలులో తెలుగును బోధిస్తూ, పిల్లలకోసమని అనేక తెలుగు వాచకాలను వ్రాసాడట. వీరే కాక లె పియర్ గార్గాం, డూక్రోస్, పియరీ ఫ్రాంకోయిస్ జేవియర్ దుచాంప్ (ఇతను ఒక ఖగోళ శాస్త్రజ్ఞుడు). ఫాదర్ జీన్ కామెట్టి (ఇతను యజుర్వేదాన్ని ఫ్రెంచిలోకి తర్జుమా చేసాడని అంటారు) వంటి వారు తెలుగుభాషను నేర్చుకొని పద్దెనిమిదో శతాబ్దంలో ఈ గడ్డపై విస్తృతంగా సంచరించి, ఇక్కడి ప్రజలతో మమేకమైనారు ఫ్రెంచి దేశస్థులు.

**వ్రాతప్రతుల తరలింపు:** 17 మరియు 18 వ శతాబ్దాలలో ఫ్రెంచి మతప్రచారకులు తెలుగుదేశం నుంచి అనేక వ్రాతప్రతులను సేకరించి ఫ్రాన్స్ పంపించారు. వీటిని ఫ్రెంచి ఇంగ్లీషు భాషలలోకి అనువదించి ప్రపంచానికి పరిచయం చేశారు. ముఖ్యంగా ఖగోళశాస్త్రం, గణితం, సాహిత్యం, ఇక్కడి ఆచార వ్యవహారాలు వంటి వివిధ రంగాలకు చెందిన వ్రాతప్రతులు అనేకం ఫ్రాన్స్‌కు తరలింపబడ్డాయి. లె నాయిర్ పాండిచ్చేరీ ఫ్రెంచి గవర్నరుగా ఉన్నసమయం లో ఇలా భారతీయ వ్రాతప్రతులను సేకరించి నందుకు అయ్యే ఖర్చును ఫ్రెంచి ప్రభుత్వం భరిస్తుందని భారతదేశంలో మతబోధకుడిగా ఉన్న Etienne Le Gacతో కుదుర్చుకొన్న ఒక ఒప్పందం తెలియచేస్తుంది. దరిమిలా 1729–1735ల

మధ్య 287 వ్రాతప్రతులు పారిస్ లైబ్రరి చేరాయి. లె గాక్ ఎక్కువ కాలం తెలుగు దేశంలోనే గడిపాడు కనుక ఇవి ఎక్కువగా ఇక్కడి నుంచే సేకరించి ఉంటాడని భావించ వచ్చు. 1732 లో పాన్స్ (Pons) అనే మత బోధకుడు ఫ్రాన్స్ పంపించిన 168 పుస్తకా లలో 31 వ్యాకరణ గ్రంథాలు, 22 పురాణ, వేదాంత కావ్యాలు, 25 పురాణ పుస్తకాలు, 8 ఖగోళ శాస్త్రగ్రంథాలు, 9 పద్యకావ్యాలు, 25 స్థానిక ఆచారాలకు సంబంధించిన పుస్తకాలు, 29 న్యాయ శాస్త్రానికి సంబంధించిన గ్రంథాలు మరికొన్ని ఇతర పుస్తకాలు ఉన్నాయి. వీటిలో తెలుగు-ఫ్రెంచి నిఘంటువు, తెలుగు-సంస్కృత నిఘంటువులు కూడా ఉన్నాయి.

మచిలీపట్నం నుంచి సేకరించిన 'పంచాంగ శిరోమణి' అనే ఒక వ్రాతప్రతిని 1750 లో పియరీ పాతులెట్ (Pere Patoullet) ఫ్రాన్స్ లోని జోసెఫ్ దె లిస్లె అనే ఖగోళ శాస్త్రజ్ఞునికి పంపించాడు. ఇదే సమయంలో Xavier Duchamp పంపిన ఖగోళశాస్త్రానికి చెందిన మరో వ్రాతప్రతిలోని అంశాల ఖచ్చితత్వాన్ని పారిస్ అబ్జర్వేటరీ (ఖగోళ అధ్యయనకేంద్రం) ధ్రువీకరించింది. ఈ రెండు వ్రాతప్రతులు ప్రస్తుతం

Archives Francaises de la Compagnie de Jesus at Vanves, Paris నందు భద్రపరచబడి ఉన్నాయి. (రి Processes that shaped the sources the history of science Florence Bretelle)

వ్రాతప్రతుల తరలింపు అనేది ఒకరకమైన మేధోపరమైన దోపిడీగా అనిపించినప్పటికీ వీటిపై పారిస్‌లో జరిగిన పరిశోధనల ఫలితంగా భారతీయ శాస్త్రవిజ్ఞాన పునాదులు ప్రపంచానికి తెలిసినట్లయింది. అంతేకాక ప్రపంచ విజ్ఞానపరంగా చరిత్రను క్రోడీకరించటంలో ఈ వ్రాతప్రతులు ఎంతగానో దోహదపడ్డాయి.

1767 నాటి ఒక అరుదైన వ్రాత ప్రతి : జీన్ లా దె లారిస్టన్ (Jean Law de Lauriston) 1765-1777 మధ్య పాండిచ్చేరీకి గవర్నరుగా పనిచేశాడు. అత్యంత సమర్థుడు, సౌమ్యుడుగా పేరు తెచ్చుకొన్నాడు. ఇతను భారతదేశంలో తన పదవీ కాలంలో రాసుకొన్న డైరీలను ఆధారంగా చేసుకొని రాసిన 'మొఘలు సామ్రాజ్య విశేషాలు' అనే పుస్తకం నేటికీ మొఘలుల పాలన పై ఒక మంచి రిఫరెన్సుగా నిలిచివుంది. 1758లో యానాన్ని మొదటి సారిగా బ్రిటిష్ వారు ఆక్రమించుకొన్నారు. 1765లో యానాన్ని బ్రిటిష్ వారి నుండి తిరిగి చేజిక్కించు కోవటంలో లారిస్టన్ పాత్ర గణనీయ మైనది.



1967 నాటి అరుదైన వ్రాతప్రతి లారిస్టన్ నోట్

ఆ సమయంలో లారిస్టన్ ఉపేక్షించి ఉంటే యానాం ఎప్పటికీ బ్రిటిష్ ప్రాంతం గానే ఉండి పోయేది అనటంలో సందేహం లేదు. ఇతను బ్రిటిష్ అధికారులతో సంప్రదింపులు జరిపి యానాం నుండి జరిగే అన్ని ఎగుమతి, దిగుమతు లకు బ్రిటిష్ ప్రభుత్వం నుండి పన్ను మినహా యింపును సాధించి పెట్టాడు. తరువాతి కాలంలో ఈ హక్కును బ్రిటిష్ ప్రభుత్వం కాలరాసి 15 నుంచి 20% పన్ను విధించటం మొద లెట్టటం తో 19వ శతా బ్దాంతానికి వచ్చేసరికి యానాం వ్యాపారపరంగా తన వైభవాన్ని కోల్పోయింది. 1767 లో లారిస్టన్ వ్రాసుకొన్న ఒక నోట్‌లో యానాం ప్రస్తావన ఈ విధంగా ఉంది.

***ఈ నోట్‌కు తెలుగు అనువాదం:*** *యానాం అనే ఈ ప్రాంతం నుంచి అత్యుత్తమ చేనేత దుస్తులు లభిస్తున్నవి. పరిస్థితులు అనుకూలించినట్లయితే ఇక్కడినుంచి ఏడాదికి పది లక్షల లీవ్ ల (ప్రాచీన ఫ్రెంచి కరెన్సీ ఒక్కొక్కటి సుమారు నాలుగు వందల గ్రాముల వెండి విలువతో సమానం) విలువైన వ్యాపారం చేయవచ్చును. వస్త్రాలే కాక ఈ ప్రాంతం నుండి టేకుకలప, నూనెలు, ధాన్యం మరియు ఇతర పప్పుధాన్యాలు సేకరించే వాళ్ళం. యానానికి వాణిజ్యపరమైన ప్రాధాన్యతే కాక మరో రకమైన ప్రత్యేకత కూడా ఉంది. బ్రిటిష్‌వారితో మనకు సర్కారు ప్రాంతంలో యుద్ధాలు జరిగే సమయంలో, బ్రిటిష్ వారి పట్ల అసంతృప్తి తో ఉన్న కొందరు రాజుల మద్ధతు కూడకట్టు కోవటానికి యానాం ప్రధాన స్థావరంగా ఉండేది. యానానికి మంచి వ్యాపార భవిష్యత్తు ఉంది.*

ఈ నోట్ లోని అంశాలను గమనిస్తే లారిస్టన్ 1767 లో యానాంలో బస చేసిన సమయంలో వ్రాసినట్లు అనిపిస్తుంది. అంతే కాక ఆనాటి యానాం వ్యాపార సామర్థ్యం, రాజకీయ ప్రాధాన్యం కూడా అర్థం చేసుకొనవచ్చును.

లారిస్టన్ రాసుకొన్న ఈ నోట్ యానానికి సంబంధించిన అరుదైన పురాతన డాక్యుమెంటు. లా దె లారిస్టన్ గౌరవార్థం ఫ్రెంచి ప్రభుత్వం పాండిచ్చేరిలోని ఒక ప్రాంతానికి 'లాస్ పేట' అనే పేరు పెట్టింది. అది ఈ నాటికీ అదే పేరుతో పిలవబడుతున్నది. మి

### అసంపూర్ణ అద్భుతాలు

# రా.వి శాస్త్రి నవలలు

– కాండ్రేగుల నాగేశ్వరరావు

రాచకొండ విశ్వనాథ శాస్త్రి బహుమతి ప్రదాన సమయంలో గ్రహీత డాక్టర్ కేశవరెడ్డి మాట్లాడుతూ రావిశాస్త్రి వారి *రాజు మహిషి, గోవులొస్తున్నాయి జాగ్రత్త* లాంటి నవలలను అసంపూర్ణంగా వదిలి వేయడానికి గల కారణాలను విజ్ఞులు విశ్లేషించాలని కోరారు. ఈ నవలలను మధ్యలో వదిలిన తరువాత మరొక 24 సంవత్సరాలు ఆయన జీవించే ఉన్నారు. కానీ వీటిని పూర్తి చేయడానికి ఏవిధమైన కృషి చేయలేదు. మానవజీవితం అసంపూర్ణం కావటము వలన జీవితాన్ని దర్పణంగా చేసుకున్న రచయిత ఆ నవలలను అసంపూర్ణంగా వదిలేసి వుండవచ్చున్నది డాక్టర్ కేశవరెడ్డి అభిప్రాయం. దీనిపై పెద్ద ఎత్తున స్పందన వస్తుందనుకున్న నాలాటి వారికి నిరాశే మిగిలింది. చివరకు ఎలాగైనా సరే దీనిపై తెర తీయాలనేదే నేను చేస్తున్న ప్రయత్నం.

కథ, నవల, గేయం, ఏ సాహిత్య ప్రక్రియకైనా ఒక ప్రారంభం, కొనసాగింపు, ముగింపు వుంటుంది. ఉండితీరాలి. కథ, నవలలో ఇది మరీ ముఖ్యం. కథ ప్రారంభం పాఠకునికి ఒక కాలాన్ని, ఒక ప్రదేశాన్ని సూచిస్తుంది. ఏ ప్రదేశంలో ఆ కథ గమనం ప్రారంభమయిందో దానిని బట్టి పాఠకుడు తన మదిలో ఒక ఊహాచిత్రాన్ని చిత్రించుకుంటాడు. తెలివైన పాఠకుడు తన మస్తిష్కంలో తర్కాన్ని కూడా సిద్ధంచేసి ఉంచుకుంటూ కథలోని వాస్తవికతను, కాల్పనికతను గుర్తిస్తూ చదువుకుంటూపోతాడు. కథ, నవల మొదటిభాగం ఒక పదిపేజీలు చిరిగిపోయినా, దొరకకపోయినా కథ, నవలను చదవడానికి ఉపక్రమించవచ్చు. కొంతదూరం చదివిన తరువాత కథా ప్రారంభాన్ని ఊహించగలుగుతాము. Waste land poem కు 1996వ సంవత్సరము వరకూ మొదటి 56 పేజీలు లేవు. టి.యస్.ఇలియట్ 'క్విన్' అనే పేరుగల ఒక సాహితీ మిత్రునికి Waste land ప్రతినొకదానినిచ్చి తరువాత దాని గురించి మరచిపోయారు. తన దగ్గర ఉన్న ప్రతిని 1922లో పుస్తకంగా ప్రచురించి, 1948వ సంవత్సరంలో నోబుల్ బహుమతి అందుకున్నారు. ఇలియట్ 1965వ సంవత్సరంలో మరణించారు. అతని రెండవ భార్య అయిన వేలరీ ఇలియట్ 'క్విన్' ప్రతిని పరిష్కరించి 1971లో తిరిగి పూర్తి పాఠాన్ని ప్రచురించింది. రెండు ప్రతులను పోల్చి చూడగా 1922లో వెలువడ్డ ప్రతిలో మొదటి 56పేజీలు లేవు. ఈ సంఘటన సాహిత్య ప్రక్రియలలో ప్రారంభం లేకున్నా మరీ అంత ఇబ్బంది కలగదని చెబుతుంది. (ఈ ప్రారంభం ముఖ్యమే కాదనలేము, కానీ అది దొరకని సమయాల్లో)

ముగింపు సాహిత్య ప్రక్రియకు చాలా ముఖ్యం. ఎందుకంటే కథ/నవలలోని పతాకసన్నివేశాలు ముగింపుకు చేరువలోనే ఉంటాయి. అపరాధ పరిశోధక నవలలూ, బేతాళ కథలకు ముగింపేప్రాణం. ముగింపు లేకపోతే అవి నిర్జీవంగా ఉండి ఒక పూడ్చులేని వెలితిని మనస్సులో నిలుపుతుంది. రచయిత తన ఉక్తి వైచిత్రినంతటినీ దానిలోనే ప్రస్ఫుటంగా చూపించగలుగుతాడు. నిజానికి కథ/నవలలో వచ్చే చివరి వాక్యం, చివరిపదం కూడా రచయితయొక్క నిర్దిష్టమైన సంకల్పాన్ని, భావనాబలాన్నీ, సామాజిక కోణాన్ని అద్దంలా మన ముందుంచుతుంది. కథా శిల్పానికి ముఖ్యమైన ఫినిషింగ్ టచెస్ చివరి భాగాన్నాశ్రయించుకుంటాయి. రచయిత ఏ భావాన్ని మనస్సులో పెట్టుకొని వ్రాశాడో దానిద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతాము. ఊహాతీతమైన సంఘటనలతో వాస్తవికతను జోడించి వ్రాసే రచయితల విషయంలో ఇది మరింత ముఖ్యమైన అవసరం. ఆ కథను అతను సుఖాంతముగా ముగిస్తాడా లేక విషాదంగా ముగిస్తాడా అన్నది తన రచనపై



రా.వి.శాస్త్రితో ఇంటర్వ్యూ: (1988లో)

**ప్ర:** *రత్తాలు-రాంబాబు, రాజు-మహిషి,* పూర్తిచేసే ఉద్దేశ్యం ఉందా?

**రా.వి.శా:** చేయగలిగితే చేస్తాను.

ఇదే ప్రశ్న మరో రూపంలో వేసినపుడు ఇంటర్వ్యూ: (1993లో)

**ప్ర:** *రత్తాలు-రాంబాబు, రాజు-మహిషి,* మిగిలిన భాగం పూర్తిచేయరా? ప్లాట్ ఉందేమోకదా?

**రా.వి.శా:** ఉంది కాని పూర్తి చేయను. వ్యవధిలేదు. కష్టమేమో అనుకుంటాను. మళ్లీ అంతా చదవాలి, చదివి స్పిరిట్ ఆఫ్ హిస్టరీలోకి వెళ్లాలి. అది రాసి 24 సం॥లు అయింది. *రాజు-మహిషి* ఇక *రత్తాలు-రాంబాబు* విషయానికొస్తే ఇట్ ఈజ్ డిఫ్‌కల్ట్ టు గోబ్యాక్ ఎగైన్. అవే క్యారెక్టర్స్ డెవలప్ అవుతాయి. ఈచ్ క్యారెక్టర్ విల్ బిహేవ్ ఎక్స్‌సెంజింగ్ ఆఫ్ లాజిక్‌కి భిన్నంగా మనం ఇష్టం వచ్చినట్లు రాయడం అసహ్యంగా ఉంటుంది.

రచయిత మాత్రమే సాధికారంగా తీర్పు ఇవ్వగలడు. ముగింపు పట్ల పాఠకునికుండే ఆసక్తే పత్రికలలోని సీరియల్స్‌ను చదివేలా చేస్తుంది. ఇప్పుడేం జరగబోతుంది అన్న ఉత్కంఠతతో పాఠకుణ్ణి రచనలకు చేరువ చేస్తుంది. గోపీచంద్ రాసిన *చీకటి గదులు*– శ్రీ శారద రాసిన *సరళాదేవి హత్య,* నవలలు– రచయితలు కాలధర్మం చెందటం వలన సశేషంగా మిగిలిపోయాయి. *బారిష్టరు పార్వతీశం,* అతడు–ఆమె లాంటి నవలలు మధ్యలో ఆగిపోయాయి. ఆ తరువాత చాలా కాలానికి గానీ అవి ముగింపు సంతరించుకోలేదు. ఈ మధ్య సమయంలో అవి అసంపూర్ణంగా ఉన్నా సాహిత్యంలో వాటిస్థాయిగాని, వన్నెగాని తగ్గలేదు. నిజానికి అవి పూర్తి కాకుండా ఉంటేనే బాగుండి ఉండేదేమో అన్న అభిప్రాయం కొంతమందిలో లేకపోలేదు. అసమానమైన శైలిలో సాగిన మొదటి భాగాలకూ, పేలవంగా, రసహీనంగా సాగిన రెండవ భాగానికీ తేడా స్పష్టంగా తెలుస్తుంది. రచయిత తనంత తానుగా ఉద్యుక్తుడై రాసిన దానికి, పాఠకుల కోరికపై రాసిన దానికి గల తేడాను మనం గుర్తించవచ్చు.

ముగింపు స్పష్టంగా, కన్‌క్లూజివ్‌గా ఉండి తీరాలని లేదు. ఎన్నో నలలూ, కథలూ, సినిమాలు పతాక సన్నివేశం తరువాత వచ్చిన సంఘటనతో ముగుస్తుంది తప్ప కన్‌క్లూజివ్ ఎండింగ్ తోకాదు. అందుకే కథ విన్న తరువాత కొంతమంది పిల్లలు కథలోని అస్పష్టతని, సందేహ నివృత్తి చేసుకోవడానికి ప్రశ్నలు వేసి వేధించేటప్పుడు కథ చెబుతున్నవారు 'కథ కంచికి మనమింటికి' అని భరతవాక్యం పలికి పిల్లలను అనునయిస్తారు. ఆనాటి *రామాయణం,* శరత్‌బాబు, రవీంద్రనాథ్ టాగూర్‌ల ఎన్నో నవలలు అసంపూర్ణంగానే మిగులుతాయి. ఉదాహరణకు *దేవదాసు* నవలనే తీసుకుంటే అందులో దేవదాసు మరణిస్తాడు తప్ప మిగిలిన పాత్రల సంగతేంటనే విషయంలో స్పష్టత లోపిస్తుంది. కథలో చివర దేవదాసును చూడడానికి అన్ని సంకెళ్ళు తెంచుకుని పిచ్చిగా పరిగెట్టుకుంటూ వచ్చిన పార్వతి గతేమయిందో తెలియదు. ఆమెనొక దేవతలా భావించే భర్త, పిల్లలు, ఆ సంఘటన తరువాత ఎలా రియాక్ట్ అయ్యారు? అంతవరకూ ఆమె చేసిన త్యాగాన్ని స్వార్థంగా భావిస్తారా? భర్త మునుపటి ఔదార్యం ఆమెపై చూపగలడా లాంటి అనేకానేక ప్రశ్నలు మనల్ని వేధిస్తాయి. అంతమాత్రం చేత దేవదాసు ఒక ముగింపు లేని నవలగా మనం భావించలేము. రావిశాస్త్రి వ్రాసిన కథలెన్నో ముఖ్యంగా *జరీ అంచుపట్టుచీర, మెరుపు మెరిసింది* లాంటివన్నీ ఒక విధంగా అసంపూర్ణాలే. ఆ పరిస్థితులలో ప్రస్తుతానికి అదే ముగింపు. ఆ పరిస్థితులు మారవచ్చు. ఆ కథ సుఖాంతం కావచ్చు అని ఆశాజీవులు భావిస్తే వాస్తవ వాదులు అందులో వున్న సూక్ష్మమైన సామాజిక అంశాలపై దృష్టి నిలిపి వాటిని మార్చే ప్రయత్నానికి పూనుకోవచ్చు. రావిశాస్త్రి నవలల విషయంలో అవి మొదట ఒక చిన్న కథగా కొద్దిపాటి పాత్రలతో ప్రారంభించబడి పోను పోనూ విస్తరించబడటం వలన అవి రచయిత చేతుల నుంచి జారుకోవడం వలన దానిపై రచయితకు కంట్రోల్ లేకుండా పోవడం వలన ముగింపు క్లిష్టమై ఉండవచ్చునని అందువల్ల ఆయన వాటిని అసంపూర్ణంగా వదిలివేసి వుండవచ్చని కొంతమంది భావిస్తున్నారు.

ఆర్థికపరమైన సమస్యలే ప్రధానంగా ఉన్న సంఘాలలో, అన్ని విలువలూ దానిచుట్టే పరిభ్రమించుటవలన, ప్రస్తుత పరిస్థితులలో ఎక్కడో ఒకచోట రాజీపడి జీవితాంతం అపరాధ భావనతో బాధపడే అనేకమందిని మన సంఘంలో చూస్తూ ఉన్నాము. మహోత్కృష్టమైన మానవ సంఘాన్ని శాసించే ఈ భౌతిక పరిస్థితులు మారితే తప్ప విశ్వమానవ సౌభ్రాతృత్వం తద్వారా విశ్వశాంతి నెలకొల్పబడదు. అంతవరకూ మానవుడు అవిశ్రాంత పోరాటం సాగించవలసిందే. అయితే అటువంటి పరిస్థితులు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించకపోవడం వలన, ఈ కథలకు, గాథలకు కాల్పనికమైన ఒక పతాక సన్నివేశాన్ని మనసొప్పక బహుశా వాటిని అలానే వదిలివేసి ఉండవచ్చు. అవకాశవాదులతో కూడిన ఆషాఢభూతి ప్రపంచంలో, అమాయకత్వంతో, వాస్తవానికి దూరంగా, ఆశలపల్లకిలో నిత్యం విహరించే మధ్యతరగతి ప్రజ, ఏదో అద్భుతం జరిగి, జీవితంలో హరివిల్లు విరుస్తుందని పేరాశతో ఎదురుచూసే సామాన్యులూ, తమకు అనుకూలంగా పరిస్థితి మారితే భగవంతుని కృషి లేకపోతే ప్రారబ్ధకర్మని సరిపెట్టుకొనే సగటు భారతీయుని మనస్తత్వంతో రాజీపడలేక పొయెటిక్ జస్టిస్ చేయలేక వాటినలాగే వదిలేసి ఉండవచ్చు.

ఏది ఏమైనా అజరామరమైన శిల్ప శైలితో వాస్తవానికి పట్టంకడుతూ ఇంతకు పూర్వం ఇదే విధంగా ఒక ఆదర్శ పురుషుని దృష్టిలో ఉంచుకొని, ఆ ఆదర్శ పురుషుడు వాస్తవలోకంలో కాదు, కాల్పనికంగా కూడా అంతుబట్టుకోలేక, ఒకటికి పదిసార్లు, అక్షరాలా పదకొండుసార్లు తిరిగి వ్రాసినా పూర్తి చేయలేకపోయిన డాస్టోవిస్కీ *'ఇడియట్'* నవలలా రావిశాస్త్రి వాస్తవిక, కాల్పనికతతో సమన్వయించలేక ఈ నవలలను అలానే వదిలివేశాడని నేను భావిస్తున్నాను. ఇంద్రధనిస్సు చిత్రాలలా, వర్డ్స్ వర్త్ పద్యం solitary reaper లా, సత్యజిత్ రే–పథేర్ పాంచాలిలా, గురుదత్ ప్యాసాలా, చాప్లిన్ చిత్రాల్లా అసమగ్రంలోనే అమరత్వాన్ని సాధించిన రా.వి.శాస్త్రి నవలలు ముగింపులేని అసంపూర్ణ మహాకావ్యాలు. మి




# సంపాదకునిగా
# శ్రీపాద

## *ప్రబుద్ధాంధ్ర* పత్రిక:

**మా**నవత పెంపొందాలంటే, సమాజంలో విజ్ఞానం వెల్లివిరియాలన్నది జనవిజ్ఞాన వేదిక దృఢ నమ్మకం. సకల అభ్యుదయాలకు విజ్ఞానం వేరు వంటిదని భావిస్తూ ఆ దిశగా అడుగులో అడుగు వేస్తూ దానికి అనుగుణంగా పుస్తక ప్రచురణ చేపట్టింది. దానిననుసరించే విజ్ఞానంతో పాటు నైతిక విలువలు పెంచే పుస్తకాలను ఎంపిక చేసుకున్నారు. చరిత్రగ్రంథాలలో కనబడని ఎన్నో విశేషాలు, వాస్తవాలు, మహామహుల వ్యాసాలలోను, నాటి పత్రికలలోను దర్శనం ఇస్తాయి. వాటిని వెలికి తీసి ప్రచురించే బాధ్యత జనవిజ్ఞాన వేదిక చేపట్టింది. అందులో భాగంగా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రబుద్ధాంధ్ర పోరాటాలు రెండు భాగాలుగా ప్రచురించారు.

అసలు సిసలైన తెలుగు కథకు కనకాభిషేకం చేసిన కథక చక్రవర్తి శ్రీపాద. ఆయన మాటలో, రాతలో, అన్ని ప్రక్రియల్లోను రచనల్ని పండించిన మూర్తిమత్వం కానవస్తుంది. ఈ వ్యాసాలు ఆయన ఉద్యమ స్ఫూర్తిని, వాదపటిమను, పట్టుదలను ఆవిష్కరిస్తాయి. ఆంధ్రభాషపై ఆయనకు గల అంకిత భావాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. ఆయన వ్రాసిన వ్యాసాల్లో విశేషమైనవి, అపురూపమైన వాటిని మాత్రమే ఎన్నుకొని ప్రచురించటం జరిగింది.

శ్రీపాద వారు 1922 వ సంవత్సరంలో ప్రబుద్ధాంధ్ర పేరుతో సాహిత్య పత్రికను నిర్వహించి మంచి సంపాదకునిగా పేరు పొందారు. దీని సంవత్సర చందా రూ. 1 మాత్రమే! ప్రబుద్ధాంధ్రకు "ఆంధ్రదేశమే కార్యక్షేత్రం. ఆంధ్ర వికాసమే ప్రాప్యం అని సగర్వంగా ప్రకటించారు."

తెలుగు తియ్యదనాన్ని, అందాన్ని అందరికి చూపాలని ఆకాంక్ష. అందువల్లనే మొదట్లో ప్రబుద్ధాంధ్రలో పద్యాలకు స్థానమిచ్చిన శ్రీపాదవారు అయిదవ సంపుటిలో పద్యాన్ని నిషేధించారు. ఆ సంపుటి తొలి పేజీలో పునఃపూజ పేరుతో వ్రాసిన సంపాదకీయంలో "ఈ సారి పద్యాలు ప్రకటించదలచుకోలేదు. ఇప్పుడు వచన వాఙ్మయానికి చాలా అవసరం ఉంది. జనసామాన్యంలో విద్య వ్యాపించాలంటే వచన వాఙ్మయమే ఆధారం. వ్యవహారికం సులభమే, దానిలో హృదయాన్ని తాకే శక్తి ఉంది, జాతీయత ఉంది, రసానుభవం ఉంది. విషయం కోసం భాషేకానీ, భాషకోసం విషయం కాద"ని స్పష్టం చేశారు.

ఆంధ్రజాతికి జాతీయ భాష ఆంధ్రభాషే కాని హిందీభాష కాదు. హిందీ భాష పట్ల ఆయనకు ద్వేషం లేదు. అది తెలుగుపై పెత్తనం చెలాయించటం పైనే ఆయన అభ్యంతరం. తన అసమ్మతిని వ్యాసాల రూపంలో దృఢంగా తెలియజేస్తూ దానిని ఒక ఉద్యమంగా రూపొందించారు. సంస్కృతముతో సంబంధం తగ్గించి *తెలుగు భాష స్వతంత్ర స్థితిని* కల్పించడానికి ఆయన తన జీవితాంతం కృషి చేశారు. దీనిలో శ్రీపాద వారి ఎంపిక చేసిన సంపాదకీయాలతో పాటు చింతా దీక్షితులు, గిడుగు, మారేమండ రామారావు, భావరాజు ప్రభృతులు వ్రాసిన వ్యాసాలున్నాయి. ఆనాటి లబ్ధప్రతిష్ఠులైన వారి రచనలను, (Timiless) మరొకసారి వెలుగులోనికి తీసుకొనివచ్చిన జనవిజ్ఞాన వేదిక సంపాదకులయిన నాగసూరి వేణుగోపాల్, పున్నమరాజు నాగేశ్వరరావులు అభినందనీయులు.

*పేజీలు: 100 కు పైగా, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు జనవిజ్ఞాన వేదిక, 162, విజయ లక్ష్మీనగర్, నెల్లూరు –524004 లో సంప్రదించండి.*

# చరిత్రలో నాగమ్మ

– ఆర్. చంద్రశేఖరరావు

తొలి మహామంత్రిణిగా నాయకురాలి నాగమ్మ గురించి వై.హెచ్.కె. మోహనరావుగారు చాలా పరిశోధించి అనేక విషయాలు మనముందుంచారు. పలనాటి బ్రహ్మనాయుడు చేసిన సాంఘిక సంస్కరణలు ప్రజలముందు ఇప్పటి వరకు ఆయనను ఒక గొప్ప వ్యక్తిగా నిలబెట్టాయి. 11,12 శతాబ్దాలలోనే ప్రజలందరితో చాపకూటి సిద్ధాంతాన్ని పాటించాడని, ఇంకా, దళితుల దేవాలయ ప్రవేశంకోసం పోరాడాడని, ఆ సందర్భంలోనే దానిని వ్యతిరేకించిన నాగమ్మ, ఆమెతోపాటు ఇతర సనాతన వాదులతో ఘర్షణపడిన బ్రహ్మనాయుడ్ని ఉన్నత విలువల ప్రతినిధిగా చూశాము. ఒక దళితుడు అయిన కన్నమదాసుని సర్వసైన్యాధిపతిగా చేశాడని చదివాము. ఇంకా అన్నదమ్ములైన నలగామరాజు, మలిదేవుల మధ్య ఘర్షణలు, వివాదాలు లేకుండా శాంతికోసం ప్రయత్నించాడని, శైవ, వైష్ణవ మతస్థుల మధ్య ఐక్యతకు కృషిచేశాడని కూడ చదివాము.

తన స్వతఃసిద్ధమైన ఔన్నత్యం కంటే, నాయకురాలి నాగమ్మ కాపట్యం, కుటిల నీతుల వలన ప్రతినాయిక మీద కలిగిన వ్యతిరేకత వలన బ్రహ్మన్నను గొప్పనాయకుడిగా భావిస్తూ వచ్చాము. కానీ, ఇందుకు భిన్నంగా కొందరు బ్రహ్మనాయుడిని కుటిలునిగా, మోసగాడిగా, స్వార్థపరుడిగా, నాయకత్వం కోసం ఎంతటి నీచానికైనా ఒడిగట్టేవాడిగా చిత్రించడం ద్వారా నాయకురాలి నాగమ్మను ఉన్నత స్థానంలో నిలబెట్టటానికి ప్రయత్నించారు. దానికంటే నాగమ్మను ఒక ధీర వనితగా, మహిళా మేధావిగా, అసాధారణ దక్షత కలిగిన స్త్రీమూర్తిగా చిత్రించితే చాలా బాగుండేది. ఆయా రంగాలలో పురోగమిస్తున్న మహిళలకు, మహిళా ఉద్యమాలకు ఒక స్ఫూర్తి ప్రదాతగా నాగమ్మ వ్యక్తిత్వం నిలిచేది.

''నాయకురాలు నాగమ్మ'' పుస్తకంలో రచయిత మోహనరావు, శ్రీనాథుడు, పింగళి లక్ష్మీకాంతం, కోడూరు ప్రభాకర రెడ్డి, చిట్టిబాబు, గుర్రం చెన్నారెడ్డి, జి.హెచ్.రోఫ్ఫేర్, తదితర అనేక మంది రచనల నుండి ఉటంకించారు. ఒక రచనాక్రమంలో వ్యక్తుల యొక్క గొప్పతనాన్ని ఆయా సందర్భాల్ని బట్టి కథలు, రచయితలు వర్ణిస్తారు. నాయకురాలు నాగమ్మ గొప్పతనాన్ని గురించి వర్ణించినవన్నీ ఒక క్రమంలో చక్కగా అమర్చారు. అలాగే వివిధ సందర్భాలలో బ్రహ్మనాయుడిని వివిధవ్యక్తులు వ్యతిరేకించిన అంశాల్ని చక్కగా కూర్చారు. శ్రీనాథ మహాకవి ముందుమాటల్లో కానీ, లేక ఎక్కడయినా బ్రహ్మనాయుడి గురించి తన అంచనా ఏదయినా చెప్పకుండా వుండడు. దానిని వీరు ఉటంకించలేదు. పల్నాటి వీరచరిత్రను శ్రీనాథుడు పల్నాటి భారతంగా చెప్పినట్లుగా, బ్రహ్మనాయుని ఔన్నత్యానికి ప్రతీకగా చెప్పినట్లు చదివాను. అలాగే ఇతర రచయితలు కూడా పల్నాటి చరిత్రపై కథనంలో చెప్పినవి గాకుండా తమ స్వంత వ్యాఖ్యానాలు ఉంటే వాటిని ఉటంకించలేదేమో అనిపిస్తున్నది. పల్నాటి వీరచరిత్రలో బ్రహ్మనాయుడు – బాలచంద్రుని సంవాదంలో, బ్రహ్మనాయుడిని చాలా తూలనాడుతూ, కించపరుస్తూ అన్నిటికి బ్రహ్మనాయుడే కారణమన్నట్లు బాలచంద్రుడు నిందించిన భాగాన్ని సుదీర్ఘంగానే పేర్కొన్నారు. ఆయావ్యక్తుల మనోభావాలు చెప్పేటప్పుడు కవులు అలాగే వర్ణించిన సందర్భాలు అనేకం వుంటాయి. దుందుడుకు స్వభావం కలిగిన బాలచంద్రుడు ఆవేశంలో మాట్లాడినవన్నీ వాస్తవాలని అనుకోకూడదు.

మహాభారతంలో ద్రౌపది వివిధ సన్నివేశాలలో పాండవులను తూలనాడుతూ మాట్లాడిన సందర్భాల్ని తిక్కన మహాకవి గొప్పగా వర్ణించారు. ఇంకా భీముడు వివిధ సంఘటనలలో ధర్మరాజుని నానా మాటలన్నాడు. ఆ పరుష వాక్యాలనుబట్టి ఆ వ్యక్తుల స్వభావాన్ని అంచనా వేయలేము. భారతంలో ఒక్కొక్క పర్వములోని భీష్మ, ద్రోణ, కర్ణ, అర్జున, దుర్యోధన, భీమ, ధర్మరాజు, ద్రౌపది మున్నగువారి గొప్పదనాన్ని వర్ణించేటప్పుడు మిగతా వ్యక్తులు అల్పులనిపిస్తారు.

ప్రబంధకవులు నాటకీయతకోసం, కావ్య రమణీయత కోసం రాసేవాటిపై చరిత్ర పరిశోధనలో ఆధారపడటం మంచిది కాదు. దానికి బదులుగా కవులు, రచయితలు పీఠికలలోగానీ, ముందుమాటలలోగానీ, వేరే విధంగాగానీ ఆ వ్యక్తులపై తమ అభిప్రాయాలు ప్రకటించిన వాటి ద్వారా ఇంకా ఎక్కువ సమాచారం రాబట్టవచ్చు. ఈనాటికి కూడా అంటరానితనానికి, అసమానతా మానవవిలువలకు వ్యతిరేకంగా మనం ఇంకా పోరాడాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది. కొన్ని విలువలకు ప్రతినిధిగా భావింపబడుతున్న బ్రహ్మనాయుడ్ని పడగొట్టడం ద్వారా సమాజానికి మేలు ఏమయినా జరుగుతుందా? దానికి భిన్నంగా పరిపాలనా దక్షత, నాయకత్వ లక్షణాలు మాత్రమే కలిగివుండి, మానవీయ విలువలకు ప్రతినిధికాని నాయకురాలి నాగమ్మను గొప్పగా చిత్రించడం ఏ విలువలకు మేలు జరుగుతుందో రచయిత ఆలోచించాలి. మానవీయ విలువల పరిరక్షణ, సమాజ పురోగమనకాంక్ష చరిత్ర పరిశోధన లక్ష్యంగా తప్పనిసరిగా వుండాలని, అలాలేని చరిత్ర పరిశోధన సమాజానికి మేలు చేయదని భావించాలి. మి

ఆర్. చంద్రశేఖరరావు, ఫోన్ : 8790817028

# చదవండి...

**- ఎన్నార్కె**




❖ **సాహితీ సౌరభాలు :** వాణీమోహన్, కె.సరోజ, మంగళా కందూర్ వ్రాసిన కథలు. ఇందులోని కథావస్తువు, శిల్పం, భాష, భావం అన్నీ కలిసి కథా రచనలో సందేశాన్ని సూటిగా చెప్పకుండా కథాంశాన్ని ఒక సందేశంగా మన ముందుంచుతుంది. వివిధ పత్రికలలో ప్రచురించబడి ఆకాశవాణిలో ప్రసారమైన ముప్ఫైకథల కదంబ సాహిత్యమిది.

*పేజీలు: 236, వెల : ₹ 80/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 0944940396, 09040650961 లో సంప్రదించండి.*




❖ **తరంగాలు :** మంగళా కందూర్, కొమరవోలు సరోజ, వాణీమోహన్ వ్రాసిన 15 కథలు. ఇది సాహితీ సౌరభాలకు ఒక సీక్వెల్‌గా వచ్చిన మరో కథా కదంబం.

*పేజీలు 136, వెల ఇంతని పేర్కొనబడలేదు. ప్రతులు కావలసినవారు పైన పేర్కొన్న (సాహితీ సౌరభాలు) నెంబర్లకు ఫోను చేయగలరు.*




❖ **గ్రథాలయ సమాచార శాస్త్ర వ్యాసాలు :** గ్రంథాలయ సమాచార శాస్త్రంలో అంతర్జాతీయ సమాచార పుస్తకాలు రచించినవారు శ్రీ ఎల్.ఎస్. రామయ్య. ఈ పూర్వ సీఫెల్ లైబ్రేరియన్‌గారు రచించిన వ్యాసాలను క్రోడీకరించి, కూర్పు చేసి, పుస్తక రూపంగా మనముందుంచిన వారు కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థయందు లైబ్రేరియన్లుగా పని చేసిన ముదుగంటి సుధాకర రెడ్డి, వారి సతీమణి ప్రభావతీ దేవి గార్లు. ఇందులోని అనేక వ్యాసాలు మనల్ని ఆలోచింప చేస్తాయి. విద్యార్థులు, రీడింగ్ హేబిట్ ఉన్నవారు తప్పక చదవ వలసినవి.

*పేజీలు : 100, వెల : ₹ 40/-, ప్రతులు కావలసినవారు సాహితీ ప్రచురణ వారిని సంప్రదించండి.*




❖ **మా నాన్న సూర్యప్రకాశరావు :** ఈ వచన కవితా మాలిక రచయిత్రి డాక్టరు పాతూరి కుసుమ కుమారి. 'ఆయనే మానాన్న ప్రకాశరావు' అనీ అంతిమ వాక్యాలలోనూ, ముందు మాటలలోనూ కళ్ళకు కట్టినట్లు తన తండ్రి వ్యక్తిత్వాన్ని వర్ణించారు రచయిత్రి. కాలగతిలో కనుమరుగవుతున్న ఒకప్పటి గ్రామీణ జీవన విధానం, బాంధవ్యాలు గుర్తుకు తెచ్చుకుంటున్నప్పుడు మనసు చివుక్కు మనక మానదు.

*పేజీలు : 50, వెల నిర్ణయించ బడలేదు. ప్రతులు కావలసినవారు ఫోన్: 040-23402436 లో సంప్రదించండి.*




❖ **కవిత 2011 :** పాపినేని శివశంకర్, దర్భాశయనం శ్రీనివాసాచార్యుల సంపాదకత్వంలో ప్రచురించ బడిన సాహితీ మిత్రుల స్వప్న సాకార మీ పుస్తకం. వర్తమాన కాలంలో చిన్నా, పెద్దా తేడాలు లేకుండా మంచి కవిత్వాన్ని సంకలనం చేసి అందించినందుకు అభినందిద్దాం. సాహితీ మిత్రులు, విజయవాడ వారి ప్రచురణ.

*పేజీలు : 160, వెల : ₹ 120/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 0866-2433359 లో సంప్రదించండి.*

❖ **కౌచిప్పలో కమ్మనిసారము :** రచయిత కొమరగిరి వెంకటభూపాలరావు. ఆయనకు రాముని యందు రక్తి, రామాయణము నందు భక్తి ఉంది. రామగాథను బాల్యంనుండి మననం చేసుకుంటూ వయసును పండించుకున్న మనీషి. కేవలం ఒక వాల్మీకమేకాక తెలుగులో వెలుగు చూచిన రామగాథలన్నీటినీ సాపేక్షంగా సమీక్షించారు. గ్రంథాన్ని చూడచక్కగా ఉండడానికి గాను దాకేజు శివప్రసాద్ చే 48 వన్నెల చిత్రాలు వేయించారు. 650 పేజీలున్న ఈ బృహద్గ్రంథం క్రేన్ సైజులో చదవడానికి వీలుగా పెద్ద ఫాంట్‌లో ముద్రించ బడింది. దీని వెల 1000 రూ.లుగా నిర్ణయించినా కొ.వె.భు.రావు గారి పరిశ్రమతో పోల్చితే అది తక్కువనే చెప్పాలి.



*పేజీలు : 650, వెల : ₹ 1000/-,* ప్రాప్తిస్థానము తెలుగు విశ్వవిద్యాలయము, కళాతోరణం, హైదరాబాద్, సావిత్రీసదనము నెం: 203, 3-4-566/41, లింగంపల్లి హైదరాబాద్.

❖ **అంతస్తాపము :** విభిన్న అంశాల మీద వ్రాసిన చందోబద్ధ పద్యాల సంపుటి. ఎలనాగ గా పిలువబడే డాక్టరు నాగరాజు సురేంద్ర వర్తమాన సామాజిక జీవితంలోని అనేక అంశాలకు ప్రతి స్పందనలు ఈ పద్యంలో కనిపిస్తాయి. పాలపిట్ట బుక్స్ వారి ప్రచురణ.




*పేజీలు : 70, వెల : ₹ 50/-.*

❖ **అంతర్లయ :** ఎలనాగ కవిత్వంలో భాషకు కొత్త సొబగులు అద్దుతూ, ప్రయోగానికి ప్రాధాన్యత ఇచ్చే శైలి కనిపిస్తుంది. పాలపిట్ట బుక్స్‌వారి ప్రచురణ.




*పేజీలు : 190, వెల : ₹ 90/-, ప్రతులు కావలసినవారు పాలపిట్ట బుక్స్ ప్రచురణ సంస్థ వారిని సంప్రదించండి.*

❖ **భమిడిపాటి కామేశ్వరరావు :** రచయిత తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి. సాహిత్య అకాడమీ వారు భారతీయ సాహిత్య నిర్మాతల పేరుతో వెలువరిస్తున్న జీవిత చరిత్రల సంపుటాలలో ఇది ఒకటి. సభక్తికంగా, విమర్శనా దృష్టితో ఈ తరానికి చెందిన రచయితగా కామేశ్వరరావుగార్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ చేసిన రచన. ఈ పరిచయం అతి ప్రశంసా పూర్వకంగానూ, అతినిశిత విమర్శనా దృష్టితోనూ కాకుండా మధ్యేమార్గంగా ఉండాలనే అకాడమీ అభిప్రాయానికిది అద్దంపడుతుంది. భమిటిపాటి వారి నాటకాలను ఇష్టపడేవారు తప్పక కొని చదువ దగ్గ పుస్తకం.




*పేజీలు : 120, వెల : ₹ 40/-.*

❖ **ఎగరేసిన ఎర్రని జండా :** 1955 వరకూ భద్రాచలం డివిజన్ కమ్యూనిస్టుల ఉద్యమ చరిత్ర. రచయిత కామ్రేడ్ టి.వి. ఆర్. చంద్రం. చంద్రం చనిపోవడానికి ముందు మూడేళ్ళ క్రితం కొందరు కామ్రేడ్ల కోరిక మేరకు ఈ ప్రాంత ఉద్యమ నేపథ్యాన్ని, చరిత్రను సంక్షిప్తంగా రికార్డు చేశారు. దానికిది పుస్తక రూపం. పుస్తకం విషయంలో, భావంలో సాంద్రత ఎక్కువ. అరుణసాగర్ అను సగటు కొడుకు పేరుతో వచ్చిన ఎర్రజెండా కప్పుకుని ఎగిరిపోయిన అమ్మకథ కంట నీరు పెట్టిస్తుంది. సాహితీ మిత్రులు, విజయవాడ వారి ప్రచురణ.




*పేజీలు : 60, వెల : ₹ 30/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 0866-2433359 లో సంప్రదించండి.*

# కమ్మతెమ్మెరలు.... *4వ పుట తరువాయి...*

✶ "...బుద్ధుని బోధనలను, వాటి లోతుపాతులను వివరించే ప్రయత్నంలో కొందరు వారి పాండిత్య ప్రకర్షలోకి పోతారేమోననిపిస్తుంది. ఒక్కోసారి, ఈ విపులీకరణలూ, సమీక్షలూ మొదలైన వాటికంటె సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ లాంటి వారి The Light of Asia చదువుకుంటే హాయి అని పిస్తుంది...*పునర్భవం* లాజికల్‌గా, రేషనల్‌గా చేసిన లోతైన చర్చ. అందులో విస్తృతంగా ఎందరో మేధావుల్ని ఉటంకించారు. టైటిల్‌లోనే రెండర్థాలున్నాయి. పునర్జన్మ అని అన్ని మతాలూ నమ్మేదీ; జీవితాన్ని జ్ఞానంతో, బుద్ధితో, క్రమశిక్షణతో, అనుభవపూర్ణమైన అవగాహనతో పునస్సమీక్షించుకుని ఎప్పటికప్పుడు పునర్నిర్మించుకుని సార్థకం చేసుకోవడం రెండోదీ. జ్ఞాన మార్గంలో నిత్యమూ మెళుకువతో జీవించే మనిషికి ప్రతిరోజు, ప్రతిఘటన, ప్రతిఅనుభవం, ప్రతికొత్త ఆలోచన, భావన అంతా పునర్భవమే...

...బుద్ధపౌర్ణమి ప్రత్యేక సంచికలో బౌద్ధధర్మపు వివిధపార్శ్వాల మీద వచ్చిన రచనల నుంచి ఎన్నో గొప్ప విషయాలు తెలిశాయి. కొన్ని రచనలు informative, మరికొన్ని reflective, ఇంకాకొన్ని meditative. అయితే చెప్పేవిధానం, అందుకుపయోగించిన పదజాలం విషయంలో రచయితలు ఎన్ని యిబ్బందులు పడాలో! కొందరు ఎంతో గాఢమైన విషయాలను పాఠకులకు ఇబ్బంది కలకుండా, వారికి అర్థమయ్యే పదజాలాన్ని ఉపయోగిస్తారు. మరికొందరు పాఠకుడికి బాధ్యతను నిర్దేశించి, అర్థం చేసుకునే ప్రయత్నం అతని చేత చేయించేందుకు, అతడు భాషలోని బరువైన పదజాలాన్ని తప్పనిసరిగా అర్థం చేసుకునే కసరత్తు చేయవలసినదేనంటారు...

...ఆస్కార్ వైల్డ్ కన్‌ఫెషన్, *అగాధం* ఫాలో అవుతున్నాను...కళాకారుడు, అతను ఏ కళకు చెందినవాడైనా, అతని కోరికలు, భావనలు, ఊహలు, ఆలోచనలు - చివరికి అతను చేసే తప్పులూ పొరబాట్లూ అంతే గాఢంగా వుంటాయి. గొప్పకళ ఆ కళాకారుడిలోంచి బైటకి రావాలంటే, రూపం తీసుకోవాలంటే స్వర్గమంత ఉన్నతమైన ఎక్సైట్‌మెంటో లేదా నరకమంత అగాధమైన దుఃఖం అతణ్ణి ఆవహించాలి. ఎక్సైట్‌మెంట్ కళాకారుణ్ణి స్వర్గదారుల్లో నడిపించి గొప్ప కవిత్వాన్నీ కళారూపాలనీ బయలు పరుస్తుంది. ఒక్కోసారి అతణ్ణి మిస్టిక్‌గా మారుస్తుంది. దుఃఖం అతణ్ణి ప్రపంచపు మురికి ముళ్లదారుల్లో కత్తి మొనలమీదనడిపి విప్లవవాదినీ, జీవన నగ్నసత్యాల ఆవిష్కర్తనీ చేస్తుంది. ఇవి రెండు ప్రత్యేక మార్గాలు. మిగిలినవన్నీ in between లే. పైగా మిత్రుడికీ, ఆత్మీయుడికీ ఉత్తరం వ్రాయడం అంటే మనిషి హృదయం, ఆత్మ అక్షరాల్లో నగ్నంగా పరుచుకోవడం. అందుకే జైల్లో ఉత్తరం అంత గాఢం. ఆ చెప్పుకునేప్పుడు కూడా ఇంకా తను చెప్పవలసిన విషయాన్ని సంపూర్ణంగా చెప్పే ప్రయత్నంలో అంత గాఢమైన పదజాలంకోసం కళాకారుడు పడే ఘర్షణ, తడబాటు, నిస్సహాయత, బాధ, నిట్టూర్పు ఆ అక్షరాల్లో దర్శనమిస్తుంది. బైరాగి (ఆలూరి) అన్నాడు కదా- *కవితా సతి చేలాంచలాలు ఎప్పుడూ చేతికందినట్టే అనిపించి అంతలోనే అందకుండా మాయమౌతాయి*- అని! బైరాగి మాటలు అర్థమైన కవులు మనకు కొద్దిమందే వున్నారు...

...*అగాధం* లోని అగాధమైన, గూఢమైన సత్యవాక్కుల్ని అండర్‌లైను చేసుకున్నాను. అలాంటి రచనలు చదవడాన్నే నేను ప్రేమిస్తాను. గొప్ప దుఃఖంలోంచి ఆస్కార్ వైల్డు లోని ఆధ్యాత్మిక భావాలు - క్రీస్తు గురించీ - గొప్పగా వ్యక్తీకరించబడ్డాయి. మానవజీవన దుఃఖంలోంచి జీవిత సత్యాలను కవిత్వంలోకి పిండిన బైరాగి కవిత్వం అట్లాంటిదే. ముఖ్యంగా రెండో భాగంలో దుఃఖాన్ని గురించి వైల్డు వ్యక్తపరిచిన విషయాలు నగ్నసత్యాలు. నేనూ దుఃఖభాజనుణ్ణి గనుకనే నాకు అంతగా నచ్చాయేమో! తరువాతి భాగం కోసం ఎదురు చూస్తున్నాను. ఇలాంటివి పబ్లిష్ చేయడం మంచిపని. అవసరంకూడా..."

**- బి.వి.రామిరెడ్డి,** రుద్రవరం.

✶ "...బుద్ధ సంచిక అన్ని వ్యాసాలు ఎంతో అర్థవంతంగా ఉన్నాయి. ఇలాంటి పత్రిక తెస్తున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను...*అగాధం* మూడు నెలల నుంచి చదువుతున్నాను. రచయిత అభినందనీయులు - కారణాలనేకం! ముందుగా చెప్పవలసింది ఆస్కార్ వైల్డ్ హృదయాన్ని ఆవిష్కరించగలిగారు. అభివ్యక్తీకరణ చాలా గాఢంగా వుంది. దానికి తగిన అందమైన భాషా పదాలతో నింపారు. ముఖ్యంగా క్రీస్తు వ్యక్తిత్వాన్ని అత్యద్భుతంగా వర్ణించారు. చలం, పరమహంస యోగానంద పూర్వం క్రీస్తు గురించి వ్రాసినవి చదివాను. అంతకంటే *అగాధం*లో చాలా లోతైన విశ్లేషణ చిక్కని వాక్యాలతో మనోరంజకంగా వుంది. రచయితను మళ్లీ అభినందిస్తున్నాను..."

**- అలెగ్జాండర్,** శాంతిధామం, నల్గొండ.



భక్తి

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



నీటి చుక్క